సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 131
గురువారం 1-8-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



గురి కుదిరితే మరో పతకం
50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో ఫైనల్‌కు చేరిన భారత షూటర్ - 13లో



కమలకు ఏకపక్ష మద్దతు
డెమొక్రాట్ల నామినీగా జైకొట్టిన 99 శాతం మంది డెలిగేట్లు - 6లో



హమాస్ చీఫ్ హత్య
ఆగర్భ శత్రువైన హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేను టెహ్రాన్ నడిబొడ్డులో ఆయన సొంతింట్లోనే ఇజ్రాయెల్ హతమార్చింది.
- వివరాలు 6లో



ఖేద్కర్ అభ్యర్థిత్వం రద్దు
వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా మనోరమ దిలీప్ ఖేద్కర్‌పై యూపీఎస్సీ శాశ్వత వేటువేసింది.
- వివరాలు 6లో



అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూత
భారత మాజీ క్రికెటర్, కోచ్ అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూశారు. కొంత కాలంగా ఆయన కేన్సర్‌తో బాధపడుతున్నారు.
- వివరాలు 14లో



ప్రధానిపై సభాహక్కుల తీర్మానం
రికార్డుల్లో నుంచి తొలగించిన వ్యాఖ్యలను మోదీ షేర్ చేయడం సభాహక్కుల ఉల్లంఘనే అంటూ కాంగ్రెస్ ఎంపీ చన్నీ నోటీసిచ్చారు.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతీ సుదన్ నియామకం



మాజీ ఐఏఎస్ అధికారిణి ప్రీతీ సుదన్ బుధవారం యూపీఎస్సీకి నూతన చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. 2024 ఆగస్టు 1 నుంచి 2025 ఏప్రిల్ 29 వరకు లేదంటే తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా ఆమె కొనసాగుతారు.
- వివరాలు 6లో

రైతులకు కాంగ్రెస్ దగా..



కాంగ్రెస్ ఏవేవో ఆంక్షలు పెట్టి రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా రైతులను దగా చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. రైతులకు మద్దతుగా ఓ పోస్టర్‌ను విడుదల చేసిన ఆయన.. హెల్ప్‌లైన్ నంబర్ 8886 100 097ను ప్రారంభించారు.
- వివరాలు 3లో

ఆందోళన మధ్యే ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం



బీఆర్‌ఎస్ సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ద్రవ్య వినిమయ బిల్లు 2024–25కు శాసనసభ బుధవారం ఆమోదం తెలిపింది. ఆర్థిక శాఖ మంత్రి భట్టి బిల్లును ప్రవేశపెట్టగానే కాంగ్రెస్ సభ్యులు ఆమోదం తెలిపారు.
- వివరాలు 3లో

అతనికి ఉరే సరి: హైకోర్టు



ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య కేసులో రంగారెడ్డి జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. అత్యంత పాశవికంగా చిన్నారిపై దారుణానికి ఒడిగట్టిన దినేశ్‌కు ఉరి శిక్షే సబబే అని చెప్పింది. 2017, డిసెంబర్ 12న నార్సింగిలో చిన్నారిపై దినేశ్‌అత్యాచారానికి పాల్పడ్డాడు.
- వివరాలు 16లో

రుణమాఫీ.. కోతలే!

రైతులు 35.49 లక్షలు.. రుణమాఫీ సొమ్ము రూ. 24,449 కోట్లు!

ఈసారి మూడు విడతల్లో రుణమాఫీకి వ్యవసాయశాఖ తేల్చిన లెక్క ఇది

- గతంలో 'లక్ష'మాఫీకి 36.68 లక్షల రైతులైతే.. 2 లక్షల మాఫీకి 35.49 లక్షల మందే..
- లక్ష రుణమాఫీ కంటే 2 లక్షల మాఫీలో 1.19 లక్షలు తగ్గిన రైతుల సంఖ్య
- రుణమాఫీలో కోతలు.. రేషన్‌కార్డు, పీఎం కిసాన్ నిబంధనల అమలు వల్లేనా?
- రేషన్‌కార్డు ఉన్నవారికే ప్రస్తుతం మాఫీ.. వ్యవసాయ శాఖ సర్క్యులర్ జారీ



జాబితాలో నా పేరు రాలేదు



→ నాపేరు తూర్పింటి స్వామి. చౌటుప్పల్‌లోని యూనియన్ బ్యాంకులో గతేడాది అక్టోబర్ నెలలో రూ. 1,19,700 రుణం తీసుకున్నాను. తాజాగా ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించడంతో నా లోను మాఫీ అవుతుందని అనుకున్నాను. కానీ జాబితాలో నా పేరు లేదు. బ్యాంకు, వ్యవసాయ కార్యాలయానికి వెళ్లగా నా పేరు లేదు. నాకు రుణమాఫీ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీలో భారీగా కోతలు పడ్డాయి. ఈసారి మూడు విడతల రుణమాఫీలో మొత్తం రైతు కుటుంబాల సంఖ్య 35,49,870 కాగా, వారికి మాఫీ చేస్తున్న సొమ్ము రూ. 24,449 కోట్లు అని వ్యవసాయశాఖ వర్గాలు తేల్చాయి. మొదటి విడతలో 11,34,412 మంది రైతు కుటుంబాలకు రూ.6,034 కోట్లు ఇచ్చారు. ఇక మంగళవారం రెండో విడతలో 6,40,223 మంది రైతు కుటుంబాలకు రూ. 6,190 కోట్లు విడుదల చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇక మూడో విడతకు సంబంధించి వ్యవసాయశాఖ వర్గాల లెక్క ప్రకారం 17,75,235 మంది రైతు కుటుంబాలకు రూ.12,225 కోట్లు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో 2018లో ప్రకటించిన లక్షలోపు రుణమాఫీకి ప్రకటించిన రైతుల కంటే ఇప్పుడు రైతుల సంఖ్య తగ్గడం గమనార్హం. 2018లో మొత్తంగా 36.68 లక్షల మంది రైతులకు రూ.19,198 కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుందని నిర్ణయించింది. లక్షలోపు రుణమాఫీతో పోలిస్తే, ఇప్పుడు రెండు లక్షల రూపాయలు మాఫీ చేస్తున్నా అప్పటికంటే ఇప్పుడు 1.19 లక్షల మంది రైతులు తగ్గడం గమనార్హం.

మొదటి విడతలోనే తగ్గిన సొమ్ము

మొదటి విడతలో 11.34 లక్షల మందికి రూ. 6,034 కోట్లు జమ చేశారు. వీరంతా రూ.లక్ష వరకు పంట రుణాలు తీసుకున్న రైతులే. కాగా 2018లో లక్ష వరకు రుణమాఫీ రూ.19 వేల కోట్లకు పైబడి ఉండగా, ఇప్పుడు లక్ష రూపాయల వరకు రుణమాఫీ కేవలం రూ.6,034 కోట్లతో, కేవలం మూడో వంతుకే పరిమితమైంది. భారీగా రైతుల సంఖ్య, రుణమాఫీ సొమ్ము కూడా తగ్గింది. పీఎం కిసాన్, రేషన్‌కార్డు తదితర నిబంధనల వల్ల పెద్దఎత్తున అర్హులైన రైతులు తగ్గుతున్నారని రైతునేతలు అంటున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రూ.2 లక్షల రుణాలున్న రైతులందరికీ మాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఎందుకు నిబంధనలు పెడుతోందని వారు ప్రశ్నిస్తున్నారు. కాగా, అనేక జిల్లాల్లో ఇప్పటికీ రైతులు తమకు రైతు రుణమాఫీ రాలేదని ఫిర్యాదులు చేస్తున్నారు.

ఒకేచోట 50 మందికి రుణమాఫీ జరగలేదు

ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో మంగళవారం రుణమాఫీ సంబరాలు నిర్వహిస్తుండగా జైనథ్ మండలానికి
మిగతా 5వ పేజీలో ▶



6 లో

ఎటు చూసినా వినాశనమే


167 మృతులు	191 మందికిపైగా జనం జాడ గల్లంతు
219 గాయపడినవారు	బురద, శిథిలాల నుంచి బయటపడుతున్న మృతదేహాలు..

- కోలుకోని వయనాడ్ జిల్లాలోని కుగ్రామాలు
- విపత్తుపై ముందుగానే హెచ్చరించాం: అమిత్ షా
- పంపింది ఆరెంజ్ అలెర్ట్, అదీ 29న: విజయన్

దురాశ తెచ్చిన దుఃఖమిది..

సాగర్‌కు పోటెత్తిన కృష్ణమ్మ

161.97 టీఎంసీలకు పెరిగిన నిల్వ.. రేపట్నుంచి ఎడమకాల్వకు నీటి విడుదల..



సాక్షి, హైదరాబాద్/దోమలపెంట: నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటలకు నాగార్జునసాగర్‌లోకి 2,18,622 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో నీటినిల్వ 526.8 అడుగుల వద్ద 161.97 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ నిండాలంటే ఇంకా 151 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి భారీ వరద వస్తున్న నేపథ్యంలో మరో ఐదారు రోజుల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుతుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,62,411 క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. ఎనిమిది గేట్లు పది అడుగుల మేర ఎత్తి.. కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 2,83,360 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ఆ జలాలు నాగార్జునసాగర్ వైపు పరుగులు తీస్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కృష్ణా ప్రధాన పాయతోపాటు మలప్రభ, ఘటప్రభలు వరదెత్తుతున్నాయి. దీంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ఉధృతి పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 3.42 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 3.50 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 3.35 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 3.22 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 2.95 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 2.81 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. తుంగ, భద్ర, ఉప నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటం.. భద్ర డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో గురువారం ఉదయం 9 గంటల నుంచి తుంగభద్రలో ప్రవాహం రెండు లక్షల క్యూసెక్కులకు
మిగతా 5వ పేజీలో ▶



తెలంగాణ రాష్ట్ర కొత్త గవర్నర్‌గా ప్రమాణం చేసిన అనంతరం సంతకం చేస్తున్న జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, సీఎం రేవంత్ రెడ్డి - 5లో

ఇక్కడ ముంచి.. అక్కడ తేలిండ్రు

నీ వెనకాల ఉండే ఆ అక్కల మాటలు వింటే జూబ్లీ బస్టాండ్‌లో కూర్చోవాల్సిందే

సబిత, సునీత తదితరులను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యలు

- ద్రవ్య వినిమయ బిల్లుపై కేటీఆర్ ప్రసంగానికి బదులిచ్చిన సీఎం
- రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ సభ్యుల అభ్యంతరం.. సభలో గందరగోళం
- అరుపుల మధ్యే సీఎం ప్రసంగం
- సబితను అక్కలా భావించా.. ఆమెను విశ్వసించి కాంగ్రెస్‌లో చేరా
- అండగా ఉంటానని.. టీఆర్‌ఎస్‌లో చేరి మోసం చేశారన్న సీఎం
- బీఆర్‌ఎస్ వాళ్లు కలిసి వస్తామంటే నమ్మేదెవరంటూ ప్రశ్న
- రేవంత్ వ్యాఖ్యలపై సబిత ఆవేదన
- నాపై ఎందుకీ కక్ష.. ఎందుకు టార్గెట్ చేశారు? అంటూ నిలదీత




సాక్షి, హైదరాబాద్: 'మేము కలిసి వస్తాం. ప్రభుత్వానికి సహకరిస్తాం అని కేటీఆర్ పదే పదే చెప్తున్నారు. మీరు కలిసి వస్తారా?! అన్నం ఉడికిందా లేదా? అన్నది ఒక్క మెతుకు పట్టి చూస్తే తెలుస్తుంది. ప్రతిపక్ష నాయకుడు (కేసీఆర్) సభకే రారు. వీరు కలిసి వస్తా అంటే నమ్మేది ఎవరు? నేను అందుకే వారికి (కేటీఆర్) సూచన చేస్తున్నా. నీ వెనకాల ఉండే అక్కలు ఇక్కడ (కాంగ్రెస్‌లో) ఉండి చెప్పి చెప్పి, ఇక్కడ ముంచి అక్కడ (బీఆర్‌ఎస్)
మిగతా 2వ పేజీలో ▶

అవసరమైతే ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కావొచ్చు

- సందర్భాన్ని బట్టి స్పీకర్ నిర్ణయం తీసుకుంటారు: సీఎం రేవంత్
- అక్కల మాటలు నమ్మి మోసపోయా అని కేటీఆర్‌కు చెప్పా
- నేను సభలో ఒక్క మాట కూడా అసభ్యంగా మాట్లాడలేదు

2 లో

రేవంత్ క్షమాపణ చెప్పాల్సిందే..



- మహిళా ఎమ్మెల్యేలపై సీఎం వ్యాఖ్యలు తెలంగాణ ఆడబిడ్డలకు అవమానకరం: కేటీఆర్
- ఆడబిడ్డల ఉసురు తగులుతుంది

2లో

అక్కలను నమ్ముకుంటే.. బతుకు ఆగమంటారా?



- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబిత కంటతడి
- ఏ ముఖం పెట్టుకుని అసెంబ్లీకి వచ్చారంటారా?
- రేవంత్, భట్టి వ్యాఖ్యలు బాధించాయి

2లో

విపక్ష నేతగా నిలబెట్టాల్సిందిపోయి మోసం చేశారు



- ఇంటికి వెళ్లి పార్టీ వీడొద్దని ప్రాథేయ పడినా ఫలితం లేకుండా పోయింది.. స్వార్థం కోసం బీఆర్‌ఎస్‌లో చేరిన మీరు బాధపడుతున్నామని అంటున్నారా?
- అసెంబ్లీలో సబితపై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్

2 లో

ఇదండీ సంగతి



రమణా.. లోడ్ ఎత్తరా



- జూలై టార్గెట్ కోసం చివరిరోజు ఎక్సైజ్ అధికారుల తంటాలు
- ఎంతోకొంత సరుకు తీసుకెళ్లాలని వైన్‌షాప్ యజమానులపై ఒత్తిడి
- గతేడాది జూలైతో పోలుస్తూ స్టాక్ ఎత్తాలని స్థానిక ఎక్సైజ్ సిబ్బంది ఫోన్లు
- చేసేదేమీ లేక వీలున్నంత స్టాక్ గోదాముల నుంచి తీసుకెళ్లిన రిటైలర్లు

ఇదేం ఖర్మరా బాబు.. ఎక్సైజోళ్ల బాధ పడలేకుంది. టార్గెట్.. టార్గెట్ అంటూ నిత్యం సంపుతున్నారు. మద్యం అమ్మితే నాలుగు డబ్బులు మిగిలేది మాకే కదా.. ఎంత అమ్మితే అంత వస్తుంది.. కానీ ఇప్పుడు వాళ్లకు సంపాదించి పెట్టాలట.. ఒక్కో షాప్‌నకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అదనంగా మద్యం కొని అమ్మాలట. మాకేమైనా అదనంగా వస్తుందా అంటే అది లేదు. రూ.లక్ష మందు సమాను కొంటే రూ.15 వేలు పోతున్నాయి. ఏంటో మరి..! ..ఇది మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ వైన్స్ యజమాని ఆవేదన. అతను ఒక్కడే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణదారులందరి పరిస్థితి ఇదే.


సాక్షి, హైదరాబాద్/సాక్షిప్రతినిధి, మహబూబ్‌నగర్, కరీంనగర్: ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం ప్రారంభంలోనే ఎక్సైజ్ అధికారులకు కష్టాలు వచ్చిపడ్డాయి. ఈ ఏడాది జూలై మాసంలో మద్యం అమ్మకాల లక్ష్యాన్ని చేరేందుకు నెల చివరి రోజైన బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు నానాతంటాలు పడ్డారు. ఈ నెల టార్గెట్ పూర్తి కాలేదని, పైఅధికారులు టార్గెట్ పెట్టారని, వీలున్నంత మేర స్టాక్ తీసుకెళ్లాలని వైన్‌షాప్‌ల యజమానులపై ఒత్తిడి తీసుకొచ్చారు. వాస్తవానికి, గత మూడు నెలలుగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు రూ.3వేల కోట్లు మించి జరుగుతున్నాయి. జూన్ నెలలో రూ.3,175 కోట్లు దాటింది. కానీ, జూలై నెలలో ఈ అమ్మకాలు రూ.3వేల కోట్లలోపు ఉండడంతో ఎట్టి పరిస్థితుల్లో లక్ష్యం చేరాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానికంగా ఉండే ఎక్సైజ్ అధికారులు రిటైలర్లపై ఒత్తిడి పెంచారు. గోదాముల్లో సరుకు రెడీగా
మిగతా 5వ పేజీలో ▶

ఎల్‌ఆర్‌ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్

- మార్గదర్శకాలను విడుదల చేసిన పురపాలక శాఖ
- గతప్రభుత్వ హయాంలో లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు
- కోర్టు కేసులతో ఇన్నాళ్లూ ఆగిపోయిన పథకం
- తాజాగా వాటిని క్లియర్ చేయాలని సర్కారు నిర్ణయం
- మూడు దశల్లో ప్రక్రియ.. ఇందుకోసం ప్రత్యేక అప్లికేషన్
- ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పరిశీలన..
- నేడు ఈ అంశంపై అధికారులు, కలెక్టర్లతో సమీక్షించనున్న సీఎస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)కు రంగం సిద్ధమవుతోంది. గతంలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, ఆమోదించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2020లో అప్పటి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రకటించగా.. 25 లక్షల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులకు రూ.1,000 చొప్పున ఫీజు తీసుకుంది. క్రమబద్ధీకరణ కోసం చార్జీలను నిర్ణయించి, ప్రక్రియ ప్రారంభించింది. కానీ కోర్టు కేసుల వల్ల అది నిలిచిపోయింది. అప్పటి నుంచి లక్షలాది మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని పలుమార్లు ప్రకటించింది. తాజాగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అనుమతిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. అనధికారిక ప్లాట్లు, లేఅవుట్ల సమస్యను పరిష్కరించే దిశగా నిబంధనలను సరళీకరిస్తూ.. పెండింగ్ దరఖాస్తుల ఆమోదానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) రూపొందించిన ప్రత్యేక అప్లికేషన్ ద్వారా ఈ ప్రక్రియ
మిగతా 5వ పేజీలో ▶



తానాషాహీ నహీ చలేగా..!

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నినాదాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ వాయిదా అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాజీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వచ్చారు. సీఎం క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. తానాషాహీ (నియంతృత్వం చెల్లదంటూ) నహీ చలేగా..అంటూ మీడియా పాయింట్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సుదీర్ఘంగా మాట్లాడుతుండటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బిగ్గరగా నినాదాలు చేశారు. అనంతరం కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి విలేకరులతో మాట్లాడారు.

లాబీలో సబిత భావోద్వేగం

స్పీకర్ 10 నిమిషాలు విరామం ప్రకటించడంతో సభ నుంచి బయటకు వచ్చిన సబితా ఇంద్రారెడ్డి లాబీలో భావోద్వేగానికి గురయ్యారు. 'అసెంబ్లీలో గంట సమయం ఇస్తే నా గురించి, నా కుటుంబం గురించి చెప్తా. రాష్ట్రానికి, రంగారెడ్డి జిల్లాకు ఏం చేశామో చెప్తాం. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యల గురించి మాట్లాడినందుకే నన్ను టార్గెట్ చేశారు'అని సబిత వ్యాఖ్యానించారు.

ఏడుపు ఎందుకు సబితమ్మా?

'ఎక్స్'లో టీపీసీసీ కౌంటర్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చపై టీపీసీసీ స్పందించింది. సబితా ఇంద్రారెడ్డి అసెంబ్లీలో మీడియాతో మాట్లాడుతూ కంటతడి పెట్టుకోవడాన్ని ఉటంకిస్తూ 'ఏడుపు ఎందుకు సబితమ్మా'? అంటూ 'ఎక్స్'లో ట్వీట్ చేసింది. 'చేవెళ్ల చెల్లెమ్మా అని కాంగ్రెస్ పార్టీ ఆదరించినందుకా? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో హోంమంత్రిని చేసినందుకా? కష్టకాలంలో కాంగ్రెస్‌ను మోసం చేసి పదవి కోసం బీఆర్ఎస్‌లో చేరినందుకా? బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పనిచేసినందుకా? అని ప్రశ్నించింది. 'నువ్వు ఏడిస్తే సానుభూతి రాదు సబితమ్మా' అని ట్వీట్ చేసిన టీపీసీసీ, గతంలో కాంగ్రెస్ నాయకురాలు డీకే అరుణనుద్దేశించి మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సబితా ఇంద్రారెడ్డి మాట్లాడిన వీడియోను జతచేసింది.

సీఎం వ్యాఖ్యలపై దిష్టిబొమ్మల దహనం నేడు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనం కార్యక్రమానికి బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్త ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం, స్థానం ఉందన్న విషయాన్ని మరచి.. ఆడబిడ్డలను నమ్ముకుంటే ముంచుతారంటూ, జీవితం బస్టాండ్ పాలవుతుందంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దిష్టిబొమ్మల దహనంతో పాటు రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయాలని కేటీఆర్ కోరారు.

'కాంగ్రెస్ ఒక్కో తప్పును ప్రజలు లెక్క పెడుతున్నారు'



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో బుధవారం బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్య లపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సభానాయకుడు రేవంత్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాను. ఇది మొత్తం మహిళా లోకానికి జరిగిన అవమానం. సీఎం వెంటనే బీఆర్ ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ సమావేశాలను ఎంతో హుందాగా నిర్వహించి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాం. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ, ప్రతిపక్షాల గొంతును నొక్కుతూ కాంగ్రెస్ వైఖరి గర్హనీయం'అని హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడమే తప్పా అని ప్రశ్నించారు. 'మందబలంతో కాంగ్రెస్ ప్రదర్శిస్తున్న ఈ దురహంకారాన్ని రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారు. కాంగ్రెస్ చేస్తున్న ఒక్కో తప్పును లెక్కబెడుతున్నారు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

అవసరమైతే ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కావొచ్చు

సందర్భాన్ని బట్టి స్పీకర్ నిర్ణయం తీసుకుంటారు

- గతంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ సభ్యత్వాలు రద్దు చేశారు
- మీడియాతో సీఎం రేవంత్ చిట్‌చాట్
- అక్కల మాటలు నమ్మి మోసపోయా అని కేటీఆర్‌కు చెప్పా
- నేను సభలో ఒక్క మాట కూడా అసభ్యంగా మాట్లాడలేదు



సాక్షి, హైదరాబాద్: 'బహిష్కరణలు, సస్పెన్షన్లు, మార్షల్స్ అవసరం లేకుండా సభ నడపాలనేది మా ప్రభుత్వ ఆలోచన. కానీ అలాంటి అవసరం, సందర్భం వస్తే స్పీకర్ నిర్ణయం తీసుకుంటారు. అవసరాన్ని బట్టి ఎమ్మెల్యేల సభ్యత్వం కూడా రద్దు కావొచ్చు. ఏ నిర్ణయమైనా సమయం, సందర్భాన్ని బట్టి ఉంటుంది. శాసనసభలో నేను ఒక్కమాట కూడా అసభ్యంగా మాట్లాడలేదు. నేను మాట్లాడిన దాంట్లో అన్ పార్లమెంటరీ పదం లేదు..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం శాసనసభ వాయిదా అనంతరం ఆయన తన చాంబర్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై సభలో చేసిన వ్యాఖ్యలు, ఇతర అంశాలపై స్పందించారు.

నేను వాళ్ల పేర్లు ప్రస్తావించలేదు

'మోసానికి పర్యాయపదం సబిత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నన్ను కాంగ్రెస్‌లోకి రమ్మని చెప్పిన సబిత అక్క నాకు అండగా ఉండాల్సింది పోయి పార్టీ మారింది. నా ఎన్నికల బాధ్యత తీసుకుంటానని చెప్పి నేను నామినేషన్ వేసేటప్పటికే వ్యతిరేక ప్రచారం మొదలుపెట్టారు. సునీతా లక్ష్మారెడ్డి కోసం 2018 ఎన్నికల్లో ప్రచారానికి పోతే నా మీద కౌడిపల్లి, నర్సాపూర్‌లో రెండు కేసులు పెట్టారు. అధికార పార్టీలోకి వెళ్లి మహిళా కమిషన్ పదవి తీసుకున్న సునీత తాను ఎమ్మెల్యే అయినా తన ప్రచారం కోసం వెళ్లిన తమ్ముడి మీద కేసులు తీయించలేదు. ఈ నేపథ్యంలోనే అక్కల మాటలు నమ్మి నేను మోసపోయాను అని కేటీఆర్‌కు చెప్పా. నేను వాళ్ల పేర్లు ప్రస్తావించలేదు. సబిత వ్యక్తిగత విషయాలను మాట్లాడినందుకే, నేను మిగతాది పూర్తి చేశా..' అని సీఎం చెప్పారు.

కేసీఆర్‌ను ఫ్లోర్‌లీడర్‌గా తొలగించాలి

'సబితక్కకు అవమానం, అన్యాయం జరిగి ఆవేదన చెందితే కేసీఆర్, హరీశ్‌రావు అసెంబ్లీకి ఎందుకు దుమ్మా కొట్టారు. సభలోకి వచ్చి సబితక్కకు అండగా నిలబడకుండా, పార్టీ సభ్యులను పట్టించుకోకుండా కేసీఆర్ ఎందుకు పత్తా లేకుండా పోయారు. సభలో మాట్లాడేందుకు కేటీఆర్, హరీశ్‌రావు చాలు అనుకుంటే, కేసీఆర్‌ను ఫ్లోర్‌లీడర్ పదవి నుంచి తొలగించాలి. కేసీఆర్‌కు రాష్ట్రం పట్ల బాధ్యత, పట్టింపు లేదు. కేసీఆర్‌కు అధికారం తప్ప ప్రజలను పట్టించుకోవాలనే మంచి ఆలోచన లేదు..' అని రేవంత్ విమర్శించారు.

విపక్ష సభ్యులకే ఎక్కువ సమయం

ఒక రోజు 17 గంటలపైనే సభ జరగడాన్ని బట్టి చూస్తే వారం రోజులకు పైగా సభ జరిగినట్లే. ఎన్ని రోజులు సమావేశాలు జరిగాయనే దానికంటే ఎన్ని గంటలు జరిగిందనేదే ముఖ్యం. గడిచిన పదేళ్లతో పోలిస్తే అసెంబ్లీని ప్రజాస్వామికంగా నడుపుతున్నాం. సభలో విపక్ష సభ్యులకే ఎక్కువ సమయం ఇచ్చాం. బీఆర్ఎస్ తరఫున కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి ముగ్గురు కలిసి ఆరు గంటల సేపు మాట్లాడారు. నాతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు.. ముగ్గురం కలిసినా అంతసేపు మాట్లాడలేదు' అని సీఎం చెప్పారు.

కలిసినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదు

గద్వాల ఎమ్మెల్యే తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నారనే వార్తపై స్పందిస్తూ.. 'టీ తాగేందుకు కలుసుకోవటం, రాజకీయాలకు, పార్టీల్లో చేరటానికి సంబంధం లేదు. ఇటీవల ఎనిమిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నా చాంబర్‌కు వచ్చి టీ తాగారు. అంతమాత్రాన వారు మా పార్టీలో చేరినట్లా..?' అని రేవంత్ ప్రశ్నించారు.

ప్రజాస్వామికంగా అసెంబ్లీ సమావేశాలు

'గతంలో బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ సభ్యత్వాలు రద్దు చేశారు. నన్ను కూడా ఒక సెషన్ మొత్తం సస్పెండ్ చేయడంతో నా నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరుగుతుందని హైకోర్టులో పిటిషన్ వేశా. నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శాసనసభలోనూ ఎమ్మెల్యేగా ఉన్నా. కానీ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు పూర్తి ప్రజాస్వామికంగా, బాధ్యతగా జరిగాయి. చర్చను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినా మేము బాధ్యతగా వ్యవహరించాం. ఈసారి బడ్జెట్ సమావేశాలు తక్కువ రోజులు జరిగినా బడ్జెట్, పద్దులు, ద్రవ్య వినిమయ బిల్లుపై అందరికీ మాట్లాడే అవకాశం దొరకడంతో వీలైనంత చర్చ జరిగింది.

అక్కలను నమ్ముకుంటే.. బతుకు ఆగమవుతుందంటారా?



అసెంబ్లీ ఆవరణలో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్, కౌశిక్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, అనిల్ జాదవ్, అరికపూడి గాంధీ, మల్లారెడ్డి, గంగుల. చిత్రంలో సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కంటతడి

- ఏ ముఖం పెట్టుకుని అసెంబ్లీకి వచ్చారంటారా?
- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం వ్యాఖ్యలు చాలా బాధించాయి

సాక్షి, హైదరాబాద్: ''మమ్మల్ని నమ్మితే బతుకు బస్టాండేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్న మాటలు చాలా బాధించాయి. అక్కలను నమ్ముకుంటే బతుకు ఆగమైపోతుందని రేవంత్ అన్న మాటలు మమ్మల్ని మాత్రమే కాదు, తెలంగాణ మహిళలను అవమానించినట్టే. అంతేకాదు ఏం ముఖం పెట్టుకుని అసెంబ్లీకి వచ్చారని మమ్మల్ని డిప్యూటీ సీఎం భట్టి అనడం దారుణంగా అవమానించడమే''అని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. అక్కలుగా తాము అందరి మంచి కోరుతామని, కానీ ఖర్మకాలి అసెంబ్లీకి వచ్చామని సబితారెడ్డి కంటతడి పెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి తాను చేసిన వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పక్కదారి పట్టించేందుకే అవమానించారు!

కేటీఆర్ శాసనసభలో బడ్జెట్‌పై నిజాలు మాట్లాతుంటే.. దాన్నుంచి పక్కదారి పట్టించేందుకే సీఎం తమపై అవమానకర వ్యాఖ్యలు చేశారని సబిత మండిపడ్డారు. ''మీ వెనుక కూర్చొన్న అక్కలు అంటూ మమ్మల్ని అవమానపరిచారు. సీఎంకు మహిళలంటే ఎంత గౌరవమో తెలుస్తోంది. నేను మోసం చేశానని రేవంత్‌రెడ్డి అంటున్నారు. అప్పట్లో ఆయనను కాంగ్రెస్‌లో రమ్మనడమే నేను చేసిన తప్పా?''అని నిలదీశారు. దివంగత సీఎం వైఎస్సార్ తమను రాజకీయాల్లోకి తీసుకువచ్చారని, మహిళలను ఆయన ఎంతో ప్రోత్సహించారని సబిత గుర్తుచేశారు. తాను గత 24 ఏళ్లలో చాలా మంది సీఎంలను చూశానన్నారు. సీఎం సీటు రేవంత్ సొంతం కాదని, 4 కోట్ల మంది ప్రజలు ఇచ్చిన పదవి అన్న విషయం మర్చిపోవద్దని హితవు పలికారు. తామెక్కడ నిలదీస్తామోనని అసెంబ్లీ నుంచి పారి పోయారన్నారు.

ఏం ముఖం పెట్టుకుని వచ్చారంటారా?

అసెంబ్లీకి ఏం ముఖం పెట్టుకుని వచ్చారన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్షమాపణ చెప్పాలని సబిత డిమాండ్ చేశారు. ''నేను ఏ తప్పు చేయలేదు. చాలామంది పార్టీలు మారారు. కేసీఆర్ ఇంటిపై వాలిన కాకి మా ఇంటిపై వాల కుండా చూస్తామన్న రేవంత్ మాటలేమయ్యాయి? ఇప్పుడు పార్టీ మారిన వాళ్లను మీ పక్కన ఎందుకు పెట్టుకున్నారు? తాను కాంగ్రెస్ నుంచి బయటికి ఎందుకు రావాల్సి వచ్చిందో, ఎలా మెడబట్టి బయటికి గెంటే ప్రయత్నం చేశారో తెలుసు. నా కారణంగానే గతంలో భట్టి విక్రమార్కకు ప్రతి పక్ష నేత పదవి పోయిందన్నారే.. మరి ఇప్పుడు ఆయన సీఎం ఎందుకు కాలేదు'' అని నిలదీశారు.

ఏ పార్టీలో ఉన్నా కమిట్‌మెంట్‌తో పనిచేశాం: సునీతా లక్ష్మారెడ్డి

తాము ఏ పార్టీలో ఉన్నా కమిట్‌మెంట్‌తో పనిచేశామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చెప్పారు. అధికారం ఉన్నా, లేకున్నా పార్టీ జెండా మోసి కార్యకర్తలను కాపాడుకున్నామన్నారు. డీకే అరుణ, సబితారెడ్డితో పాటు తనను అవమానించారని, దొంగలే దొంగ అన్నట్లుగా ఉందని మండిపడ్డారు. సీతక్క ఏ పార్టీ నుంచి వచ్చారో ప్రజలకు తెలుసన్నారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇక్కడ ముంచి అక్కడ తేలిండ్రు

▶ మొదటి పేజీ తరువాయి

తేలిండ్రు.. ఆ అక్కల మాటలు విన్నదు అనుకో, జూబ్లీ బస్టాండ్‌లో కూర్చోవాల్సి వస్తది..' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శాసనసభలో బుధవారం ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్ మాట్లా డారు. ఆయన ప్రసంగం ముగించగానే ఆయన వెనకాల ఉన్న బీఆర్ఎస్ సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు గట్టిగా బల్లలు చరుస్తూ మద్దతు పలికారు. ఈ నేపథ్యంలోనే సీఎం మాట్లాడుతూ.. 'వెనకాల ఉండే అక్కలు..' అనే వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారి అరుపులు, నినాదాలు, కాంగ్రెస్ సభ్యుల ప్రతి నినాదాలతో గందరగోళం మధ్యే రేవంత్ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

అండగా నిలబడతానని చెప్పి మోసం చేశారు: రేవంత్

'ప్రజాజీవితంలో ఉన్నప్పుడు వ్యక్తిగత, ప్రజాజీవితానికి సంబంధించిన చర్చ ఉంటుంది. నాకు, సబితక్కకి మధ్య జరిగిన వ్యక్తిగత చర్చను ఆమె సభలో చెప్పారు. కాబట్టి దానికి కొనసాగింపుగా జరిగిన కొన్ని చర్చలను నేను సభలోనే చెప్పాల్సిన అవసరముంది. కాంగ్రెస్ పార్టీలోకి నన్ను సబిత ఆహ్వానించడం, పెద్ద లీడర్ అవుతావని చెప్పడం వాస్తవమే. నేను ఆమె మాటను విశ్వసించి, సొంత అక్కగా భావించి, కుటుంబ సంబంధాలు, ఇతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆనాడు కాంగ్రెస్‌లో చేరా. 2019లో కాంగ్రెస్ పార్టీ నన్ను పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయమంది. అప్పుడు సబితక్క నన్ను పిలిచి మల్కాజిగిరి నుంచి పోటీ చెయ్యి.. ఎన్నికల్లో అండగా నిలబడతానని మాట ఇచ్చారు. కానీ నన్ను పార్టీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన మరుక్షణమే ఆమె టీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ మాయ మాటలను నమ్మి అధికారం కోసం కాంగ్రెస్‌ను వదిలి టీఆర్ఎస్ పార్టీలో చేరి మంత్రి పదవి పొంది తమ్ముడిని మోసం చేశారు. (ఇది నిజమా? కాదా? అని సబితారెడ్డినుద్దేశించి ప్రశ్నించారు) కాబట్టే ఆమెను నమ్మవద్దని కేటీఆర్‌కు సూచించా. బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవులు పొంది ఈ రోజు వచ్చి మాకు నీతులు చెబితే మేము ఏమైనా అమాయకులమా?..' అంటూ సీఎం ప్రశ్నించారు. 'మైనారిటీలకు మంత్రి పదవి ఇవ్వలేదని కేటీఆర్ మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. 2014–19 మధ్యకాలంలో ఒక్క మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వాన్ని నడిపించారు. ప్రభుత్వానికి సహకరించేది ఉంటే ప్రతిపక్ష నాయకుడిని సభలో కూర్చోమని చెప్పండి..' అని రేవంత్ అన్నారు. తాను కొత్త గవర్నర్‌కు ఆహ్వానం పలకడానికి విమానాశ్రయానికి వెళ్తున్నానని, తిరిగి వచ్చిన తర్వాత అందరికీ సమాధానమిస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి సభ నుంచి వెళుతుండగా బీఆర్ఎస్ సభ్యులు 'షేమ్ ..షేమ్' అంటూ నినాదాలు చేశారు. దీనికి ముందు బీఆర్ఎస్ సభ్యుల నిరసనల నేపథ్యంలో స్పీకర్ అవకాశం ఇవ్వడంతో సబిత గద్గద స్వరంతో మాట్లాడారు.

ఏం మోసం చేశాం: సబిత

'రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినప్పుడు నేను అక్కగా ఆశీర్వదించా. నువ్వు చాలా ఎదుగుతావు.. ఈ రాష్ట్రానికి సీఎం అవుతావు..అంటూ పార్టీలోకి ఆహ్వానించా. సీఎం గుండెల మీద చెయ్యి వేసుకుని ఇది నిజమా? కాదా? చెప్పాలి. ఈ రోజు నాపై ఎందుకు కక్ష తీర్చుకుంటున్నాడో అర్థం కావడం లేదు. ప్రతిసారీ అసెంబ్లీలో ఒక ఆడబిడ్డకు బాధ అవుతుంటే వినే స్థితిలో లేరా? ఎందుకు నన్ను టార్గెట్ చేసింద్రు. నీ వెనక కూర్చున్న అక్కలను నమ్ముకోవద్దు.. మోసం చేస్తరని అన్నడు? ఏం మోసం చేశాం? ఏం ముంచినం? వీళ్లను ముంచినమా? ఎన్నికల సమయంలో కూడా నా నియోజకవర్గంలో మాట్లాడుతూ సబితక్క పొద్దునొక్క మాట, రాత్రి ఒక్క మాట మాట్లాడతది అన్నాడు. పొద్దునొక్క మాట, రాత్రి ఒక్క మాట ఏం మాట్లాడిన? ఎవరిని, ఎందుకు అవమానిస్తున్నవు? ఎందుకీ కక్ష ? ప్రతిసారీ టార్గెట్ చేస్తున్నరు. ఏం చేసినం మేము ఆడబిడ్డలం. సీఎం తన మాటలను ఉపసంహరించుకోవాలి..' అని సబిత డిమాండ్ చేశారు. సబిత ఆ మాట అనగానే స్పీకర్ మైక్ కట్ చేశారు. అంతకు ముందు 'సీఎం రేవంత్ ఏ పార్టీలో నుంచి వచ్చారు? కేసీఆర్ ఇంటిపై వాలిన కాకి నా ఇంటిపై వాలినా కాల్చి వేస్తా అని గతంలో అన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి అంత మందిని ఎందుకు చేర్చుకున్నారు..' అని సబిత నిలదీశారు.

విపక్ష నేతగా నిలబెట్టాల్సింది పోయి మోసం చేశారు

ఇంటికి వెళ్లి పార్టీ వీడొద్దని ఆవేదన పడినా ఫలితం లేకుండా పోయింది

- స్వార్థం కోసం కాంగ్రెస్‌ను వదిలి బీఆర్ఎస్‌లో చేరిన మీరు బాధపడుతున్నా అని అంటున్నారు
- ఇంకా ఏ ముఖం పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడతారు?
- అసెంబ్లీలో సబితపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫైర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తనకు 2018లో సీఎల్పీ నేతగా, ప్రతిపక్ష నేతగా అవకాశం కల్పించిందని, ఒక దళితుడికి సీఎల్పీగా అవకాశం లభించడం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్‌లో దశాబ్ద కాలం మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి తన వెనక ఉండి ప్రతిపక్ష నేతగా నిలబెట్టాల్సింది పోయి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది నేతలతో కలిసి ఆమె ఇంటికి వెళ్లి పార్టీ విడిచి వెళ్లవద్దని, మీరు వెళ్తే సభ్యుల సంఖ్య తగ్గి ప్రతిపక్ష నేత హోదాను కోల్పోతానని, కాంగ్రెస్ పరువుపోతుందని ఆవేదన పడినా ప్రయోజనం లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి మధ్య జరిగిన వాగ్వాదానికి స్పందిస్తూ ఆయన మాట్లాడారు. 'అధికారం, స్వార్థం కోసం కాంగ్రెస్ వదిలి టీఆర్ఎస్‌లో చేరిన మీరు బాధపడుతూ మాట్లాడుతున్నా అంటున్నారు. అసలు బాధ పడాల్సింది నేనా? కాంగ్రెస్ పార్టీనా? మీరా? ఇంకా ఏం ముఖం పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడతారు? పార్టీలు మారి పరువు తీసి మొత్తం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు' అని భట్టి విక్రమార్క తీవ్ర స్వరంతో మాట్లాడారు. వేరే పార్టీలో ఉన్న సబితను 2004లో కాంగ్రెస్‌లో చేర్చుకుని టికెట్ ఇచ్చి ఐదేళ్లు మంత్రిగా చేసినట్టు గుర్తు చేశారు. 2009లో మళ్లీ టికెట్ ఇచ్చి మళ్లీ ఆమెను మంత్రిని చేసి అత్యంత ముఖ్యమైన శాఖలు అప్పగించారన్నారు. 2014లో పార్టీ ఆమెకు టికెట్ ఇచ్చిందని, వాళ్ల అబ్బాయికి కూడా ఎంపీ టికెట్ ఇచ్చిందని భట్టి చెప్పారు.

మోసం చేశారు: మంత్రి సీతక్క

కాంగ్రెస్‌లో చేరిన (బీఆర్ఎస్) ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ.. కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో గవర్నర్‌కు ఫిర్యాదు చేయించారని బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క మండిపడ్డారు. వారితో రాజీనామా చేయించి బీఆర్ఎస్‌లోకి తీసుకున్నారా? సబితతో రాజీనామా చేయించారా? అని నిలదీశారు. మీతో వస్తామని చెప్పి ఒకరిద్దరు మహిళలు ఏం చేశారో తనకు తెలుసని, ఆ బాధను సీఎం అనుభవించారని చెప్పారు. (కాంగ్రెస్‌లో చేరేందుకు) ఢిల్లీకి వస్తున్నామని వారు చెప్పడంతో సీఎం రేవంత్.. రాహుల్ గాంధీ వద్ద సమయాన్ని తీసుకున్నారని, ఆ తర్వాత రాకుండా మోసం చేశారన్నారు. ఆ బాధ అనుభవించిండు కాబట్టే కేటీఆర్‌కు సీఎం సూచన చేశారన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆమెను ఉద్దేశించి నీకేం తెలియదు అనగా, నీ దురహంకారాన్ని బంద్ చేసుకో అని సీతక్క తీవ్ర స్వరంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వారికి ఎంతో చేసిందని, అదే కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే వారిద్దరు చప్పట్లు కొట్టడం సబబేనా? అని సబిత, సునీతా లక్ష్మారెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు.

ఆసక్తి లేకుంటే వెళ్లిపోవచ్చు: మంత్రి శ్రీధర్‌బాబు

సభా నాయకుడు సీఎం మాట్లాడుతున్నప్పుడు సభ్యులందరూ సభలో కూర్చొని ఉండాలనే సంప్రదాయం ఉందని, కూర్చునే ఆసక్తి లేని వాళ్లు వెళ్లిపోవచ్చని శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ మాట్లాడుతున్నప్పుడు బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ వెల్ వద్ద చేరి ఆందోళన చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. శాసనసభ వ్యవహారాల మంత్రిగా తనకున్న అధికారాలను సైతం ప్రశ్నిస్తూ కొత్త సంప్రదాయానికి తెరలేపారని మండిపడ్డారు. తీరు మారకపోతే సభలో (సస్పెన్షన్ తరహా) తీర్మానం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రేవంత్ క్షమాపణ చెప్పాల్సిందే

మహిళా ఎమ్మెల్యేలపై సీఎం వ్యాఖ్యలు తెలంగాణ ఆడబిడ్డలకు అవమానకరం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీ రామారావు డిమాండ్ చేశారు. ఈ అవమానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలది మాత్రమే కాదని.. మొత్తం తెలంగాణ ఆడబిడ్డలకే అవమానకరమని పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. ''మహిళా ఎమ్మెల్యేలను అకారణంగా, అసభ్యంగా హీనాతిహీనంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు అవమానించారు. మహిళా ఎమ్మెల్యేలు ఎంతో కష్టపడి రాజకీయాల్లో సక్సెస్ అయ్యారు. అంతేతప్ప రేవంత్ మాదిరిగా విన్యాసాలు చేస్తూ రాజకీయాల్లోకి రాలేదు. వాళ్ల కుటుంబాలకు ఉన్న ఆదరణతో స్వశక్తితో రాజకీయాల్లో రాణిస్తున్నారు. అలాంటి మహిళలను పట్టుకుని నోటికి వచ్చినట్టు వాగడం సీఎం రేవంత్‌కు తగదు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలి..'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. మహిళలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందన్నట్టుగా సీఎం మాట్లాడటం హేయమని మండిపడ్డారు. సీఎం కుర్చీలో కూర్చునేందుకు రేవంత్ అనర్హుడని, ఆయనకు ఆడబిడ్డల ఉసురు తగులుతుందని వ్యాఖ్యానించారు.

భట్టికి ఎంత గుండె ధైర్యం?

''ముఖ్యమంత్రి ఇట్లా ఉంటే.. ఉప ముఖ్యమంత్రి మమ్మల్ని ఏ ముఖం పెట్టుకొని అసెంబ్లీకి వచ్చినవ్ అంటారా? మీరు ఏ ముఖం పెట్టుకుని వచ్చారో మేము కూడా అదే విధంగా అసెంబ్లీకి వచ్చాం. మా ఆడబిడ్డలతో ఇష్టమొచ్చినట్టు మాట్లాడటానికి డిప్యూటీ సీఎం భట్టికి ఎంత గుండె ధైర్యం ?'' అని కేటీఆర్ నిలదీశారు. ప్రజలు మీకు అధికారం ఇచ్చినది ఇష్టమొచ్చినట్టు మాట్లాడటానికా అని ప్రశ్నించారు. తాము పదేళ్ల అధికారంలో ఉన్నా ఎప్పుడైనా ఇలా మహిళలను అవమానించామా అని పేర్కొన్నారు. సీఎంను ఏకవచనంతో సంబోధిస్తే వెంటనే సరిచేసుకున్నానని, అది కేసీఆర్ తమకు నేర్పిన సంస్కారమని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ మహిళా పక్షపాత పార్టీ

అనని మాటలను మాకు ఆపాదిస్తున్నారు

- మహిళా గవర్నర్‌ను అవమానించిందెవరో అందరికీ తెలుసు
- కేటీఆర్‌కు ఆది శ్రీనివాస్, ఇతర ఎమ్మెల్యేల కౌంటర్



అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న వేముల వీరేశం. చిత్రంలో ఆది శ్రీనివాస్, యశస్వినీరెడ్డి, పర్ణికారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఐదుగురు మహిళలు పనిచేశారని, మహిళా పక్షపాతి అంటేనే కాంగ్రెస్ పార్టీ అని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో చప్పట్లు కొడుతూ సభాగౌరవాన్ని మంటగలుపుతున్న బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌కు సమాధానం చెప్పలేకనే కొన్ని మాటలను తప్పుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బుధవారం సీఎల్పీ మీడియా హాల్‌లో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, రాజ్‌ఠాకూర్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను సీఎం రేవంత్ అక్కా అని పిలుస్తారని, అక్కా అని పిలవడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ అనని మాటలను అన్నట్టు ఆపాదించడం సరైంది కాదని చెప్పారు. ఒక మహిళ గవర్నర్‌గా రాష్ట్రానికి వస్తే ఆమెను అవమానించింది ఎవరో అందరికీ తెలుసునని పరోక్షంగా బీఆర్ఎస్‌ను విమర్శించారు. మంత్రి సీతక్కను సైతం గౌరవం లేకుండా బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారని, సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీలో గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లింది నిజం కాదా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడారని సబితమ్మ ఆవేదన చెందిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కేబినెట్‌లో ఒక్క మహిళకు కూడా అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇప్పుడు సభ నుంచి పారిపోయిన బీఆర్ఎస్ నేతలకు ప్రజలు రాబోయే రోజుల్లో కర్రు కాల్చి వాతపెడతారని వ్యాఖ్యానించారు. సబితా ఇంద్రారెడ్డిని గౌరవించింది మా పార్టీయేనని, ఆమెను ఉమ్మడి రాష్ట్రంలోనే హోంమంత్రిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. మహిళను పార్టీ అధ్యక్షురాలిని చేసే దమ్ము బీఆర్ఎస్‌కు ఉందా అని వారు సవాల్ విసిరారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డికి మహిళలంటే గౌరవమని, సభలో ఆయన ఎవరినీ అవమానించలేదని ప్రభుత్వ విప్‌లు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, శంకర్, బాలు నాయక్, వేముల వీరేశం, విజయ రమణారావు, యశస్వినీరెడ్డి, మట్టా రాగమయి, చిట్టెం పర్ణికారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు.

సభ ముందుకు మరో రెండు బిల్లులు

సాక్షి, హైదరాబాద్: బుధవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఆదేశాల మేరకు రెండు బిల్లులను శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. 'తెలంగాణ శాసనాల సంక్షిప్త పదాల మార్పు, సంబంధిత విషయాల గురించిన బిల్లు', 'తెలంగాణ సివిల్ న్యాయస్థానాల చట్టం సవరణ బిల్లు'ను సభలో ప్రవేశపెట్టారు. సభలో రగడ నేపథ్యంలో బుధవారం ప్రవేశపెట్టిన రెండు బిల్లులతో పాటు మంగళవారం ప్రవేశపెట్టిన స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుపై గురువారం చర్చ జరగనుంది.

క్లుప్తంగా...

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల రాజకీయ డ్రామా

బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: శాసనసభలో బుధవారం ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయ డ్రామా నడిపాయని బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను చూసి అధికార కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుందని ఆయన దుయ్యబట్టారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో ఏలేటి మాట్లాడుతూ...ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో అధికార పార్టీతో సమానంగా బీజేపీ లోక్‌సభ స్థానాలు గెలవడంతో ఇరు పార్టీలు రాజకీయ డ్రామాకు తెరలేపాయన్నారు. శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై బీజేపీ తరుపున మాట్లాడటానికి అవకాశం ఇవ్వకపోవడం సరికాదని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ సభను నడుపుతున్న తీరు అప్రజాస్వామికంగా ఉందని విమర్శించారు.

భట్టి తన సామాజికవర్గాన్ని ఎప్పుడూ వాడుకోరు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాజకీయం కోసం తన సామాజిక వర్గాన్ని ఎప్పుడూ వాడుకోరని, ఈ రోజు మాత్రం నిండు సభలో తాను దళితుడినని భట్టి చెప్పారంటే ఆయన ఎంత బాధతో మాట్లాడి ఉంటారో అర్థమవుతోందని శాసనసభా వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. భట్టి మొదటిసారి నోరు విప్పారని, తనకు జరిగిన అన్యాయం గురించి పదేళ్ల తర్వాత ఆయన మాట్లాడారని శ్రీధర్‌బాబు బుధవారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ చెప్పారు. సభలో ముఖ్యమంత్రి ఎవరి పేరును తీసుకోలేదని, ఆయన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలు అనవసరంగా ఆవేశపడుతున్నారని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ బతకాలంటే హరీశ్‌కు అప్పగించాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజకీయ పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కుటుంబేతర వ్యక్తులకు పార్టీ పగ్గాలను అప్పగించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ తరుణంలో బీఆర్ఎస్ పార్టీ బతకాలంటే హరీశ్‌రావుకు అప్ప గించాలని, కేటీఆర్ చేతిలో పార్టీని పెడితే బతకదని ఆయన అభిప్రాయ పడ్డారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ప్రజాస్వామ్యం లేదని, హరీశ్‌రావును అణగదొక్కడానికి శతవిధాలా ప్ర యత్నం చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు ప్రజ లకు మంచి చేసి, ఇప్పుడు పోరాటం చేస్తే బాగుండేదని యెన్నం అభిప్రాయపడ్డారు.

ఓయూలో మళ్లీ డిటెన్షన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో మళ్లీ డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. కరోనా సమయంలో 2019–20 విద్యా సంవత్సరం నుంచి రద్దు చేసిన డిటెన్షన్ విధానాన్ని ఈ విద్యా సంవత్సరం (2024–25) నుంచి ప్రవేశపెట్టినట్టు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు గడువును పెంచినట్టు ఇంటర్ బోర్డ్ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోగా ఇంటర్ కళాశాలల్లో చేరవచ్చని సూచించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు పొడిగింపు తేదీని పరిగణనలోకి తీసుకుని ప్రవేశాలు చేపట్టాలని బోర్డు ఆదేశించింది.

నేటి నుంచి ఆర్నెల్లు ఉద్యోగుల బదిలీలపై నిషేధం

ఆర్థిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల సాధారణ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. గురువారం నుంచి ఆరు నెలల పాటు రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ శాఖలోనూ బదిలీలు ఉండవని, ఆ తర్వాత కూడా పరిపాలనా సౌలభ్యం కోసం అవసరమైతే ఆర్థిక శాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆ శాఖ మంత్రి, ఆర్థిక మంత్రి ద్వారా ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల్లో ఎలాంటి ఉల్లంఘన జరిగినా ఆయా ఉద్యోగుల వేతనాలు చెల్లించవద్దని ట్రెజరీ శాఖను ఆదేశించారు. కేవలం పదోన్నతులు, పోస్టుల రద్దు, రివర్షన్లు, మాతృశాఖకు పంపడం, డిప్యుటేషన్లు మాత్రమే అనుమతించాలని, అది కూడా ఏ ఉద్యోగికీ స్థానచలనం కలగకుండా స్పష్టమైన ఖాళీల్లో మాత్రమే భర్తీ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పరిపాలనా సౌలభ్యంకోసం ఖాళీగా ఉన్న పోస్టుల్లోకి కనీసం ఏడాది సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సహేతుక కారణాలు చూపి ఆర్థిక శాఖ అనుమతితో బదిలీ చేయవచ్చని వెల్లడించారు.

బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన మధ్యే

ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం

- 'అక్కలు.. ఇక్కడ ముంచి అక్కడ తేలిన్రు' అన్న సీఎం వ్యాఖ్యలతో రగడ

సాక్షి, హైదరాబాద్: 'మహిళలను అవమానపరిచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి.. నహీ చలేగా నహీ చలేగా..తానాషాహి నహీ చలేగా..'అన్న బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లు 2024–25కు శాసనసభ బుధవారం ఆమోదం తెలిపింది. సభలో గందరగోళం నేపథ్యంలో కీలకమైన ఈ బిల్లుపై బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులకు మాట్లాడే అవకాశం లభించలేదు. ఈ పరిస్థితుల్లోనే ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ద్రవ్య వినిమయ బిల్లును సభలో ప్రవేశపెట్టగానే కాంగ్రెస్ సభ్యులు బల్లలు చరుస్తూ ఆమోదం తెలిపారు. అనంతరం ద్రవ్యవినిమయ బిల్లుకు సభ ఆమోదం తెలిపినట్లు సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.



దద్దరిల్లిన సభ

'వెనకాల ఉండే అక్కలు..ఇక్కడ ముంచి అక్కడ తేలిన్రు. ఆ అక్కల మాటలు విన్నారనుకో.. జూబ్లీ బస్టాండ్లో కూర్చోవాల్సి వస్తది..'అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల అరుపులు, కేకలు, నినాదాలతో సభ అట్టుడుకింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 1.20 గంటలప్పుడు వాయిదా పడిన అసెంబ్లీ తిరిగి 3.30 గంటలకు ప్రారంభమైంది. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ద్రవ్య వినిమయ బిల్లుపై మాట్లాడాల్సిందిగా బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. అయితే తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి సీటు నుంచి లేచి నిలుచున్నారు. సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి కూడా ఆమెకు మద్దతుగా లేచి నిలుచున్నారు. స్పీకర్ అంగీకరించకుండా ఏలేటిని మాట్లాడాల్సిందిగా కోరారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కౌశిక్‌రెడ్డి, వివేకానంద, మల్లారెడ్డి, మాగంటి గోపీనాథ్, డాక్టర్ సంజయ్, కాలేరు వెంకటేశ్ తదితరులు ఆందోళనకు దిగారు. అయినా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడడం ప్రారంభించడంతో.. సబిత, సునీత, లక్ష్మి పోడియం వద్దకు వెళ్లి తమకు అవకాశం ఇవ్వాలని సభాపతిని కోరారు. కేటీఆర్, ఇతర సభ్యులు తమ సీట్ల నుంచి లేచి నిలబడి సబితకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడిన తర్వాత సబితా ఇంద్రారెడ్డికి అవకాశం ఇస్తానని స్పీకర్ చెప్పినా, బీఆర్ఎస్ సభ్యులు వినిపించుకోలేదు.

సబితకు అవకాశం ఇవ్వాలి: అక్బర్

ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కల్పించుకుని సబితా ఇంద్రారెడ్డి పేరు తీసుకుని సీఎం మాట్లాడారు కాబట్టి, సమాధానం చెప్పే హక్కు ఆమెకు ఉంటుందని అన్నారు. సబితకు స్పీకర్ అవకాశం ఇవ్వడమే సబబని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎవరి పేరును ప్రస్తావించలేదని అన్నారు. సీఎం సభలో ఎవరి పేరూ ఎత్తకుండా చేసిన వ్యాఖ్యలపై సబితా ఇంద్రారెడ్డి సమాధానమిచ్చారని, దానిపై ముఖ్యమంత్రి వివరణ ఇచ్చారని, ఆ అంశం ముగిసిందని స్పష్టం చేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడకపోతే కాంగ్రెస్ సభ్యుడు గడ్డం వివేక్ (చెన్నూరు)కు మైక్ ఇవ్వాలని సూచించడంతో వివేక్‌కు స్పీకర్ అవకాశం ఇచ్చారు.

వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు

వివేక్ మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన తీవ్రమైంది. కేటీఆర్‌తో సహా బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి 'ముఖ్యమంత్రి అహంకార వైఖరి నశించాలి', 'సీఎం డౌన్‌డౌన్', తదితర నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. అయినా వివేక్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. కేటీఆర్, సబిత తదితరులు వివేక్‌ను ప్రసంగం ఆపమని కోరినా ఆయన పట్టించుకోలేదు. దీంతో సబిత, సునీత, కోవా లక్ష్మి ఎమ్మెల్యేల సీట్ల దగ్గర కింద కూర్చొని నిరసన తెలిపారు. మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెల్ దగ్గర ఆందోళన కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో ఎంఐఎం నేత అక్బరుద్దీన్.. మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబుల వద్దకు వెళ్లి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను ఉద్దేశించి స్పీకర్.. 'మీరు చాలా జంటిల్‌మ్యాన్, ఇలా వ్యవహరించడం తగదు. ద్రవ్య వినిమయ బిల్లు ఇంపార్టెంట్ అని మీరే చెప్పారు. ఈ బిజినెస్ మంచిది కాదు..'అని వ్యాఖ్యానించారు. అయినా బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు ఆగలేదు. చప్పట్లు కొడుతూ సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాంతో మంత్రి సీతక్క మైక్ తీసుకొని 'సీఎం ఎవరినీ ఏమీ అనలేదు. మీరు గతంలో మహిళ అని చూడకుండా గవర్నర్‌ను కూడా అవమానించారు. నన్ను అసెంబ్లీలో నాలెడ్జ్ లేదని అవమానించారు. చప్పట్లు కొడుతూ రోడ్ల మీద ఆడుతున్నారా? అసెంబ్లీలోనా? 'అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ గొడవ జరుగుతుండగానే ఆర్థిక మంత్రికి.. ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం కోరాల్సిందిగా స్పీకర్ సూచించడం, భట్టి బిల్లును ప్రవేశపెట్టడం, బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించడం వెంట వెంటనే జరిగిపోయాయి. అనంతరం స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించగా.. సభ వాయిదా పడడానికి ముందు సీఎం సభలోకి ప్రవేశించారు.

కేటీఆర్‌ది రెచ్చగొట్టే కుట్ర

సూచనల ముసుగులో మోసం చేస్తున్నారు: అసెంబ్లీలో సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ సూచనల ముసుగులో శాసనసభను తప్పుదోవ పట్టించేందుకు, మోసమనే ప్రణాళికను ప్రజల మెదళ్లలో చొప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పదేళ్లు ఏలినవారు పది నెలలు కూడా పూర్తి చేసుకోని కాంగ్రెస్ ప్రభుత్వం మీద వందల ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ''ఎప్పుడు చూసినా రాజకీయాలేనా? ప్రభుత్వంగా మా పాత్ర మేం పోషిస్తాం. ప్రతిపక్షంగా వారి పాత్ర వారు పోషించాలి. ఇప్పుడు ఎన్నికలు కూడా లేవు. ఎందుకు రాజకీయాలు?''అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. బుధవారం ఉదయం శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. ఈ సమయంలో మధ్య మధ్యలో సీఎం రేవంత్ జోక్యం చేసుకున్నారు. ముచ్చర్ల భూములను ఫార్మాసిటీ కోసం తీసుకుంటున్నట్టు నోటిఫికేషన్ ఇచ్చారని, ఇప్పుడా భూముల వినియోగం మారిస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని కేటీఆర్ సూచించడంపై విరుచుకుపడ్డారు. ఆ వివరాలు రేవంత్ మాటల్లోనే..

''ముచ్చర్ల వద్ద భూసేకరణకు సంబంధించి సొంతంగా ఎందుకు ఊహాగానాలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు? హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత ముచ్చర్ల నాలుగో సిటీగా.. మన భవిష్యత్తు సిటీగా అవతరించబోతోంది. అంతర్జాతీయ స్థాయి వైద్యం కావాలంటే అక్కడికి రావాలి. స్కిల్ నేర్చుకోవాలంటే ప్రపంచవ్యాప్తంగా యువత అక్కడికి రావాలి. అంతర్జాతీయ క్రీడాకారులు అక్కడికి రావాలి. అలా అన్ని రంగాల్లో ప్రపంచ స్థాయి హబ్‌గా మార్చబోతున్నాం.

స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తాం..: ముచ్చర్లలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. గురువారం సాయంత్రం జరిగే శంకుస్థాపనకు ప్రతిపక్ష నేతలు కూడా రావాలి. మాదాపూర్‌లోని న్యాక్‌ను అక్కడికి మార్చి పెద్ద వ్యవస్థగా ఏర్పాటు చేస్తున్నాం. ఒకప్పుడు ఆఫ్రో ఏషియన్ గేమ్స్‌ను ఘనంగా నిర్వహించుకున్న ఘనత హైదరాబాద్‌ది. దానికి ఉపయోగించిన గచ్చిబౌలి స్టేడియం సముదాయాన్ని నిరుపయోగంగా, తాగుబోతులకు అడ్డాగా చేశారు. ఇప్పుడు ముచ్చర్లలో ఓ స్పోర్ట్స్ యూనివర్సిటీ, అంతర్జాతీయ స్టేడియం నిర్మించబోతున్నాం. అంతర్జాతీయ స్థాయి శిక్షణ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం బీసీసీఐతో మాట్లాడాం. దీంతోపాటు 200 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌ను అంతర్జాతీయ సంస్థలతో ఏర్పాటు చేయబోతున్నాం.

ఆ ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు..: క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న హైదరాబాద్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు విద్యార్హతల్లో మినహాయింపులు ఇచ్చి గ్రూప్–1 స్థాయి ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం. ఒలింపిక్స్‌లో పతకం తెచ్చిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు గత ప్రభుత్వం ఉద్యోగం ఇస్తానని ఇవ్వలేదు. ఇప్పుడు ఆమెకు కూడా గ్రూప్–1లో డీఎస్పీ స్థాయి ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం.

బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకొచ్చా..

''కేసీఆర్ సభకు వస్తారేమోనని ఎదురుచూశా రాలేదు. ఆయన ఇటీవల చీల్చి చెండాడుతానని ప్రకటించడంతో.. ఎందుకైనా మంచిదని బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకుని వచ్చా''అని రేవంత్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇక ''ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు కేటీఆర్‌కు సంబంధం ఏమిటన్న విషయంలో నేను, మంత్రులు మాట్లాడుకుంటుండగా చర్చకు వచ్చింది. కేటీఆర్ 100 శాతం ఆర్టిఫిషియల్, జీరో శాతం ఇంటెలిజెన్స్ అని ఒకరు తేల్చారు''అని ఎద్దేవా చేశారు.

ప్రశ్నించడం అడవి బిడ్డల రక్తంలోనే ఉంది: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: ప్రశ్నించడం అడవి బిడ్డల రక్తంలోనే ఉందని ఉద్యమాలు చేసిన చరిత్ర తమ కుటుంబానిదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ...పోడు భూముల కోసం తన తండ్రి జైలు జీవితం గడపాల్సి వచ్చిందన్నారు. ఫొటోలకు పోజులివ్వడం, ఓట్ల కోసమే గతంలో గతంలో పోడు పట్టాలను బీఆర్ఎస్ పంపిణీ చేసిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం పోడు భూములకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. సభలో ఎవరేం చేస్తున్నారన్నది ప్రజలు చూస్తున్నారని, గతంలో సబితా ఇంద్రారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గౌరవం ఉండేదని, ఇప్పుడు మారిన రాజకీయ సమీకరణల్లో భాగంగా సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడి ఉండొచ్చని సీతక్క అభిప్రాయపడ్డారు.

జేసీజే పరిధిలోకి రూ.10 లక్షల్లోపు కేసులు


పరిధిని సవరిస్తూ అసెంబ్లీలో బిల్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆస్తుల మార్కెట్ విలువ రూ.10 లక్షల్లోపు ఉన్న కేసులే జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే) పరిధిలోకి వచ్చేలా మార్పులు చేస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టింది. మార్కెట్ విలువ రూ.20 లక్షల వరకున్న కేసులన్నీ విచారణకు వీరి వద్దకే వస్తుండటం, ఆ మేరకు జూనియర్ సివిల్ జడ్జిల సంఖ్య పెరగకపోవడంతో ప్రస్తు తం ఉన్న వారు తీవ్ర పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారు. దీంతో మార్కెట్ విలువ పరిధి రూ.10 లక్షలకు తగ్గించాలని న్యాయమూర్తుల కమిటీ విజ్ఞప్తి చేసింది. అలాగే రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల ఆస్తుల మార్కెట్ విలువ ఉన్న కేసులను సీనియర్ సివిల్ జడ్జికి అప్పగించాలని సూచించింది.

టీఎస్ నుంచి టీజీగా: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తెలంగాణ స్టేట్‌గా పేర్కొంటూ టీఎస్‌ను సంక్షిప్త పదంగా చేర్చారని.. అయితే దాన్ని తెలంగాణగా మార్చి సంక్షిప్త పదాన్ని టీజీగా మార్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌ను ఏపీ, మధ్యప్రదేశ్‌ను ఎంపీ, బిహార్‌ను బీఆర్‌గా పేర్కొంటున్నప్పుడు తెలంగాణను టీఎస్‌గా పేర్కొనడం సరికాదని వ్యాఖ్యానించింది. 2024, మే 17 నుంచి రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీలు, స్వతంత్ర ప్రతిపత్తి సంస్థలు, అధికారిక దస్తావేజులు, రిజిస్ట్రేషన్లు, వెబ్‌సైట్లతో పాటు అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఇకపై టీజీగా సంక్షిప్త పదాన్ని మార్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు మార్పు బిల్లును ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది.

గ్రూప్–1 మెయిన్స్ ఎంపిక జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ లేఖ



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హుల జాబితా రూపకల్పనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు తీవ్ర నష్టం జరిగిందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆధారంగా 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపికలో జీఓ 29 ప్రకారం చేయడంతో ఈ నష్టం జరిగినట్టు వివరించారు. జీఓ 29 ప్రకారం మల్టీజోన్ పరిధిలోని పోస్టుల ఆధారంగా ఆ సంఖ్యకు 50 రెట్లు అదనంగా అభ్యర్థులను ఎంపిక చేశారని తెలిపారు. ఈ ప్రక్రియలో ఓపెన్ కాంపిటేషన్ కేటగిరీలోకి రిజర్వేషన్ ఉన్న అభర్థులు అర్హత సాధించలేకపోయారన్నారు. ఈ అంశంపై టీజీపీఎస్సీని సంప్రదిస్తే సుప్రీంకోర్టు తీర్పును చూపిస్తున్నారని, కానీ సుప్రీంకోర్టు తీర్పుకు ప్రస్తుత పరిస్థితికి ఏమాత్రం పొంతన లేనప్పటికీ సంబంధం లేని అంశాలతో అభ్యర్థులను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లేఖ రాశారు. ఈ ప్రతులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీజీపీఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సైతం పంపారు.



జస్టిస్ సాంబశివరావు నాయుడు పదవీ విరమణ సందర్భంగా బుధవారం హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయమూర్తి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. అంతకుముందు హైకోర్టు ఫుల్‌బెంచ్.. జస్టిస్ సాంబశివరావు నాయుడిని ఘనంగా సత్కరించి, ఆయన సేవలను కొనియాడింది.

బీజేపీ రైతులను అప్పులపాలు చేస్తే.. కాంగ్రెస్ సాయమందిస్తోంది

తెలంగాణలో రైతు రుణమాఫీపై రాహుల్‌గాంధీ పోస్ట్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ప్రకటించిన హామీ మేరకు రెండో విడతలో రుణమాఫీ చేయడంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర రైతాంగానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'తెలంగాణ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండో విడత రైతు రుణమాఫీని విడుదల చేసింది. రాష్ట్రంలోని 6.4 లక్షల రైతు కుటుంబాలకు రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ చేయడం రైతాంగానికి ఉపశమనం కలిగిస్తోంది. ఒకవైపు, బీజేపీ దేశంలోని రైతులను అప్పుల ఊబిలో బంధించి, వారి డిమాండ్‌లను, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే హామీని తిరస్కరించింది. కానీ కాంగ్రెస్ మాత్రం సాధ్యమైన ప్రతిచోటా వ్యవసాయ కుటుంబాలకు సహాయం అందించేందుకు కృషి చేస్తోంది. ఇండియా కూటమి రైతులకు కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ అయుధాన్ని అందించడం ద్వారా దేశ రైతుల నుంచి అప్పుల ఊబి నుంచి బయటపడేస్తుంది'అని పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి రీపోస్ట్ చేస్తూ 'మా నాయకుడు రాహుల్‌గాంధీ హామీ ఇచ్చిన మేరకు, రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక గందరగోళాన్ని మిగిల్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పేర్కొన్న వాగ్దానాలను అమలు చేస్తోంది. 12 రోజుల్లోనే 18 లక్షల మంది రైతులకు మొత్తం రుణమాఫీ చేయడంతో తెలంగాణ వ్యాప్తంగా ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. ఇది రాజకీయాలు, పార్టీలు గుప్పించే వాగ్దానాలపై విశ్వాసాన్ని పెంచేందుకు దోహదపడింది'అని పేర్కొన్నారు.

'మూసీ'పై అనుమానాలు సృష్టించవద్దు

కేటీఆర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సూచన

సాక్షి, హైదరాబాద్: మూసీ అభివృద్ధి ప్రాజెక్టు ప్రాథమిక దశలో ఉందని, డీపీఆర్‌కి తుదిరూపు ఇస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మూసీ ప్రాజెక్టుపై అనుమానాలు సృష్టించే ప్రయత్నం చేయవద్దని ఆయన మాజీ మంత్రి కేటీఆర్‌కు సూచించారు. శాసనసభలో బుధవారం ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ మంత్రి వివరణ ఇచ్చారు. థేమ్స్ నదికి మించిన రీతిలో మూసీని అభివృద్ధి చేస్తామని వివరించారు. కలుషితమైన మూసీ నది కారణంగా లక్షలాది మంది బాధపడుతున్న తరుణంలో దానిని ప్రక్షాళన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజల తరఫున ఆయన అసెంబ్లీలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలు పనిలేక ఊరికే తిరుగుతారని బీఆర్ఎస్ పార్టీతోపాటు, ఆ పార్టీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ఈ పథకం విజయవంతమైందని బీఆర్ఎస్ నేతల కళ్లు మండుతున్నాయని ధ్వజమెత్తారు. మహిళలను అవహేళన చేసే వీడియోలపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన అసెంబ్లీలో స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం కారణంగా ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారని కేటీఆర్ అనడాన్ని ఆయన తప్పుబట్టారు.



అభినందించడం కాదు.. అభిశంసించాలి

అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'బడ్జెట్‌ను చూసి మమ్మల్ని అభినందిస్తారనుకున్నామని మంత్రులు అంటున్నారు. అభినందించడం కాదు... మంత్రులను, ప్రభుత్వాన్ని అభిశంసించాలి''అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె. తారకరామారావు దుయ్యబట్టారు. కానీ దేశంలో రీకాల్ విధానం లేనందున ప్రభుత్వాన్ని మరో నాలుగున్నరేళ్లు భరించక తప్పదన్నారు. బుధవారం శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చను ప్రారంభిస్తూ ప్రభు త్వంపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు కొండంత హామీలిచ్చి బడ్జెట్ కేటాయింపులు మాత్రం గోరంతే చేశారని విమర్శించారు. రకరకాల పేర్లు చెప్పి లబ్ధిదారులకు కోత పెడుతున్నారని.. రికవరీలతో బెంబేలెత్తిస్తున్నారని తప్పుబట్టారు.

వంద రోజుల్లో అమలు ఏదీ?

వంద రోజుల్లో హామీల అమలంటూ ఊదరగొట్టిన ప్రభుత్వం ఇప్పుడేమో వాటిని అమలు చేయలేక లీకులతో పత్రికల్లో హెడ్‌లైన్లతో మేనేజ్ చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ఉండబట్ట లేక ఓటేస్తే ఉన్న బట్ట లాక్కున్నట్టుగా మారిందని ఎద్దేవా చేశారు. పదేళ్ల తమ పాలనలో జీఎస్‌డీపీని రూ. 4 లక్షల కోట్ల నుంచి రూ. 14.50 లక్షల కోట్లకు చేర్చామని.. తలసరి ఆదాయాన్ని రూ. 3.47 లక్షలకు పెంచి రాష్ట్రాన్ని ఉన్నతంగా నిలిపామన్నారు. నిజాలు ఇలా ఉంటే.. తెలంగాణ దివాలా తీసిందని ప్రభుత్వం చెబుతుంటే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని కేటీఆర్ ప్రశ్నించారు.

ఒక్క ఉద్యోగమైనా ఇచ్చినట్లు చెబితే లక్ష మందితో భట్టికి సన్మానం

ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ అంటూ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. వాటి సంగతేంటో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఒక్క ఉద్యోగమైనా ఇచ్చినట్లు ఒక్కరు చెప్పినా తాను రాజీనామా చేసి చిక్కడపల్లి లైబ్రరీలో లక్ష మందితో భట్టికి పౌర సన్మానం చేస్తానని సవాల్ విసిరారు. తాము 1.63 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని, ఇప్పుడు కాంగ్రెస్ చెబుతున్న 30 వేల ఉద్యోగాలు కూడా అందులోవేనన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక 388 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రుణమాఫీ కథ 'పంచ పాండవులు మంచకోళ్ల'లాగే ఉందని, ముందు రూ.40 వేల కోట్లు అని, తర్వాత రూ.30 వేల కోట్లు అని, ఆఖరికి రూ.25 వేల కోట్లు అంటున్నారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల హామీలను విస్మరిస్తున్నందుకు ఈ ప్రభుత్వంపై రికవరీ చార్జిషీటు దాఖలు చేయాలన్నారు.

ఈ ప్రభుత్వానికి కేసీఆర్ ఫోబియా

మాట్లాడితే కేసీఆర్ ప్రస్తావన తెస్తున్న ఈ ప్రభుత్వానికి ఆయన ఫోబియా పట్టుకుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో ప్రతి పథకం, ప్రతి అభివృద్ధి నిర్మాణంలో కేసీఆర్ కనిపిస్తారని, ఆయన ముద్రను చెరపడం సాధ్యం కాదన్నారు. కేసీఆర్‌పై కోపంతో మంచి పథకాలను నిలిపివేయొద్దని హితవు పలికారు. కావాలంటే వాటి పేర్లు మార్చి అమలు చేసుకోవాలని సూచించారు.

రేవంత్‌తో స్నేహం పదేళ్లుగా చెడింది

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధించినందుకు కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే కేటీఆర్ ఆ వ్యాఖ్యను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. రేవంత్‌తో 18 ఏళ్లుగా స్నేహం ఉందని.. కానీ పదేళ్లుగా చెడిందన్నారు.

'మూసీ'కి రూ. లక్షన్నర కోట్లా?

రూ. 16 వేల కోట్లతో తమ ప్రభుత్వం మూసీ సుందరీకరణకు ప్రతిపాదించగా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 1.5 లక్షల కోట్లతో ప్రాజెక్టును ప్రతిపాదించడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 94 వేల కోట్లు ఖర్చు పెడితేనే గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు మూసీ అభివృద్ధికి రూ. లక్షన్నర కోట్ల ప్రాజెక్టుపై ఏమంటారని ప్రశ్నించారు.

రేవంత్, కేటీఆర్ మధ్య 'చదువుల'పై చర్చ

సీఎం–కేటీఆర్ మధ్య సొంత చదువులపై సభలో ఆసక్తికర చర్చ జరిగింది. తెలంగాణలో చదివినందున 610 జీవో, ముల్కీ నిబంధనలను వర్తింపజేసినా ప్రతి ఉద్యోగానికి తనకు అర్హత ఉందని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. గుంటూరులో చదివిన కేటీఆర్‌కు ఆ అర్హత ఉందా? అని ప్రశ్నించారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ తాను గుంటూరులో ఇంటర్ చదివానని.. కానీ ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేదని.. ప్రైవేటు ఉద్యోగాలే సంపాదించానని చెప్పారు. అందువల్ల ప్రైవేటు ఉద్యోగాలకు 610 జీవో వర్తించదని పేర్కొన్నారు.



రైతులకు కాంగ్రెస్ దగా!

అంక్షలతో రుణమాఫీ పూర్తిగా చేయకుండా మోసం: కిషన్‌రెడ్డి

- బాధిత రైతుల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 8886 100 097
- రుణమాఫీ కాని రైతులు దీనికి కాల్ చేసి వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- దీనికి విశేష స్పందన వస్తోందంటున్న బీజేపీ నేతలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏవేవో అంక్షలు పెట్టి రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా రైతులను దగా చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి 8 నెలలైనా ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదని విమర్శించారు. రుణమాఫీ కాని రైతులకు అండగా నిలుస్తామన్నారు. ఇందుకోసం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రారంభిస్తున్నట్టు కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ''రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని నమ్మించి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దగా చేస్తోంది. రైతులకు ఏ ప్రతిపాదికన రుణమాఫీ చేస్తున్నారన్న అంశాన్ని స్పష్టం చేయాలి. చాలా మంది రైతులు రుణమాఫీ జరగక బ్యాంకుల్లో డీఫాల్టర్‌గా మారే దుస్థితి ఏర్పడింది'' అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మోసపూరిత హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక దగా చేయడంలో అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ ఒకటేనని ఆరోపించారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం..


గ్రామస్థాయిలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి, రుణమాఫీ అందని రైతుల వివరాలు సేకరిస్తామని.. ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు. రైతులు, యువత, బీసీలు, మైనారిటీలు, మహిళలు.. ఇలా అన్ని వర్గాలకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో విద్యారంగానికి 14 శాతానికిపైగా బడ్జెట్ కేటాయిస్తే.. అది తెలంగాణలో 7.60 శాతమేనన్నారు.

మాటలు కోటలు దాటినా..

కాంగ్రెస్ నాయకుల మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు సెక్రటేరియట్ దాటడం లేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పంటలకు మద్దతు ధర పెంపు, నిరుద్యోగులకు జాబ్ కేలండర్ ప్రకారం నోటిఫికేషన్లు ఇస్తామన్న హామీలు ఏమైపోయాయని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాలు, భూముల అమ్మకాలతోనే ఆదాయం పెంచుకోవాలని ఆలోచిస్తోందే తప్ప.. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం గురించి ఏమాత్రం ఆలోచించడం లేదన్నారు.

ఇదీ బీజేపీ హెల్ప్‌లైన్ నంబర్

రుణమాఫీకాని రైతులకు అండగా నిలిచేలా, 'రైతుల పక్షాన కాంగ్రెస్ సర్కారును ప్రశ్నిస్తున్న తెలంగాణ' పేరుతో బీజేపీ పోస్టర్‌ను కిషన్‌రెడ్డి విడుదల చేశారు. అనంతరం హెల్ప్‌లైన్ నంబర్ 8886 100 097ను ప్రారంభించారు. కాగా.. ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు విశేష స్పందన వస్తోందని బీజేపీ నేతలు చెప్తున్నారు.



వాస్తవంలో కంటే
ఊహలోనే మనం ఎక్కువగా బాధపడతాం.
– సెనెకా

సాక్షి
గురువారం, 1 ఆగస్టు 2024

ప్రకృతి శాపమా? మన పాపమా?

దేవతల రాజ్యంగా పేరుబడ్డ కేరళలోని సుందరమైన వయనాడ్ ప్రకృతి ఆగ్రహానికి గురై శ్మశాన స్థలిగా మారిన దృశ్యాలు చూస్తుంటే ఎవరికైనా భావోద్వేగం కలగకమానదు. జూలై 29 సోమవారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల ప్రాంతంలో అందరూ ఆదమరిచి నిద్రిస్తున్న వేళ భారీ వాన, ఉరుము లేని పిడుగులా వరుసగా భారీయెత్తున కొండచరియలు విరిగి మీద పడడంతో కేరళ ఉత్తర ప్రాంతంలోని ఆ జిల్లా చిగురుటాకులా వణికిపోయింది. కళ్ళుపొడుచుకున్నా కనిపించని చీకటిలో, ఏం జరుగుతోందో తెలిసే లోపల ఇళ్ళు కూలిపోయాయి. నిలువెత్తు బురదలో మునిగి, గ్రామాలు తుడిచి పెట్టుకుపోయాయి. ఘటనాస్థలి నుంచి కొన్ని పదుల కిలోమీటర్ల వరకు మనుషులు కొట్టుకుపోయి, ఛిద్రమైన దేహాలతో శవాలై తేలారు. మృతుల సంఖ్య 150 దాటి అంతకంతకూ పెరుగుతున్న వేళ ఇటీవల కొన్నేళ్ళుగా కేరళలో ఆకస్మిక వరదలు, భూపతనాలు పెరిగిపోవడం పట్ల చర్చ మొదలైంది. ఈ విలయంలో ప్రకృతి శాపమెంత? పాలకుల పాపమెంత?

గమనిస్తే... గత ఏడేళ్ళలో దేశంలో అత్యధికంగా కొండచరియలు విరిగిపడింది కేరళలోనే! 2015 నుంచి 2022 మధ్య దేశవ్యాప్తంగా 3,782 ఘటనలు జరిగితే, వాటిలో 59.2 శాతం ఘటనలు ఒక్క మలయాళ సీమలోనే సంభవించాయి. 1961 – 2016 మధ్యతో పోలిస్తే, ఇప్పుడు ఏటా ఇలాంటి దుర్ఘటనలు, ప్రాణనష్టం అనూహ్యంగా పెరగడానికి అనేక కారణాలున్నాయి. ప్రకృతితో పాటు మనం కూడా దీనికి కారణమేనని నిపుణులు, శాస్త్రవేత్తలు తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులూ దానికి వచ్చి చేరాయి. వాతావరణ మార్పుల వల్ల కేరళపై కమ్ముకుంటున్న క్యుములోనింబస్ మేఘాలు హఠాత్తుగా భారీ వర్షాలు కురిపిస్తున్నాయి. అసలు కేరళలో దాదాపు సగం... భౌగోళికంగా 20 డిగ్రీలకు మించిన ఏటవాలు భూముల ప్రాంతం. అందువల్ల నేలకోత, కొండచరియలు విరిగిపడడం ఎక్కువే! దానికి తోడు కొండరాళ్ళను పట్టి ఉంచే మట్టి వదులుగా మారి, ముప్పు పెరుగుతోంది. వాలుభూముల్లో భారీగా వానలు వస్తే, పై మట్టి బాగా వదులైపోయి, కొండచరియలు పతనమై ప్రాణాంతకమవుతాయి. వయనాడ్‌లో ఇప్పుడు జరిగింది అదే!


వయనాడ్ జిల్లాలో చిన్న పట్నమైన ముండక్కాయ్ లాంటి వాటి పరిస్థితి మరీ ఘోరం. కొండచరియలు విరిగిపడిన ఘటనల నుంచి గత నాలుగు దశాబ్దాల్లో రెండుసార్లు (1984లో, 2019లో) ప్రాణనష్టం, ఆస్తినష్టంతో బయటపడ్డ ఆ పట్నం తాజా విలయంలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. దాన్ని బట్టి తాజా విలయం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 400 మందికి పైగా మరణానికి కారణమైన 2018 నాటి కేరళ వరదల తర్వాత అత్యంత దురదృష్టకరమైన విపత్తు ఇది. నిజానికి, తుపానులు, అధిక వర్షపాతం, భూకంపం లాంటి ప్రకృతి విపత్తులకు సంబంధించి ప్రమాద హెచ్చరిక వ్యవస్థలు ఎవరికైనా కీలకం. అనేక ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో అందుకు అత్యాధునిక వ్యవస్థలు ఉన్నాయని కేంద్ర సర్కారు చెబుతోంది. అంతెందుకు... అధిక వర్షపాతం గురించి కేరళను అప్రమత్తం చేస్తూ, వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడడానికి వారం రోజుల ముందే జూలై 23న ముందస్తు హెచ్చరిక చేశామంటోంది. కేరళ సర్కార్ మాత్రం ప్రమాద స్థాయి తక్కువైన ఆరెంజ్ ఎలర్ట్ మాత్రమే తమకు అందిందని అంటోంది.

రాజకీయాలు, పరస్పర నిందారోపణలు పక్కనపెడితే... కేరళ సహా పడమటి కనుమలు వ్యాపించిన ప్రాంతమంతటా ఇలాంటి ప్రమాదాలు పొంచివున్నాయని కొన్నేళ్ళుగా నిపుణులు గగ్గోలు పెడుతున్నారు. 2011లోనే కేంద్రం పడమటి కనుమల పరిరక్షణకై పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ సారథ్యంలో నిపుణుల కమిటీ వేసింది. అరుదైన జీవజాలానికి ఆవాసమైన దట్టమైన అరణ్యాలున్నందు వల్ల గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, కేరళలకు విస్తరించిన పడమటి కనుమల్లో 75 శాతం మేర ప్రాంతాన్ని పర్యావరణరీత్యా సున్నితమైనదిగా ప్రకటించాలని కమిటీ సిఫార్సు చేసింది. గాడ్గిల్ కమిటీ నివేదిక ఇచ్చి 13 ఏళ్ళవుతున్నా కేరళ సహా ప్రభుత్వాలేవీ ఆ సిఫార్సుల్ని పాటించలేదు. అదేమంటే, సిఫార్సులు కఠినంగా ఉన్నాయనీ, అభివృద్ధికీ, జీవనోపాధికీ నష్టం చేస్తాయనీ సాకులు చెబుతున్నాయి. పైగా, అభివృద్ధి రేసులో పడి కొండల్ని తొలిచి, భారీ నిర్మాణాలకు దిగాయి. జలవిద్యుత్ కేంద్రాలు చేపట్టాయి. కేరళలో హోటళ్ళు, టూరిస్ట్ రిసార్ట్‌లు, అక్రమ తవ్వకాలకైతే అంతే లేదు. సున్నిత పర్యావరణ ప్రాంతాల్లోని ఈ తప్పుడు అభివృద్ధి నమూనాను ఇకనైనా మార్చుకోకపోతే కష్టం.

కేరళ, తమిళనాడు, కర్ణాటక – మూడు రాష్ట్రాలకూ కూడలిలో వయనాడ్ అందమైన పర్యాటక ప్రాంతమన్నది నిజమే. దేశదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు అనువుగా వసతులు పెంచి, పర్యాటక ఆర్థిక వ్యవస్థను పెంపొందించాలన్న ఆకాంక్షా సహజమే. కానీ, పర్యావరణ రీత్యా అత్యంత సున్నితమైన ప్రాంతంలో ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టి, యథేచ్ఛగా ప్రకృతి విధ్వంసం సాగిస్తే అది మొదటికే మోసమన్న ఇంగితం లేకుంటే ఎలా? ప్రకృతితో సహజీవనం మరిచి, ఇటు చట్టబద్ధంగానూ, అటు చట్టవిరుద్ధంగానూ గనుల తవ్వకాలను అనుమతిస్తే అన్ని రకాలుగా విలయమే తప్ప వికాసం జరుగుతుందా? మనుషుల భద్రత కన్నా మాయదారి వ్యాపారం ఎక్కువా? అందుకే, ఒక్క మాటలో వయనాడ్ విలయం కేవలం ప్రకృతి సృష్టించినది కాదు. మనుషుల దురాశకు ఫలితం. అభివృద్ధి పేరిట మనం సాగిస్తున్న ప్రకృతి వినాశనం తాలూకు విపరిణామం. మనిషి తన పరిధి, పరిమితి గుర్తెరిగి ప్రవర్తించకపోతే, మనుగడకే ముప్పని చెప్పే నిష్ఠురసత్యం. బాధ్యులైన అందరం ఇకనైనా కళ్ళు తెరవాలి. ప్రకృతి పునరుజ్జీవనానికి ఆగి ఆలోచించాలి. వయనాడ్ నేర్పే పాఠం అదే!

గెలిచినా, ఓడినా చరిత్రే!

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

భారతీయ బ్రాహ్మణ మూలాలున్న కమలాదేవి హ్యారిస్‌కు అమెరికాలో జరిగింది ఒక సామాజిక అద్భుతం అని చెప్పాలి. తండ్రి వైపు నుంచే కాకుండా, తల్లి పోరాటాల రీత్యా కూడా ఆమె నల్లజాతి వారసత్వాన్ని ఎంచుకున్నారు. యవ్వనంలోనూ, ఆ తర్వాతా తెల్లజాతి జాత్యహంకార భావాలకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ దేశానికి తొలి నల్లజాతి మహిళా ఉపాధ్యక్షురాలిగా ఇప్పటికే చరిత్ర సృష్టించారు. ఇది కొన్ని దశాబ్దాల క్రితం ఊహించ డానికి కూడా వీలు లేని సామాజిక దృగ్విషయం. ఇప్పుడు డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా శ్వేతజాతీయ వాదులతోనూ, మహిళా వ్యతిరేకి అయిన ట్రంప్‌తోనూ ఆమె పోరాడుతారు. గెలిచినా ఓడినా ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది మహిళలకు రోల్ మోడల్‌గా నిలుస్తారు.

‘నేను హిందువునెట్లయిత?’ అని 1996లో నేను రాసిన పుస్తకంలో, బ్రాహ్మణుడు తనను తాను దళితుడిగా మార్చుకున్నప్పుడే భారతదేశం మార్పు చెందుతుందని చెప్పాను. అలాంటిది జరుగుతుందని ఊహించలేమని కొంత మంది భారతీయ చరిత్ర, సంస్కృతి పండితులు విమర్శించారు. సంస్కృతీకరణ ప్రక్రియలో భాగంగా బ్రాహ్మణుల అన్ని జీవన విధానాలను శూద్రులు, దళితులు అవలంబిస్తారనేది వారి వాదన. మరాఠాలు ఓబీసీ రిజర్వేషన్ పొందడానికి ‘కుణ్బీ’ సర్టిఫికెట్ అడగటం గురించి గానీ, చాలామంది శూద్ర ఓబీసీలు రిజర్వేషన్ కోటా కోసం ఆదివాసీ లేదా దళిత హోదా అడగటం గురించి గానీ వారు ఏం చెబుతారో నాకు తెలీదు. ఉత్తర భారత బనియాలు ఓబీసీ సర్టిఫికెట్లను తీసుకుంటూ రిజర్వేషన్ పొందడం గురించి వాళ్లేమంటారు? దీన్ని సంస్కృతీకరణ అనవచ్చా? నా దృష్టిలో అది దళితీకరణే కానీ సంస్కృతీకరణ కాదు. ఈ రోజుల్లో ఏ కులమైనా బ్రాహ్మణ సర్టిఫికెట్ కోసం అడగడం లేదు. భారతదేశంలో ఇలా జరుగుతుండగా, పాశ్చాత్య దేశాలలోని వలస భారతీయుల్లో ఏం జరుగుతోంది?

భారతీయ బ్రాహ్మణ మూలాలున్న కమలాదేవి హ్యారిస్‌కు అమెరికాలో జరిగింది ఒక సామాజిక అద్భుతం అని చెప్పాలి. ఆమె ఆఫ్రికన్–అమెరికన్ హోదాను పొందింది తన నల్లజాతి తండ్రి కారణంగానే కాదు... ఆమె తల్లి శ్యామల గోపాలన్ హ్యారిస్ తమిళ బ్రాహ్మణ వలసదారు. నల్లజాతి స్త్రీలా కనిపించేవారు. పైగా వివాహానికి ముందు తన జీవితంలో ఎక్కువ భాగం యూసీ బర్కిలీ ప్రాంతంలోని నల్లజాతి పరిసరాల్లో జీవించారు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ సాగించిన పౌర హక్కుల ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. డొనాల్డ్ హ్యారిస్‌తో ఆమె వివాహం జరిగిన తర్వాత కలిగిన ఇద్దరు కుమార్తెలు కమల, మాయ నల్లజాతీయుల పరిసరాల్లోనే పెరిగారు. వారు తమ ప్రారంభ జీవితంలో నల్లజాతి ఆధిపత్య పాఠశాలలో చదువుకున్నారు. ఆమె భర్త డొనాల్డ్ హ్యారిస్ జమైకన్ అమెరికన్ ఆర్థికవేత్త. శ్యామలకు విడాకులు ఇచ్చిన తర్వాత ఇప్పుడు జమైకాలో నివసిస్తున్న ఆయన కూడా నవ్యభావాలు కలిగిన వ్యక్తి. ఏమైనప్పటికీ, కమల తన తల్లి వైపు పూర్వీకుల బ్రాహ్మణ గోధుమవర్ణ సంప్రదాయ వారసత్వాన్ని ప్రకటించుకోవచ్చు. లేదా తల్లి, తండ్రి మాదిరిగా నల్లవారి జీవితాలూ విలువైనవే భావనతో కూడిన క్రైస్తవీకరణ ప్రక్రియను అనుసరించవచ్చు. ఆమె నల్లజాతి వారసత్వాన్ని ఎంచుకున్నారు. తన యవ్వనంలోనూ, ఆ తర్వాతా తెల్లజాతి జాత్యహంకార భావాలకు వ్యతిరేకంగా పోరాడారు.

ఆ దేశానికి తొలి నల్లజాతి మహిళా ఉపాధ్యక్షురాలిగా కమల ఇప్పటికే చరిత్ర సృష్టించారు. ఇది కొన్ని దశాబ్దాల క్రితం ఊహించడానికి కూడా వీలు లేని సామాజిక దృగ్విషయం. ఆఫ్రికనీకరణ చెందిన నల్ల–గోధుమ బ్రాహ్మణ మహిళ అయిన కమలా హ్యారిస్,



కమలా హ్యారిస్

డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా శ్వేతజాతీయ వాదులతోనూ, మహిళా వ్యతిరేకి అయిన ట్రంప్‌తోనూ పోరాడుతారు. ఎన్నికల్లో గెలిస్తే అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలు, తొలి నల్లజాతి మహిళా అధ్యక్షురాలు అవుతారు.

250 ఏళ్ల ప్రజాస్వామ్య చరిత్రలో అధ్యక్షురాలిగా వైట్‌హౌజ్‌లో ప్రవేశించడానికి శ్వేతజాతి లేదా నల్లజాతి మహిళను అమెరికా ఎప్పుడూ అనుమతించలేదు. వైట్‌హౌజ్‌లో నివసించిన మహిళలందరూ వారి అధ్యక్ష భర్తలకు సహాయక పాత్రను పోషించే ప్రథమ మహిళలు (ఫస్ట్ లేడీస్)గా ఉండేవారు. కమల గెలిస్తే తన భర్తను ప్రథమ పురుషుడి (ఫస్ట్ మ్యాన్)గా మార్చిన మహిళ అవుతారు. ఇకపై ఆయన భూమిపై ఉన్న తన అత్యంత శక్తిమంతమైన భార్యామణిని జాగ్రత్తగా చూసుకోవాలి.

బరాక్ ఒబామా మొట్టమొదటి అమెరికన్ నల్లజాతి పురుష అధ్యక్షుడిగా ఎంపికైనప్పుడు, శ్వేతజాతి ఆధిపత్యవాదులు మినహా అందరూ ఆ విజయాన్ని పండుగలా జరుపుకొన్నారు. పైగా ఆయన ఎనిమిదేళ్ల విజయవంతమైన అధ్యక్షుడిగా నిరూపించుకున్నారు. అయినా అది అమెరికా ప్రాథమిక పితృస్వామ్య స్వభావాన్ని మార్చలేదు.

మరొక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, చాలామంది భారతీయ సంతతికి చెందిన పురుషులు, మహిళలు పాశ్చాత్య దేశాలలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. రిషి సునాక్ ఇప్పటికే తనను తాను హిందువునని పదేపదే ప్రకటించుకుంటూ ఏడాదికి పైగా ప్రధానిగా బ్రిటన్‌ను పాలించారు. అయితే, కమల మత విశ్వాసం రీత్యా క్రైస్తవురాలు. ఆమె క్రిస్టియన్ కాకపోతే ఉపాధ్యక్ష పదవి వచ్చేది కాదు, అధ్యక్ష అభ్యర్థిగా అవకాశం కూడా వచ్చేది కాదు. హిందువుగా ఉంటూ వైట్‌హౌజ్‌లోకి వెళ్లాలనుకునేవారు కొందరున్నారు. భారతీయ మూలాలకు చెందిన శాకాహార బ్రాహ్మణుడైన వివేక్ రామస్వామి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారుగానీ విఫలమయ్యారు. కమలను ‘పిల్లలు లేని పిల్లి’ అని పిలిచిన రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ భార్య ఉషా చిలుకూరి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బ్రాహ్మణ మూలాలున్న మహిళ. ఆమె తన హిందూ శాకాహార సాంస్కృతిక విలువను బహిరంగంగా ప్రకటించుకున్నారు.

విగ్రహాలను పూజించే సునాక్‌ను ప్రధానిగా అనుమతించిన బ్రిటన్‌లా కాకుండా, భారతదేశ ప్రధానిగా మరే విదేశీ వ్యక్తినీ అనుమతించకూడదనే ఆరెస్సెస్/బీజేపీ నమూనాను అమెరికా కూడా అనుసరించవచ్చు. ఇతర మతవిశ్వాసం గల మరే వ్యక్తినీ అధ్యక్షుడిగా అమెరికా అనుమతించకపోవచ్చు. ఏదేమైనా, కమల వారి ఆధ్యాత్మిక భావాలకు సరిపోతారు.

కమల తన ఆఫ్రికన్–అమెరికన్ ముద్రతో దేశాధ్యక్షురాలైతే, నల్లజాతి అమెరికన్లతో అంతగా సంబంధం లేని భారతీయ ప్రవాసులు విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటారు. సంపన్న భారతీయులు, ముఖ్యంగా మితవాద హిందూ భారతీయులు... ట్రంప్ దాతలుగా, ట్రంప్ ఓటర్లుగా ఉంటున్నారు. ట్రంప్ 2020లో మోదీ బలపరిచిన అభ్యర్థి. బహుశా ఇప్పటికీ ఆరెస్సెస్/బీజేపీ పంథా అదే కావచ్చు. వారు డెమోక్రటిక్ పార్టీని వామపక్ష ఉదారవాద పార్టీగా చూస్తారు. ఉపాధ్యక్షురాలిగా తన అధికారిక హోదాలో కమల భారత్‌ను సందర్శించలేదు.

నలుపు, గోధుమరంగు స్త్రీ–పురుష సంబంధాలను నివారించడానికీ, తెల్లవారితో కలిసి జీవించడానికీ భారతీయ అమెరికన్లు ప్రయత్నిస్తారు. శ్యామలా గోపాలన్, కమలాదేవిలా కాకుండా, వారు శ్వేతజాతీయుల పరిసరాల్లో లేదా వారి సొంత భారతీయ (దక్షిణాసియా కూడా కాదు) పరిసరాల్లో ఉంటూ, స్వచ్ఛమైన శాకాహార పార్టీలతో జీవించడానికి ఇష్టపడతారు. అలాంటి పార్టీలలో మగవాళ్లు సూట్లు ధరిస్తారు, మహిళలు భారతీయ నారీమణుల్లాగా చీరలు కట్టుకుంటారు. కమలా హ్యారిస్ మాత్రం అమెరికన్ వ్యక్తిలా చక్కగా డిజైన్ చేసిన ఫుల్ సూట్లో కనిపిస్తారు. ఆమె దుస్తుల కోడ్ ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తూ, పురుషునిలాగా ఎలా ఉండాలని అమెరికన్ స్త్రీలు కూడా ఆమె నుండి నేర్చుకునేలా ఉంటుంది. అన్నిటికంటే మించి ఆమె జీవన శైలి సమానత్వంతో కూడుకున్నది.

కమలా హ్యారిస్ అధ్యక్ష రేసులో గెలిచినా, ఓడినా మార్పు దోహదకారులలో ఒకరిగా మారారు. భారతీయ సంతతికి చెందిన మహిళగా ఆమె ఆఫ్రికనీకరణ, మార్పు దోహదకారి పాత్రను నేను ఎంతగానో ఆరాధిస్తున్నాను. ఆమె భవిష్యత్తులోనూ శతాబ్దాల పాటు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది మహిళలకు రోల్ మోడల్‌గా ఉంటారు. ఆమె గెలిచి తన భర్తను వైట్‌హౌజ్‌లో ప్రథమ పురుషుడి (ఫస్ట్ మ్యాన్)గా చేస్తారని ఆశిస్తున్నాను.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మహా రచయిత



ఇవ్వాళ (జూలై 31) మున్షీ ప్రేమ్‌చంద్ జయంతి. ఈనాటికీ ఎవరూ అందుకోలేని రీతుల్లో ఆయన హిందీ, ఉర్దూ సాహిత్యాలను పునర్నిర్వచించారు. మా తాత ఘన వారసత్వం నన్ను అమితమైన గర్వానికి గురిచేస్తుంటుంది. ఇప్పుడూ, ఎప్పుడూ ఆయన్ని ఉత్సవం చేసుకుందాం.

– ప్రబీర్ రాయ్, రచయిత

వచ్చిందేమిటి?



అక్టోబర్ 7 నాడు ఇజ్రాయెల్ మీద హమాస్ దాడిని ఇస్మాయిల్ హనియే ప్రత్యక్షంగా నవ్వుతూ వీక్షించారు. తర్వాత ఇతర హమాస్ అధికారులతో కలిసి ప్రార్థన చేశారు. ఇప్పుడాయన చచ్చిపోయారు.

– యాసర్ అలీ, కాలమిస్ట్

ఏం చేయాలని?



ఇరాన్ నడిబొడ్డున (హమాస్ నేత) ఇస్మాయిల్ హనియేను హత్య చేసేంత సామర్థ్యం ఇజ్రాయెల్‌కు ఉంది. కానీ లక్ష మందికి పైగా (పాలస్తీనా) పౌరులను చంపకుండా గాజాలోని తన 200 మంది బందీలను మాత్రం కాపాడలేదు.

– సరయు పానీ, కాలమిస్ట్

గందరగోళమే సహజం



క్రమం అనేది ముఖ్యమని మనం తప్పుగా భావిస్తుంటాం. కానీ వాస్తవం ఏమంటే, ప్రపంచం అనేది సాధారణంగా, మానవ జీవితం అనేది నిర్దిష్టంగా అస్తవ్యస్తంగా ఉండేట్టుగానే రూపొందింది. ఏదో ఒక ఘర్షణ లేకపోతే మనుషులు బోరుకొట్టి చచ్చిపోతారు.

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

ఏ విధంగా?



జమైకా ఆఫ్రికాలో లేదు. ఇండియా ఆఫ్రికాలో లేదు. మరి (అమెరికా డెమోక్రాట్ అధ్యక్ష అభ్యర్థి) కమలా హ్యారిస్ ఆఫ్రికన్–అమెరికన్ ఎలా అవుతారు?

– లావెర్న్ స్పైసర్, రిపబ్లికన్ నేత

ఇన్ బాక్స్

నరకాలుగా నగరాలు

ఢిల్లీ నడిబొడ్డున పేరొందిన ఒక కోచింగ్ సెంటర్‌లో వరద నీటిలో మునిగి ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. సివిల్ సర్వీసు పరీక్షలకు మంచి కోచింగ్ సెంటర్‌గా ఆ సంస్థకు దశాబ్దాల చరిత్ర ఉంది. రాజధాని నగరంలో ఉన్న ఆ సెంటరు నిబంధనలకు వ్యతిరేకంగా భవనం బేస్‌మెంట్‌లో లైబ్రరీ నిర్వహిస్తోంది. విద్యార్థులు ముగ్గురూ అందులో చిక్కుకుని మరణించిన వారే. ఎన్నో ఆశలతో, ఎంతో ధనం ఫీజుల రూపంలో వెచ్చించి ఆ సంస్థలో చేరిన విద్యార్థులు, సంస్థ నిర్వాహకుల అత్యాశ, అధికారుల అలసత్వం, అవినీతి, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల జీవితాల్ని కోల్పోయారు.

బేస్‌మెంట్‌ని పార్కింగు కోసం, లేదా స్టోర్ రూమ్‌గా మాత్రమే వినియోగించాలని ఒక నిబంధన. దాన్ని లైబ్రరీగా మార్చి సొమ్ము చేసుకోవడం ఆ సంస్థ కక్కుర్తి. అలా ప్రాణాపాయం కలిగే అవకాశం ఉన్నా, నిబంధనల్ని అతిక్రమించినా పట్టనట్టు వ్యవహరించడం, లేదా లంచాలు తిని ఉపేక్షించడం నగర పాలక సంస్థ నిర్వాకం. ఆ సెంటరులోకి వరద నీరు ఒక్క ఉదుటున చేరడానికి కారణం యథేచ్ఛగా అక్రమ కట్టడాల్ని అనుమతించడం. డ్రయిన్ వ్యవస్థ పూడుకున్నంత వరకూ వదిలేయడం. అయితే ఈ సమస్య ఆ ఒక్క కోచింగ్ సెంటర్‌కో, ఆ ప్రాంతానికో పరిమితం కాదు. పుట్టగొడుగుల్లా నగరమంతా వ్యాపించిన కోచింగ్ సెంటర్లు, వాణిజ్య సముదాయాలు, అక్రమ కట్టడాలు... ఇలా పట్టణ ప్రణాళికల్ని తుంగలో తొక్కేవి కోకొల్లలు. అలాగే ఢిల్లీ ఒక్కటే ఇలా దయనీయంగా లేదు. దేశంలో ప్రతీ పట్టణమూ ఇలా అఘోరిస్తున్నవే. రాష్ట్రాలకు పెరుగుతున్న ఒత్తిడి మేరకు కేంద్రం నిధులు, మార్గదర్శకాలు ఇవ్వాలి. పట్టణాల అభివృద్ధిని రాష్ట్రాలు దగ్గరగా పర్యవేక్షించాలి. నగర పాలక సంస్థలు సమర్థంగా వ్యవహరించాలి. దురదృష్టవశాత్తూ అలాంటి రోజులు దగ్గరలో కనబడడం లేదు.

– డా॥ డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం మాజీ ఎంపీ, విజయనగరం

అలుపెరుగని అక్షరాయుధుడు

సందర్భం



టి. ఉడయవర్లు

తెలుగు జర్నలిజాన్ని కొత్త పుంతలు తొక్కించిన సృజనాత్మక సంపాదకుడు ఏబీకే ప్రసాద్. పుస్తకాలు చదివే అలవాటు లేని వారంతా ఇతర కారణాలతో సంపాదకులై పోతున్న తరుణంలో ఏబీకే లాంటి నిత్య పఠనాభిలాషి సంపాదకుడు కావడం అరుదు, ఆదర్శం.

వెనకటికి ‘నా కలమే ఖడ్గ’మని చెప్పిన కోటంరాజు రామారావు ప్రతిరోజూ రాజీనామా లేఖ తన జేబులో పెట్టుకొని ఉండేవారని చెప్పగా విన్నాము. కానీ ఏబీకే విషయంలో దాన్ని సమకాలీనులంతా స్వయంగా చూశారు. తన భావాలకు చోటు లేనిచోట ఆయన నిమిషమైనా నిలువలేరు. అందుకే ‘ఈనాడు’ వైజాగ్ ఎడిషన్‌లో ఎడిటర్‌గా తన జీవితాన్ని ప్రారంభించిన ఏబీకే రాష్ట్రంలో ఎడిటర్‌గా పని చేయని తెలుగు దినపత్రికంటూ దాదాపు లేకుండా పోయింది. నిజానికి తెలుగు పత్రికల సంస్థాపక సంపాదకుడుగా ఆయనకు గొప్ప పేరు వచ్చింది.

‘ఈనాడు’ తర్వాత ‘ఉదయం’, ‘వార్త’, ‘ఆంధ్రజ్యోతి’ హైదరాబాద్, తిరుపతి ఎడిషన్లు ఏబీకే వెలిగించిన దీపాలే. ‘ఆంధ్రభూమి’ అసోసియేట్ ఎడిటర్‌గా, ‘ఆంధ్రప్రభ’ చీఫ్ ఎడిటర్‌గానూ ఆయన పనిచేశారు. ప్రభుత్వ మాస పత్రిక ‘ఆంధ్రప్రదేశ్’కు కూడా ఎడిటర్‌గా పనిచేశారాయన. పక్ష పత్రికలు ‘సుప్రభాతం’, ‘మాభూమి’లకు ఎడిటర్‌గా తొలుదొలుత వాటిని తీర్చిదిద్దింది ఆయనే.

1956లో వామపక్ష భావాల పత్రిక ‘విశాలాంధ్ర’లో తెలుగు జర్నలిజం రంగంలో ప్రవేశించిన ఏబీకే గత ఏడు దశాబ్దాలుగా ఈ భూప్రపంచంలో జరిగే మానవ సంబంధ పరిణామాలన్నింటిపై స్పందించారు. ఆయన చలించిపోయి అక్షరాకృతి నిచ్చిన ‘నిబద్ధాక్షరి’ సాహిత్య ప్రియులంతా చదివి తీరవలసిందే. ఏబీకే సంపాదకీయాలు ఇప్పటివరకు పది సంపుటాలుగా వచ్చాయి. ఆయన సంపాదకీయాలు విస్తృత విజ్ఞానానికి, పఠనశీలానికి, నిశిత పరిశీలనాశక్తికి, భావనాపటిమకు, భాషా పాటవానికి, పాఠక మార్గదర్శకత్వానికి ప్రతీకలు. మరీ ముఖ్యంగా తెలుగు పత్రికలలో ఇతర సంపాదకులు స్పృశించని ఆర్థిక సంబంధ అంశాలకు చెందిన అంశాలను తీసుకుని ఎంతో లోతుగా, సమయస్ఫూర్తితో సంపాదకీయాలు రాశారు. ఆర్థిక రంగ నిపుణులకు దిక్సూచి వంటి సేవలందించారు.

పాఠక జనరంజకంగా సంపాదకీయం రాయడంతో పాటుగా పత్రిక మొదటి పేజీని సుందరంగా, సందర్భానుసారంగా తీర్చిదిద్దడం, చద్దివాసన లేకుండా పరిశోధనాత్మక వార్తలు ప్రచురించడం, ఆకర్షణీయమైన శీర్షికలు పెట్టడం, ఆ తర్వాత ఎడిట్ పేజీని చక్కగా రూపొందించడం, ప్రత్యేకంగా వ్యాసాలు రాయడం, ఇతరులతో పలు కొత్త శీర్షికలు రాయించడం – దిన పత్రికను అన్నివిధాలా సమగ్రంగా, అప్పుడే వండి వార్చిన భోజనంలాగా తాజా వార్తల కోసం, వ్యాసాల కోసం నకనకలాడే పాఠక జనానికి వడ్డించడంలో ఏబీకే సిద్ధహస్తులు. అత్యాధునిక భావాలుగల ఏబీకేలో పట్టుదల, సమయస్ఫూర్తి, వేగం ఎక్కువ. జర్నలిజం





ఏబీకే ప్రసాద్

రంగంలో ఆయనతో పాటుగా కలాలు పట్టిన వారంతా కలాలు మూసేశారు. ఏబీకే లాగా ఇప్పటికీ రచనలు చేస్తున్న పాత్రికేయులెవరూ లేరు.

ఇవాళ తెలుగు జర్నలిజం రంగంలో పనిచేస్తున్న వారిలో ఎక్కువమంది ఏబీకే తయారుచేసిన సైన్యమే. ప్రవృత్తిపరంగా ఎవరెలా ఉన్నా, వృత్తిపరంగా చాలామందిని ఆయన చాకుల్లా మార్చారు. ప్రజాభిప్రాయాన్ని మలచడంలో ఏడు దశాబ్దాల అనుభవం గల ఏబీకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా నిరంతర కృషి చేశారు. తెలుగు భాషకు ప్రాచీన ప్రతిపత్తి సాధించడంలో ఆయన పాత్ర ఎంతగానో ఉంది.

ముప్పై శాతం మంది పిల్లలు తమ మాతృభాషకు దూరమైపోతున్న కొద్దీ ఆ భాషను మృత భాషగా పరిగణించవలసి వస్తుందని యునెస్కో నిర్ధారణ చేసిందనీ, సమాచార విశ్వీకరణవల్ల భాషా వైవిధ్యానికి ప్రమాదం ఏర్పడిందనీ కూడా యునెస్కో తీర్మానించిందని ఏబీకే హెచ్చరించారు. ఒక భాష మరొక భాషపై పెత్తనం చలాయించడాన్ని నిరసించాలని యునెస్కో ఇచ్చిన సలహాను తెలుగు ప్రజానీకం ఆహ్వానించాలన్నారు. పాఠశాల విద్యలో తెలుగు బోధనను అయిదవ తరగతి వరకే పరిమితం చేయకుండా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయా ల్నింటిల్లో ఎస్.ఎస్.సి. వరకు విధిగా అమలు చేస్తేనే విద్యార్థుల్లో భావప్రకటనకు స్థిరత్వం వస్తుందని ఏబీకే అభిప్రాయం వ్యక్తం చేశారు. జపనీస్, చైనీస్ భాషల అభివృద్ధికి, వాటి వికాసానికి మూలం అంతా మాతృభాషలను మాధ్యమంగా చేసుకున్నందు వల్లనే అన్నారు.

ఈ ఆగస్టు ఒకటో తేదీన తొంభయ్యవ ఏట అడుగిడుతున్న ఏబీకేను వయోధిక పాత్రికేయ సంఘం ‘జీవన సాఫల్య పురస్కారం’తో ప్రెస్‌క్లబ్‌లో సత్కరిస్తున్నది. ఏబీకే వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తూ సమగ్రంగా రూపొందించిన ‘అలుపెరుగని అక్షరాయుధుడు–ఏబీకే’ గ్రంథాన్ని పూర్వ ప్రధాని మీడియా సలహాదారు సంజయ్‌బారు ఆవిష్కరిస్తున్నారు.

ఈ సందర్భంగా యువ పాత్రికేయులకు మీరిచ్చే సందేశమేమిటి? అని ప్రశ్నిస్తే – ‘యువ పాత్రికేయులు సమకాలీన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, సాంకేతిక, శాస్త్రీయ సంబంధమైన ప్రతి పరిణామాన్నీ పరిశీలించాలి. వాటిని అవగాహన చేసుకోవాల’న్నారు. పుస్తక పఠనాన్ని మరవకూడదన్నారు. పాత్రికేయులు వృత్తిరీత్యా తమకు అప్పగించిన పని మీద దృష్టి మొత్తం కేంద్రీకరించాలన్నారు.


అంతేకాదు– ‘యువ పాత్రికేయులు తమ వృత్తికి సంబంధంలేని అంశాలలో జోక్యం చేసుకోకూడదు, ధర్మాచరణను వీడకూడదు. ఇందులో సాధకబాధకాలు ఉన్నాయి. అది అందరికీ తెలిసిన విషయమే అయినా, అన్ని అవాంతరాలను తట్టుకుని నిలబడినవాడే ఆదర్శం కాగలడ’ని ఏబీకే ఘంటాపథంగా చెప్పారు.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు I 98856 86415
(నేడు ఏబీకే ప్రసాద్ 90వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ‘అలుపెరుగని అక్షరాయుధుడు–ఏబీకే’ పుస్తకావిష్కరణ)

కోరికలు – ఆత్మ సాధన

మనస్సు నుండి అనేక కోరికలు జనిస్తూ ఉంటాయి. అటువంటివాటిలో కొన్ని మనం ఏ ప్రయత్నం చేయకుండానే పూర్తి అవుతాయి. అందువలన మనం సంతోషాన్ని పొందుతాం. మరికొన్ని కోరికలు మనం ఎంతగా ప్రయత్నం చేసినా పూర్తి కావు. కోరికలు ఫలించని పరిస్థితిలో రెండు రకాల ప్రశ్నలు మనముందు ఉంటాయి. అవి: ఒకటి ‘నా కోరికలు ఏ విధంగా నెరవేరతాయి?’ రెండు ‘ఏ కోరికలు నెరవేరతాయో అటువంటి కోరికలనే నేను కోరుకోవాలా?’ అయితే ఈ రెండూ మన చేతిలో లేవు. మనస్సు వస్తువులతో అంటిపెట్టుకొని ఉండడం వలన కోరికలు జనిస్తాయి. ఇటువంటి కోరికల వల్ల మనకు వస్తువులతో సంబంధం ఉన్నట్లు ఆలోచనలు కలుగుతాయి. ఏదో ఒక కోరిక నెరవేరితే... దానివలన కొంత అనుభవం వస్తుంది. ఒకవేళ కోరిక నెరవేరకపోతే అది ఒత్తిడికి లేక కలవరపాటుకు దారితీస్తుంది. అందువలన వేరొక రకమైన అనుభవం వస్తుంది. కోరికలు నెరవేరినా లేక నెరవేరకున్నా, వాటిని గూర్చి మనస్సులో ఎక్కువ ఆలోచనలు కలుగుతాయి. ఎవరైతే ఇటువంటి పరిస్థితిలో చిక్కుకొంటారో అటువంటివారి విధిని ఊబిలో చిక్కిన మనిషితో పోల్చవచ్చు. ఈ విధంగా చిక్కుకొని ఉన్నప్పుడు పరిష్కారం ఎక్కడ లభిస్తుంది?

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మనస్సును నెమ్మదిగా, క్రమంగా, ఆలోచనారహిత స్థితికి తీసుకొని రావాలి. మనస్సులో ఆలోచనలు పుట్టకపోతే, అసలు ఆలోచనలనేవి ఉండనే ఉండవు. అలాగే కోరికలు కూడా ఉండవు. ఎవరైనా తన మనస్సును విచారించకుండా ఆపగలరా? ఎందుకంటే... ఎల్లప్పుడూ ఆలోచించడం మనస్సు సహజ లక్షణం. కాబట్టి (ఆత్మ) సాధకుడు తన సాధనల ద్వారా... ఆలోచనల వలన కలిగే ఒత్తిడిని దూరం చేసుకోవాలి. ఇందుకోసమై సాధకుడు తన దృష్టిని మళ్ళించకుండా, ఆధ్యాత్మిక లక్ష్యంపైనే మనస్సును కేంద్రీకరింప జేయాలి. దేవుని అనుగ్రహం వలన సాధకుడు కాస్త ముందుగానో లేక ఆలస్యంగానో తన సాధన ఫలితాలను పొందగలుగుతాడు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.ద్వాదశి సా.4.18 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** మృగశిర ప.12.13 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.8.38 నుండి 10.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.58 నుండి 10.49 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.57 వరకు, **అమృత ఘడియలు:** రా.2.14 నుండి 3.50 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.31.

క్లుప్తంగా...

సూర్యాపేట హైవేపై ఫ్లైఓవర్

- మంత్రి తుమ్మల ప్రతిపాదనకు జాతీయ రహదారుల సంస్థ గ్రీన్‌సిగ్నల్
- ఖమ్మం–సూర్యాపేట మార్గంలో తీరనున్న వాహనదారుల కష్టాలు



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సూర్యాపేట హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణానికి జాతీయ రహదారుల అథారిటీ అనుమతి మంజూరు చేసింది. ఇక్కడ ఫ్లైఓవర్ లేకపోవడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున బ్లాక్ స్పాట్‌గా గుర్తించి ఫ్లైఓవర్ మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పాటు నేషనల్ హైవే అథారిటీ అధికారులకు లేఖ రాశారు. దీంతో స్పందించిన అథారిటీ.. ఫ్లైఓవర్ మంజూరు చేయగా త్వరగా పనులు ప్రారంభించాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లు అధికారులను కోరారు. దేవరపల్లి నేషనల్ హైవేలో భాగంగా నిర్మించిన ఈ రహదారి, వాహనదారులకు అనుకూలంగా ఉన్నా ఖమ్మం నుంచి సూర్యాపేట మార్గంలో వెళ్లే వాహనాలు హైవేపైకి చేరేందుకు సూర్యాపేట వైపు ముందుకు వెళ్లాక యూటర్న్ తీసుకుని తిరిగి రావాల్సి వస్తోంది. ఈ సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఫ్లైఓవర్ నిర్మించాలని మంత్రి తుమ్మల ప్రతిపాదించారు. ఫ్లైఓవర్ మంజూరు చేయడంపై మంత్రి హైవే అథారిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

లక్షమందితో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్: బీసీలపై వివక్ష చూపడం మానుకోవాలని, సమగ్ర కులగణన చేశాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని లేదంటే లక్షమందితో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఆగస్టు చివరి వారంలో బీసీ సమగ్ర కులగణన కోరుతూ ఈ నెల 9న ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. 17 రోజుల పాటు సమగ్ర కులగణన సాధన యాత్ర పేరుతో నిర్వహించిన యాత్ర బుధవారం కరీంనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో జాజుల మాట్లాడుతూ...ఏ పార్టీ అధికారంలో ఉన్నా బీసీలకు అన్యాయం చేయడంలో పోటీ పడుతున్నాయన్నారు. కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడిగా బీసీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అగ్రకులాలకు సీఎం పీఠమిచ్చి, దళితులకు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి, బీసీలను విస్మరించడమేమిటని మండిపడ్డారు.

రూ. 60 లక్షలు కాదు.. రూ. 2 కోట్లు

- మార్క్‌ఫెడ్‌లో బయటపడుతున్న అక్రమాల పరంపర
- ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోనూ సొమ్ము మాయం
- పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోని యంత్రాంగం.. సేల్ పాయింట్లపై నిఘా కరువు
- 'సాక్షి' కథనంతో కరీంనగర్ జిల్లాలో అక్రమాలపై మాత్రం విచారణకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్‌లో అక్రమాలు రోజురోజుకు వెలుగుచూస్తూనే ఉన్నాయి. 'సాక్షి' బుధవారం ప్రచురించిన 'మార్క్‌ఫెడ్‌లో రూ. 60 లక్షలు మాయం' కథనంతో మరిన్ని అక్రమాలు బయటపడుతున్నాయి. కరీంనగర్ జిల్లాలో రూ. 60 లక్షలు మాయమైనట్లు తేలగా ఇప్పుడు ఆ జిల్లాతోపాటు ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోనూ ఇటువంటి అక్రమాలు జరిగినట్లు మార్క్‌ఫెడ్‌లోని కొందరు అధికారులే చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో రూ. 70 లక్షలు, నల్లగొండ జిల్లాలో 50 లక్షలు, ఆదిలాబాద్ జిల్లాలో రూ. 40 లక్షల వరకు మార్క్‌ఫెడ్ ఎరువుల సొమ్మును కొందరు ఉద్యోగులు కాజేశారని అంటున్నారు. అంటే మొత్తంగా రూ. 2.20 కోట్లు కాజేసినట్లు అంచనా. అయితే కరీంనగర్ విషయం బయటపడటంతో అక్కడి అధికారులపై చర్యలు చేపట్టి అక్రమాలపై విచారణకు ఆదేశించారు. కానీ మిగిలిన జిల్లాల్లో జరిగిన వాటిపై మాత్రం నోరుమెదపడంలేదు. ఏళ్లుగా అక్రమాలు జరుగుతున్నా వాటిపై నిఘా ఎందుకు పెట్టలేకపోయారన్న విమర్శలు వస్తున్నాయి.

డీసీఎంఎస్ సేల్ పాయింట్ల ద్వారా అక్రమాలు...

మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా, డీఏపీ సహా వివిధ రకాల ఎరువులను జిల్లాలకు పంపిస్తారు. వాటిలో కొంతభాగాన్ని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల ద్వారా రైతులకు సరఫరా చేస్తారు. అందుకోసం కొందరు ప్రైవేట్ ఎరువుల దుకాణదారులకు లేదా నిరుద్యోగుల కోసం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సేల్ పాయింట్లను ఇచ్చారు. వాటికి లైసెన్సులు కూడా మంజూరు చేసి ఎరువులు సరఫరా చేస్తున్నారు. అందుకు అవసరమైన సొమ్మును సేల్‌పాయింట్ల నుంచి తీసుకోవాలి. అయితే కరీంనగర్ జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు రికార్డులను సరిగ్గా నిర్వహించకపోవడం, డేటా తారుమారు చేయడం, రికార్డుల చోరీ, ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు మార్క్‌ఫెడ్ గుర్తించింది. డీసీఎంఎస్ వేములవాడ సేల్ పాయింట్‌లో ఎరువుల బకాయిలు రూ. 76.77 లక్షలు దుర్వినియోగం అయినట్లు తేల్చింది. అందులో ఇప్పటివరకు రూ. 16 లక్షలు రికవరీ చేయగా ఇంకా రూ. 60.77 లక్షల మేర బకాయిలు అక్రమార్కుల వద్దే ఉన్నాయి. అలాగే ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల్లోనూ అక్రమాలు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఆయా జిల్లాల మార్క్‌ఫెడ్ అధికారుల ప్రోత్సాహంతోనే అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం. 1,100 డీసీఎంఎస్ సేల్ పాయింట్లలో ఎన్నింటిలో అక్రమాలు జరుగుతున్నాయో విచారణ చేపట్టాల్సిన అవసరముందన్న చర్చ జరుగుతోంది. వాటిపై నిఘా కరువైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విచారణాధికారిగా సీఎఫ్‌ఎం

కరీంనగర్‌లో రూ. 60 లక్షలు దుర్వినియోగమైనట్లు గుర్తించాం. ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌ను ఎరువుల బకాయిల వసూలుకు పూర్తి బాధ్యత వహించాల్సిందిగా ఆదేశించాం. ఈ ఉదంతంపై మార్క్‌ఫెడ్ చీఫ్ ఫెర్టిలైజర్ మేనేజర్ (సీఎఫ్‌ఎం)ను విచారణాధికారిగా నియమించాం. తదుపరి నివేదిక అందాక తగిన చర్యలు తీసుకుంటాం.
– విష్ణువర్ధన్‌రావు, జనరల్ మేనేజర్, మార్క్‌ఫెడ్

గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణస్వీకారం

- ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే
- పాల్గొన్న సీఎం రేవంత్, మండలి చైర్మన్, మంత్రులు
- తెలంగాణ ప్రజలకు సేవ చేయడం నా అదృష్టం: గవర్నర్



కొత్త గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కొత్త గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ బుధవారం సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. రాష్ట్ర నాలుగో గవర్నర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీఎస్ శాంతికుమారి ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త గవర్నర్‌కు అభినందనలు తెలిపారు. జిష్ణుదేవ్ వర్మ 2018–23 మధ్యకాలంలో త్రిపుర ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు.

ప్రజలకు కొత్త గవర్నర్ సందేశం

విభిన్న సంస్కృతులు, సుసంపన్నమైన వారసత్వం, ప్రకృతి అందాలకు ప్రసిద్ధి చెందిన తెలంగాణ ప్రజలకు సేవ చేయడం తనకు దక్కిన అదృష్టమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్రపతి, ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన సందేశాన్ని విడుదల చేశారు. సమృద్ధిగా సహజ వనరులు, సారవంతమైన వ్యవసాయ భూములతో పాటు వ్యాపార, వాణిజ్యానికి కేంద్రంగా తెలంగాణ ఉందన్నారు. యంగ్ అండ్ డైనమిక్ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వానికి, మంత్రివర్గానికి అభినందనలు తెలియజేశారు. ప్రజాస్వామ్యం, న్యాయం, కరుణ వంటి విలువలతో కూడిన మన రాజ్యాంగం నిర్దేశించిన బాటలో కలిసి నడుస్తూ మార్పు దిశగా ప్రయాణాన్ని ప్రారంభిద్దామని పిలుపునిచ్చారు. ఆర్థికాభివృద్ధి, సామాజిక సమానత్వం, పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిర అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమన్నారు. యువత, విద్య, సాధికారత, ఆరోగ్య సంరక్షణను ప్రాధాన్య అంశాలుగా తీసుకుంటామని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చొరవను ప్రశంసించారు.

విమానాశ్రయంలో ఘనస్వాగతం: శంషాబాద్: ప్రమాణ స్వీకారానికి ముందు రాష్ట్ర నూతన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమానాశ్రయంలో గవర్నర్‌కు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు సాయుధ దళాలు గౌరవవందనం చేశాయి.

రమణా..లోడ్ ఎత్తరా

▶ మొదటి పేజీ తరువాయి

ఉందని, ఈ నెలలో అమ్మకాల లక్ష్యం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారని, ఎంతోకొంత సరుకు తీసుకెళ్లాలంటూ వైన్‌షాప్ యజమానులకు ఫోన్లు చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో చేసేదేమీ లేని పరిస్థితుల్లో వైన్‌షాపుల యజమానులు అందుబాటులో ఉన్న నగదును బట్టి డీడీలు చెల్లించి గోదాముల నుంచి స్టాక్ తీసుకెళ్లారు. దీనిపై ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ ప్రతిసారీ ఈ టార్గెట్లు ఉంటాయని, ఇప్పుడు ప్రభుత్వానికి నిధులు కూడా అవసరమైనందున ఉన్నతాధికారుల సూచన మేరకు సరుకు తీసుకెళ్లాలని వైన్‌షాపులను కోరామే తప్ప ఒత్తిడి తేలేదని, వీలునుబట్టి వైన్‌షాపుల నిర్వాహకులు సరుకు తీసుకెళ్లారే తప్ప...గొంతు మీద కత్తి పెట్టలేదని చెప్పడం గమనార్హం.

తలలు పట్టుకుంటున్న వైన్స్ యజమానులు..

జనాభా ప్రాతిపదికన శ్లాబ్‌ల ప్రకారం టెండర్ దక్కించుకున్నామని.. నిర్ణీత కోటా అయిపోయిన తర్వాత తాము చెల్లించే మొత్తంలో సుమారు 15 శాతం నష్టపోవాల్సి వస్తోందని వైన్స్ షాప్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు ఓ ప్రాంతంలో రూ.50 లక్షల శ్లాబ్‌తో టెండర్ దక్కించుకున్న వ్యాపారికి పది పర్యాయాల వరకు ఐఎంఎల్ డిపోలో కొనుగోలు చేసిన మద్యానికి ఎలాంటి అదనపు పన్ను ఉండదు. అంతకుమించి కొనుగోలు చేస్తే రూ.లక్షకు దాదాపు 15 శాతం అంటే రూ.15 వేలు అదనంగా పన్ను రూపంలో చెల్లించాలి. దీంతో పాటు అమ్మకాలు లేని సమయంలో కొనుగోలు చేయాల్సి రావడం భారంగా మారిందని.. మిత్తీలకే సరిపోని పరిస్థితి ఉందని మద్యం దుకాణాల యజమానులు వాపోతున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇలా...

ఉమ్మడి కరీంనగర్ పరిధిలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలు ఉన్నాయి. తాజాగా ఎక్సైజ్ అధికారులు నాలుగు జిల్లాల్లోని వైన్‌షాపులకు ఒక్కసారిగా సేల్స్ పెంచాలని టార్గెట్ విధించారు.

- కరీంనగర్‌తో సహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ప్రతీ వైన్‌షాపునకు రూ.30 లక్షల టార్గెట్ విధించారు. ''మీరు అమ్ముకోండి.. లేదా స్టాక్ మీతోపాటే ఉంచుకోండి.. అవేమీ మాకు చెప్పొద్దు. కానీ, తప్పకుండా ప్రతీషాప్ రూ.30 లక్షల స్టాక్ కొనుగోలు చేయాల్సిందేనని'షరతు పెట్టారు. దీంతో గత్యంతరం లేక కేసులు పెడతారేమోననే భయంతో రూ.30 లక్షల స్టాక్ కొనేందుకు సిద్ధమవుతున్నారు.
- సిరిసిల్ల జిల్లాలో రూ.30 లక్షల సరుకు తాము కొనలేమని మెజారిటీ వైన్‌షాపుల నిర్వాహకులు చేతులు ఎత్తేయడంతో కనీసం గత ఏడాది విక్రయాలను చేరుకోవాలని మినహాయింపు ఇచ్చారు.
- జగిత్యాల జిల్లాలోనూ వ్యాపారులు తాము రూ.30 లక్షలు చేయలేమని అనడంతో గతేడాది విక్రయాలతో 5–10 శాతం అదనంగా విక్రయించాలని టార్గెట్ పెట్టడంతో అంతా ఓకే అన్నారని సమాచారం.
- పెద్దపల్లి జిల్లాలో రూ.30 లక్షల స్టాక్ కొనలేమని వ్యాపారులు చెప్పడంతో చివరికి గతేడాది విక్రయాల మీద 30 శాతం అదనంగా విక్రయించాల్సిందేనని షరతు పెట్టడంతో వ్యాపారులు సమ్మతించారని తెలిసింది.
- దీంతో ప్రతీ వైన్‌షాపు నిర్వాహకుడు రూ.లక్షలాదిగా దొరికిన చోటల్లా అధిక వడ్డీలకు అప్పులు చేస్తూ టార్గెట్ రీచ్ అయ్యేందుకు నానాతంటాలు పడుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్

▶ మొదటి పేజీ తరువాయి

కొనసాగిస్తామని పేర్కొంది.

దరఖాస్తుల వడపోత 3దశల్లో..: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మూడు దశల్లో వడపోయనున్నారు. తొలిదశలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అప్లికేషన్ ఆధారంగా పరిశీలన జరుపుతారు. వివాదాస్పద, ప్రభుత్వ భూముల్లో ఉండే లేఅవుట్లకు సంబంధించి ఈ దశలోనే అనుమతులు నిలిచిపోతాయి. ఇందుకోసం ధరణిలో పేర్కొన్న వివరాలను, సర్వే నంబర్ల వారీగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న వివరాలను పరిశీలిస్తారు. లేఅవుట్ వేసిన భూమి పూర్తి వివరాలను గుర్తిస్తారు. అలాగే ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతారు. ఈ బృందంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ ఏఈ, ప్రణాళిక సూపర్‌వైజర్, పంచాయతీ ఈవో, యూఎల్‌బీ సిబ్బంది ఉంటారు. ఈ బృందాలు లేఅవుట్ ఉన్న భూమి ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, చెరువులు, కుంటలకు సంబంధించినదా, సీలింగ్, కోర్టు వివాదాలు ఉన్నదా అన్న వివరాలను పరిశీలిస్తాయి. ఈ డేటా నమోదు చేయడానికి మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

రెండోదశలో సీపీవో, టీపీవో, డీపీవో పరిశీలన..

మొదటి దశ వడపోత దాటి వచ్చే దరఖాస్తులను టౌన్ ప్లానింగ్ అధికారులు, పంచాయతీ అధికారులు పరిశీలిస్తారు. రెండో దశలో లేఅవుట్, రోడ్లు, జోన్ నిబంధనల ఉల్లంఘన, ఖాళీ స్థలాలను వదిలేయడం వంటి సాంకేతిక విషయాలను పరిశీలిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే.. ఆయా దరఖాస్తులకు సంబంధించి క్రమబద్ధీకరణ ఫీజును నిర్ణయిస్తారు. ఫీజు చెల్లించిన తర్వాత దరఖాస్తులు మూడోదశకు వెళతాయి.

మూడోదశలో ఉన్నత స్థాయి సమీక్ష

మూడో దశలో దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు పరిశీలిస్తారు. ఏవైనా లోపాలను గుర్తిస్తే దరఖాస్తులను తిరస్కరిస్తారు. అన్నీ సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకుంటే చివరగా అనుమతి కోసం పంపుతారు.

ఆమోదానికి చొరవ చూపాలంటూ..: ఆగస్టు మొదటి వారం నుంచే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని.. 3 నెలల్లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎల్‌ఆర్‌ఎస్ సమస్యను అధిగమించేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లు, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు, పంచాయతీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించింది. ఈ అంశంపై గురువారం సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించనున్నారు.

యాజమాన్య కోటా సీట్ల భర్తీకి మండలి గ్రీన్‌సిగ్నల్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనుమతించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను బుధవారం వెల్లడించింది. యాజమాన్య కోటా సీట్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రైవేటు కాలేజీలు ఆగస్టు 1 నుంచి 13 వరకు ప్రధాన పత్రికల్లో ప్రచురించాల్సి ఉంటుంది. నోటిఫికేషన్ తర్వాత దరఖాస్తు చేసుకునేందుకు 6 రోజుల గడువు ఇవ్వాలి. రాష్ట్రంలోని 1.11 లక్షల ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉంటే, అందులో 30% యాజమాన్య కోటాగా భర్తీ చేస్తారు. ఇందులో 15% ఎన్‌ఆర్‌ఐ లకు కేటాయిస్తారు. ఈ కేటగిరీ కింద సీట్లు పొందే విద్యార్థులు ఎన్నారైలు స్పాన్సర్డ్ చేసిన వారై ఉండాలి. సంబంధిత సబ్జెక్టులతో 50 శాతం మార్కులతో అర్హత పరీక్ష ఉత్తీర్ణత అయి ఉండాలి. మిగిలిన 15 % సీట్లను తొలుత జేఈఈ లో ర్యాంకు ఆధారంగా, తర్వాత ఎంసెట్‌లో ర్యాంకు ఆధారంగా కేటాయించాలి. సంబంధిత సబ్జెక్టుల్లో 45 శాతం కనీస మార్కులు కలిగి ఉండాలి. ప్రవేశాల ప్రక్రియను ఈ నెల 28తో ముగించాల్సి ఉంటుంది. ప్రవేశాలు కల్పించిన వారి జాబితాను కాలేజీలు సెప్టెంబర్ 10లోగా వెల్లడించాల్సి ఉంది. యాజమాన్య కోటాకు సంబంధించిన సీట్లు ఇప్పటికే భర్తీ అయినట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో, మండలి నోటిఫికేషన్ ఇవ్వడం విశేషం.

రుణమాఫీ.. కోతలే!

▶ మొదటి పేజీ తరువాయి

చెందిన 50 మందికి పైగా రైతులు అక్కడకు వచ్చారు. కలెక్టర్‌ను కలిసి తాము రెండో విడతలో లక్షన్నర రుణమాఫీకి అర్హులైనా, తమకు ఆ ప్రయోజనం దక్కలేదని వినతిపత్రం అందజేశారు. ఆ మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఖాతాదారులైన ఆ రైతులు తమకు రుణమాఫీ దక్కలేదని మొదట వ్యవసాయశాఖ అధికారులను అడిగితే బ్యాంక్ అధికారులు అసలు వారి వివరాలను ప్రభుత్వానికి పంపలేదని చెప్పడంతో నిర్ఘాంతపోయారు. దీంతో వారు కలెక్టర్‌కు ఈ విషయాన్ని తెలియజేశారు. కలెక్టర్..రాష్ట్ర నోడల్ అధికారితోపాటు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు దృష్టికి కూడా తీసుకెళ్లారు. బ్యాంకు అధికారులు ఎందుకు పంపలేదో అంతుబట్టడం లేదని అంటున్నారు. మాఫీకి నిబంధనలు ఏమైనా అడ్డువచ్చాయా? లేక ఏదైనా కారణం ఉందా తెలియడం లేదు.

పేర్లు సరిపోలక 18 మందివి రిజెక్ట్: నారాయణపేట సింగిల్ విండో కార్యాలయ పరిధిలో లక్షన్నర రుణమాఫీకి 44 మంది రైతులు అర్హులు. అందులో 26 మందికిగాను రూ.20.55,349 మందికి రుణమాఫీ అయ్యింది. మిగిలిన వారికి పాస్‌బుక్, ఆధార్‌కార్డులో పేర్లు తేడా ఉండడంతో రాలేదు. రేషన్‌కార్డు ఆధారంగా పేరు మ్యాచ్ కావడం లేద ని అక్కడి ప్యాక్స్ కార్యదర్శి అశోక్‌కుమార్ అంటున్నారు.

బ్యాంకు పేరు మాయం: జనగామ యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లో జనగామ, పాల కుర్తి, లింగాలఘణపురం, దేవరుప్పుల, రఘునాథపల్లి మండలాలకు చెందిన 500 మందికిపైగా రైతులు పంట రుణా లు తీసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి 300 మందికి అర్హత ఉంది. బ్యాంకుల వారీగా రుణమాఫీ జాబితా వివరాలు తీసుకున్న సర్కారు, అర్హుల జాబితాను ప్రకటించే క్రమంలో 'యూనియన్ బ్యాంకు'పేరు గల్లంతు అయ్యింది. మూడు విడతల రుణమాఫీ పూర్తయిన తర్వా త, గల్లంతు జాబితాను పరిశీలిస్తామని ప్రభుత్వం చెప్పడంతో రైతులు ఒకింత కలవరపాటుకు గురవుతున్నారు.

ఇద్దరు రైతులకు ఒకే ఆధార్ నంబర్ నమోదు

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రేణికుంట్ల సాంబయ్య డీసీసీబీలో రూ.60 వేల రుణం తీసుకున్నాడు. అయితే మొదటివిడత తో రుణమాఫీ జరగలేదు. దీంతో రైతు విస్తరణ అధికారిని అడగ్గా.. నీ పేరుమీద రూ.2 లక్షలకుపైగా రుణం ఉందని వివరాల కాపీని అందజేశారు. ఆత్మకూరు డీసీసీబీ బ్యాంకులో తన పేరుతో ఒకే ఆధార్ నంబర్‌తో 1,49,861 పంట రుణం, రూ.83,337 మరో రుణం మొత్తంగా రూ.2,33,198 ఉండడంతో ఆశ్చర్యపోయాడు. అదే గ్రామంలో రేణికుంట్ల సాంబయ్య ఉండగా ఆయన రుణా న్ని కూడా బ్యాంకర్లు తన ఆధార్ నంబర్‌తోనే నమోదు చేయడంతో తన పేరుపై రెండు లక్షలకుపైగా రుణమున్నట్టు వచ్చిందని, దీంతో అర్హత ఉన్నా తాను రుణమాఫీకి అర్హత కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

రేషన్‌కార్డు లేదని మాఫీ కాదంటున్నారు

మూడేళ్ల క్రితం గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.లక్ష రుణం తీసుకున్నా. ఇప్పుడు అది వడ్డీతో కలిపి రూ. 1.40 లక్షలు అయ్యింది. రెండో విడతలో మాఫీ అవుతుందని అనుకున్నా, లిస్ట్‌లో పేరు లేకపోతే..ఏఈఓ దగ్గరికి వెళ్లి నా ఆధార్‌కార్డుతో పరిశీలించమని చెప్పగా రేషన్‌కార్డు లేకపోవడంతో కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉందని, రుణమాఫీ చేయకుండా నిలిపివేసినట్టు తెలిపారు. నాకు ఇంతవరకు రేషన్ కార్డు రాలేదు.
– బోడపోతుల రమేష్, రైతు కొణిజర్ల, ఖమ్మం జిల్లా

రేషన్‌కార్డున్న వారికే ప్రస్తుతం మాఫీ

సర్క్యులర్ జారీ చేసిన వ్యవసాయశాఖ

రుణమాఫీ కాకపోవడానికి కారణాలేంటో వ్యవసాయశాఖ ఒక సర్క్యులర్ జారీచేసింది. వాటిని అన్ని జిల్లాల వ్యవసాయశాఖ అధికారులకు పంపించింది. వాటిని రైతులకు కిందిస్థాయి అధికారులు ప్రశ్న, జవాబుల రూపంలో వివరిస్తున్నారు. అవేంటంటే...

ప్రశ్న: లక్ష లేదా లక్షన్నరలోపే నాకు రుణం ఉంది. కానీ నాకు ఇంకా మాఫీ కాలేదు ఎందుకు?

జవాబు: రుణమాఫీ కుటుంబ ప్రాతిపదికన వర్తిస్తుంది. మీ కుటుంబానికి మొత్తం ప్రస్తుతం లక్షన్నర లోపు ఉంటే మాఫీ అవుతుంది.

ప్రశ్న: మా కుటుంబం అందరి పేరు మీద లక్షన్నరలోపే ఉంది. అయినా మాఫీ కాలేదెందుకు?

జవాబు: మీకు రేషన్‌కార్డు లేకపోవచ్చు. రేషన్‌కార్డు లేని వారి వద్దకు త్వరలో అధికారులు వచ్చి గ్రామపంచాయతీలో గ్రామకమిటీ ద్వారా కుటుంబ నిర్ధారణ చేశాక రుణమాఫీ అవుతుంది. ఈ ప్రక్రియ చేయడానికి సమయం పడుతుంది. మీ గ్రామానికి వచ్చే ముందు ప్రతి ఒక్కరికి సమాచారం ఇస్తాం. ప్రస్తుతం రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకు మాత్రమే మాఫీ అయ్యింది. రేషన్‌కార్డు లేని వారికి విచారణ చేశాక మాఫీ చేస్తాం.

ప్రశ్న: రేషన్ కార్డు ఉంది. మా కుటుంబంలో అందరి పేరు మీద లక్షలోపే ఉంది. అయినా మాకు రుణమాఫీ కాలేదు.

జవాబు: ఆధార్ అనుసంధానం సమస్య వల్ల కాలేకపోవచ్చు. మీ ఆధార్ + మీ లోన్ అకౌంట్ స్టేట్‌మెంట్ + పట్టాదారు పాసుబుక్ జిరాక్స్‌లతో రైతు వేదికల వద్ద వెంటనే సంప్రదించాలి.

ప్రశ్న: మా కుటుంబంలో అందరం 2018 కన్నా ముందు లోన్ తీసుకున్నాం. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తున్నాము. అయినా మాకు రుణమాఫీ కాలేదు.

జవాబు: మీరు రుణ ఖాతా తెరిచిన తేదీ అంటే డేటాఫ్ శాంక్షన్ పరిగణనలోనికి తీసుకుంటారు. 2018 డిసెంబర్ 12వ తేదీ కంటే ముందు మీరు రుణం తీసుకుంటే మీకు రుణమాఫీ వర్తించదు.

ప్రశ్న: మా ఇంట్లో నేనొక్కడినే ఉన్నాను. పిల్లలు సెపరేట్ అయ్యారు. నాకు రేషన్‌కార్డు లేదు. నాకు లక్ష మాత్రమే లోన్ ఉంది. ఇంకా నాకు రుణమాఫీ కాలేదు ఎందుకు ?

జవాబు: మీరు ఒక్కరే అని మీరు చెప్పితే సరిపోదు. త్వరలో అధికారులందరం గ్రామాల్లోకి వస్తాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామకమిటీ కుటుంబ నిర్ధారణ చేస్తుంది. కుటుంబ నిర్ధారణ చేసిన తర్వాతనే మీకు రుణమాఫీ అవుతుంది. అప్పటివరకు మీకు లక్షలోపు రుణమున్నా ఇప్పుడే రుణమాఫీ కాదు.

సాగర్‌కు పోటెత్తిన కృష్ణమ్మ

▶ మొదటి పేజీ తరువాయి

చేరుతుందని డ్యామ్ అధికారులను సీడబ్ల్యూసీ(కేంద్ర జల సంఘం) అప్రమత్తం చేసింది. ఆ మేరకు దిగువకు వరదను విడుదల చేస్తామని తుంగభద్ర బోర్డు అధికారులు ఏపీ, తెలంగాణ అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణా, తుంగభద్రల్లో వరద పెరిగిన నేపథ్యంలో గురువారం నుంచి శ్రీశైలానికి చేరే వరద మరింత పెరగనుంది.

ఆగస్టు 2 నుంచి ఎడమకాల్వకు నీటి విడుదల: మంత్రి ఉత్తమ్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమకాల్వ ఆయకట్టుకు ఆగస్టు 2వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని ఉత్తమ్ కోరగా, సానుకూలంగా స్పందించారు. ఎగువ నుంచి వరద వస్తుండటంతో ఇప్పటికే ఆయకట్టు రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

మిడ్‌మానేరుకు జలకళ



బోయినపల్లి(చొప్పదండి): నిన్నటిదాకా వెలవెలబోయిన మిడ్‌మానేరు ప్రాజెక్టుకు ప్రస్తుతం జలకళ సంతరించుకుంది. కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరదనీరు భారీగా చేరడంతో జూలై 27న గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరద కాల్వ ద్వారా మిడ్‌మానేరుకు నీటి విడుదల ప్రారంభించారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో ఐదు రోజుల క్రితం 5.90 టీఎంసీల నీటినిల్వ మాత్రమే ఉంది. రోజుకు15 వేల క్యూసెక్కుల చొప్పున ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల జరగడంతో బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు ప్రాజెక్టులో 10.55 టీఎంసీల మేర నీటినిల్వ ఉంది. ప్రాజెక్టులోకి నీరు చేరడంతో సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల పరిధిలోని గంగాధర, రామడుగు, బోయినపల్లి మండలాలకు చెందిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎటు చూసినా వినాశనమే

బురద, శిథిలాల నుంచి బయటపడుతున్న మృతదేహాలు

కొనసాగుతున్న అన్వేషణ, సహాయక చర్యలు



మరుభూమిగా మారిన వయనాడ్‌లో బుధవారం కొనసాగుతున్న సహాయక చర్యలు

- 167 దాటిన మరణాలు
- 191 మంది జాడ గల్లంతు
- 219 మందికి గాయాలు

వయనాడ్/తిరువనంతపురం: ప్రకృతి ప్రకోపానికి గురై శవాల దిబ్బగా మారిన కేరళలోని వయనాడ్ జిల్లా మారుమూల కుగ్రామాల వద్ద అన్వేషణ, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున కుంభవృష్టి వర్షాలతో నానిన కొండచరియలు పడటంతో బురదలో కూరుకుపోయిన ఇళ్ల శిథిలాల కింద పెద్ద సంఖ్యలో మృతదేహాలను ఆర్మీ, సహాయక బృందాలు వెలికితీశాయి. దీంతో మరణాల సంఖ్య 167కి పెరిగింది. 191 మంది జాడ తెలియాల్సి ఉంది. 219 మంది గాయపడ్డారు. ఛిద్రమైన చాలా మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. వందలాది మందిని సమీప పట్టణాల ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ గ్రామస్థుల మరణాలతో వారి బంధువుల, ఆక్రందనలు, తమ వారి జాడ కోసం కుటుంబసభ్యుల వెతుకులాటతో ఆ ప్రాంతాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. శిథిలాల కింద బ్రతికుంటే బాగుణ్ణు అని ఆశ, ఏ చెడువార్త వినాల్సి వస్తుందోనన్న భయాలతో వందలాది మంది ఆత్మీయులు, మిత్రుల రాకతో ఆ ప్రాంతాల్లో విషాదం రాజ్యమేలింది. కొండపై నుంచి వచ్చిన వరద, బురద ధాటికి రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో బుధవారం ఉదయం మాత్రమే పూర్తిస్థాయిలో సహాయక కార్యక్రమాలు మొదలుపెట్టగలిగారు. రెండ్రోజుల్లో 1,592 మందిని కాపాడినట్లు కేరళ సీఎం విజయన్ చెప్పారు.

వేయి మందిని రక్షించిన ఆర్మీ: యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలతో రంగంలోకి దిగిన భారత సైన్యం దాదాపు 1,000 మందికిపైగా స్థానికులను సురక్షితంగా కాపాడింది. డిఫెన్స్ సెక్యూరిటీ కోర్ బృందాలు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు, తీరగస్తీ దళాలు సంయుక్తంగా చేపడుతున్న రెస్క్యూ ఆపరేషన్లతో చాలా మంది ప్రాణాలతో బయటపడ్డారు. హెలికాప్టర్లు, తాత్కాలిక వంతెనల సాయంతో ఘటనాస్థలి నుంచి వారికి జాగ్రత్తగా తీసుకొస్తున్నారు. కొందరు మానవహారంగా ఏర్పడి ఆవలి ఒడ్డు నుంచి కొందరిని ఇటువైపునకు తీసుకొస్తూ సాహసంచేస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌లతో పాటు స్థానికు తమ వంతు సాయం చేస్తున్నారు. శిబిరాలకు 8,017 మందిని తరలించారు.

ఆదుకుంటున్న బెలీ వంతెనలు: 330 అడుగుల పొడవైన తాత్కాలిక బెలీ వంతెనలు నది ప్రవాహం ఆవలివైపు చిక్కుకున్న బాధితులను ఇటువైపు తీసుకొచ్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. 690 అడుగుల బెలీ వంతెనలను ఢిల్లీ కంటోన్మెంట్ నుంచి తెప్పిస్తున్నారు. మేప్పడి–చూరల్మల వంతెన నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. నిఘా హెలికాప్టర్లు కొండప్రాంతాలు, నదీ ప్రవాహం వెంట తిరుగుతూ బాధితుల జాడ కోసం అన్వేషణ కొనసాగిస్తున్నాయి.

పరిస్థితిని సమీక్షించిన ప్రధాని మోదీ
దిగ్భ్రాంతికర ఘటనలో సహాయక చర్యలు, పునరావాసం తదితర చర్యల పురోగతిపై ప్రధాని మోదీ సమీక్ష జరిపారు. కేరళకు పూర్తిస్థాయిలో కేంద్రం మద్దతిస్తోందని కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ ఘటనాస్థలిని సందర్శించిన సందర్భంగా చెప్పారు.

కుగ్రామాల్లో శ్మశాన వైరాగ్యం

భారీ శిలలు పడి నేలమట్టమైన ఒక ఇంట్లో నాలుగైదు మంది కుటుంబసభ్యులు ఒకరినొకరు గట్టిగా పట్టుకుని అలాగే బురదలో కూరుకుపోయిన విషాద దృశ్యం అక్కడి సహాయక బృందాలను సైతం కంటతడి పెట్టించింది. ముండక్కై జంక్షన్, చూరల్మల ప్రాంతాల్లో భీతావహ దృశ్యాలు అక్కడి ప్రకృతి విలయాన్ని కళ్లకు కట్టాయి. ''ముండక్కై గ్రామంలో ఘటన జరిగిన రోజు దాదాపు 860 మంది జనం ఉన్నారు. వాళ్లలో ఎంతమంది ప్రాణాలతో ఉన్నారో తెలీదు' అని స్థానికులు వాపోయారు. ''చెట్లను పట్టుకుని కొందరు, చెట్టు కింద పడి మరికొందరు, బురదలో కూరుకుపోయి ఇంకొందరు ప్రాణాలు కోల్పోయారు. కుర్చీలో కూర్చుని, మంచాల మీద పడుకుని ఉన్న మృతదేహాలను గుర్తించాం'' అని సహాయక బృందాలు వెల్లడించాయి. ''అంతా కోల్పోయా. అందర్నీ కోల్పోయా. నాకు ఇక్కడ ఇంకా ఏమీ మిగల్లేదు' అంటూ ఒక పెద్దాయన ఏడుస్తూ కనిపించారు. ''బురదలో కాలు పెట్టలేకున్నాం. మావాళ్లు ఎక్కడున్నారో'' అంటూ ఒకరు కంటతడి పెట్టుకున్నారు.

10 శాతం ఇళ్లు మిగిలాయి
ముండక్కైలో దాదాపు 500 ఇళ్లు ఉంటాయని ఓ అంచనా. విధ్వంసం తర్వాత 450 ఇళ్లు నేలమట్టమయ్యాయి. 49 ఇళ్లే మిగిలాయి. బాధితులు అంగన్‌వాడీ కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు.



చిన్నారులను తరలిస్తున్న సిబ్బంది

ముందుగానే హెచ్చరించాం: అమిత్ షా



కుంభవృష్టిపై వారం క్రితమే ముందస్తు హెచ్చరికలు చేశామని రాజ్యసభలో వయనాడ్ విషాదంపై తాత్కాలిక చర్చ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు. '' ముందు జాగ్రత్తగా జూలై 23వ తేదీన ఎన్‌డీఆర్‌ఎఫ్ నుంచి 9 బృందాలను కేరళకు పంపించాం . వయనాడ్‌లో విలయం మొదలవగానే జిల్లా కలెక్టర్ నుంచి ఈ బృందాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. వెంటనే వాళ్లంతా రంగంలోకి దిగారు. అన్వేషణ, సహాయ, పునరావాస కార్యక్రమాల్లో కేరళకు పూర్తి స్థాయిలో మోదీ సర్కార్ అండగా నిలుస్తుంది. ఆరు సంవత్సరాల క్రితమే ఇలాంటి కొండప్రాంతాల నుంచి జనాన్ని వేరేచోటుకు తరలించాలని ఢిల్లీ ఐఐటీ నిపుణులు హెచ్చరించారు. అయినా వారి సలహాను కేరళ సర్కార్ పెడచెవిన పెట్టింది. భారీ వర్షాలు పడొచ్చని జూలై 18న, 25న రెండుసార్లు హెచ్చరికలు పంపాం. 20 సెం.మీ. భారీ వర్షం పడి కొండచరియలు పడొచ్చని 26న హెచ్చరించాం. స్థానికులను ఎందుకు తరలించలేదు?'' అని కేరళ సర్కార్‌ను అమిత్ ప్రశ్నించారు.

పంపింది ఆరెంజ్ అలెర్ట్... అదీ 29న: విజయన్



అమిత్ షా వ్యాఖ్యలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖండించారు. ఈ మేరకు తిరువనంతపురంలో పత్రికా సమావేశంలో మాట్లాడారు. '' అమిత్ షా చెప్పేదంతా అబద్ధం . 28వ తేదీవరకు ఎలాంటి అలర్ట్ పంపలేదు. వర్షాలొస్తాయని భారత వాతావరణ శాఖ వయనాడ్ జిల్లాకు సాధారణ ఆరెంజ్ అలర్ట్‌ను 29వ తేదీన మాత్రమే పంపింది. 20 సెంటీమీటర్లలోపు వర్షాలకు ఆరెంజ్ అలర్ట్, 24 సెం.మీ.లోపు వర్షాలకు రెడ్ అలర్ట్ ఇస్తారు. కానీ వయనాడ్ జిల్లాలో అసాధారణంగా 572 మిల్లీమీటర్లకు మించి కుంభవృష్టి నమోదైంది. ఇంతటి భారీ వర్షసూచన వాతావరణశాఖ చేయలేదు. మంగళవారం కొండచరియలు పడ్డాక తీరిగ్గా ఉదయం ఆరుగంటలకు రెడ్ అలర్ట్‌ను పంపించారు. వరదపై హెచ్చరించాల్సిన సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి ఎలాంటి హెచ్చరిక రాలేదు. అయినా ఇది పరస్పర విమర్శలకు సమయం కాదు'' అని అన్నారు.

దురాశ తెచ్చిన దుఃఖం

వయనాడ్‌లో పర్యావరణ విధ్వంసం

యథేచ్ఛగా తవ్వకాలు, హోటళ్లు, రిసార్టులు

కాస్త వానకూ వణుకుతున్న కొండ ప్రాంతం

అత్యాశే మనిషికి పెను శాపంగా మారుతోంది. వయనాడ్ విలయమే ఇందుకు తాజా ఉదాహరణ. అసలే కేరళకు పశ్చిమాన అరేబియా సముద్రం. ఆపై తూర్పున విస్తారమైన పశ్చిమ కనుమలు. దాంతో పుష్కలమైన వానలకు ఆ రాష్ట్రం పెట్టింది పేరు. ఏకంగా 310 సెంటీమీటర్ల వార్షిక సగటు వర్షపాతం నమోదవుతుంది. ఇందులో మూడొంతుల వానలు జూన్–సెప్టెంబర్ మధ్య వర్షాకాలంలోనే కురుస్తాయి. కేరళలో పశ్చిమ కనుమల అందాలు కన్ను తిప్పుకోనివ్వవు. వాటిని ఆస్వాదించేందుకు పర్యాటకుల రాక కొన్నేళ్లుగా ఊహాతీతంగా పెరుగుతోంది. దాంతో ఎకో టూరిజం పేరిట హోటళ్లు, రిసార్టుల నిర్మాణం అడ్డూ అదుపూ లేకుండాపోయింది. అందుకోసం అడవులను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. కొండ ప్రాంతాలను కూడా ఎక్కడ పడితే అక్కడ అడ్డగోలుగా తవ్వేయడం నిత్యకృత్యంగా మారింది. వీటిని కట్టడి చేసి సమతుల్యత పాటించాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వమూ వీటిని వీలైనంతగా ప్రోత్సహిస్తూ వస్తోంది. పర్యావరణపరంగా అత్యంత సున్నిత ప్రాంతమైన పశ్చిమ కనుమలు ఈ విపరిణామాలను తట్టుకోలేకపోతున్నాయి. ఫలితమే విపరీతమైన వాతావరణ మార్పులు. అవి కేరళలో కొన్నేళ్లుగా పరిపాటిగా మారాయి. 2017, 2018, 2019ల్లో వరుసగా తుఫాన్లు, వరదలు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. అతి భారీ వర్షాలు ఇకపై మరింత పెరుగుతాయని ఈ ట్రెండ్ చెబుతోంది.

విపరీత వాతావరణ పరిస్థితులు...
వయనాడ్ విధ్వంసానికి మనిషి దురాశే ప్రధాన కారణమని లండన్ ఇంపీరియల్ కాలేజ్ రీసెర్చ్ అసోసియేట్ మరియం జకారియా అన్నారు. ''వయనాడ్, ఇడుక్కి జిల్లాల్లో కొండ ప్రాంతాలపై నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోవడమే పెను సమస్యగా పరిణమించింది. దాంతో ఒకప్పుడు చల్లగా ఉండే వయనాడ్ ప్రాంతం ఇప్పుడు వేడిగా, పొడిగా మారిపోయింది. వేసవిలో తీవ్రమైన ఎండలు, వర్షాకాలంలో మితిమీరిన వానలు పరిపాటిగా మారాయి. దాంతో కొండచరియలు విరిగిపడే ముప్పు నానాటికీ పెరుగుతోంది. బాగా ఎండిన నేలల్లో వాననీరు తక్కువగా ఇంకుతుంది. కొండల పైభాగంలో రాతి శిఖరాలను ఆవరించి ఉండే మట్టి పొరలు వదులుగా ఉంటాయి. భారీ వర్షాలకు తడిసి, వరద ఉధృతికి కొట్టుకుపోతాయి. తాజా విలయమే ఇందుకు ఉదాహరణ'' అని వివరించారు. ''వాయు, సముద్ర ఉష్ణోగ్రతల్లో పెరుగుదల ఈ విపరీత వాతావరణ పరిస్థితులకు దోహదపడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల వంటివి తీవ్రతను మరింతగా పెంచుతున్నాయి. ఫలితంగా ఉన్నట్టుండి కుంభవృష్టి కురిసి భారీ ఆస్తి, ప్రాణ నష్టానికి దారితీస్తుంది'' అని జకారియా వివరించారు.

అటకెక్కిన కమిటీ సిఫార్సులు...

అత్యంత సున్నితమైన భౌగోళిక పరిస్థితులు కేరళ ప్రత్యేకత. కొంత ప్రాంతాలు ఎక్కువ కావడంతో దాదాపుగా సగం రాష్ట్రం 20 డిగ్రీల ఏటవాలు కోణంలో ఉంటుంది. పెలుసు బారిన మట్టితో కూడిన కొండల పై ప్రాంతాలు భారీ వర్షాలకు విరిగిపడటం పరిపాటి...

- గత ఏడేళ్లలో దేశవ్యాప్తంగా అత్యంత ఎక్కువ సంఖ్యలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు నమోదైంది కేరళలోనే! దేశమంతటా 3,782 ఘటనలు జరిగితే వీటిలో కేరళ వాటాయే 2,239!
- 2021లో కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లో భారీ వరదలు, కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో భారీగా ప్రాణనష్టం జరిగింది.
- పశ్చిమ కనుమల్లో 61 శాతాన్ని పర్యావరణ పరంగా అతి సున్నిత ప్రాంతంగా ప్రకటించి పరిరక్షించాలని మాధవ్ గాడ్గిల్ కమిటీ 13 ఏళ్ల క్రితమే కేంద్రానికి సిఫార్సు చేసింది.
- కేరళలో కొంత ప్రాంతాలన్నింటినీ ఈ జాబితాలో చేర్చి ఎలాంటి అభివృద్ధి, నిర్మాణ పనులూ జరగకుండా చూడాలని పేర్కొంది.
- గనుల తవ్వకాలు, ఇసుక తవ్వకాలు, జల–పవన విద్యుత్కేంద్రాలు, కాలుష్యకారక పరిశ్రమల నిర్మాణం తదితరాలను పూర్తిగా నిషేధించాలని సూచించింది.
- కానీ ప్రజల జీవనోపాధికి, రాష్ట్రాభివృద్ధికి ఈ సిఫార్సులు గొడ్డలిపెట్టంటూ కమిటీ నివేదికను కేరళ ప్రభుత్వం పట్టించుకోలేదు.
- వయనాడ్‌లో గత 50 ఏళ్లలోనే పచ్చదనం ఏకంగా 60 శాతానికి పైగా హరించుకుపోయిందని 2022లో జరిగిన అధ్యయనం తేల్చింది.
- అదే సమయంలో జిల్లావ్యాప్తంగా తేయాకు తోటల సాగు ఏకంగా 1,800 శాతం పెరిగిపోయిందని వివరించింది.
- కొండ ప్రాంతాల్లో నేల పై పొరల్ని గట్టిగా పట్టి ఉంచే చెట్లు తదితరాలు లేకపోవడం కొద్దిపాటి వర్షాలకే మట్టిపెళ్లలు విరిగిపడటం పరిపాటిగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రధానిపై సభాహక్కుల తీర్మానం

- నోటీసు ఇచ్చిన కాంగ్రెస్ ఎంపీ చన్నీ
- రికార్డుల్లోంచి తొలగించిన వ్యాఖ్యలను షేర్ చేశారని ఆరోపణలు


న్యూఢిల్లీ: విపక్షనేత రాహుల్ గాంధీపై లోక్‌సభలో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాగూర్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల వివాదం మరో మలుపు తీసుకుంది. అనురాగ్ వ్యాఖ్యల్లో స్పీకర్ తొలగించిన భాగాలను కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'లో షేర్ చేశారని, ఇది సభాహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నోటీసు ఇచ్చారు. సభా నియమావళి రూల్–222 కింద ప్రధానిపై సభాహక్కుల ఉల్లంఘన తీర్మానానికి నోటీసు ఇస్తున్నట్లు చన్నీ తెలిపారు. మంగళవారం అనురాగ్ ఠాకూర్ లోక్‌సభలో మాట్లాడుతూ.. తమ కులమేమిటో తెలియని వారు కులగణన గురించి మాట్లాడుతున్నారని రాహుల్‌ను ఉద్దేశించి అన్నారు. దీనిపై విపక్ష సభ్యుల అభ్యంతరంతో స్పీకర్ స్థానంలో ఉన్న జగదంబికా పాల్ (కాంగ్రెస్ ఎంపీ) అనురాగ్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. 'నిబంధనల ప్రకారం రికార్డుల నుంచి తొలిగించిన వ్యాఖ్యలను ప్రచురించడం సభాహక్కుల ఉల్లంఘనే. సుప్రీంకోర్టు కూడా దీన్నే ధృవకరించింది' అని చన్నీ తెలిపారు. ' అయితే అనురాగ్ తమ కులమేమిటో తెలియని వారు కులగణన గురించి మాట్లాడుతున్నారని అన్నపుడు ఎవరి పేరునూ తీసుకోలేదని, ఈ వ్యాఖ్యను రికార్డుల నుంచి తొలగించలేదని, దీని ఆధారంగా చన్నీ ఇచ్చే నోటీసు పరిగణనకు రాకపోవచ్చని అధికారవర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ మంగళవారం ఎక్స్‌లో అనురాగ్ ఠాకూర్ ప్రసంగాన్ని మొత్తం షేర్ చేస్తూ.. 'తప్పకుండా వినాల్సినది. వాస్తవాలు, హాస్యం మేలు కలయిక. ఇండియా కూటమి నీచ రాజకీయాలను ఎండగట్టింది' అని కితాబిచ్చారు. అనురాగ్ వ్యాఖ్యలపై బుధవారం కూడా లోక్‌సభలో తీవ్ర దుమారం రేగింది.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కండి: సోనియా



న్యూఢిల్లీ: ప్రజామోదం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ వ్యాఖ్యానించారు. త్వరలో జరగబోయే కీలకమైన రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు సంసిద్ధం కావాలని నేతలకు ఆమె దిశానిర్దేశం చేశారు. బుధవారం ఆమె పార్టీ నేతలు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ''లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పట్ల ప్రజల్లో సానుకూలత బాగా పెరిగింది. ఇది చూసి అతివిశ్వాసాన్ని మీ దరి చేరనీయకండి' అని నేతలకు హితవు పలికారు.

99 శాతం డెలిగేట్ల మద్దతు కమలకే



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష స్థానానికి పోటీ చేసే దిశగా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్.. కీలక ముందడుగు వేశారు. డెమొక్రటిక్ పార్టీ ప్రతినిధుల వర్చువల్ రోల్‌కాల్ ఓట్లు కోరే అర్హత సాధించారు. బరిలో ఆమె ఒక్కరే మిగలడంతో.. పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా కమలా హారిస్ ఎన్నిక ఇక లాంఛనమే కానుంది. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఖాయం చేసుకునేందుకు కమలా హారిస్ నామినేషన్‌కు 3,923 మంది డెలిగేట్లు (99 శాతం) మద్దతు పలికారు.

అనురాగ్ క్షమాపణ చెప్పాలి: విపక్షాలు

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ కులంపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలంటూ విపక్ష సభ్యులు బుధవారం ఉదయం లోక్‌సభ కార్యకలాపాలను అడ్డుకున్నారు. కులగణన చేపట్టాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, శివసేన (యూబీటీ) ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడబోతుండగా పేపర్లను చించి వెల్‌లోకి విసిరేశారు. గందరగోళం మధ్యనే ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. స్పీకర్ పిలిచినా.. కొందరు కాంగ్రెస్ సభ్యులు తమ ప్రశ్నలు అడగలేదు.

రాహుల్ కులమడిగితే తప్పేంటి?: రిజిజు

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ కులమేమిటని అడిగితే తప్పేమిటని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రశ్నించారు. ''ప్రతి ఒక్కరినీ మీది ఏ కులమని అడుగుతూ దేశాన్ని కులం ఆధారంగా విభజించాలని రాహుల్ చూస్తున్నారు. విలేకరులను, సైనికులను, ప్రజలనూ కులం గురించి వాకబు చేస్తారు. ఆయన కులం మాత్రం ఎవరూ అడగొద్దా? ఇదేం విడ్డూరం? అన్నారు..

ఇరాన్ సవాలు.. ఇజ్రాయెల్ సమాధానం
హమాస్ చీఫ్ హత్య

ఇరాన్ అధ్యక్షుని ప్రమాణస్వీకారంలో పాల్గొన్న హనియే

కాసేపటికే టెహ్రాన్‌లోని సొంతింట్లోనే వైమానిక దాడికి బలి

కేవలం 12 గంటలు. అంత స్వల్ప వ్యవధిలో ఇటు హిజ్బొల్లాను, అటు హమాస్‌ను ఇజ్రాయెల్ చావుదెబ్బ తీసింది. రెండు ఉగ్ర సంస్థల్లోనూ అత్యున్నత స్థాయి నేతలను అత్యంత కచ్చితత్వంతో కూడిన వైమానిక దాడుల ద్వారా అడ్డు తొలగించుకుంది. మంగళవారం రాత్రి హిజ్బొల్లా మిలిటరీ కమాండర్ ఫాద్ షుక్ర్‌ను లెబనాన్ రాజధాని బీరూట్‌లో అంతమొందించింది. తెల్లవారుజామున తన ఆగర్భ శత్రువైన ఇరాన్ రాజధాని టెహ్రాన్ నడిబొడ్డులో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేను ఆయన సొంతింట్లోనే హత్య చేసింది. తద్వారా ఎక్కడైనా, ఎవరినైనా, ఎప్పుడైనా లక్ష్యం చేసుకోగల సత్తా తనకుందని మరోసారి నిరూపించుకుంది. గాజా యుద్ధంతో ఇప్పటికే అట్టుడుకుతున్న పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ తాజా చర్యలతో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. హనియే హత్యకు ప్రతీకారం తప్పదని ఇరాన్ సుప్రీం కమాండర్ ఖమేనీ హెచ్చరికలు జారీ చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం తప్పకపోవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హిజ్బొల్లా కూడా షుక్ర్ మృతిని ధ్రువీకరించింది. 'ఇజ్రాయెల్ మూల్యం చెల్లించక తప్పద'ని పేర్కొంది. గాజాలో కాల్పుల విరమణకు ఇక దారులు మూసుకుపోయినట్టేనని భావిస్తున్నారు...



మంగళవారం సాయంత్రం టెహ్రాన్‌లో ఖమేనీతో హనియే

- పశ్చిమాసియాలో సంక్షోభం తీవ్రం
- ప్రతీకారం తప్పదన్న హమాస్
- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య మళ్లీ కమ్ముకుంటున్న యుద్ధమేఘాలు

టెహ్రాన్/బీరూట్: పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ సంస్థ చీఫ్ ఇస్మాయిల్ హనియే (62) వైమానిక దాడిలో హత్యకు గురయ్యారు. మంగళవారం రాత్రి టెహ్రాన్లో ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఇరాన్ దీన్ని తన బల ప్రదర్శనకు వేదికగా మలచుకుంది. అందులో భాగంగా గాజాను వీడి 2019 నుంచీ ఖతార్‌లో ప్రవాసంలో గడుపుతున్న హనియే తదితర హమాస్ నేతలతో పాటు పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్, హెజ్బొల్లా, యెమన్‌కు చెందిన హౌతీ తదితర ఉగ్ర సంస్థల అగ్ర నేతలంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ఇజ్రాయెల్‌కు మరణం' అంటూ మూకుమ్మడిగా నినాదాలు చేశారు. కాసేపటికే ఇజ్రాయెల్ గట్టిగా జవాబిచ్చింది. కార్యక్రమం ముగిసి హనియే టెహ్రాన్‌లోని తన ఇంటికి చేరుకున్న కాసేపటికే ప్రాణాంతక వైమానిక దాడికి దిగింది. ఇల్లు దాదాపుగా ధ్వంసం కాగా హనియే, బాడీగార్డు చనిపోయారు. దీన్ని హమాస్ కూడా ధ్రువీకరించింది. హనియేను ఇజ్రాయెల్ వైమానిక దాడితో పొట్టన పెట్టుకుందని మండిపడింది. ఇజ్రాయెల్‌పై దీటుగా ప్రతీకార చర్యలుంటాయని స్పష్టం చేసింది. దాడిపై ఇరాన్ స్పష్టత ఇవ్వకున్నా ఇరాన్ పారామిలటరీ రివల్యూషనరీ గార్డ్స్ దర్యాప్తు చేపట్టింది. ఇది ఇజ్రాయెల్ పనేనని అమెరికా కూడా అభిప్రాయపడింది. ఇజ్రాయెల్ మాత్రం దీనిపై స్పందించలేదు. అయితే, ''మేం యుద్ధాన్ని కోరుకోవడం లేదు. కానీ ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాం'' అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యొయెవ్ గలాంట్ ప్రకటించారు.

హెచ్చరించినట్టుగానే...
గతేడాది అక్టోబరు 7న తన గడ్డపై హమాస్ నరమేధానికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ యుద్ధానికి దిగడం తెలిసిందే. హనియేతో పాటు హమాస్ అగ్ర నేతలందరినీ మట్టుబెట్టి తీరతామని ఆ సందర్భంగానే ప్రతిజ్ఞ చేసింది. హమాస్ నేతలు ఎక్కడున్నా వెంటాడి వేటాడాలంటూ ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొసాద్‌కు బాహాటంగానే అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహూ ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 7 నాటి దాడిలో హనియేకు నేరుగా పాత్ర లేదు. పైగా హమాస్‌లో మితవాద నేతగా ఆయనకు పేరుంది. అయినా నాటి దాడికి ఆయన ఆశీస్సులూ ఉన్నాయని ఇజ్రాయెల్ నమ్ముతోంది.

ఇజ్రాయెల్‌కు మరణశాసనమే: ఖమేనీ అల్టిమేటం

హనియే మృతికి ప్రతీకారం తప్పదని ఇరాన్ ఆధ్యాత్మిక నేత, సుప్రీం కమాండర్ అయతొల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. అది తమ పవిత్ర బాధ్యత అని స్పష్టం చేశారు. ''మా ప్రియతమ అతిథిని మా నేలపైనే ఇజ్రాయెల్ పొట్టన పెట్టుకుంది. తద్వారా తనకు తానే మరణశాసనం రాసుకుంది'' అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో ఇరాన్ స్పందన తీవ్రంగానే ఉండొచ్చని అనుమానిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఖమేనీ నివాసంలో సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరగడం దీన్ని బలపరుస్తోంది. తమపైకి వస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ అన్నారు.

షుక్ర్‌ను మట్టుపెట్టాం: ఇజ్రాయెల్



హెజ్బొల్లా మిలిటరీ కమాండర్ ఫాద్ షుక్ర్‌ను ఇజ్రాయెల్ హతమొందించింది. ఇజ్రాయెల్ ఆక్రమిత గోలన్ హైట్స్‌లో హెజ్బొల్లా ఇటీవలి రాకెట్ దాడులతో చిన్నారులతో పాటు మొత్తం 12 మంది ఇజ్రాయెలీలు మరణించడం తెలిసిందే. దానికి ప్రతీకారంగా లెబనాన్ రాజధాని బీరూట్‌పై మంగళవారం రాత్రి ఇజ్రాయెల్ రాకెట్ దాడులకు దిగింది. ఈ దాడుల నుంచి షుక్ర్ తప్పించుకున్నట్టు హెజ్బొ ల్లా చెప్పుకున్నా, అతను మరణించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. 1983లో బీరూట్‌లో అమెరికా సైనిక స్థావరంపై దాడులకు సంబంధించి షుక్ర్ ఆ దేశ వాంటెడ్ లిస్టులో ఉన్నాడు.

శరణార్థి నుంచి హమాస్ చీఫ్ దాకా...

ఇస్మాయిల్ హనియే గాజా సమీపంలో శరణార్థి శిబిరంలో 1962లో జన్మించారు. 1987లో మొదటి పాలస్తీనా యుద్ధ సమయంలో పుట్టుకొచ్చిన హమాస్‌లో ఆయన వ్యవస్థాపక సభ్యుడు. సంస్థ వ్యవస్థాపకుడు, తొలి చీఫ్ అహ్మద్ యాసిన్‌కు అత్యంత సన్నిహితుడు. 2004లో ఇజ్రాయెల్ దాడుల్లో యాసిన్ మరణించాక హమాస్‌లో కీలకంగా మారారు. ఉద్రాతలూగించే ప్రసంగాలకు పెట్టింది పేరు. 2006లో పాలస్తీనా ప్రధానిగా గాజా పాలన చేపట్టారు. ఏడాదికే పాలస్తీనా నేషనల్ అథారిటీ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ ఆయన్ను పదవి నుంచి తొలగించారు. నాటి నుంచి గాజాలో ఫతా–హమాస్ మధ్య పోరు సాగుతోంది. అబ్బాస్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ హనియే గాజా ప్రధానిగా కొనసాగుతున్నారు. 2017లో హమాస్ చీఫ్ అయ్యారు.

యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతీ సుదన్



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ కేడర్ సీనియర్ మాజీ ఐఏఎస్ అధికారిణి ప్రీతీ సుదన్ బుధవారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)కి నూతన చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. '' రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యూపీఎస్సీ ప్రస్తుత సభ్యురాలైన ప్రీతీ సుదన్‌ను చైర్‌పర్సన్‌గా నియమించారు. 2024 ఆగస్టు ఒకటో తేదీ నుంచి 2025 ఏప్రిల్ 29వ తేదీదాకా లేదంటే తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా ఆమె చైర్‌పర్సన్‌గా కొనసాగుతారు' అని కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోని పదవీకాలం 2029 మే నెలదాకా ఉన్నప్పటికీ హఠాత్తుగా తన పదవికి రాజీనామాచేయడంతో ప్రీతీకి సారథ్య బాధ్యతలు అప్పగించారు.

పలు శాఖల్లో కీలక బాధ్యతల్లో..
ప్రీతీ 2022 నవంబర్ 29 నుంచి యూపీఎస్సీలో సభ్యులుగా ఉన్నారు. 1983 బ్యాచ్ ఐఏఎస్ అయిన ప్రీతీ 2020 జూలై ముందువరకు మూడేళ్ల కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శిగా పనిచేశారు. ఆరోగ్య కార్యదర్శి పదవిలో చివరి ఆరునెలల్లో కోవిడ్ సంక్షోభకాలంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 37 సంవత్సరాలపాటు పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆమెకు ఉంది. రక్షణ శాఖలో, శిశు,మహిళాభివృద్ధి శాఖ మంత్రిత్వ శాఖల్లోనూ పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో పనిచేసినపుడు ఆర్థిక, ప్రణాళిక, విపత్తునిర్వహణ, పర్యాటకం, వ్యవసాయ రంగాల అభివృద్ధి కోసం కృషిచేశారు. ప్రపంచబ్యాంక్‌కు కన్సల్టెంట్‌గానూ పనిచేసిన అంతర్జాతీయ అనుభవం ఆమె గడించారు.

ఏమిటీ యూపీఎస్సీ?
అఖిలభారత సర్వీసులు నిర్వహించే అధికారుల ఎంపిక కోసం 1926 అక్టోబర్ ఒకటిన నాటి బ్రిటిష్ ప్రభుత్వం దీనిని 'పబ్లిక్ సర్వీస్ కమిషన్'గా ఏర్పాటుచేసింది. తర్వాత ఇది ఫెడరల్ పబ్లిక్ కమిషన్‌గా, ఆ తర్వాత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా రూపాంతరం చెందింది. యూపీఎస్సీ పరీక్షలు, తుది ఇంటర్వ్యూలు చేసి ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ ఇలా అఖిలభారత సర్వీసులకు అధికారులను ఎంపికచేస్తుంది.

పూజా ఖేడ్కర్ అభ్యర్థిత్వం రద్దు

తదుపరి పరీక్షలు, నియామకాల నుంచి డిబార్: యూపీఎస్సీ



న్యూఢిల్లీ: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా మనోరమ దిలీప్ ఖేడ్కర్‌పై యూపీఎస్సీ శాశ్వత వేటువేసింది. అధికారి దుర్వినియోగం, తప్పుడు పత్రాలతో సివిల్స్‌లో నెగ్గడం వంటి అవకతవకలకు పాల్పడ్డ నేరానికి శిక్షగా ఆమె ప్రొవిజనల్ అభ్యర్థిత్వాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. తదుపరి ఎంపికలు, నియామకాల నుంచి ఆమెను డిబార్ చేస్తున్నట్లు యూపీఎస్సీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. '' గత 15 ఏళ్లలో ఒక అభ్యర్థి తన అవకాశాలు(పరీక్ష అటెంప్టులు) మించి మరోసారి పరీక్ష రాయడం ఇదే తొలిసారి. పూజా ఖేడ్కర్ తప్పుడు గుర్తింపు పత్రాలతో అదనంగా మరోసారి సివిల్స్ పరీక్ష రాసి సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్స్,2022 నిబంధనలను ఉల్లంఘించినట్లు స్పష్టమైంది'' అని యూపీఎస్సీ తెలిపింది. ''మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ జూలై 18న షోకాజ్ నోటీసులిచ్చాం. జూలై 25దాకా గడువు ఇచ్చాం. ఆగస్టు నాలుగోతేదీదాకా గడువుకావాలని ఆమె కోరారు. తుది గడువు జూలై 30 మధ్యాహ్నం 3.30గంటలకల్లా రావాలని చెప్పినా ఆమె నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అందుకే తుది చర్యలు తీసుకున్నాం. పూజా ఉదంతంతో 2009–2023కాలంలో సివిల్స్‌లో తుది ఎంపికకు సెలక్ట్ అయిన 15వేలకుపైగా అభ్యర్థుల జాబితాను క్షుణ్ణంగా వడగట్టాం. ఎవ్వరూ ఇలా అదనపు అటెంప్ట్ చేయలేదు'' అని పేర్కొంది.

బీజేడీ ఎంపీ మొహంతా రాజీనామా



న్యూఢిల్లీ: బిజూ జనతాదళ్ రాజ్యసభ ఎంపీ మమతా మొహంతా బుధవారం ఎగువసభలో తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. మమత స్వదస్తూరీతో రాజీనామా లేఖను రాసి, తనను కలిసి అందజేశారని, నిబంధనల ప్రకారమే ఉండటంతో ఆమె రాజీనామాను తాను ఆమోదించానని రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వెల్లడించారు. మమత బీజేపీలో చేరనున్నారని పార్టీవర్గాలు వెల్లడించాయి. మమత రాజీనామాతో రాజ్యసభలో బీజేడీ బలం ఎనిమిదికి పడిపోయింది. ఒడిశాలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఆ స్థానాన్ని దక్కించుకోనుంది.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 1 । ఆగస్టు । 2024



తప్పుడు నివేదికలు ఇచ్చిన..
భూ సర్వేకు సంబంధించి తప్పుడు నివేదిక లిచ్చిన నలుగురు జీహెచ్ఎంసీ ఉద్యోగులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. -8లో



అసెంబ్లీ ముట్టడి భగ్నం
విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం- ప్రగతి శీల యువజన సంఘం చేపట్టిన అసెంబ్లీ ముట్టడిని పోలీసులు భగ్నం చేశారు. -8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.0/24.0
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా, పలుచోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వర్షం కురిసే అవకాశముంది.

ఓవర్‌లోడుకు చెక్

ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ



సాక్షి, సిటీబ్యూరో: నిన్నా మొన్నటి దాకా అంతర్గత నష్టాలపై దృష్టి సారించిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తాజాగా ఓవర్‌లోడ్‌తో తరచూ విద్యుత్ అంతరాయాలకు కారణమవుతున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్లపై నజర్ పెట్టింది. ఎప్పటికప్పుడు అధిక ఒత్తిడికి లోనవుతున్న సబ్‌స్టేషన్లను గుర్తించి వాటిలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ పరిధిలోని 521 సబ్‌స్టేషన్ల పరిధిలోని 1070 పీటీఆర్‌లు ఉండగా వీటిలో ఒక రంగారెడ్డి జోన్‌లోనే 70 పీటీఆర్‌ల సామర్థ్యాన్ని పెంచింది. అంతేకాదు.. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది విద్యుత్ అంతరాయాలను కూడా భారీగా తగ్గించింది. 1912 కాల్ సెంటర్ సహా ట్విట్టర్, డిస్కం యాప్‌ల ద్వారా వచ్చే ఫిర్యాదులను సైతం 40 శాతం తగ్గించినట్లు ఆ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం క్యూఆర్ కోడ్‌ను ఆగస్టు ఒకటి నుంచే అందుబాటులోకి తీసుకురావాల్సి ఉండగా, పలు సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ఫ్రాడ్‌లకు అవకాశం లేకుండా పటిష్టమైన భద్రతతో ఈ క్యూఆర్ కోడ్‌ను రూపొందిస్తున్నట్లు, డిప్యూటీ సీఎం అనుమతితో త్వరలోనే దీన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు తెలిపారు. ఆగస్టులోనూ టీజీఎస్పీడీసీఎల్ బిల్‌డెస్క్ ద్వారానే బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



ఫోర్త్ సిటీకి రెడీ

కర్బన ఉద్గారరహిత నగరంగా అభివృద్ధి

- ఇప్పటికే అమెజాన్, ఫాక్స్‌కాన్ కంపెనీ ఏర్పాటు
- 400 కేవీ సబ్ స్టేషన్, మెడికల్ కాలేజీ హాస్పిటల్
- నేడు స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీకి శంకుస్థాపన చేయనున్న సీఎం

ఫార్మాసిటీ భూముల్లో ఫార్మా విలేజీలు

సాక్షి, సిటీబ్యూరో: విశ్వనగరి మరింత విస్తరిస్తోంది. తూర్పు దిశగా మరో నగర నిర్మాణం దిశగా ప్రభుత్వం పునాదులు వేస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థల తాకిడితో ఈ నగర విస్తరణకు ప్రణాళిక రచిస్తోంది. ఇప్పటికే ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీల తరహాలో మరో నగర ఏర్పాటుకు అంకురార్పణ చేస్తోంది. ఔషధ నగరి విస్తరణ స్థానంలో కాలుష్య రహిత మహానగరి నిర్మాణానికి గురువారం ప్రభుత్వం తొలి అడుగు వేస్తోంది. యువతకు ఉపాధి కల్పన కోసం కాలుష్య రహిత పరిశ్రమల నెలకొల్పనుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ఈ ప్రాంతానికి వన్నె తేవాలని నిర్ణయించింది. విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు, విశాలమైన రోడ్లు, ఆస్పత్రులు, మెట్రోరైలు రవాణా తదితర మౌలిక సౌకర్యాలు కల్పించనుంది.

ఫార్మాసిటీ.. ఇక నెట్ జీరో సిటీ

ఫార్మాసిటీ ఏర్పాటు కోసం యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లో 19,333 ఎకరాలను సేకరించాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. అందులో 14,500 ఎకరాలను ఇప్పటికే సేకరించింది. అయితే.. భాగ్యనగరానికి చేరువలో పెద్ద ఎత్తున ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు నెలకొల్పితే పర్యావరణం కలుషితం కానుందనే ఆందోళన వ్యక్తమైంది. అయినప్పటికీ.. గత ప్రభుత్వం వెనకడుగు వేయలేదు. అప్పట్లో తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిందే తడవుగా ఫార్మా ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఫార్మాసిటీ స్థానంలో ఫార్మా విలేజీలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే ఫార్మా సిటీ భూముల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కర్బన ఉద్గారాలు, ఇతర గ్రీన్‌హౌస్ వాయువులను పీల్చుకుని, మానవాళికి అవసరమైన ఆక్సిజన్‌ను ఇచ్చే వృక్ష సంపదను పెంచి, ఈ ప్రాంతాన్ని నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో న్యూయార్క్ తరహాలో దీన్ని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తోంది.

మహేశ్వరానికి మహర్దశ

హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు రూ.225 కోట్లతో 10.5 కి.మీల ఆరు లేన్ల రహదారి నిర్మాణం పూర్తి చేశారు. అమెజాన్ డేటా సెంటర్‌కు నిరంతరాయ విద్యుత్ సరఫరా, భవిష్యత్తు భారీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే ఇక్కడ 765 పవర్ గ్రిడ్ సహా వంద ఎకరాల్లో 400 కేవీ సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 112లో మహేశ్వరం వైద్య కళాశాలకు ఇప్పటికే 20 ఎకరాలు కేటాయించింది. రూ.160 కోట్లతో మెడికల్ కాలేజీ, రూ.400 కోట్లతో ఆస్పత్రి భవనం ఏర్పాటుకు గత ఏడాదే శంకుస్థాపన చేశారు. కొంగరలో ఫాక్స్‌కాన్ కంపెనీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే కార్యకలాపాలు మొదలు కానున్నాయి. కొంగర రావిరాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 200 అడుగుల విస్తీర్ణంలో రహదారి విస్తరణతో పాటు ఎయిర్‌పోర్టు నుంచి తుక్కుగూడ , ఫాక్స్‌కాన్ మీదుగా ప్రతిపాదిత నెట్ జీరో సిటీకి మెట్రోలైన్ సేవలను అందుబాటులోకి తేనున్నారు. ఈ ప్రాంతంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, 200 ఎకరాల్లో ఏఐ (కృత్రిమ మేధ) సిటీ, 200 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సుకు సీఎం సూత్రప్రాయంగా అంగీకరించారు.

వర్సిటీకి నేడు శంకుస్థాపన

పరిశ్రమలు, ఐటీ, అనుబంధ రంగాల ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సర్వే నంబర్ 112లో 57 ఎకరాల్లో స్కిల్స్ వర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. ఫార్మా, విజ్యువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, రిటైల్, ఈ కామర్స్, లాజిస్టిక్, ప్యాకింగ్, హార్డ్‌వేర్, ఎలక్ట్రిషన్ వంటి 17 రంగాలలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్, మూడేళ్ల డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ కోర్సులను నిర్వహించనున్నారు. ఏటా 20 వేల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో 'యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్ షిప్ బిల్లు-2024'ను కూడా ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గవర్నర్/సీఎం ఈ వర్సిటీకి చాన్సలర్‌గా వ్యవహరించనున్నారు. ఒక వీసీ సహా 15 మందితో పాలక మండలి ఉంటుంది. ఇందులో ఏడుగురు సభ్యులు పరిశ్రమలకు చెందిన వారే ఉంటారు.
వర్సిటీ మూడేళ్ల నిర్వహణకు రూ.312 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేసింది. రూ.170 కోట్లు కేవలం కోర్సుల ఫీజుల రూపంలో సమకూరనుంది. మీర్‌ఖాన్‌పేట్‌లో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయబోతున్న నైపుణాభివృద్ధి విశ్వవిద్యాలయం, రోడ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు.

చీఫ్ సిటీప్లానర్‌గా శ్రీనివాస్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ)గా కె. శ్రీనివాస్ నియమితులయ్యారు. బదిలీల్లో భాగంగా హెచ్ఎండీఏ (ప్లానింగ్-2) డైరెక్టర్‌గా ఉన్న శ్రీనివాస్‌ను సీసీపీగా ప్రభుత్వం బదిలీ చేసింది. జీహెచ్ఎంసీ సీసీపీగా ఉన్న ఎం.రాజేంద్ర ప్రసాద్ నాయక్‌ను హెచ్ఎండీఏ (ప్లానింగ్-2) డైరెక్టర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

జీహెచ్ఎంసీని సందర్శించిన యూపీ మేయర్లు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో అమలవుతున్న వరద నివారణ, నిర్వహణ పద్ధతుల్ని అధ్యయనం చేసేందుకు బుధవారం నగరానికి వచ్చిన ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, కాన్పూర్, లక్నో, అయోధ్య మేయర్లు మంగ్లేష్ కుమార్ శ్రీవాత్సవ, ప్రమీల పాండే, సుష్మా ఖరక్‌వాల్, గిరీష్ పాటి త్రిపాఠిలు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతలను మర్యాదపూర్వకంగా కలిశారు. వర్షాల సమయంలో జీహెచ్ఎంసీలోని 150 డివిజన్లలోని పరిస్థితుల్ని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తూ అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటారని మేయర్ వారికి వివరించారు. ఎస్ఎన్‌డీపీ కింద చేపట్టిన పనులు, డీఆర్ఎఫ్ చేస్తున్న పనులను గురించి ఎస్ఎన్‌డీపీ సీఈ కోటేశ్వరరావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వారికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మేయర్ల బృందం గురువారం ఎల్బీనగర్ జోన్‌లో ఎస్ఎన్‌డీపీ కింద చేసిన నాలాల అభివృద్ధి పనుల్ని చూస్తారని జీహెచ్ఎంసీ పేర్కొంది.

డిజిటల్ నంబర్.. క్యూఆర్ కోడ్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలోని అన్ని ఆస్తులు, యుటిలిటీస్‌కు జీఐఎస్ మ్యాపింగ్ సర్వేతో పాటు దానికి అనుబంధంగా డిజిటల్ డోర్ నంబర్ల ప్రక్రియ కూడా జరుగుతున్నట్లు కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. జీఐఎస్ సర్వే ద్వారా అన్ని ఆస్తుల జియో ట్యాగింగ్ పూర్తయ్యాక అన్ని ఇళ్లకూ ప్రత్యేక క్రమసంఖ్యతో డిజిటల్ డోర్ నంబర్ జారీ అవుతుందని తెలిపారు. దానికి సంబంధించిన క్యూఆర్ కోడ్ ప్లేట్లను ఇళ్ల బయట తలుపులకు బిగించనున్నట్లు పేర్కొన్నారు. సాంకేతికత ఆధారంగా అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్ని తట్టుకునేలా వాటిని తయారు చేయించనున్నట్లు తెలిపారు. తద్వారా ఈ-గవర్నెన్స్‌కు యాక్సెస్ సులభం కావడంతోపాటు అత్యవసర సమయాల్లో ప్రజలకు తగిన సహాయం అందించేందుకు ఉపకరిస్తుందని పేర్కొన్నారు. అన్ని పబ్లిక్ యుటిలిటీస్‌ను ఒక ఐడీకి కనెక్ట్ చేయడం ద్వారా అన్ని విభాగాల మధ్య మంచి కమ్యూనికేషన్ ఉంటుందని తెలిపారు. మెరుగైన పట్టణ నిర్వహణ, ప్రజా సదుపాయాల కోసం జరుగుతున్న జీఐఎస్ సర్వేకు ప్రజలు సహకరించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఆధార్, పాన్ వంటి వ్యక్తిగత వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది సేకరించరు అని పేర్కొన్నారు. ప్రజల గోప్యత, భద్రతకు ప్రథమ ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు.

'గుర్తింపు'లేని చదువులు!

యూజీసీ గుర్తింపులేని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం

- చెల్లని సర్టిఫికెట్లు.. నామమాత్రపు పాలన
- నిధులు, నియామకాలు, భవన నిర్మాణాలు శూన్యం
- కోఠి ఉమెన్స్ కాలేజీకే పరిమితమైన వర్సిటీ



ఉస్మానియా యూనివర్సిటీ: ఉమ్మడి రాష్ట్రంలోని పద్మావతి మహిళా వర్సిటీ ఏపీకి పరిమితం కాగా.. రెండున్నరేళ్ల క్రితం నగరంలో తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కానీ.. దీనికి యూనివర్సిటీస్ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గుర్తింపే లేకుండాపోయింది. రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయనందున ఇంత వరకు యూజీసీ గుర్తింపు లభించలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో విశ్వవిద్యాలయం జారీ చేస్తున్న డిగ్రీ, పీజీ కోర్సుల సర్టిఫికెట్లు చెల్లుబాటు కావడం లేదు. వివిధ కోర్సులు పూర్తి చేసి తీసుకున్న పట్టాలు ఉన్నత విద్యకు, ఉద్యోగాలకు ఉపయోగపడటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నీ తెలిసినా రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులు మహిళా విశ్వవిద్యాలయానికి యూజీసీ గుర్తింపు లేకున్నా మూడేళ్ల నుంచి డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు (ప్రవేశాలు) కల్పిస్తున్నారు. యూనివర్సిటీకి యూజీసీ గుర్తింపు కోసం అధికారులు ఎలాంటి ప్రయత్నం చేయడంలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

ఆది నుంచీ నిర్లక్ష్యమే..

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ప్రారంభించినప్పటి నుంచీ నిర్లక్ష్య వైఖరే కనిపిస్తోంది. గత నెల నాలుగు ప్రైవేట్ వర్సిటీలకు అనుమతులిస్తూ చట్టం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ మహిళా యూనివర్సిటీని విస్మరించింది. ఓయూ నుంచి కోఠి ఉమెన్స్ కాలేజీని వేరుచేసి మహిళా విశ్వవిద్యాలయంగా నామకరణ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా విస్తరించాల్సిన మహిళా విశ్వవిద్యాలయం కేవలం కోఠి ఉమెన్స్ కాలేజీకి పరిమితమైంది.
ఇంత వరకు పర్మనెంట్ వీసీని నియమించలేదు. కొత్త కోర్సులు, అవసరాలకు భవనాలు, టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులను నియమించలేదు. డిగ్రీ, పీజీ కోర్సుల్లో బోధనకు 30 మంది పర్మనెంట్, 220 మంది కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులతో వర్సిటీ కొనసాగుతోంది. రిజిస్ట్రార్, జాయింట్ రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్, ఇతర అధికారుల నియమాకాల ఆచూకీ లేదు. కనీసం యూనివర్సిటీ కాలేజీకి ప్రిన్సిపాల్ కూడా లేరు. గతంలో ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొ. విజ్జులతను ఇన్‌చార్జి వీసీగా నియమించి యూనివర్సిటీని నామమత్రంగా కొనసాగిస్తున్నారు.

కొత్త కోర్సులు, పరిశోధనల ఊసే లేదు..

మహిళా వర్సిటీలో ఇంత వరకు పరిశోధనలు, కొత్త కోర్సులు, లా, ఇంజినీరింగ్, బీఈడీ ఇతర కాలేజీల ఊసేలేదు. యూజీసీ గుర్తింపు లేనందున ఓయూ పరిధిలోని 100 మహిళా కాలేజీలను కూడా వర్సిటీకి బదిలీ చేయలేదు.

ప్రకటనలకే పరిమితమైన నిధులు..

మహిళా విశ్వవిద్యాలయం మౌలిక వసతుల కల్పనకు, ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. గత ప్రభుత్వం రూ.100 కోట్లు ప్రకటించి చిల్లిగవ్వ కూడా మంజూరు చేయలేదు. నిధుల కొరత కారణంగా విద్యార్థులకు ప్రయోగశాలలు, పరిశోధనల కెమికల్స్, లైబ్రరీ పుస్తకాలు, కంప్యూటర్ ల్యాబులు, ఇతర మౌలిక వసతులను అధికారులు కల్పించలేకపోతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఉద్యోగుల వేతనాలు ఓయూ నుంచి చెల్లిస్తుండగా, విద్యార్థినుల నుంచి వసూలు చేసే ఫీజులతో యూనివర్సిటీ నామమాత్రంగా కొనసాగుతోంది. కొత్తగా ఏర్పడిన మహిళా వర్సిటీలో ఒక్క భవనం కూడా నిర్మించలేదు. పాత భవనంలోనే హాస్టల్, తరగతి గదులను నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్ గది పరిమితికి మించి 15 నుంచి 18 వరకు మంది విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. తరగతుల సంఖ్య తక్కువగా ఉండటంతో పీజీ విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

సర్టిఫికెట్లు చెల్లుబాటవుతాయి: ఇన్‌చార్జి వీసీ

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం డిగ్రీ సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతాయని ఇన్‌చార్జి వీసీ ప్రొ.విజ్జులత వివరించారు. మహిళా విశ్వవిద్యాలయం పేరు మీద ఇంత వరకు మార్కుల జాబితాలను (మెమోలు) మాత్రమే జారీ చేశాం. డిగ్రీ పట్టాలను, కాన్వొకేషన్ సర్టిఫికెట్లు జారీ చేయలేదు. వర్సిటీ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నందున ఉన్నత చదువులతో పాటు విదేశీ విద్యకు, ఉద్యోగాలకు సర్టిఫికెట్లు ఉపయోపడతాయన్నారు. ప్రభుత్వం చట్టం చేయగానే యూజీసీ గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

పంచాయతీల విలీనం

నేడు కేబినెట్ ఆమోదం

- అనంతరం అసెంబ్లీలో బిల్లు..



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని గ్రామ పంచాయతీలను సమీపంలోని మున్సిపాలిటీలు లేదా కార్పొరేషన్ల పరిధిలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలా విలీనం చేసిన అనంతరం ఆ మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలన్న నిర్ణయంతో ఉంది. అందులో భాగంగా ఇప్పటికే పాలకవర్గాల పదవీ కాలం పూర్తయిన పంచాయతీలను తక్షణమే విలీనం చేయాలని, పురపాలక సంఘాల పదవీ కాలం పూర్తయ్యాక వాటిని విలీనం చేయనుంది. పదవీ కాలం పూర్తయిన పంచాయతీలను డీనోటిఫై చేసి.. ఆ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీల జాబితాను పంపాలని నగర శివారు జిల్లాల కలెక్టర్లను ఆయన ఆదేశించారు. జీహెచ్ఎంసీలో విలీనయ్యే పంచాయతీలతో పాటు.. ఔటర్ వెలుపల మున్సిపాలిటీలకు దగ్గర ఉన్న వాటిని ఆయా మున్సిపాలిటీల్లో కలపడం లేదా కొన్ని పంచాయతీలను ఒక క్లస్టర్‌గా విభజించి కొత్త మున్సిపాలిటీలుగా చేసేలా ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనలపై గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించి.. శుక్రవారం ముగిసే శాసనసభ సమావేశాల్లో బిల్లు రూపంలో సభ ముందుకు తేవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు ఔటర్‌కు సమీపంలో ఉన్న పంచాయతీల జాబితాలను ప్రభుత్వానికి పంపారు. రంగారెడ్డి జిల్లాలో పది జీపీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తుండగా.. మేడ్చల్ జిల్లాలో 23 గ్రామాలను వాటికి దగ్గరలో ఉన్న పురపాలికల్లో కలుపనున్నారు. ఔటర్‌కు వెలుపల అత్యంత చేరువలో ఉన్న జీపీలను కూడా పురపాలనలో విలీనం చేసే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది.

మున్సిపాలిటీ	విలీనమయ్యే పంచాయతీలు
పెద్ద అంబర్‌పేట	కుత్బుల్లాపూర్, తారామతిపేట, గౌరెల్లి, బాచారం
శంషాబాద్	రషీద్‌గూడ, బహదూర్‌గూడ, హమీదుల్లానగర్, చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ
శంకర్‌పల్లి	మీర్జాగూడ
తుక్కుగూడ	హర్షగూడ
ఘట్‌కేసర్	మర్రిపల్లిగూడ, ఏదులాబాద్, ఘనాపూర్,
నాగారం	కీసర, రాంపల్లి దాయర, యాద్గార్‌పల్లి, చీర్యాల
తూంకుంట	బాబాగూడ, బొమ్మరాసిపేట, శామీర్‌పేట
మేడ్చల్	రాయిలాపూర్, పూడూరు
గుండ్లపోచంపల్లి	గౌడవెల్లి, మునీరాబాద్
దమ్మాయిగూడ	తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, కరీంగూడ, గోధుమకుంట
పోచారం	చౌదరిగూడ, వెంకటాపూర్, కాచవాని సింగారం, ప్రతాపసింగారం, కొర్రెముల

జీహెచ్ఎంసీలో ప్రజా పాలన సేవా కేంద్రాలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు అర్హులైన వారికి అందించేందుకు నగరంలో ప్రజా పాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ ఒక ప్రకటనలో తెలిపింది. అర్హులైన అభ్యర్థులు తమ సమీపంలోని ప్రజాపాలన సేవా కేంద్రాల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. సంబంధిత సర్కిళ్లలోని సర్కిల్ కార్యాలయాలు/వార్డు కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. పూర్తి వివరాలకు జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

కదలక.. వదలక!

బల్దియాలో బదిలీలు నై?

- ఏళ్లకు ఏళ్లుగా ఇక్కడే.. ఎందుకో?
- ఎక్కడికి, ఎవరూ కదల్చలేరనే భరోసా
- నదుపాయాలు, ఆదాయాలతో తిష్ట
- జీహెచ్ఎంసీలో విచిత్ర పరిస్థితి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో వివిధ విభాగాల్లో బదిలీలు జరుగుతున్నాయి. జీహెచ్ఎంసీలోనూ బదిలీల పర్వం ప్రారంభమైంది. ఇప్పటి వరకు దాదాపు పదిమంది మున్సిపల్ కమిషనర్లు, ఇతరత్రా విభాగాల్లో ఒకరో, ఇద్దరివో బదిలీలు మాత్రమే జరిగాయి తప్ప కీలక విభాగాల్లో ఉన్న వారివి జరగలేదు. వారితో పాటు సీనియర్లుగా ఎంతోకాలంగా ఇక్కడే పాతుకుపోయిన ఉన్నతస్థాయిల్లోని వారి బదిలీలూ జరగలేదు. వారిలో చాలా మంది తామిక్కడే ఉంటామని, తమనెవరూ కదల్చలేరని సన్నిహితుల వద్ద ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకు కారణం మున్సిపల్ శాఖలో తమ హోదాకు తగిన పోస్టులు రాష్ట్రంలో ఇతర కార్పొరేషన్లలో ఖాళీ లేనందున తమను ఎక్కడికీ పంపలేరని చెబుతున్నారు. రాష్ట్రంలోని పెద్ద కార్పొరేషన్లకు ఐఏఎస్ అధికారులు కమిషనర్లుగా ఉన్నందున, తమను ఎక్కడికీ ఎవరూ కదల్చలేరని భరోసాగా ఉన్నారు. అంతేకాదు బదిలీలు 40 శాతానికి మించి జరగరాదనే నిబంధనతోనూ అన్ని స్థాయిల పోస్టులను పరిగణనలోకి తీసుకొని తమను కదల్చలేరని పదేళ్లకుపైగా పని చేస్తున్నవారు సైతం నమ్మకంగా ఉన్నారు. వారే కాదు.. ఎంటమాలజీ వంటి విభాగాల్లోని వారిది సైతం అదే ధీమా. సీనియర్ ఎంటమాలజిస్టు పోస్టులు రాష్ట్రంలో చాలా స్వల్పంగా మాత్రమే ఉన్నందున తాము ఇక్కడే ఉంటామని ధీమాగా ఉన్నారు.

కదలరు అంతే..

జీహెచ్ఎంసీలో దాదాపు రెండేళ్లు పనిచేసినా చాలు ఎవరైనే సరే ఇక్కడినుంచి ఇంకెక్కడికీ కదలరు. అందుకు కారణం ఇక్కడ లభించే సదుపాయాలు, పై ఆదాయాలు ఇంకెక్కడా లభించవు. అందుకే పదోన్నతులను సైతం కాదనుకొని ఇక్కడే ఉంటున్నవారు. ఉండేందుకు ప్రయత్నిస్తున్న వారూ ఉన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో కమిషనర్ స్థాయి వారికి, క్షేత్రస్థాయి పర్యటనలు ఉండేవారికి మాత్రమే వాహన సదుపాయం ఉంటుంది. ఇక్కడైతే సూపరింటెండెంట్‌లకు, అంతకంటే దిగువ స్థాయి వారికి సైతం వాహన సదుపాయం ఉంటుంది. అంతేకాదు.. కార్యాలయం నుంచి కాలు బయట పెట్టని వారికి సైతం వాహన సదుపాయం ఉంటుంది. దాన్ని మరోలా వినియోగించుకొని నెలవారీ ఆదాయం పొందుతున్న వారూ తక్కువేం లేరు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలా వివిధ వైభోగాలకు అవకాశం ఉన్నందున, వాటికి అలవడిన వారు ఇక్కడి నుంచి కదలడం లేదు.

వచ్చేవారే.. వెళ్లేవారు లేరు

ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి డిప్యుటేషన్లపై బల్దియాకు వచ్చిన వారు సైతం ఇక్కడి నుంచి కదలనే కదలరు. డిప్యుటేషన్లు ముగిసినా, ఏళ్లకేళ్లుగా తిష్టవేసిన ఎందరో ఉన్నారు. యూసీడీ విభాగం నుంచి మొదలు పెడితే ఇలాంటి వారికీ లెక్కేలేదు. బదిలీల సమయంలో సైతం వారిని కదల్చలేకపోతున్నారంటే వారి 'పవర్' ఏమిటో అంచనా వేసుకోవచ్చు. మున్సిపల్ శాఖకు చెందిన వారు ఎందరో కొందరు బదిలీ అవుతున్నప్పటికీ, ఇతర విభాగాల వారు మాత్రం కావడం లేదంటే వారి హవా ఎంతో ఊహించుకోవచ్చు.


ఏళ్లకేళ్లుగా..

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ హోదాలో కొనసాగుతున్న వారు ఎందరో ఉన్నారు. వీరిలో ఇరవయ్యేళ్లకుపైగా ఇక్కడే ఉంటున్నవారు ఎందరో ఉన్నారు. అంతేకాదు.. 30 నుంచి 40 ఏళ్లుగా నగరంలోనే ఉంటున్నవారు కూడా ఉన్నారంటే పరిస్థితిని అంచనా వేయొచ్చు. సీనియర్లయిన తమను ఎక్కడకూ పంపలేరని భావిస్తున్న వారు ఇతర ప్రాంతాల్లో తమ హోదాకు తగ్గ పోస్టుల్లేవంటున్నారు. కానీ.. ఇతర విభాగాల నుంచి ఇక్కడికి డిప్యుటేషన్‌పై వస్తుండగా లేనిది మున్సిపల్ శాఖ నుంచి ఇతర విభాగాలకు ఎందుకు డిప్యుటేషన్లపై వెళ్లడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. అన్నింటికీ ఒకటే సమాధానం. సదుపాయాలు.. పై ఆదాయం. ప్రత్యేక చాంబర్లు. అందుకే వచ్చేవారు తప్ప వెళ్లేవారు కనబడటం లేదు. గతంలో ఇద్దరు ముగ్గురు అధికారులు మాత్రం అలా ఇతర విభాగాలకు వెళ్లారు. అలా మిగతా వారెందుకు వెళ్లరో వారితోపాటు ఉన్నతాధికారులకే తెలియాలి.

బల్దియాకు భారం..

స్టాఫింగ్ ప్యాటర్న్‌పై ప్రసాదరావు కమిటీ సిఫార్సుల మేరకు జీహెచ్ఎంసీలో ఆరుగురు అడిషనల్ కమిషనర్లు మాత్రమే ఉండాలి. కానీ ప్రస్తుతం డజను మంది ఉన్నారు. గతంలో ఐదారుగురు అడిషనల్ కమిషనర్లు మాత్రమే అన్ని విభాగాలనూ నిర్వహించేవారు. ప్రస్తుతం అధికారులు పెరిగారు. పనులు తగ్గాయి. పనులు తగ్గినందున సమర్థంగా పని చేస్తున్నారా అంటే అదీ లేదు. ఎస్టేట్స్, అడ్వర్టయిజ్‌మెంట్స్, ట్రేడ్‌లైసెన్స్‌ల వంటి విభాగాల ద్వారా జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆదాయంలో ఇరవై శాతం కూడా రావడం లేదంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు. సీనియర్లు, పెద్ద హోదాల వల్ల వారి జీతభత్యాలు, సదుపాయాల కల్పనతో జీహెచ్ఎంసీకి ఆర్థిక భారం పెరుగుతోంది. అయినా.. మేమింతే. ఇక్కడే ఉంటామంటున్న వారిని ఎవరైనా కదల్చగలరా? వేచి చూడాల్సిందే!

ప్రసాదరావు కమిటీ సిఫారసుల మేరకు సర్కిల్ కార్యాలయాలను 12 నుంచి 30కి పెంచారు. అయిదు జోన్లను ఆరుగా చేశారు. ప్రధాన కార్యాలయంలో 11 మంది అడిషనల్ కమిషనర్లను 6కు తగ్గించాలని సిఫారస్ చేస్తే ప్రస్తుతం డజను మంది ఉన్నారు. బదిలీలపై వచ్చేవారితో ఈ సంఖ్య ఇంకా పెరగనుంది. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, హెల్త్, ఎస్టేట్స్, అడ్వర్టయిజ్‌మెంట్స్ తదితర విభాగాలను బలోపేతం చేయాల్సి ఉందని కమిటీ సూచించింది. కానీ మెరుగవలేదు.



బిగ్‌బాస్ ఫేం మెహబూబ్ బర్త్‌డేలో అనుమతి లేకుండా మద్యం వినియోగం

కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పోచారం: పార్టీల్లో మద్యం వినియోగిస్తే ముందుగా ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనను ఉల్లంఘించి బర్త్‌డే పార్టీ నిర్వహించిన బుల్లితెర కళాకారులు ఎక్సైజ్ పోలీసులకు చిక్కారు. ఘట్‌కేసర్ మండలం, అంకుషాపూర్‌లోని ది కాంటినెంటల్ రిసార్ట్‌లో బిగ్‌బాస్ షో ఫేమ్ మెహబూబ్ షేక్ (మెహబూబ్ దిల్‌సే) తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంటున్నారు. ఈ వేడుకలకు బుల్లి తెర కళాకారులు, కొందరు వీఐపీలు హాజరయ్యారు. ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోకుండా పార్టీలో మద్యం వినియోగిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించిన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు నిర్వాహకుడు షేక్ సుబానీతో పాటు రిసార్ట్ యజమాని సుధరీపై కేసు నమోదు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అబ్కారీ శాఖ అనుమతి లేకుండా పార్టీలో మద్యం వినియోగించకూడదని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు.

తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారుల అరెస్ట్

జీహెచ్‌ఎంసీలో కలకలం

- భూ సర్వే..పరిహారం విషయంలో గోల్‌మాల్
- నలుగురు అధికారుల రిమాండ్

రాజేంద్రనగర్: భూ సర్వేకు సంబంధించి తప్పుడు నివేదిక అందజేసిన నలుగురు జీహెచ్‌ఎంసీ ఉద్యోగులను రాజేంద్రనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పర్‌పల్లి సర్వే నంబర్ 43,44,46లో సందీప్ రెడ్డి కుటుంబ సభ్యులకు 3.08 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలానికి సబంధించి నగరానికి చెందిన ముక్రముద్దీన్ ఖాన్, ఆష్ఫాక్‌లు పాత స్టాంపు పేపర్‌పై పాత సర్వే నంబర్ 78 వేసి నకిలీ పత్రాలు సృష్టించారు. నిజాం నవాబులు ఇనామ్‌గా ఈ భూమి ఇచ్చారంటూ దస్తావేజులను తయారు చేశారు. అనంతరం తమ స్థలం గుండా 100 ఫీట్ల రోడ్డు వెళ్లిందని చెబుతూ 2022లో జీహెచ్‌ఎంసీ అధికారులకు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేశారు. రోడ్డు వెడల్పులో స్థలం వెళ్లినందున తమకు నష్ట పరిహారం చెల్లించాలని విన్నవించారు. ఈ విషయమై రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి మహ్మద్ కబీరుల్లా ఖాన్, డిప్యూటీ సిటీ ప్లానర్ ఎస్.కృష్ణమోహన్, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సర్వేయర్‌గా పని చేస్తున్న కె.శ్రీనివాస్ రెడ్డి, సర్వేయర్ ఎ.దీపక్ కుమార్‌లు తప్పుడు నివేదికలను అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా నిందితుడు రూ.5.78 కోట్ల టీడీఆర్‌ను తీసుకున్నాడు. దీంతో పాటు 3.08 ఎకరాల స్థలంలోని మిగతా స్థలాన్ని 14 డాక్యుమెంట్లు చేసి రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ కేసులో తప్పుడు నివేదికలు అందజేసిన నలుగురు జీహెచ్‌ఎంసీ అధికారులను రాజేంద్రనగర్ పోలీసులు



బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి కబీరుల్లా ఖాన్‌ను ఏ-4గా, డిప్యూటీ సిటీ ప్లానర్ ఎస్.కృష్ణమోహన్‌ను ఏ-5గా, డిప్యూటీ సర్వేయర్ కె.శ్రీనివాస్ రెడ్డిని ఏ-6గా, సర్వేయర్ దీపక్ కుమార్‌ను ఏ-7గా నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ముక్రముద్దీన్ ఖాన్, ఆష్ఫాక్‌లను జూలై 11న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జీహెచ్‌ఎంసీలో ఒక కేసులు నలుగురు అధికారులు అరెస్ట్ కావడం ఇదే మొదటిసారి. గతంలోనే కబీరుల్లా ఖాన్, కృష్ణమోహన్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఈ కేసులో మరికొంతమంది పాత్ర ఉందని..వాటిని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విచారణలో నిందితులుగా తేలితే వారిని సైతం అరెస్ట్ చేస్తామన్నారు.

లీగ్ మ్యాచ్‌లో రాణించిన కెప్టెన్

- మణికుమార్ సీసీ, పోస్టల్ సీసీ జట్ల మధ్య పోటీ..
- 4 వికెట్లతో రాణించిన మణికుమార్ సీసీ కెప్టెన్ వంశీ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మణికుమార్ సీసీ, పోస్టల్ సీసీ మధ్య రెండు రోజుల లీగ్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించారు. అజీటన్ గ్రౌండ్ వేదికగా జరిగిన ఈ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో మణికుమార్ సీసీ జట్టు కెప్టెన్ వంశీ కుమార్ 4 వికెట్లతో అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ లీగ్ మ్యాచ్‌లో పోస్టల్ క్రికెట్ క్లబ్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచిన మణికుమార్ సీసీ బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ టీం నిర్ణీత ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. అనంతరం 4 వికెట్లను కోల్పోయిన పోస్టల్ క్రికెట్ క్లబ్ నిర్ణీత ఓవర్లలో 145 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది విజయం సాధించింది. అయితే పోస్టల్ సీసీ జట్టు కోల్పోయిన 4 వికెట్లను మణికుమార్ సీసీ కెప్టెన్ వంశీ కుమార్ పడగొట్టడం విశేషం. వంశీ 8 ఓవర్లలో 40 పరుగులిచ్చి 4 వికెట్లను తీసి రాణించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు గౌతంరెడ్డిని అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

హస్తినాపురం: స్నేహం ముసుగులో స్నేహితురాలిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు గౌతంరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం శేరిల్ల గ్రామానికి చెందిన ఎడ్ల గౌతంరెడ్డి అదే జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన మునుగాల శివాజీరెడ్డి అలియాస్ చింటూరెడ్డి స్నేహితులు. వీరిద్దరు పథకం ప్రకారం సోమవారం రాత్రి వనస్థలిపురంలోని ఓ రెస్టారెంట్లో గౌతంరెడ్డి చిన్ననాటి స్నేహితురాలిపై మద్యం మత్తులో లైంగిక దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో యువతి ఫిర్యాదు మేరకు గౌతంరెడ్డిని అబ్దుల్లాపూర్ మెట్‌లోని సంపూర్ణ హోటల్ వద్ద అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి మంగళవారం రాత్రి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు ఏసీపీ తెలిపారు. అతని వద్ద నుండి ఐఫోన్, బుల్లెట్ బైకు స్వాధీనం చేసుకుని మరో నిందితుడు శివాజీరెడ్డి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు వెల్లడించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

డబీర్‌పురా: విలువైన కెమెరాలను అద్దెకు తీసుకొని ఉడాయిస్తున్న ఓ అంతర్రాష్ట్ర దొంగను మీర్‌చౌక్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.9 లక్షల విలువ చేసే కెమెరా, లెన్సులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బెంగళూరులోని కెంగెరీ ప్రాంతానికి చెందిన బి.చలపతి ఫోటో గ్రాఫర్. కాగా గత నెల 24వ తేదీన సాయంత్రం చలపతి అమీర్‌పేట్ కృష్ణానగర్ ప్రాంతంలోని యూనిక్ డ్రీమింగ్ కెమెరా రెంటల్ యజమాని దత్తాత్రి వద్దకు వచ్చి తన పేరు మనోజ్‌గా చెప్పుకొని తనకు ఒక సోని కెమెరా, రెండు మాస్టర్ లెన్స్ కావాలన్నాడు. కెమెరాలతో పాటు ఫోటో షూట్ చేసేందుకు కెమెరామెన్ రాకేశ్‌ను పంపిస్తే రూ.9 వేలు చెల్లిస్తానన్నాడు. ఈ మేరకు మరుసటి రోజు చలపతి, రాకేశ్‌లు క్యాబ్ బుక్ చేసుకొని ట్యాంక్ బండ్, జలవిహార్, సంజీవయ్య పార్కు, బిర్లా సైన్స్ మ్యూజియం సందర్శించి ఫోటో షూట్ చేసుకున్నారు. అనంతరం పాతబస్తీలోని సాలార్‌జంగ్ మ్యూజియానికి చేరుకున్నారు. ఇక్కడ మ్యూజియంలో ఫోటో షూట్ చేయాలని చలపతి సూచించడంతో రాకేశ్ ఒక్కడే క్యాబ్ డ్రైవర్‌తో కలిసి మ్యూజియంలోకి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి కారుతో పాటు నిందితుడు చలపతి కనిపించకుండా పోయాడు. దీనిపై బాధితుడు రాకేశ్ మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భారీగా సబ్‌రిజిస్ట్రార్ల బదిలీలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీగా సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ బుధవారం స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు జారీ చేసింది. మల్టీజోన్-2 పరిధిలో గ్రేడ్-1 సబ్‌రిజిస్ట్రార్లు 24 మంది, జోన్- 6లో గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్లు 32 మంది బదిలీ అయ్యారు.

పోలీస్ ఉద్యోగంలో ఎన్నో సవాళ్లు: సీపీ



రంగారావును సన్మానిస్తున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి

హిమాయత్‌నగర్: శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటామని, పోలీస్ ఉద్యోగం ప్రజలతో మమేకమై ప్రజల కోసం చేసేదని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ పొందుతున్న 36 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి వీడ్కోలు సభ నిర్వహించారు. వీరిలో అడిషనల్ డీసీపీ ఎస్.రంగారావు, ఇన్‌స్పెక్టర్ గౌస్ ఖాన్‌లతో పాటు 12 మంది ఎస్‌ఐలు, 19 మంది ఏఎస్‌ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ఎంతో కీలక పాత్ర వహించారని, రిటైర్‌మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రైవేట్ పరం వద్దు: చాడ



ధర్నాలో మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

హిమాయత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం ప్రైవేట్‌పరం చేసే ప్రతిపాదనను వెనక్కితీసుకోవాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన వందలాదిమంది వంట కార్మికులు హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ నుండి బుధవారం 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు వంటలు చేసి పెడుతున్న కార్మికులకు బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షులు డా.బి.వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన శంకర్ గుండ్లపోచంపల్లిలోని శివాలయం సమీపంలో నివాసముంటున్నాడు. శంకర్, అతని భార్య ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కుమార్తె సంగీత(18), ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా బుధవారం సంగీత కడుపు నొప్పి వస్తోందని చెప్పి కళాశాలకు వెళ్లకుండా ఇంట్లో ఉండగా భార్యాభర్తలు డ్యూటీకి వెళ్లారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో చిన్నకుమారుడు భోజనం చేసేందుకు ఇంటికి రాగా సంగీత సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. చుట్టుపక్కల వారి సహాయంతో ఆమెను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. చదువులో సరిగా రాణించలేకపోతున్నానని తమ కుమార్తె తరచూ బాధ పడేదని, ఈ నేపథ్యంలో ఉరివేసుకుందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అసెంబ్లీ ముట్టడి భగ్నం



పీడీఎస్‌యూ-పీవైఎల్ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాంపల్లి: విద్యా రంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని, వెంటనే జాబ్ కేలండర్ ప్రకటించాలని, అసెంబ్లీలో ఉద్యోగుల ఖాళీలపై ప్రకటన చేయాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ)-ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) సంయుక్తంగా చేపట్టిన అసెంబ్లీ ముట్టడిని పోలీసులు భగ్నం చేశారు. ఈ మేరకు బుధవారం రెండు సంఘాలు కలిసి అసెంబ్లీ ఆవరణ వద్ద నెలకొన్న ఐదంచెల భద్రతా వలయాలను ఛేదించుకుని మెరుపు వేగంతో ఒక్కసారిగా గేటు ముందుకు దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. అధిక సంఖ్యలో అసెంబ్లీ వద్దకు చేరుకున్న పీడీఎస్‌యు, పీవైఎల్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకు వచ్చిన వారిని వచ్చినట్లుగానే అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో పోలీసులు, పీడీఎస్‌యూ, పీవైఎల్ కార్యకర్తలకు మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా విద్యారంగం మీద శ్రద్ధ పెట్టడం లేదన్నారు. బడ్జెట్‌ను సవరించి విద్యా రంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరి సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోటీ పరీక్షలు వాయిదా వేయాలని ఆందోళన చేస్తుంటే..అసెంబ్లీలో జాబ్ కేలండర్ ప్రకటించకుండా దాటవేత ధోరణిని ప్రదర్శిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు పాలేబోయిన కిరణ్, డి.శ్రీకాంత్, జన్నారపు రాజేశ్వర్, గడ్డం శ్యామ్, మస్తాన్, పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధారవత్ రవి, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆటో డ్రైవర్ల ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కవాడిగూడ: ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందేందుకు అసంఘటిత రంగంలో ఉన్న రవాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమాలు అందక రవాణ రంగంలో ఉన్న ఆటో, క్యాబ్, డీసీఎం, లారీ, బస్సు డ్రైవర్లు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2014వ సంవత్సరం నుంచి ఆటో మీటర్ చార్జీలు పెంచలేదన్నారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా గత ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రయాణ సౌకర్యం సరళం చేసేందుకు సరికొత్త ఆటో పర్మిట్లను జారీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12వేల ఆర్థిక సహాయం అందజేసే కార్యక్రమం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్ మాట్లాడుతూ..ఆటోమీటర్ చార్జీలు వెంటనే పెంచి..ఓలా, రాపిడో, ఊబర్ సంస్థలను నిషేధించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్తగా 20 వేల ఆటో పర్మిట్లను జారీ చేయాలని డిమాండ్ చేశారు. 2019 మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో వేలాది మంది ఆటో డ్రైవర్లతో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జములయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో యూనియన్ నేతలు మోహన్‌రావు, సామల భాస్కర్, శోభన్, భిక్షపతియాదవ్, ఎండీ ఓమర్ ఖాన్, కృష్ణమూర్తి, టి.రాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానని...

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై లైంగిక దాడి

గచ్చిబౌలి: సినిమాల్లో అవకాశం కల్పిస్తానని నమ్మించిన ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై లైంగిక దాడికి పాల్పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వైజాగ్‌కు చెందిన దంతలూరి సిద్ధార్థ వర్మ(30) రాఘవేంద్రకాలనీలో నివాసం ఉంటూ సినీ పరిశ్రమలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ యువతి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ పుప్పాలగూడలో నివాసం ఉంటోంది. ఆమెకు స్నేహితురాలి ద్వార సిద్ధార్థ వర్మతో పరిచయం ఏర్పడింది. సినిమాలో అవకాశం కల్పిస్తానని నమ్మించి ఇంటికి పిలిపించుకుని, ఆల్కాహాల్ తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సిద్ధార్థ వర్మను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా ఐఈఈఈ సదస్సు


సాక్షి, సిటీబ్యూరో: బేగంపేటలోని ది ప్లాజా వేదికగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఐఈఈఈ 4వ అంతర్జాతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో సస్టైనబుల్ ఎనర్జీ అండ్ ఫ్యూచర్ ఎలక్ట్రిక్ ట్రాన్స్‌పోర్టేషన్‌పై నిర్వహించిన ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఎన్టీయు సింగపూర్ నుంచి ప్రొఫెసర్ లలిత్ గోయల్, ఖతార్ విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ అతిఫ్ ఇక్బాల్‌తో సహా ప్రముఖ వక్తల నేతృత్వంలోని సమావేశంలో 'ఎలక్ట్రిక్ పవర్ సిస్టమ్స్‌లో కెపాసిటీ రిలయబిలిటీ మూల్యాంకనం'కు సంబంధించిన అంశాలను చర్చించారు.

పెళ్లి ఇష్టం లేదని అదృశ్యమైన యువతి

లంగర్‌హౌస్: తనకు పెళ్లిళ్లపై నమ్మకం లేదని, పెళ్లి అంటే ఇష్టం లేదని..తాను పారిపోతున్నానని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి చెప్పి మరీ పారిపోయింది ఓ యువతి. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆర్మీ విశ్రాంత ఉద్యోగి హెచ్.కె సింగ్ లంగర్‌హౌస్ గాంధీనగర్‌లో ఉంటున్నాడు. ఇతని చిన్న కూతురు శశిబాల కుమారి (29) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. కొంత కాలంగా ఆమెకు వివాహం చేయడానికి కుటుంబీకులు ప్రయత్నాలు చేస్తుండగా ఒప్పుకోవడం లేదు. ఒత్తిడి పెరగడంతో రెండు రోజుల క్రితం శశి ఇంట్లో గొడవ పడింది. అదే రోజు రాత్రి ఆమె లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. తనకు పెళ్లి చేసుకోవడం ఇష్టంలేదని పోలీసులకు తెలిపింది. తాను ఇంట్లో నుండి పారిపోతున్నానని, తన తల్లిదండ్రులు వచ్చి ఫిర్యాదు చేసినా తీసుకోవద్దని, తన కోసం వెదకవద్దని చెప్పింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆమెను మాటల్లో పెట్టి తల్లిదండ్రులను పిలిపించారు. కౌన్సిలింగ్ చేసినా వినలేదు. తల్లిదండ్రులతో కలిసి ఇంటికి బలవంతంగానే వెళ్లిన ఆమె..అక్కడి నుండి అందరి కళ్లు కప్పి పారిపోయింది. దీంతో బుధవారం వారు లంగర్‌హౌస్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య...ఉద్రిక్తత

- భర్తే కారకుడంటూ బంధువుల ఆందోళన
- హత్య చేశాడని ఆరోపిస్తూ.. పోలీస్టేషన్ వద్దే అతడిపై దాడి



సుజాత (ఫైల్)



పోలీస్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న సుజాత బంధువులు

లింగోజిగూడ: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని వివాహిత బంధువులు పోలీస్టేషన్ ముందు ఆందోళన చేపట్టడంతో పాటు భర్తపై దాడి చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యాచారం మండలం కురుమిద్దెకు చెందిన రమావత్ సుజాత(21)కు గతేడాది నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గాశిరాం తాండకు చెందిన రమావత్ శివతో వివాహం జరిగింది. వీరు హయత్‌నగర్ బంజారా కాలనీలో నివాసం ఉంటున్నారు. శివ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరికి ఆరునెలల పాప ఉంది. గత కొన్ని రోజులుగా వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుజాత మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

బంధువుల ఆందోళన...

కాగా సుజాత ఆత్మహత్య చేసుకోలేదని, శివనే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకకరించారని ఆరోపిస్తూ బుధవారం హయత్‌నగర్ పోలీస్టేషన్ ముందు సుజాత బంధువులు ఆందోళన చేపట్టారు. నిందితులకు పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపించారు. సుజాత వివాహం సమయంలో ఇచ్చిన కట్నం, బంగారం తిరిగి ఇవ్వాలని శివ బంధువులతో గొడవకు దిగారు. దీంతో పోలీస్టేషన్ ఆవరణలో డబ్బును తిరిగి ఇస్తామని శివ కుటుంబ సభ్యులు ఒప్పందానికి వచ్చారు. ఈ సమయంలో స్టేషన్‌కు వచ్చిన శివపై సుజాత బంధువులు దాడి చేశారు. గమనించిన పోలీసులు వారిని ఆపడానికి ప్రయత్నించగా తోపులాట జరిగింది. ఇద్దరు మహిళా పోలీసులకు స్వల్పంగా గాయాలయ్యాయి. సుజాత బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

ఏసీబీ వలలో కమర్షియల్ ట్యాక్స్ అధికారి



లంచం తీసుకుంటూ పట్టుబడిన శ్రీధర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: ఒక ప్రైవేటు సంస్థకు చెందిన ఆడిట్ పూర్తి చేయడానికి, గతంలో అందించిన నోటీసును మూసి వేయడానికి ఓ వ్యాపారి వద్ద నుండి తెలంగాణ రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ అధికారి రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఈ సంఘటన బుధవారం అబిడ్స్‌లోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పల్‌కు చెందిన శ్రీకాంత్‌కు ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. ఆయన కంపెనీకి చెందిన ఆస్తులను మూడు సంవత్సరాలకు గాను ఆడిట్ చేయించేందుకు పంజగుట్ట సర్కిల్‌కు చెందిన స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే అతను పొందుపరిచిన ఫార్మాట్ సరిగ్గా లేదంటూ శ్రీకాంత్‌కు వాణిజ్యపన్నుల శాఖ అధికారి నోటీసులు పంపించారు. అన్ని వివరాలను సరిగ్గానే అందజేశామని ఆ నోటీసులకు శ్రీకాంత్ సమాధానం చెప్పినప్పటికి మీ వివరాలను అసెస్‌మెంట్ చేయాలంటే రూ.3 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను రూ.3 లక్షలు ఇవ్వలేనని, రూ.2 లక్షలు ఇస్తానని సదరు అధికారితో శ్రీకాంత్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని శ్రీకాంత్ ఏసీబీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అబిడ్స్‌లోని తన కార్యాలయంలో రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

పాత్రికేయులు రాజకీయాల్లోకి రావాలి

పంజగుట్ట: అవినీతి, నేర రహిత సమాజం కోసం నిస్వార్థంగా పని చేస్తున్న జర్నలిస్టులు నేరుగా రాజకీయాల్లోకి రావల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అఖిల భారత వర్కింగ్‌ జర్నలిస్టుల అసోసియేషన్‌, తెలుగు రాష్ట్ర సంక్షేమ సంఘం, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయుల రాజకీయ పార్టీ ఆవిర్భావ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జైళ్లశాఖ రిటైర్డ్‌ ఐజీ నర్సింహులు, బీసీ కమిషన్‌ మాజీ చైర్మన్‌ బి.ఎస్‌.రాములు, ఏడబ్ల్యూజేపీ జాతీయ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆనం చిన్ని వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కార్డు వినియోగించకుండానే...

350 డాలర్లు డెబిట్‌

వెంగళరావునగర్‌: కార్డు వినియోగించకుండానే నగదు డెబిట్‌ అయ్యాయంటూ మధురానగర్‌ పీఎస్‌లో కేసు నమోదైంది. సిద్ధార్థనగర్‌ నివాసి ఏలూరి వేణుగోపాల్‌ ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తుంటాడు. ఈనెల 18న ఎలాంటి ట్రాన్సాక్షన్స్‌ చేయనప్పటికీ తన ఐడీఎఫ్‌సీ క్రెడిట్‌ కార్డు నుంచి 350 డాలర్లు (రూ.29,263) డెబిట్‌ అయినట్టుగా మెసేజ్‌ వచ్చింది. దీంతో బ్యాంకులో విచారించిన అనంతరం బాధితుడు బుధవారం మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టండి



ఫిలింనగర్‌: ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డినగర్‌ బస్తీలో ఆగస్టు 11న అమ్మవారి బోనాల పండుగ నిర్వహిస్తున్నామని, అయితే ఆలయానికి దారితీసే రోడ్డు నడవడానికి కూడా వీల్లేకుండా అధ్వానంగా ఉందని, పరిసరాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేపట్టాలంటూ బస్తీవాసులు బుధవారం ఖైరతాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతి, డీసీ ప్రశాంతిలకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన జెడ్సీ ఈఈ విజయ్‌కుమార్‌ను పిలిపించి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, ఆలయ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతతో పాటు పరిసరాలు బాగుచేయాలని సూచించారు. వీధిదీపాలు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఫిలింనగర్‌ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, స్థానిక నేతలు ఉన్నారు.

ఉద్యోగులకు ఘన సన్మానం

లక్డీకాపూల్‌: నిమ్స్‌ ఆసుపత్రి సిబ్బందిలో పలువురు బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లెర్నింగ్‌ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసుపత్రి ఇంచార్జ్‌ డైరెక్టర్‌, డీన్‌ ప్రొఫెసర్‌ లిజా రాజశేఖర్‌ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులను ఘనంగా సత్కరించి, వారందించిన సేవలను కొనియాడారు. పదవీ విరమణ పొందిన వారిలో ల్యాబ్‌ టెక్నీషియన్‌ రాంబాబు , థియేటర్‌ అసిస్టెంట్‌ రంగారెడ్డి , నర్సింగ్‌ ఆఫీసర్లు జయంతి , సుగుణ మేరీ, నీలా, నర్సింగరావులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్‌ రిజిస్ట్రర్‌ డాక్టర్‌ శాంతివీర్‌, వివిధ ఉద్యోగుల సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి బెదిరింపులతో వ్యక్తి ఆత్మహత్య

వెంగళరావునగర్‌: యువతి బెదిరింపులకు గురి చేయడంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కార్మికనగర్‌ సమీపంలో నివాసం ఉండే కె.రమేష్‌ (33) గత ఐదేళ్ళుగా బసవతారకం ఆసుపత్రిలోని ఓ వైద్యుని వద్ద కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా సోమవారం సాయంత్రం ఓ యువతి రమేష్‌కు వీడియో పంపింది. వెంటనే తన వద్దకు రావాలని లేకపోతే చనిపోతానని బెదిరించింది. ఆ వీడియోను చూసిన రమేష్‌ భార్య నిలదీయగా గత కొంతకాలం కిందట ఝాన్సీ అనే యువతితో పరిచయం అయిందని, ప్రస్తుతం దూరంగా ఉన్నానని దీంతో వీడియోలు పంపుతున్నట్టు తెలిపాడు. ఈ క్రమంలోనే ఈనెల 30వ తేదీన రమేష్‌ బాత్రూంలో యాసిడ్‌ తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన అతడి భార్య రమేష్‌ను ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు తెలియజేశారు. ఝాన్సీ అనే యువతి వీడియోలు పంపడం వల్లనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ మృతుడి భార్య మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్‌ పోటీల్లో కృష్ణతేజకు బంగారు పతకం



వెంగళరావునగర్‌: జాతీయస్థాయి అండర్‌–14 బాస్కెట్‌బాల్‌ ఛాంపియన్‌షిప్‌–2024 పోటీల్లో యూసుఫ్‌గూడ ఎంజీఎం విద్యార్థి కృష్ణతేజ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. హర్యానాలో బాస్కెట్‌బాల్‌ స్టూడెంట్స్‌ ఒలింపిక్‌ నేషనల్‌ గేమ్స్‌ (11వ) నిర్వహించారు. యూసుఫ్‌గూడలోని మహాత్మాగాంధీ మెమోరియల్‌ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కృష్ణతేజ అండర్‌–14 విభాగంలో పాల్గొని సత్తా చాటి గోల్డ్‌ మెడల్‌ సాధించాడు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బంగారు పతకాన్ని సాధించిన కృష్ణతేజను స్కూల్‌ చైర్మన్‌ ఎం.ఎం.నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్కూల్‌ విద్యార్థి జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించడం తమకెంతో గర్వకారణంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటుగా ఇతర టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్‌ సిల్క్‌ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ మగువల మనసు దోచుకుటుంది. రంగురంగుల కాటన్‌, సిల్క్‌, డిజైనరీ చీరలు అమితంగా ఆకట్టుకుంటున్నాయి. శుభకార్యాలకు, పండుగలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన చీరలు ముఖ్యంగా పటోలా, చెందేరి, పోచంపల్లి, వెంకటగిరి, గద్వాల, బెనారస్‌, కోల్‌కతా, ఉప్పాడ, ధర్మవరం చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని, ఈనెల 5 వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని ఇండియన్‌ సిల్క్‌ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచేలా... విద్యార్థులకు బోధన

- శిక్షణ తీసుకుంటున్న ఉపాధ్యాయులు
- కొవిడ్‌ సమయంలో విద్యార్థులపై తీవ్ర ప్రభావం
- 3,6,9 తరగతుల విద్యార్థులకు నేషనల్‌ అఛీవ్‌మెంట్‌ టెస్ట్‌
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



శిక్షణలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు..

బంజారాహిల్స్‌: కొవిడ్‌ అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తగ్గినట్లుగా పలు సర్వేల్లో నిర్ధారణ అయ్యింది. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించి చదువుల్లో మరింత ఉన్నతంగా రాణించే దిశలో వారిని సన్నద్ధం చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. ఇందులో భాగంగానే విద్యార్థుల్లో సామర్థ్యాలు ఎంతవరకు పెంపొందుతున్నాయి..ఏ సబ్జెక్టులో వెనుకబడుతున్నారు..ఎందుకు వెనుకబడుతున్నారు..? చదువుల్లో రాణించకపోవడానికి కారణాలు ఏమిటి..? అనే విషయాలను తెలుసుకునేందుకు నవంబర్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నేషనల్‌ అఛీవ్‌మెంట్‌ టెస్ట్‌ నిర్వహించనున్నారు. ఇందుకోసం విద్యార్థులను ఈ సర్వేకు సన్నద్ధం చేసే దిశలో ఇప్పటి నుంచే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సామర్థ్యాలను పెంచే విధంగా బోధన ఉండాలని నిర్ణయించిన ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ప్రారంభించింది. ఖైరతాబాద్‌ జోన్‌ పరిధి కిందికి వచ్చే 47 ప్రాథమిక, 17 ఉన్నత పాఠశాలల పరిధుల్లో 3, 6, 9 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు బుధవారం ఈ శిక్షణ ప్రారంభమైంది. నేషనల్‌ అఛీవ్‌మెంట్‌ సర్వే పేరిట నిర్వహించనున్న ఈ పరీక్షకు గాను రెండు విడతలుగా ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నారు. మొదటి విడతలో బుధవారం షేక్‌పేట మండల పరిధిలోని 40 మంది ఉపాధ్యాయులకు, బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ ప్రారంభమైంది. గురువారం మరో 40 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన విద్యార్థులు కాంప్లెక్స్‌ మండల్‌ లెవల్‌ ఓరియంటేషన్‌ శిక్షణలో భాగంగా మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నారు. ఈ శిక్షణ అనంతరం ఉపాధ్యాయులు సదరు విద్యార్థులకు ప్రత్యేక తరహాలో బోధన అందించి మరింత ఉన్నతంగా తీర్చిదిద్దనున్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధిస్తారు. వారిని మానసికంగా మరింత సన్నద్ధం చేసే దిశలో సామర్థ్యాల పెంపుకు దోహదపడతారు. ఖైరతాబాద్‌–1 మండల పరిధిలో ఎర్రమంజిల్‌ హైస్కూల్‌లో ఈ శిక్షణ జరుగుతుంది. అలాగే ఖైరతాబాద్‌–2 మండల పరిధి శిక్షణ కార్యక్రమం జవహర్‌నగర్‌ ప్రభు త్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. రోజువారీ చదువులే కాకుండా విద్యార్థులకు మరింత అవగాహన పెంపొందించే దిశలో ప్రత్యేక తరహా బోధనను ఇచ్చేందుకు కృషి చేస్తున్నారు.

వేడుకగా ఫలహారం బండి ఊరేగింపు



ఉదయ్‌నగర్‌లో కట్టమైసమ్మ గుడి వద్ద ఫలహారం బండి ఊరేగింపు నిర్వహిస్తున్న బస్తీ కమిటీ నేతలు



కళాకారుల విన్యాసాలు

బంజారాహిల్స్‌: బోనాల పండుగ అనంతరం నిర్వహించే తొట్టెలు, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాలు ఖైరతాబాద్‌ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగానే బుధవారం బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 11లోని ఉదయ్‌నగర్‌ కట్టమైసమ్మ గుడి వద్ద నిర్వహించిన అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం డప్పుచప్పుళ్ళు, పోతరాజుల విన్యాసాల నడుమ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని బస్తీ కమిటీ నేతలు వైభవంగా నిర్వహించారు. గత 12 సంవత్సరాలుగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి బాలరాజు తెలిపారు. ప్రత్యేకంగా విజయవాడ నుంచి వచ్చిన కళాకారులు నిర్వహించిన విన్యాసాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లోకరాజు, శేఖర్‌, రాముయాదవ్‌, శేఖర్‌ యాదవ్‌, బాబు, ముర్తుజా, పూల్‌ సింగ్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుల ఆందోళన

లక్డీకాపూల్‌: నిమ్స్‌ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లోని రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ బుధవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భగా యూనియన్‌ అధ్యక్షులు ఎం.వెంకటేష్‌ మాట్లాడుతూ నిమ్స్‌లో సెక్యూరిటీ సర్వీసు నిర్వహించడానికి రెండు సెక్యూరిటీ ఏజెన్సీలు ఉన్నాయని అన్నారు. ఒకే దగ్గర, ఒకే పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు వేర్వేరు వేతనాలు అందుతున్నాయన్నారు. సెక్యూరిటీ గార్డులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. జీతాలు సమయానికి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీంతో నిమ్స్‌ హాస్పిటల్‌ మెడికల్‌ సూపరింటెండెంట్‌ సత్యనారాయణ డైరెక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సిబ్బంది విధులు కొనసాగించారు.

మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడతాం



మాజీద్‌ రెహమాన్‌

లిబర్టీ: హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ జా యింట్‌ సెక్రటరీగా మాజీద్‌ రెహమాన్‌ నియామకమయ్యారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హ్యూమన్‌ రైట్స్‌ పరిరక్షణ కోసం పని చేస్తానని వెల్లడించారు. మానవ హక్కులను ఉల్లంఘిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలో మానవ హక్కులు ఉల్లంఘన జరిగితే కార్పొరేట్‌ వ్యవహారాల శాఖ చూస్తూ ఊరుకోదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు సమ్మేళనాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన తీసుకొస్తామని ఆయన తెలిపారు.

కనుల పండువగా ప్రమాణ స్వీకారోత్సవం



ఆత్మకూరు రామారావు స్కూల్‌లో విద్యార్థి నాయకుల బృందం

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌–45 లో ని భారతీయ విద్యాభవన్స్‌ ఆత్మకూరు రామారావు స్కూల్‌లో ప్రైమరీ విద్యార్థుల 16వ విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. ఆటాపాటలతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి డాక్టర్‌ బి.శృతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణపై విద్యార్థులు దృష్టిపెట్టాలన్నారు. సమాజాభివృద్ధిలో కూడా భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలసి ఆమె ఆవరణలో మొక్కలు నాటారు. స్కూల్‌ ప్రిన్సిపాల్‌ శ్రీలతానాయర్‌ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆయుర్వేద కళాశాలలో ఘనంగా బోనాలు



వెంగళరావునగర్‌: వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో బుధవారం ఘనంగా బోనాల వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ప్రాంగణంలోని వింధ్యా వాహినీ మాత, హాస్పిటల్‌ ఆవరణలో ఉన్న శ్రీకనక దుర్గా మాత అమ్మవార్ల వద్ద పూజలు చేశారు. ఆయుష్‌ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆయుర్వేద ప్రొఫెసర్లు, సిబ్బంది అమ్మవార్లకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత బోనాలు నెత్తిన పెట్టుకుని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయుష్‌ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ స్వరూప రాణి, అడిషనల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పరమేశ్వర్‌ నాయక్‌, ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రమాదేవి, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఉమా శ్రీనివాస్‌, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీష్‌, ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ ముజీబ్‌, హైదరాబాద్‌ జిల్లా కార్యదర్శి టి.ఎస్‌. చారి, కార్యదర్శి లక్ష్మణ్‌, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్‌, స్పోర్ట్స్‌ కార్యదర్శి శంకర్‌లతో పాటుగా కళాశాలకు చెందిన పలువురు సీనియర్‌ ప్రొఫెసర్లు, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు, పీజీ స్కాలర్స్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవెంట్‌ పరిశ్రమ ఎదుగుదలకు కృషి

టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు



సాక్షి, సిటీబ్యూరో: ఈవెంట్‌ పరిశ్రమ ఎదుగుదలకు శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలంగాణ ఛాంబర్‌ ఆఫ్‌ ఈవెంట్స్‌ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆళ్ల బలరాం బాబు తెలిపారు. తెలంగాణ ఛాంబర్‌ ఆఫ్‌ ఈవెంట్స్‌ నూతన ఎగ్జిక్యూటీవ్‌ కమిటీ కొలువుదీరిన సందర్భంగా నగరంలోని డాక్టర్‌ ఎంసీఆర్‌ హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో తెలంగాణ ఛాంబర్‌ ఆఫ్‌ ఈవెంట్స్‌ ఇండస్ట్రీ 6వ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలతో పరిశ్రమగా ఎదుగుదలను కొనసాగిద్దామన్నారు. తెలంగాణా ఛాంబర్‌ ఆఫ్‌ ఈవెంట్స్‌ అసోసియేషన్‌ పరిధిలో వివిధ సంఘాల ఎన్నికలు జరిగాయన్నారు. ఈ ఎన్నికలలో నెగ్గిన కార్యవర్గాలు రెండేళ్లపాటు కొనసాగుతాయని చెప్పారు. సమావేశంలో రిటైర్డ్‌ ఐఆర్‌ఎస్‌ అధికారి రోసిరెడ్డి మాట్లాడుతూ ఈవెంట్‌ ఇండస్ట్రీ భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ న్యాయవాది అశోక్‌ రామ్‌కుమార్‌, స్టార్టప్‌ ఎంట్రప్రెన్యూర్‌ విశాలరెడ్డి వుయ్యాల పాల్గొన్నారు.

కేన్సర్‌ చికిత్సలో కొత్త విధానం

సాక్షి, సిటీబ్యూరో: చికిత్సలో భాగంగా 'నిమోటుజుమాబ్‌' అనే థెరపీని జోడించడం ద్వారా తల మెడ కేన్సర్‌ రోగులకు జీవిత కాలం పెరుగుతుందని ముంబైలోని టాటా మెమోరియల్‌ హాస్పిటల్‌ నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. ఈ విషయాన్ని ఆసుపత్రి నగర ప్రతినిధులు తెలిపారు. చికిత్సలో రేడియోథెరపీతో పాటు ఈ 'నిమోటుజుమాబ్‌'ను భాగం చేయడం వలన తల, మెడ భాగాల్లోని కేన్సర్‌ రోగులకు 10 సంవత్సరాలకు పైగా జీవిత కాలం మెరుగుపడుతుందని, అంతేకాక జీవన నాణ్యత కూడా పెరుగుతుందని వివరించారు. దేశంలోని క్యాన్సర్‌ రోగుల్లో మూడింట ఒక వంతు తల, మెడ క్యాన్సర్‌లు ఉన్న నేపథ్యంలో మొత్తం 536 మంది రోగులపై నిర్వహించిన ఈ అధ్యయన ఫలితాలు రోగులకు ఆశాజనకంగా మారాయన్నారు.

సన్మానం



ఖైరతాబాద్‌: ఖైరతాబాద్‌ మహాభారత్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్‌ కుమార్తె మౌనికారెడ్డి పట్టుదలతో సీఏ పూర్తిచేసింది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి సీఏ పూర్తి చేసిన మౌనికారెడ్డిని బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్‌ విజయారెడ్డి ఘనంగా సన్మానించారు. సాధించాలని పట్టుదల ఉంటే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని విజయారెడ్డి తెలిపారు. తల్లిదండ్రులతోపాటు మౌనికను విజయారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిమ్మ బాబూరావు, కరాటే రమేష్‌, సత్యనారాయణ, పార్వతి, సలీం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అధికారుల పర్యటన



దేవరకొండ బస్తీలో పర్యటిస్తున్న విద్యుత్‌ శాఖ అధికారులు..

వెంకటేశ్వరకాలనీ: ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్‌ సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా విద్యుత్‌ శాఖ అధికారులు బుధవారం బస్తీ పర్యటన చేపట్టారు. టీఎస్‌ఎస్‌పీడీసీఎల్‌ బంజారాహిల్స్‌ ఎస్‌ఈ చంద్రశేఖర్‌, డీఈ నరేందర్‌రెడ్డి, ఏడీఈ హైమానంద, ఏఈ రమేష్‌ల ఆధ్వర్యంలో విద్యుత్‌ సిబ్బంది బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–5లోని దేవరకొండ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తొలగించి పక్కనే ఉన్న శ్మశాన వాటికలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించామని, జీహెచ్‌ఎంసీ డబ్బులు చెల్లించగానే షిఫ్టు చేయడం జరుగుతుందని అధికారులు హామీనిచ్చారు. అలాగే ఐదారు చోట్ల ఐరన్‌ కరెంటు స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయని, వాటిని మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. తప్పకుండా పాత స్తంభాలను మారుస్తామని, కొత్తవి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా విద్యుత్‌ శాఖ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం డివిజన్‌ పరిధిలో ఒక్కో బస్తీలో క్షేత్ర స్థాయి పర్యటన ఉంటుందని ఈ సందర్భంగా ఎస్‌ఈ (ఆపరేషన్స్‌) చంద్రశేఖర్‌ తెలిపారు. ఈ అవకాశాన్ని బస్తీవాసులు సద్వినియోగం చేసుకోవాలని, తమ ప్రాంతంలో కరెంటు సమస్యలను తమ ఇంటి వద్దకే వచ్చే అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

మితిమీరిన వేగంతో దూసుకెళ్తూ...

కారు బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు



బోల్తాపడ్డ కారు...

బంజారాహిల్స్‌: మద్యం మత్తులో కారును వేగంగా నడుపుతూ ప్రహరీ గోడను ఢీకొట్టగా కారు బోల్తా పడి ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. శంకర్‌పల్లికి చెందిన నక్కల సాకేత్‌రెడ్డి (20) ఇటీవలే బీసీఏ కోర్సు పూర్తి చేసి మూడు రోజుల్లో ఆస్ట్రేలియా వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే తన చిన్ననాటి స్నేహితుడు కొంపల్లికి చెందిన సాయిసిద్ధార్థ్‌తో కలసి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తన కారు (ఏపీ 09 సిక్యూ 3599)లో మాదాపూర్‌లోని సాండ్స్‌ అండ్‌ స్పిరిట్స్‌ పబ్‌కు వెళ్ళాడు. అర్ధరాత్రి ఒంటి గంటకు మద్యం మత్తులో ఇద్దరూ బయటకు రాగా సాకేత్‌రెడ్డి కారు నడుపుతూ జూబ్లీహిల్స్‌ చెక్‌పోస్టు నుంచి చిరంజీవి బ్లడ్‌ బ్యాంక్‌ మీదుగా వెళ్తూ వెంకటగిరి వైపు మితిమీరిన వేగంతో దూసుకెళ్లి ప్రహరీగోడను ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. దీంతో కారు నడుపుతున్న సాకేత్‌ రెడ్డికి, సాయిసిద్ధార్థ్‌కు గాయాలు కాగా వీరిని ఆస్పత్రిలో చేర్చారు. బుధవారం సాకేత్‌రెడ్డిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. సాకేత్‌ రెడ్డికి బ్రీత్‌ఎనలైజర్‌ టెస్ట్‌ నిర్వహించగా ఆల్కాహాల్‌ మోతాదు 130 బీఏసీగా నిర్ధారణ అయ్యింది. మద్యం మత్తులో వేగంగా కారును నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టానుసారంగా ఆటోలు పార్కింగ్‌ చేస్తే ఊరుకునేది లేదు

ఫిలింన గర్‌ సీఐ శ్రీనివాసులు



ఆటోడ్రైవర్లకు అవగాహన కలిగిస్తున్న ఫిలింనగర్‌ సీఐ ఎం.శ్రీనివాసులు

ఫిలింనగర్‌: ఇష్టానుసారంగా ఆటోలు రోడ్ల పక్కన పార్కింగ్‌ చేయడం వల్ల రాత్రిపూట వాటిల్లో కూర్చొని మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీని వల్ల ప్రశాంతతకు భంగం ఏర్పడుతుందని ఫిలింనగర్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎం.శ్రీనివాసులు అన్నారు. ఫిలింనగర్‌ 18 బస్తీలకు చెందిన ఆటో డ్రైవర్లకు ఆయన బుధవారం స్టేషన్‌ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఆటోలను తప్పనిసరిగా ఇళ్ల ముందే పార్కింగ్‌ చేసుకోవాలని, ఎక్కడంటే అక్కడ పార్కింగ్‌ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రతి ఆటో డ్రైవర్‌ యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్‌ లైసెన్స్‌, ఆర్‌సీ బుక్‌తో పాటు విధిగా ధ్రువపత్రాలన్నీ ఉండాలని, లేకపోతే వాటిని సీజ్‌ చేస్తామని, కఠిన చర్యలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రతి ఆటోకు నెంబర్‌ ప్లేట్‌ సక్రమంగా ఉండాలని, ఏమాత్రం తేడా ఉన్నా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని, అందరూ ఐకమత్యంగా ఉండి నిబంధనలు పాటించాలని సూచించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రజానాట్యమండలి ప్రతినిధులు

ఫిలింనగర్‌: మత్తు పదార్థాలకు అలవాటు అయితే ఎంతో విలువైన జీవితాలు నాశనం అవుతాయని, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సినీనటుడు డాక్టర్‌ మాదాల రవి అన్నారు. ప్రజా నాట్యమండలి హైదరాబాద్‌ నగర కమిటీ ఆధ్వర్యంలో ఫిలింనగర్‌ ప్రభుత్వ రౌండ్‌ టేబుల్‌ పాఠశాలలో డ్రగ్స్‌ వల్ల తలెత్తే అనర్థాలను వివరించే ఫొటో ఎగ్జిబిషన్‌ను మాదాల రవి ప్రారంభించారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌.మారన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాదాల రవి మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు బానిసలు అవుతున్నారని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే అంశమని అన్నారు. డ్రగ్స్‌ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌.రఘు, నాయుడు, భరత్‌, ఫిలింనగర్‌ ఎస్‌ఐ అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్కులు పచ్చదనంతో ఆహ్లాదాన్ని కలిగించాలి

వెంగళరావునగర్‌: పార్కులన్నీ పచ్చదనంతో సందర్శకులకు ఆహ్లాదాన్ని కలిగించాలని శేరిలింగంపల్లి జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి తెలియజేశారు. వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని యూసుఫ్‌గూడ కృష్ణకాంత్‌పార్క్‌, కళ్యాణ్‌నగర్‌ థీమ్‌పార్క్‌, ఆర్‌కె కాలనీ, బోరబండ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్థానికులు, వాకర్స్‌ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పార్కులో వాకర్స్‌ ట్రాక్‌ సరిగా లేదని, బాత్రూం వాసన వస్తుందని, బల్లలు విరిగిపోయాయని, నీటి సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలను విన్న జడ్‌సి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కులు ఏర్పాటు చేసింది ప్రజల ఆహ్లాదం కోసమని, తక్షణమే ఆయా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు పగడ్బందీగా చేపట్టి ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించాలని సూచించారు. వరదనీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆయన వెంట సర్కిల్‌–19 ఉప కమిషనర్‌ సేవా ఇస్లావత్‌, ఈఈ రాజ్‌కుమార్‌, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ ఆక్రమణల తొలగింపు

వెంగళరావునగర్‌: వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని మధురానగర్‌కాలనీలో ఉన్న ఫుట్‌పాత్‌ ఆక్రమణలను గత రెండు రోజులుగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. ముఖ్యంగా కాలనీలోని పలు ప్రాంతాల్లో నివాసితులు తమ జాగా కంటే అధికంగా ఆక్రమించి ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాకుండా ఆయా స్థలాలను అక్రమంగా వివిధ వ్యాపార సముదాయాలకు అనుమతి ఇస్తూ కిరాయి వసూలు చేసుకుంటున్నారు. ఈ వ్యాపార సముదాయాల వద్ద ప్రతిరోజు పెద్దసంఖ్యలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్‌ చేయడం వల్ల కార్లు, ఆటోలు, చివరకు ద్విచక్ర వాహనాలు కూడా వెళ్ళలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని జీహెచ్‌ఎంసీ విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విభాగం అధికారులు తమ సిబ్బందితో వచ్చి ఫుట్‌పాత్‌ ఆక్రమణలను తొలగించారు. కాగా కాలనీలో ఇంకా ఆక్రమణలు ఉన్నాయని, రోడ్డును ఆక్రమించి ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసుకున్నారని, లే అవుట్‌లను పరిశీలించి వాటిని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చిరంజీవి స్పందించడం హర్షనీయం

పంజగుట్ట: గద్దర్‌ అవార్డుల ప్రదానోత్సవాలకు సంబంధించి సినీ పరిశ్రమకు చెందిన పెద్దలు, మూవీ ఆర్టిస్ట్‌ అసోసియేషన్‌, నిర్మాతల మండలి చొరవ తీసుకోవాలని గద్దర్‌ కుమార్తె డాక్టర్‌ జి.వి.వెన్నెల గద్దర్‌ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గద్దర్‌ అవార్డుల ప్రదానం విషయంలో సినీరంగం స్పందించ లేదని, ఆ తరువాత ప్రముఖ సినీ నటుడు చిరంజీవి గద్దర్‌ నిరంతర శ్రామికుడని, ఆయన పేరుతో గద్దర్‌ అవార్డులు ఇవ్వడం ఎంతో సముచితమని గద్దర్‌ అవార్డులు తీసుకునేందుకు తాము సిద్ధమని, ఈ విషయంలో ఫిల్మ్‌ ఛాంబర్‌, నిర్మాతల మండలి చొరవ తీసుకోవాలంటూ స్పందించడం ఎంతో హర్షనీయమన్నారు. అదే తరహాలో నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కూడా గద్దర్‌ అవార్డులు స్వీకరిస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. గద్దర్‌ సినీ పరిశ్రమకు చెందిన రచయితల సంఘంలో, మూవీ ఆర్టిస్ట్‌ అసోసియేషన్‌లో సభ్యులని, 45 సంవత్సరాలుగా సినీ పరిశ్రమతో సంబంధం ఉందని, మన భూమి అనే చిత్రం ద్వారా నటుడిగా, గాయకునిగా చిత్రపరిశ్రమకు పరిచయమని ఆమె తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, గురువారం, 1, ఆగస్టు, 2024







195 దేశాలు చుట్టేసి..

నాంపల్లి: ప్రపంచంలోని అన్ని దేశాలను సందర్శించడమే అతడి లక్ష్యం.. ఆ దిశగా ఎంతో కష్టపడ్డారు. సుమారు 27 ఏళ్లు ఎంతో శ్రమకోర్చి అన్ని దేశాలను సందర్శించి అరుదైన ఘనత సాధించారు. ప్రస్తుతం 195 దేశాల సందర్శన పూర్తి చేసుకుని తెలుగుగడ్డపై బుధవారం అడుగుపెట్టారు. ఈ అరుదైన ఘనత సాధించిన వ్యక్తి మన తెలుగువాడు కావడం విశేషం. ప్రపంచాన్నే చుట్టేసిన 43 ఏళ్ల వయస్సు కలిగిన రవిప్రభు స్వస్థలం విశాఖపట్నం. ఆయన హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో చదువుకున్నాడు. పొలిటికల్ సైన్స్‌లో పట్టభద్రుడైన రవిప్రభు విద్యార్థి దశలోనే 1996లో అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. వివాహం చేసుకొని ఉద్యోగం చేసుకుంటూనే విదేశాలను సందర్శించడం ప్రారంభించారు. భూటాన్ దేశాన్ని సందర్శించడంతో ప్రారంభమైన ఆయన యాత్ర వెనుజులతో ముగిసింది. ప్రపంచంలోని దేశాలను సందర్శిస్తూనే 2020లో ఒక యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. మొత్తం సందర్శన విశేషాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తూ వచ్చారు. అన్ని దేశాలను చుట్టేసి వచ్చిన ఆయన రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 600 మందికి పైగా అంతరిక్షంలోకి వెళ్లారు. 6,600 మంది ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. ప్రపంచంలోని 850 కోట్ల మందిలో 280 మంది మాత్రమే ప్రతి దేశాన్ని సందర్శించారని అన్నారు. ఈ అరుదైన ఘనత సాధించిన 280 మందిలో తనకు స్థానం లభించడం సంతోషంగా ఉందని తెలిపారు. 27 ఏళ్లు కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నట్లు ఆయన వివరించారు. ఈ ప్రయాణాల కోసం రూ.25 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు.

27 ఏళ్లలో అరుదైన ఘనత సాధించిన రవిప్రభు

భూటాన్‌తో ప్రారంభించి వెనుజులాతో ముగించి..

సాహిత్యోత్సవ్.. జష్న్ ఎ అదాబ్ 3 నుంచి..

సాక్షి, సిటీబ్యూరో: హిందుస్తానీ కళ, సంప్రదాయం, సాహిత్యాన్ని మేళవించిన సాంస్కృతిక కార్యక్రమం 'సాహిత్యోత్సవ్ జష్న్ ఎ అదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్' తొలిసారిగా నగరంలో జరగనుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో ఆగస్టు 3న మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై 4వ తేదీ వరకూ కొనసాగుతుందని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హిందుస్థానీ కళాకారులు, ఉర్దూ, హిందీ కవులు, కవయిత్రులు హాజరుకానున్నారని, కవితాగోష్ఠులు, సాహిత్య సంగీత కళా ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ప్రవేశం ఉచితమని తెలియజేశారు.

దుస్తుల నుంచి ఆస్తుల దాకా అన్నీ ఆరోగ్యకరమైతేనే మాకు అది మహాభాగ్యం అంటోంది సిటీ. ఆహారంతో మొదలైన ఆర్గానిక్ ట్రెండ్ ఇంతింతై.. విస్తరిస్తూ ఇంటీరియర్ దాకా వచ్చేసింది. నగరంలో ఆర్గానిక్ ఆహారం కోసం ఏకంగా సొంతంగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన సెలబ్రిటీలు ఉన్నారు. అదేవిధంగా ఇప్పుడు ఇళ్లు, ఆఫీసులు, ఫార్మ్‌హౌస్‌లు, క్లబ్‌హౌస్‌లతో సహా ఇంటీరియర్ అంటే ఆర్గానిక్కే డియర్ అంటున్నారు.
- సాక్షి, సిటీబ్యూరో



ప్యార్ హువా..

ఆర్గానిక్ ఇంటీరియర్‌పై ఇంట్రెస్ట్

ఇంటీరియర్‌లో అత్యంత ప్రధానమైన సర్ఫేస్ డిజైనింగ్‌లో ఆర్గానిక్ ఉత్పత్తుల వాడకం బాగా పెరిగింది. సర్ఫేస్ డిజైనింగ్ అంటే ఉపరితల అలంకరణగా తెలుగులో పేర్కొనవచ్చు. ఫ్లోరింగ్, సీలింగ్ నుంచి సైడ్ వాల్స్ దాకా.. వాటి ఉపరితలాలపై వేసే పైపూత ఇంటీరియర్‌లో ప్రధానమైన అంశం. దీంతో ఇంట్లో అడుగుపెట్టగానే కనువిందు చేసేలా, కంటికి మాత్రమే కాదు ఆరోగ్యానికి సైతం ఇంపుగా ఉండేలా కోరుకుంటున్నారు 'లగ్జరీ అంటే ఎవరినో చూసి అనుసరించే ఫ్యాషన్ కాదు పర్సనలైజేషన్ అని చెప్పాలి. సిటిజనులు ఆర్గానిక్ మెటీరియల్/సస్టెయినబుల్ మెటీరియల్ కావాలని అడుగుతున్నారు' అంటూ చెప్పారు నగరంలో సర్ఫేస్ డిజైనింగ్‌కి చెందిన పేరొందిన బియాండ్ కలర్ నిర్వాహకులు కుమార్ వర్మ.

జీరో వివైసీ.. అదే క్రేజీ..

సర్ఫేస్ డిజైనింగ్ కోసం అవసరమైన మెటీరియల్స్ అయిన లైమ్ ప్లాస్టర్, టెర్రాకోట, టెర్రాజోజ్ వంటివన్నీ పూర్తిగా ఆర్గానిక్‌వే వాడుతున్నారు. అలాగే 70శాతం రీసైకిల్డ్ మెటీరియల్స్ వినియోగిస్తున్నారు. ఇక వినియోగించే రంగులు కూడా కెమికల్ కలర్స్ బదులుగా వృక్షాధారితమైన ప్లాంట్ బేస్డ్ కలర్స్ వాడుతున్నారు. ఇవి కూడా దాదాపు అన్నీ ఆక్సైడ్ కలర్స్ మాత్రమే అంటే పౌడర్స్ తప్ప లిక్విడ్ రూపంలో ఉండవు. ఈ తరహా మెటీరియల్‌ని జీరో వాలెంటైల్ ఆర్గానిక్ కాంపౌండ్‌గా పేర్కొంటున్నారు.

ఆధునికుల ఆరోగ్య స్పృహను సంతృప్తి పర్చేందుకు సర్ఫేస్ డిజైనర్స్.. ఆర్గానిక్ మెటీరియల్‌ను విదేశాల నుంచీ దిగుమతి చేసుకుంటున్నారు. వీటిలో అత్యధికంగా ఇటలీ నుంచి కొంత వరకూ స్పెయిన్, అమెరికా నుంచి కూడా దిగుమతి చేసుకుంటున్నారు. మన పూర్వీకులు ఇళ్ల నిర్మాణ శైలిలో ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు భావిస్తున్న నవతరం.. వాటినే తిరిగి కోరుకుంటోంది. శతాబ్దాల క్రితం ఎలాగైతే సున్నంతో కొన్ని రకాల మెటీరియల్ తయారు చేసేవారో అదే కాన్సెప్ట్‌తో చేస్తున్నారు. మెటీరియల్‌ని నీటిలో 18 నుంచి 20 నెలలు పాటు హైడ్రేట్ చేసి అందులోనుంచి వచ్చిన క్రీమ్‌ని సర్ఫేస్ డిజైనింగ్‌లో ఉపయోగిస్తున్నారు.

విదేశాల నుంచీ వచ్చేస్తున్నాయి..



ఎకో ఫ్రెండ్లీ.. అదే ట్రెండీ..





మన సిటీలోని టీ హబ్ సహా దేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో ప్రాజెక్ట్‌లకు పనిచేశాం. ఇప్పుడు విల్లాస్, ఫార్మ్‌హౌస్‌లు, సెలబ్రిటీల బిల్డింగ్ దేనికోసమైనా సరే.. సిటీలో ఎకో ఫ్రెండ్లీ ఇంట్రెస్ట్ బాగా పెరిగింది. దీని కోసం ఇంటీరియర్ డిజైనర్స్, ఆర్కిటెక్ట్స్‌తో కలిసి సర్ఫేస్ డిజైనింగ్ చేస్తున్నాం. మా దగ్గర 8 రకాల మెటీరియల్స్ ఉన్నాయి. 250 రకాల టెక్చర్స్ ఉన్నాయి. అత్యుత్తమ నేచురల్ క్వాలిటీ కోసం ఇటలీ నుంచి 80శాతం, స్పెయిన్, అమెరికా నుంచి 10శాతం చొప్పున మెటీరియల్స్ దిగుమతి చేసుకుంటున్నాం. ఇలా చేసేటప్పుడే భారతీయ వాతావరణానికి నప్పు తుందా లేదా.. అని పూర్తి స్థాయిలో స్కాన్ చేసి తెస్తాం.
- కుమార్ వర్మ, బియాండ్ కలర్, సర్ఫేస్ డిజైనింగ్ కంపెనీ





చిన్న పరిమాణంలో.. ప్రకృతి దృశ్యం

సృజనాత్మకతకు రూపం 'ఇకబెనా'

నగరంలో ప్రదర్శనకు స్పందన



సాక్షి, సిటీబ్యూరో: అద్భుతమైన ప్రకృతిని చిన్న ప్రదేశంలో చూపించే ఇకబెనా ఆర్ట్‌కు జపాన్‌లో మంచి ఆదరణ ఉంది. దీనికి నగరంలోనూ ఆదరణ పెరుగుతోంది. ది ఒహారా స్కూల్ ఆఫ్ ఇకబెనా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 35 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పార్క్ హోటల్‌లో ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విభిన్నమైన పూలు, ఆకులు ఇతర వస్తువులతో ఇకబెనా శైలిని ప్రదర్శించారు. ఇందులో అసోసియేట్ ప్రొఫెసర్ హోజుకి ఒయామాడ చేసిన పూల అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. భారత దేశంలోనూ ఇకబెనా కోర్సు ఆదరణ పొందుతోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జపాన్ గౌరవనీయమైన కాన్సుల్ జనరల్ తకాహషి మునియో దంపతులు, హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ రేఖారెడ్డి, ప్రెసిడెంట్ నిర్మలా అగర్వాల్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో ఇందుమతి దావ్లూర్, శారద, జ్యోత్స్న, నందరావు, శశికోలా, రేఖా బయాంకర్, మీనాక్షి సుజనని, కనకదుర్గ, నిరూప తదితరులు భాగమయ్యారు.



మేకింగ్ స్కిల్స్ బాగుంటాయి..



హైదరాబాద్‌లో ఇకబెనా ఎగ్జిబిషన్ ఎక్కడున్నా హాజరవుతా.. క్రియేటివిటీ, ఫ్లవర్ డెకరేషన్ వాటి నిర్వహన చాలా బాగుంటుంది. ఈ కోర్సు నేర్చుకోవాలంటే అధునాతన జీవన శైలిపై అవగాహన ఉండాలి. సొంతగా ఇల్లు, కంపెనీని అందంగా అలంకరించుకుంటాను. గార్డెన్‌ను సైతం మొక్కలు, రంగురంగుల పూలతో అందంగా తయారు చేసుకుంటాను.
- జీవీఎస్ రామారావు, పారిశ్రామికవేత్త, మల్లాపూర్.

అరుదైన కళ..



పెయింటింగ్, సింగింగ్, నృత్యం వంటి కళల్లాగే ఇకబెనా కూడా అరుదైన కళ. ఈ స్కూల్‌కు జపాన్‌లో మంచి గుర్తింపు ఉంది. మనం జపాన్ వెళ్లలేం.. కానీ ఆయా నిపుణులను నగరంలో కలుసుకోవడం మరిచిపోలేని అనుభూతి. పదేళ్ల నుంచి ఇందులో భాగమయ్యాను. ఈ ఆర్ట్‌లో ప్రావీణ్యం పొందాలంటే దీని లోతైన విశిష్టత అవగతమవ్వాలి. - చిలుకూరి అన్నపూర్ణ, హైదరాబాద్.

ఏకాగ్రతతోనే సాధ్యం..



ఇకబెనా వినూత్నమైన కోర్సు. ఒహారా స్కూల్ ఆఫ్ ఇకబెనా ఫ్లవర్ డెకరేషన్ చేసే వ్యక్తికి కలర్ కాంబినేషన్‌పై మంచి పట్టుండాలి. సరికొత్త ఆలోచనలతో సృజనాత్మకతను ప్రదర్శించగలగాలి. మేమంతా ఎంతో ఇష్టంతో చేస్తున్నాం. దీన్ని ప్రొఫెషన్‌గా తీసుకుని స్కూల్ నడిపిస్తున్న వారు ఇందులో ఉన్నారు.
- నీరజ గోదావర్తి, హైదరాబాద్



క్లైంబింగ్.. సాహసోపేతం

పర్వతారోహణకు పెరిగిన ఆదరణ, ఆసక్తి



ఎవరెస్ట్ ఎత్తు ఎంతో ఊహించడమే చాలా కష్టం.. అలాంటిది ఎవరెస్టు వంటి శిఖరాలను అధిరోహిస్తూ మనిషికి అసాధ్యమంటూ ఏమీ లేదని నిరూపిస్తుంటారు కొందరు పర్వతారోహకులు. ఈ పర్వతారోహణం అనేది గొప్ప ప్రయత్నంగా కీర్తించబడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతిని అందిస్తుంది. ఈ పర్వతారోహణలో భారతీయులు కూడా సత్తాచాటిన సందర్భాలు ఎన్నో.. హిమాలయాలు మొదలు వివిధ ఖండాల్లోని ఎత్తయిన పర్వతాలను అధిరోహించి భారత పతాకాన్ని సగర్వంగా నిలిపిన సందర్భాలు సైతం ఎన్నో ఉన్నాయి. అయితే ఈ పర్వతారోహణం అంత సులువు కాదు, విపత్కర పరిస్థితులకు క్లైంబింగ్ ప్రధానమైన ప్రయత్నమని పలువురు పర్వతారోహకులు చెబుతున్నారు. దీనికంటూ ప్రత్యేక శిక్షణ, అనుభవం అవసరమని హెచ్చరిస్తున్నారు. నేడు నేషనల్ మౌంటెన్ క్లైంబింగ్ డే నేపథ్యంలో పలు ఆసక్తికరమైన అంశాలు. - సాక్షి, సిటీబ్యూరో

ఇందుకు శారీరక, మానసిక శిక్షణ అవసరం

ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ అనర్థమే..

క్లైంబింగ్ డే నేపథ్యంలో..

అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుండటంతో పలువురు ఔత్సాహికులు క్లైంబింగ్ వైపు అడుగులు వేస్తున్నారు. దీనిని ఆసరా చేసుకుని పలు ప్రైవేటు సంస్థలు సైతం పర్వతారోహణకు సంబంధించి శిక్షణ అందిస్తున్నారు. కానీ క్లైంబింగ్ అనేది అత్యంత సాహసోపేతమైన ప్రయత్నమని, దీని కోసం జాతీయ స్థాయిలో అనుభవం ఉన్న కేంద్రాల్లోనే శిక్షణ పొందడం అవసరమని నిపుణులు, అనుభవజ్ఞులు సూచిస్తున్నారు. ఈ శిక్షణకు నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటేనిరింగ్ (ఉత్తర్ కాశీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటేనిరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్, అటల్‌బీహార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటేనిరింగ్ (హిమాచల్ ప్రదేశ్), హిమాలయన్ మౌంటేనిరింగ్ ఇన్‌స్టిట్యూట్ (డార్జిలింగ్) వంటి కేంద్రాలు ప్రధానమైనవని పర్వతారోహకులు వెల్లడిస్తున్నారు. ఈ శిఖరాలను చేరడం అంత సులువు కాదు, సరైన శిక్షణ లేకుండా ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరిస్తున్నారు. ట్రెక్కింగ్, క్లైంబింగ్ ఒకటి కాదు.. వీటి మధ్య ఎంతో వ్యత్యాసముందని నిపుణుల సూచన.



ప్రాణాలతో చెలగాటం..

పర్వతారోహణం అంటే ప్రకృతితో మమేకమైతూ.. అక్కడి విపత్కర పరిస్థితులకు మన దేహాన్ని అనువుగా మార్చుకుంటూ లక్ష్యాన్ని చేరడం. దీనికి అత్యంత కఠినమైన శిక్షణ అవసరం. నేను ఎన్‌సీసీ నుంచి క్లైంబింగ్‌కు ఎంపికై ఉత్తర కాశీలోని నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటేనింగ్‌లో శిక్షణ పొందాను. ఈ శిక్షణ వల్లే ప్రపంచంలోని ఎత్తయిన పర్వతాల్లో ఐదింటిని అధిరోహించాను. పర్వతారోహణం అంత సులువు కాదు.. ప్రాణాలతో చెలగాటం. ఎంతో మానసిక ధృఢత్వం అవసరం. 2019లో నేను క్లైంబింగ్ చేస్తున్న సమయంలో ఐదుగురితో ఉన్న బృందంలో ఇద్దరు చనిపోవడం చూశాను. ఏడాది ఆలస్యమైనా పర్వాలేదు.. కానీ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేంద్రాల్లోనే శిక్షణ తీసుకోవాలి. క్లైంబింగ్‌లో ఏ దిశలో, ఎంత కోణంలో, అనువైన ఫిట్‌నెస్‌తో ప్రయాణించాలి తదితర అంశాల్లో ప్రామాణికమైన శిక్షణ అవసరం. అంతేగాకుండా ఇదో ప్యాషన్‌గా మారి క్లైంబింగ్ కోసం వచ్చి హిమాలయాల వంటి ప్రదేశాలను ప్లాస్టిక్‌తో నింపేస్తున్నారు. అనవసర చెత్తతో ప్రకృతిని కాలుష్యం చేస్తున్నారు. విశిష్టమైన కేంద్రాల్లో ఆర్మీ అధికారులు వీటన్నింటిపైన బేసిక్, అడ్వాన్స్‌డ్, అడ్వెంచరస్ తదితర విభాగాల్లో శిక్షణ అందిస్తారు.
- అంగోత్ తుకారాం. (దక్షిణాది నుంచి మౌంట్ ఎవరెస్టు అధిరోహించిన మొదటి పిన్న వయస్కుడు.)



క్లుప్తంగా...

కవిత కస్టడీ పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంపై ఈడీ, సీబీఐ కేసుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగిస్తూ ట్రయల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో కస్టడీ ముగియడంతో కవితను బుధవారం వర్చువల్ ద్వారా జైలు నుంచి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరు పరిచారు. దర్యాప్తు కీలక దశలో ఉందని బెయిల్ ఇవ్వొద్దన్న దర్యాప్తు సంస్థల విజ్ఞప్తి మేరకు.. సీబీఐ కేసులో ఆగస్టు 9 వరకు, ఈడీ కేసులో ఆగస్టు 13 వరకూ కవిత కస్టడీని పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వికలాంగుల హక్కుల వేదిక ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: వికలాంగుల హక్కుల విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు కోరారు. బుధవారం కొల్లి నాగేశ్వరరావు బృందం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రితో సమావేశమైంది. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా కొనసాగుతున్న స్మిత సబర్వాల్ యావత్ వికలాంగులను కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేశారన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, రాష్ట్రంలో వికలాంగుల హక్కుల చట్టం అమలు చేస్తున్న విభాగం కూడా కనీసం దీనిపై స్పందించడం లేదని నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. తమ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

గురుకులాల్లో గెస్ట్ టీచర్లను కొనసాగించాలి

- ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న గెస్ట్ టీచర్ల తొలగింపును వెంటనే నిలిపివేసి వారిని విధుల్లో కొనసాగించాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) జాతీయ కమిటీ డిమాండ్ చేసింది. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న గెస్ట్ టీచర్లను నూతన నియామకాల పేరిట తొలగించడం దారుణమని, వారిని తొలగించడంతో రాష్ట్ర వ్యాప్తంగా 3,700 కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఏర్పడుతుందని ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల సొసైటీలు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

లైంగిక వేధింపులపై కఠిన చర్యకు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులపై లైంగిక వేధింపుల నివారణకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హైదరాబాద్ మలక్‌పేట అంధుల హాస్టల్ బాలికపై స్కావెంజర్ అత్యాచారానికి పాల్పడ్డాడని, నగరంలోని ఒక ఇంటర్నేషనల్ స్కూల్‌లో చిన్నారితో డాన్స్ మాస్టర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన సభ్యసమాజానికి సిగ్గు చేటని పేర్కొన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలను ఉక్కుపాదంతో అరికట్టాలని ఆమె కోరారు.

రన్నింగ్ బస్సులో రేప్ ఘటన.. ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్




వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ బాలస్వామి. వెనకాల నిందితులు

లాలాపేట: రన్నింగ్ బస్సులో వివాహితపై అత్యాచారం కేసులో నిందితుడైన డ్రైవర్‌తో పాటు అతన్ని ప్రోత్సహించిన మరో డ్రైవర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బుధవారం ఓయూలోని ఏసీపీ కార్యాలయంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి విలేకరుల సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. నెల్లూరువాసి ఈర్ల కృష్ణబాబు (31), ప్రకాశం జిల్లా కు చెందిన రామగిరి సిద్ధయ్య హరికృష్ణ ట్రావెల్స్‌లో డ్రైవర్లుగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 29న సాయంత్రం నిర్మల్ నుంచి ప్రకాశం జిల్లాకు బయలుదేరిన స్లీపర్ బస్సులో తొమ్మిదేళ్ల కుమార్తెతో కలిసి ప్రయాణిస్తున్న ఓ వివాహితపై కన్నేసిన డ్రైవర్ కృష్ణబాబు ఆమెను ఖాళీగా ఉన్న వెనక సీట్లోకి వెళ్లాల్సిందిగా సూచించినట్లు పేర్కొన్నారు. ఆమె చివరి సీట్లోకి వెళ్లి నిద్రించాక అర్ధరాత్రి వేళ బస్సు సికింద్రాబాద్ మీదుగా ప్రయాణిస్తుండగా ఆమె ముఖాన్ని దుప్పటితో అదిమిపెట్టి అత్యాచారానికి పాల్పడినట్లు వివరించారు. చివరకు బాధితురాలి కేకలతో నిందితుడు పరారవగా తోటి ప్రయాణికులు డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో ఓయూ పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారని డీసీపీ చెప్పారు. బాధితురాలిని గాంధీ ఆస్పత్రికి తరలించామన్నారు. చివరకు యాచారం వద్ద కృష్ణబాబును అరెస్టు చేయడంతో పాటు ఈ వ్యవహారంలో నిందితుడికి సహకరించినందుకు సిద్ధయ్యను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

కంప్యూటర్ కోర్సులే కిక్

రెండో విడతలోనూ ఇదే ట్రెండ్

- 98.12 శాతం కంప్యూటర్ సీట్ల భర్తీ
- సివిల్, మెకానికల్, ఈఈఈలో భారీగా మిగులు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్‌లోనూ కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లోనే ఎక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ బ్రాంచీల్లో పెద్ద ఎత్తున సీట్లు మిగిలిపోయాయి. కంప్యూటర్ బ్రాంచీల్లో 98.12 శాతం సీట్లు కేటాయిస్తే.. సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీలపై మెజారిటీ విద్యార్థులు ఆసక్తి చూపలేదు. మొత్తంగా మిగిలిపోయిన సీట్లలో ఎక్కువ భాగం ఈ బ్రాంచీల్లోనే ఉన్నాయి. విద్యార్థులు ఎక్కువమంది టాప్ కాలేజీలకే మొదటి ప్రాధాన్యమిచ్చారు. దీంతో సాధారణ కాలేజీల్లో 388 కంప్యూటర్ సీట్లు మిగిలిపోయాయి. రెండోదశ కౌన్సెలింగ్‌లో భాగంగా సాంకేతిక విద్య విభాగం బుధవారం ఇంజనీరింగ్ సీట్లను కేటాయించింది. ఇప్పటివరకూ 98,435 మంది దరఖాస్తు చేయగా, వీరిలో 70,129 మంది ఆప్షన్లు ఇచ్చారు. కన్వీనర్ కోటా కింద 86,509 సీట్లు ఉండగా, వీటిలో 81,490 సీట్లు కేటాయించారు. దీంతో రెండో విడత కేటాయింపు ముగిసిన తర్వాత 5,019 సీట్లు మిగిలాయి. 87 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. రెండు దశల్లో కన్వీనర్ కోటా కింద భర్తీ అయిన సీట్లలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ, ఇతర కంప్యూటర్ బ్రాంచీల్లోనే 60,173 సీట్లను భర్తీ చేశారు. ఈ కోర్సుల్లో 1156 సీట్లు మిగిలిపోయాయి. మిగతా బ్రాంచీల్లో 21,317 సీట్లు ఉండగా, ఇందులో 3863 సీట్లు మిగిలిపోయాయి. సీఎస్ఈ తర్వాత ఈసీఈలో సీట్లు భర్తీ అయ్యాయి. ఈ బ్రాంచీలో 11,436 సీట్లు ఉంటే, 557 సీట్లు మాత్రమే మిగిలిపోయాయి. మొత్తంగా కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లో 1156 సీట్లు మిగిలిపోతే, సివిల్, మెకానికల్, ఈసీఈ, ఈఈఈ బ్రాంచీల్లో 3445 సీట్లు మిగిలిపోయాయి. ఇదే విధంగా ఇతర బ్రాంచీలు (కంప్యూటర్ బ్రాంచీలు కానివి) కలుపుకొంటే మొత్తం 3863 సీట్లు భర్తీ అవ్వలేదు.

రేపటిలోగా రిపోర్ట్ చేయాలి:

ఈ దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన, బ్రాంచీలు మారిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఆగస్టు 2లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని అధికారులు సూచించారు. లేని పక్షంలో కేటాయించిన సీటు రద్దవుతుందని తెలిపారు. అయితే, తుది దశ కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాతే కేటాయించిన కాలేజీలో అవసరమైన సర్టిఫికెట్లతో రిపోర్టు చేయాలని విద్యార్థులకు అధికారులు సూచించారు. ఆఖరి దశ కౌన్సెలింగ్ ఆగస్టు 16, 17 తేదీల్లో ఉంటుందన్నారు.

కాంగ్రెస్ అలర్ట్!

- గద్వాల ఎమ్మెల్యే వ్యవహారంతో అప్రమత్తం
- మాజీ స్పీకర్ పోచారం ఇంట్లో వేడుకకు హాజరైన సీఎం, ఇతర నేతలు
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో రేవంత్ భేటీ

సాక్షి, హైదరాబాద్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వ్యవహారం నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఇంకెవరూ ప్లేట్ ఫిరాయించకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. అందులో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ములాఖత్ అయ్యారు. హైదరాబాద్‌లో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇంట్లో జరిగిన ఆయన మనవడి పుట్టినరోజు వేడుక ఇందుకు వేదిక అయ్యింది. ఈ ఫంక్షన్‌కు రేవంత్‌రెడ్డితో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, కడియం శ్రీహరి, కాలే యాదయ్య, డాక్టర్ సంజయ్, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్, ఎమ్మెల్సీలు భానుప్రసాద్ బసవరాజు సారయ్య, దండె విఠల్, బొగ్గారపు దయానంద్, యెగ్గే మల్లేశం, ఎంఎస్ ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి పార్టీ మారిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు చేయడంతో పాటు, వారి రాజకీయ భవిష్యత్తుపై హామీ ఇచ్చినట్టు సమాచారం. కాగా పలువురు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

బీర్లు, ఉల్లిగడ్డలకు ఎగబడిన జనం

- విజయవాడ–హైదరాబాద్ హైవేపై ప్రమాదం
- ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన మరో లారీ
- ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతి
- రోడ్డుపై పడిపోయిన లారీల్లోని బీరు కార్టన్లు, ఉల్లిగడ్డ బస్తాలు


ఘటనా స్థలంలో బీరు కార్టన్లు, ఉల్లిగడ్డలు

చౌటుప్పల్: బీరు కార్టన్ల లోడుతో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఉల్లిగడ్డల లోడుతో వస్తున్న లారీ ఢీకొట్టింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి బీరు కార్టన్ల లోడుతో ఖమ్మంకు వెళ్తున్న లారీని.. మహారాష్ట్ర నుంచి ఉల్లిగడ్డ బస్తాల లోడుతో ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్న లారీ లక్కారం శివారులో తంగేడువనం పార్కు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉల్లిగడ్డల లోడు లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. మహారాష్ట్రలోని తుల్జాపూర్ తాలూకా నంద్‌గామ్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ అజయ్ అశోక్ బన్సోడే (23) క్యాబిన్‌లోనే ఇరుక్కుని మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని హైవేపై అడ్డంగా పడిపోయిన లారీలను పక్కకు తప్పించారు. క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఇదే సమయంలో రోడ్డుపై పడిపోయిన ఆయా లారీల్లోని సరుకును తీసుకెళ్లేందుకు జనం ఎగబడ్డారు. ప్రజలు బీరు కార్టన్లు, ఉల్లిగడ్డలను తీసుకెళ్లేందుకు ఎగబడ్డారు. అప్పటికే అక్కడికి పెద్ద సంఖ్యలో పోలీసులు చేరుకోవడంతో వారిని అడ్డుకున్నారు. అయినా కొందరు వ్యక్తులు పోలీసుల కళ్లుగప్పి బీర్లు, ఉల్లిగడ్డలను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

నిలిచిపోయిన వాహనాలు

ఈ ప్రమాదం కారణంగా వాహనాలు నిలిచిపోవడంతో విజయవాడ మార్గంలో సుమారు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు క్రేన్, జేసీబీల సాయంతో రోడ్డుకు అడ్డంగా పడిన లారీలను పక్కకు తప్పించారు. అనంతరం వాహనాలు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో కానిస్టేబుల్ అభ్యర్థుల ఆందోళన


దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ వద్ద ఆందోళన చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

చైతన్యపురి (హైదరాబాద్): కానిస్టేబుల్ అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని బుధవారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ వద్ద ఆందోళనకు దిగారు. వందలాది మంది అభ్యర్థులు ప్లకార్డులు పట్టుకుని రోడ్డుపై బైఠాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమను పట్టించుకోవటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసుల కాళ్లపై పడ్డారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెచ్చిన జీవో 46 వల్ల గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని, జీవో నంబర్ 46 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టులో కేసు వేస్తే ఏజీ హాజరు కాకపోవటం వల్ల ఇప్పటికి 24 సార్లు వాయిదా పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ జీవోపై ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తమకు హామీ ఇచ్చారని చెప్పారు. ఆగస్టు 7న కోర్టుకు ఏజీ హాజరై తమకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చొరవ చూపాలని కోరారు.

8 మంది జిల్లా రిజిస్ట్రార్ల బదిలీ

136 మంది సబ్‌రిజిస్ట్రార్‌లకు స్థానచలనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎనిమిది మంది జిల్లా రిజిస్ట్రార్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సాధారణ బదిలీల గడువు చివరి రోజు బుధవారం ఈ బదిలీలు జరిగాయి. వీరితో పాటు రాష్ట్రంలోని 136 మంది గ్రేడ్–1, గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్‌లకు కూడా స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

‘హామీ’ ఇవ్వలేం!

వాటిని అటకెక్కించడమే లక్ష్యంగా ఏపీలో చంద్రబాబు సర్కారు అడుగులు

గవర్నర్ ఆమోదంతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ జారీ



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలను అటకెక్కించడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ జారీ చేసింది. గత ప్రభుత్వాలకు భిన్నంగా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టకుండా అసెంబ్లీ సమావేశాలను మంగళవారం ప్రొరోగ్ చేసి బుధవారం ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చింది. ఆగస్టు 1వ తేదీ నుంచి నవంబర్ 30వ తేదీ వరకు నాలుగు నెలల కాలానికి రాష్ట్ర సంచిత నిధి నుంచి రూ.1,29 లక్షల కోట్ల వ్యయానికి అనుమతిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలిపారు. దీంతో న్యాయ శాఖ కార్యదర్శి సునీత ఆర్డినెన్స్ జారీ చేశారు. ప్రభుత్వం ఇటీవలే అధికారంలోకి వచ్చినందున, ఆర్థిక శాఖ ఇతర శాఖలతో సమన్వయపరుచుకుంటూ అప్పులు, ఆర్థిక వనరులను ఖరారు చేస్తున్న నేపథ్యంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టలేమని అందులో పేర్కొంది. అసెంబ్లీ సమావేశాలు జూలై 26వ తేదీ వరకు నిర్వహించినప్పటికీ పూర్తి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టకుండా శ్వేత పత్రాల పేరుతో గత ప్రభుత్వంపై నిందలు వేయడానికే చంద్రబాబు ప్రభుత్వం పరిమితమైంది. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే వాస్తవ అప్పులను బడ్జెట్ డాక్యుమెంట్‌లో స్పష్టం చేయాల్సి ఉంటుంది. అప్పుడు అప్పులపై చంద్రబాబు అండ్ కో ఎన్నికల ముందు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తేలిపోతుంది. దీంతో పాటు సూపర్ సిక్స్ హామీలకు పూర్తి స్థాయి బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేయాల్సి వస్తుంది. ఈ రెండు అంశాల నుంచి తప్పించుకోవడానికే ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయ వనరులు, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులు స్పష్టంగా ఉన్నప్పటికీ పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టక పోవడానికి కేవలం హామీలను ఎగరకొట్టేందుకేనని స్పష్టం అవుతోంది. గతంలో ఎప్పుడూ ఒకే ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టిన దాఖలాల్లేవు. రాష్ట్రంలో కోవిడ్ లాంటి అసాధారణ పరిస్థితులు లేనప్పటికీ, ఆర్డినెన్స్ జారీ చేయడం విడ్డూరంగా ఉందని.. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే నాలుగు నెలల వ్యయానికి సభ ఆమోదం పొందే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

డాక్యుమెంట్లు ఇవ్వడానికి మీకేం ఇబ్బంది?

- ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులను ప్రశ్నించిన నాంపల్లి కోర్టు
- నిందితులకు 14 వరకు కస్టడీ పొడిగింపు

సిటీ కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను పోలీసులు ఉద్దేశపూర్వకంగానే తమకు ఇవ్వకుండా కేసును రోజురోజుకూ పొడిగిస్తున్నారని నిందితుల తరపు న్యాయవాది ఉమా మహేశ్వర్‌రావు కోర్టులో వాదించారు. దీంతో నిందితుల తరపు న్యాయవాదులకు పూర్తి డాక్యుమెంట్లను ఇవ్వడానికి మీకేంటి ఇబ్బంది? అని నాంపల్లి కోర్టు 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసులను ప్రశ్నించారు. పూర్తి డాక్యుమెంట్లను వారికి ఇప్పుడే ఇవ్వాలని ఆదేశించగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంటనే సంబంధిత పత్రాలను నిందితుల తరపు న్యాయవాదులకు అందజేశారు. బుధవారం ఈ కేసు విచారణ సందర్భంగా నిందితులైన మాజీ పోలీస్ అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును చెంచల్‌గూడ జైలు నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరుపర్చారు. అయితే ప్రధాన నిందితులైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌కుమార్ రావుపై జారీచేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) ఇంకా ఎందుకు పెండింగ్‌లో ఉందని మేజిస్ట్రేట్ ప్రశ్నించారు. దీనికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమాధానం ఇస్తూ.. వారిద్దరూ ఇప్పటికీ విదేశాల్లో ఉన్నారని, భారత్‌కు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దీనికి సంబంధించి రెడ్ కార్నర్ నోటీసు జారీ కోసం నేషనల్ సెంట్రల్ బ్యూరోతోపాటు సీబీఐకి గత వారం ప్రతిపాదనలు పంపామన్నారు. దీంతో వీలైనంత త్వరగా వారిద్దరిని అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరుపర్చాలని మేజిస్ట్రేట్ పోలీసులను ఆదేశించారు. రిమాండ్‌లో ఉన్న నలుగురికి ఆగస్టు 14 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగిస్తూ, తదుపరి విచారణను ఆగస్టు 14కు వాయిదా వేశారు.

మాజీ డీహెచ్ గడల శ్రీనివాసరావు మహబూబాబాద్‌కు బదిలీ

- పలు జిల్లాలకు డీఎంహెచ్‌వోల నియామకం



సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ప్రజారోగ్య విభాగంలో జాయింట్ డైరెక్టర్ హోదాలో ఉన్న ఆయనను ప్రభుత్వం మహబూబాబాద్ అడిషినల్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా నియమించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆయనతోపాటు మరో ముగ్గురు అధికారులు కూడా బదిలీ అయ్యారు. డాక్టర్ సీహెచ్ ధన్‌రాజ్ (ఏడీపీహెచ్‌వో) జనగామ నుంచి సిద్దిపేటకు, డాక్టర్ మనోహర్ సిద్దిపేట నుంచి యాదాద్రి భువనగిరి, డాక్టర్ మల్లికార్జునరావు నిర్మల్ నుంచి జనగామకు బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా, గడల శ్రీనివాసరావు ప్రస్తుతం దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఆయన ఇప్పటికే రెండుసార్లు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేనట్లు సమాచారం. దీంతో ఆయన తిరిగి ఉద్యోగంలో చేరతారా లేదా అన్న చర్చ కూడా వైద్య ఆరోగ్యశాఖలో జరుగుతుంది. ఒకప్పుడు డీఎంహెచ్‌వోలను నియమించిన గడల ఒక జిల్లాకు డీఎంహెచ్‌వోగా వెళ్లాల్సి రావడం గమనార్హం.

‘మహేశ్ కో–ఆపరేటివ్ బ్యాంక్’ కేసులో ఈడీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: ఏపీ మహేశ్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మనీల్యాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ముమ్మరం చేసింది. బ్యాంక్ చైర్మన్, ఎండీ, డైరెక్టర్ల ఇళ్లలో బుధవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. బంజారాహిల్స్‌లోని బ్యాంక్ హెడ్ క్వార్టర్స్ సహా చైర్మన్ రమేశ్‌కుమార్ బగ్, ఎండీ ఉమేష్‌చంద్ అస్వా, వైస్ చైర్మన్ పురుషోత్తం మందన, సోలిపురం వెంకట్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు డైరెక్టర్ల ఇళ్లు, ఆఫీసులు సహా మొత్తం 10 ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో నగదు, కీలక డాక్యుమెంట్లను సీజ్ చేశారు. పలు బ్యాంక్ లాకర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలను గురువారం వెల్లడించే అవకాశాలున్నాయి. నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంక్ షేర్ హోల్డర్లకు చెందిన డిపాజిట్లలో రూ.300 కోట్లకు పైగా అనర్హులకు రుణాలు మంజూరు చేయడం, బ్యాంకు నుంచి రూ.18.30 కోట్లు దారి మళ్లించారనే ఆరోపణలతో గతంలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బ్యాంక్ షేర్ హోల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్యామ్‌సుందర్ బియాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీస్ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేశారు. మనీల్యాండరింగ్, హవాలా లావాదేవీల వివరాలు సేకరించారు.

రేపు సచివాలయం ముందు సర్పంచుల నిరసన దీక్ష

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరుతూ తెలంగాణ సర్పంచుల సంఘం, జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయం ముందు ఈనెల 2న నిరసన దీక్ష చేయనున్నట్లు కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మి నరసింహారెడ్డి తెలిపారు. 2019–2024 మధ్య కాలంలో సర్పంచులుగా కొనసాగి రాష్ట్రంలోని పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వాటికి చెల్లించాల్సిన బిల్లులు బకాయిలు ఉన్నాయని, ఆ బిల్లులను చెల్లించాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం వహిస్తున్న ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఉదయం 10 గంటలకు సచివాలయం ముందు గాంధేయ మార్గంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీఎంపై తప్పుడు పోస్ట్.. కేసు నమోదు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూలై 29న అర్ధరాత్రి వరకు జరిగిన అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరయ్యారంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్‌పై నగర సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే మన్నె క్రిషాంక్‌పై ఆరు కేసులు నమోదు కాగా.. తాజా కేసుతో ఏడింటికి పెరిగాయి. సీఎం రేవంత్ రెడ్డిపై ట్విట్టర్ వేదికగా అవమానకరమైన పోస్టులు పెట్టినట్లు కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రిషాంక్‌పై సైబర్ క్రైమ్ పోలీసులు ఐటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల నాయకురాలు మాధవి కన్నుమూత

- అనారోగ్యంతో కన్నుమూసిన హక్కుల ఉద్యమనేత బాలగోపాల్ సోదరి
- బన్సీలాల్‌పేటలో అంత్యక్రియలు.. ప్రముఖుల నివాళి


డాక్టర్ పుట్రేవ్ మాధవి (ఫైల్)

చిక్కడపల్లి: మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకురాలు, విశ్రాంత అధ్యాపకురాలు డాక్టర్ పుట్రేవ్ మాధవి (70) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో మరణించారు. ఆమెకు భర్త, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ పి.శేషగిరిరావు, కుమార్తె శ్రీపాద, అమెరికాలో స్థిరపడిన కుమారుడు ఆదిత్య ఉన్నారు. ప్రముఖ మానవ హక్కుల వేదిక ఉద్యమనేత డాక్టర్ బాలగోపాల్, ప్రొఫెసర్ మృణాళినిల సోదరే మాధవి. పీవోడబ్ల్యూ తొలితరం నాయకుల్లో ఆమె ఒకరిగా ఉన్నారు. బీడీ కార్మికులు, మానవహక్కులు, మహిళల హక్కుల కోసం పోరాడారు. మానవ హక్కుల సంఘంలో నాయకురాలుగా పనిచేశారు. అనేక ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు.

ముగిసిన అంత్యక్రియలు

చిక్కడపల్లిలోని వివేక్‌నగర్‌లో ఉన్న మాధవి నివాసానికి బుధవారం భౌతికాయాన్ని తరలించగా పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వారిలో టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ రమా మేల్కొటే, ప్రొఫెసర్ మృణాళిని, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ కుమార్, పీవోడబ్ల్యూ వి.సంధ్య, వసంతలక్ష్మి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ, నేతలు అరుణ, హన్మేష్, ప్రదీప్, ఎస్ఎం కృష్ణ, కుప్పిలి పద్మ, ఝాన్సీ, అనసూయ, సామాజిక కార్యకర్త సజయ, అంబికా, కవి ఇంద్రవెల్లి రమేష్, ఆదివాసీ, ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా పోటీచేసిన ఆత్రం సుగుణ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బన్సీలాల్‌పేటలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

● వైట్ హౌస్

ఆ రుచికి రిటైర్‌మెంట్

న్యూస్‌మేకర్


క్రిస్ కమర్‌ఫోర్డ్

'విందు భోజనం అంటే సరైన సమయంలో సరైన పదార్థం అందించడమే' అంటుంది క్రిస్ కమర్‌ఫోర్డ్. అన్య జాతులకు ప్రవేశం లేని అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసం వైట్‌హౌస్ వంటశాలలో ప్రవేశం సాధించిన మొదటి మహిళ ఆమె. తొలి శ్వేత జాతీయేతర మహిళ కూడా! 30 ఏళ్లు వైట్‌హౌస్‌లో పని చేశాక తన 61వ ఏట జూలై 31న ఆమె రిటైర్ అయ్యారు. ఎందరో దేశాధినేతలకు తన చేతి వంట తిని పించిన క్రిస్ కమర్‌ఫోర్డ్ పరిచయం.

'అమెరికాకు అనేక మంది రాయబారులు ఉంటారు. కాని క్రిస్ కమర్‌ఫోర్డ్ షెఫ్‌గా ఉండక శాకపాకాల రాయబారి వలే అలాంటి పనే చేశారు. అమెరికా రుచులను ప్రపంచనేతలకు పంచి ఎలా ఉత్సవభరితం చేయవచ్చో చూపించారు' అని క్రిస్ కమర్‌ఫోర్డ్ రిటైర్‌మెంట్ సందర్భంగా ఆమె సమకాలిక షెఫ్ ఒకరు వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు జో బైడన్ సతీమణి జిల్ బైడన్ 'క్రిస్ కమర్‌ఫోర్డ్ తన టీమ్‌తో కలిసి ప్రేమ, ఆప్యాయతలతో కూడిన రుచులతో మా ఆత్మలను నింపారు' అని వీడ్కోలు సందేశంలో పేర్కొంది. క్రిస్ కమర్‌ఫోర్డ్ విజయగాథ...

ఫిలిప్పైన్స్ నుంచి

క్రిస్ కమర్‌ఫోర్డ్‌ది ఫిలిప్పైన్స్. మనీలాలో బాల్యం గడిచింది. గ్రాడ్యుయేషన్ అయ్యాక ఫుడ్ టెక్నాలజీలో పి.జి. చేయాలనుకుంది. 'నాకు సైన్స్ ఇష్టం. ఫుడ్ టెక్నాలజీలో పరిశోధన చేయాలనుకున్నాను. కాని మా నాన్న నువ్వు కలనరీ ఇన్‌స్టిట్యూట్‌లో చదివితే ఇంకా రాణిస్తావు అన్నాడు. నేను మా నాన్న సలహాను పాటించడం వల్లే పాకశాస్త్రం తెలుసుకొని వైట్‌హౌస్ దాకా వచ్చాను. కాబట్టి పెద్దల మాట వినండి' అంటుంది క్రిస్ కమర్‌ఫోర్డ్.


మిషెల్లీ ఒబామాతో క్రిస్ కమర్‌ఫోర్డ్

తన 23వ ఏట అమెరికా వలస వచ్చిన క్రిస్ మొదట షికాగో, తర్వాత న్యూయార్క్ రెస్టరెంట్లలో పని చేసింది. వైట్‌హౌస్‌లో వంటశాలలో మహిళలను తీసుకోకపోయినా, శ్వేతజాతీయేతర మహిళలను తీసుకునే అవకాశం అసలు లేకపోయినా 1995లో నాటి ఎగ్జిక్యూటివ్ షెఫ్ వాల్టర్ స్టాబ్లీ ఆమెను అసిస్టెంట్ షెఫ్‌గా తీసుకున్నాడు.

మన్‌మోహన్ సింగ్‌తో ప్రమోషన్

నాటి ప్రధాని మన్‌మోహన్ సింగ్ 2005లో అమెరికా సందర్శించినప్పుడు వైట్ హౌస్‌లో భారీ విందు జరిగింది. దానికి కావలసిన వంటా వార్పు అంతా క్రిస్ చూసింది. విందుకు హాజరైన వారంతా ఆహా ఓహో అన్నారు. క్రిస్ ప్రతిభ గమనించిన జార్జ్‌బుష్ సతీమణి లారా బుష్ ఆమెకు ఎగ్జిక్యూటివ్ షెఫ్‌గా ప్రమోషన్ ఇచ్చారు. ఎగ్జిక్యూటివ్ షెఫ్ వైట్‌హౌస్‌లోని సకల వంటా వార్పులకు సర్వోన్నత అధికారి. ఆమె పర్యవేక్షణలోనే దేశాధినేతలు వచ్చినప్పుడు వైట్‌హౌస్‌లో ఇచ్చే గౌరవ విందు, హాలిడే ఫంక్షన్లు, రిసెప్షన్లు, అధికారిక విందులు జరుగుతాయి.

వంట ఒక సవాలు

వైట్ హౌస్‌లో వంట ఒక సవాలు. జపాన్ దేశాధినేత వచ్చినప్పుడు ఒక మెనూ, కెన్యా అధ్యక్షుడు వచ్చినప్పుడు ఒక మెనూ, భారత ప్రధాని వచ్చినప్పుడు మరో మెనూ తయారు చేయాలి. ఒకోసారి ఆయా దేశాలకు చెందిన వంటవాళ్లను రప్పించి వారితో కలిసి వండాలి. 'ప్రతి విందుకు నాలుగు రోజుల ముందు నుంచే సిద్ధమవుతాం. సలాడ్‌లు తాజాగా ఉండేందుకు ఆ రోజున వైట్‌హౌస్‌లోని తోట నుంచి ఆకులు, దుంపలు సేకరిస్తాం. పండిన కూరగాయలు వృథా చేయడం నాకు ఇష్టం ఉండదు. వైట్ హౌస్‌లో ఉపయోగానికి రాకపోతే అవసరమైనవారికి పంపించేస్తాను' అంది క్రిస్.

ఆహారమే ఆరోగ్యం

'దేశ భవిష్యత్తు నిర్మించడమంటే నేటి బాలలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే' అంటుంది క్రిస్. 'పాకశాస్త్రం తెలిసిన వారు ఏది ఉత్తమమైన ఆహారమో ఏది పౌష్టికతతో నిండినదో తర్వాతి తరాలకు తెలియ చేయాలి. పిల్లలు మెచ్చుకునే రీతిలో ఆరోగ్యకరమైన వంటలు చేయగలగాలి. వారిని కూరగాయలతో గడపనివ్వాలి. కూరగాయల మడులకు తీసుకెళ్లాలి. వంట పట్ల అభిరుచి, అవగాహన కలిగించాలి' అంటుందామె.

హెల్త్ ఫ్యాక్ట్

నాన్‌వెజ్ తిన్నాక బాదం తినండి... ఎందుకంటే..?

మాంసాహారం తిన్న తర్వాత కొన్ని బాదం పలుకులు తినడం వల్ల ఓ ప్రయోజనం ఉంది. కొవ్వుల కారణంగా జరిగే అనర్థాల్ని తగ్గించడం ద్వారా అవి కరోనరీ గుండెజబ్బులనూ నివారిస్తాయి.



బాదంలోని ఒమెగా–3 ఆల్ఫా లినోలిక్ యాసిడ్ ఆ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది.

ఆ మాటకొస్తే మామూలు సమయాల్లో బాదం తినడం వల్ల కూడా చాలా మేలు కలుగుతుంది. వీటిలోని క్యాల్షియమ్ ఎముకలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అంతేకాదు... ఆహారనాళాన్నీ ఆరోగ్యంగా ఉంచడంలో బాదం తోడ్పడుతుంది. గుండెకూ మేలు చేస్తుంది.

● గిరిజనతండాల్లో తీజ్ సంబురాలు

'ఆరుద్ర'ను చూస్తే అనువైన వరుడు

పంట సాగు నుండి కన్నెపిల్లల పరిణయాల వరకు అంతా ప్రకృతి చెప్పిన విధంగానే నడుచుకుంటారు గిరిజనులు. అంతటి ప్రాధాన్యత కల్గిన వాటిల్లో 'తీజ్' పండుగ ముఖ్యమైనది.



గిరిజనులకు తల్లీ తండ్రి ప్రకృతే. కొరత లేకుండా ధాన్యాన్ని పస్తులు ఉంచకుండా పంటల్ని పుష్కలంగా ఇవ్వడమే కాదు తమకు అనువైన తోడును కూడా ప్రకృతి మాతే తీసుకువస్తుందన్నది ప్రగాఢమైన నమ్మకం. ఆ నమ్మకం పెళ్లీడుకు వచ్చిన పడతుల్లో కోటి ఆశలను విరబూయిస్తుంది. ఆ ఆశలే ఇంటింటా సంబరమవుతాయి.

తీజ్ అంటే...

పెళ్లీడుకు వచ్చిన గిరిజన (లంబాడ) అమ్మాయిలు సంబురంగా జరుపుకునే పండుగ తీజ్. గోధుమ నారునే కాదు ఈ కాలాన కనిపించే ఆరుద్ర పురుగులనూ తీజ్ అంటారు. ఎర్రగా అందంగా ఉండే ఆరుద్ర పురుగులను దేవుడు తమకోసం పంపిస్తాడని, ఈ పురుగులు కనిపించినప్పుడు మనసులో కోరుకున్న కోరిక ఫలిస్తుందని వీరి నమ్మకం.

ఇంటింటి ఆశీస్సులు...

పెళ్లీడుకు వచ్చిన యువతులు తమకు కావాల్సిన వరుడి కోసం చేసే ఈ పండగకు ముందు గా తల్లిదండ్రులు, పెద్దల ఆశీస్సులు తీసుకుంటారు. యువతులందరు ఇంటింటికి వెళ్లి పెద్దల ఆశీస్సులు తీసుకోవడం, వారు కానుకగా ఇచ్చే విరాళం తీసుకోవడంతో తండా అంతా సందడిగా మారుతుంది. ఇలా సేకరించిన విరాళం (ధాన్యం)తో తమకు కావాల్సిన గోధుమలు, శనగలు, ఇతర సామాన్లు కొనుగోలు చేస్తారు.

గోధుమ మొలకలు



తీజ్ పండుగలో ముఖ్యమైనది తీజ్ (గోధుమ మొలకలు) ఏపుగా పెరిగేందుకు ఆడపిల్లలు అడవికి వెళ్ళి దుస్సేరు తీగలు తెచ్చి, బుట్టలను అల్లి, తమ ఆరాధ్య దైవం తుల్జా భవాని, సేవాబాయి, సీత్లా భవానీలకు పూజలు చేసి, పుట్టమట్టిని తెస్తారు. మేకల ఎరువును కలిపి తండా నాయక్ చేతిలో ఉంచిన బుట్టలో పోస్తారు. అప్పటికే నానబెట్టి ఉంచిన గోధుమలను అందులో వేస్తారు.

శనగలకు రేగుముళ్లు

తీజ్ వేడుకల్లో భాగంగా నానబెట్టిన శనగలకు యువతులు రేగుముళ్లు గుచ్చుతారు. ఈ ప్రక్రియను బావ వరుసయ్యే వారు పడతుల మనస్సు చెదిరేలా వారిని కదిలిస్తూ ఉంటారు.

నియమ నిష్టలతో...

తండాలోని యువతులందరు తమ బుట్టలను ఒకేచోట పెడతారు. ఈ తొమ్మిది రోజులు పెట్టిన బుట్టలకు నీళ్లు పోస్తూ, వాటి చుట్టూ తిరుగుతూ గిరిజన నృత్యాలు, పాటలు పాడుతూ గడుపుతారు.

ఏడవ రోజు ఢమోళీ...

ఏడవరోజు జరిగే ఢమోళీ చుర్మోను మేరామా భవానీకి నివేదిస్తారు. వెండితో చేసిన విగ్రహం, రూపాయి బిళ్ల అమ్మవారి ముందు పెట్టి మేకపోతులు బలి ఇచ్చే తంతును 'ఆకాడో' అంటారు.



నాకు అరవై ఏళ్లు. మా చిన్నప్పుడు కూడా తీజ్ పండుగ చేసుకున్నాం. తీజ్ పెరిగిన తీరును చూసి మా అమ్మా నాన్నలు, తండా పెద్దలు నాకు పెళ్లి చేశారు. ఇదే ఆనవాయితీ మా పిల్లలు కూడా చేస్తున్నారు.

- భూక్యా వీరమ్మ
గన్యాతండ, మహబూబాబాద్

దేవతల ప్రతిరూపాలకు...

ఎనిమిదవ రోజు మట్టితో ఆరాధ్య దైవాల ప్రతిరూపాలను తయారు చేస్తారు. అబ్బాయి(డోక్రా), అమ్మాయి(డోక్రీ)లుగా పేర్లు పెడతారు. వీటికి గిరిజన సాంప్రదాయాల ప్రకారం పెండ్లి చేస్తారు. ఆడపిల్లలు పెళ్లి కూతురుగా, మగ పిల్లలు పెళ్లికొడుకుగా ఊహించుకుంటూ ఈ తంతులో పాల్గొంటారు. పెళ్లి తర్వాత తమ కుటుంబ సభ్యులను విడిచి పెడుతున్నట్లు ఊహించుకుని ఏడ్వడం, వారిని కుటుంబ సభ్యులు ఓదార్చడంతో ఈ తంతును నిర్వహిస్తారు.

తొమ్మిదవ రోజు నిమజ్జనం

డప్పు చప్పుళ్లు, నృత్యాలతో అందరూ బుట్టల వద్దకు వెళ్తారు. తండా నాయక్ వచ్చి యువతులకు బుట్టలను అందజేస్తారు. యువతులు ఆశీర్వాదాలు తీసుకుంటారు. తమ పూజాఫలంగా పెరిగిన తీజ్‌ను అన్నదమ్ముళ్లకు ఇచ్చి.. వారి ఆశీర్వాదాలు తీసుకుంటారు. తర్వాత యువతీ, యువకులు బుట్టలను పట్టుకొని ఊరేగింపుగా వెళ్లి చెరువులో నిమజ్జనం చేస్తారు.

- ఈరగాని భిక్షం, సాక్షి, మహబూబాబాద్
ఫొటోలు: **మురళీ కృష్ణ**



కళలతో కరిక్యులమ్

అలేఖ్య పుంజాల... శాస్త్రీయనాట్య పుంజం. ఆమెది యాభై ఏళ్ల నాట్యానుభవం... ముప్పై ఏళ్ల బోధనానుభవం. ఆమె మువ్వలు... కథక్... ఒడిస్సీ.. భరతనాట్యం... కూచిపూడి... అడుగులను రవళించాయి. రాష్ట్రపతి నుంచి పురస్కారం... ఆమెలో సాక్షాత్తూ అమ్మవారిని చూస్తూ ప్రేక్షకులు చేసిన అభివందనం... ఇప్పుడు సంగీతనాటక అకాడెమీకి వన్నెలద్దే బాధ్యతలు... ఆమె నాట్యముద్రలతో పోటీ పడుతున్నాయి. తెలంగాణ సంగీతనాటక అకాడెమీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా 'సాక్షి ఫ్యామిలీ'తో ఆమె చెప్పిన సంగతులివి.

''తెలంగాణలో కళారీతులు వందల్లో ఉన్నాయి. వాటిలో కొన్ని మాత్రమే ప్రజాబాహుళ్యంలోకి వచ్చాయి. మరుగున పడిన మరెన్నో కళారీతులను అన్వేషించాల్సి ఉంది. నా వంతుగా పరిశోధనను విస్తరించి మరిన్ని కళారీతులను ప్రదర్శన వేదికలకు తీసుకు రావాలనేదే నా లక్ష్యం. సంగీత, నాటక అకాడెమీ కళాకారులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. కళాకారులందరినీ ఒక త్రాటి మీదకు తీసుకురావాలి. అసలు తెలంగాణ ఉనికి కళలే. ఒక ప్రదేశం గుర్తింపు, అక్కడ నివసించే ప్రజల గుర్తింపు కూడా ఆ సంస్కృతి, కళలతో ముడిపడి ఉంటుంది. తరతరాలుగా కళాకారులు గడ్డు పరిస్థితుల్లో కూడా కళను వదిలేవారు కాదు. కళను బతికించడమే తమ పుట్టుక పరమార్థం అన్నట్లుగా కళాసాధన చేశారు. ప్రస్తుతం మన విద్యావిధానంలో కళలకు సముచిత స్థానం కల్పిస్తూ కరిక్యులమ్ రూపొందాలి. అందుకోసం కళారీతుల గురించి అధ్యయనం చేస్తున్నాను. కళాంశాన్ని పాఠ్యాంశంగా రూపొందించాలి. పిల్లలు జీవన శాస్త్రీయ విషయాలతో పాటు శాస్త్రీయ కళలను కూడా పాఠాలుగా చదవాలి.

సోషల్ మీడియా దన్ను

మా తరంలో కళాసాధనను కెరీర్ ఆప్షన్‌గా ఎంచుకోవడానికి భయపడే వాళ్లు, ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. టెక్నాలజీ విస్తృత మైంది. ఇప్పుడు కళాకారులు సోషల్ మీడియానే పెద్ద కళావేదికగా మలుచుకుంటున్నారు. మా తరంలో కళాకారుల్లో సగానికి పైగా కళాసాధనలోనే జీవితాన్ని వెతుక్కునేవారు. కొంతమంది కళకు దూరమై బతుకుతెరువు బాట పట్టేవారు. ఈ తరంలో నా దృష్టికి వచ్చిన విషయాలేమిటంటే... కళాసాధనలో అనతికాలంలోనే గుర్తింపు రావాలని కోరుకుంటున్నారు. సంతృప్తికరమైన గుర్తింపు లేకపోతే కళను వదిలేస్తున్నారు. కొనసాగేవాళ్లు పదిశాతానికి మించడం లేదు. నిజానికి సోషల్ మీడియాను ఉపయోగించుకోవడం తెలిస్తే గుర్తింపు కూడా అనతికాలంలోనే వస్తుంది. ఈ టెక్నాలజీ యుగంలో వృత్తి–ప్రవృత్తి రెండింటికీ న్యాయం చేసే అవకాశం ఉంది. జీవిక కోసం ఒక ఉద్యోగం చేసుకుంటూ కళాసాధన, కళాప్రదర్శనలు కొనసాగించండి. కళ కోసం చదువును నిర్లక్ష్యం చేయవద్దు. చదువు కోసం కళకు దూరం కావద్దు. రాబోయేతరాల కోసం ఈ వంతెనను నిలబెట్టండి. ఇప్పుడు మన శాస్త్రీయ కళారీతులు విశ్వవ్యాప్తమయ్యాయి. విదేశాల్లో ప్రదర్శనకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

కళాసాధనలో సవాళ్లు


మహిళలకు ఎదురయ్యే సవాళ్లు దేహాకృతిని కాపాడుకోవడంలోనే. సంగీతసాధనకు దేహాకృతి పట్ల ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి కాదు, నాట్యకారులకు దేహాకృతితోపాటు శారీరక దారుఢ్యం కూడా అవసరం. ప్రసవం, పిల్లల పెంపకం కోసం ఎక్కువ విరామం తీసుకుంటే కళాసాధనకు దూరమైపోతాం. పిల్లలను పెంచుకుంటూ తమ మీద తాము కూడా శ్రద్ధ తీసుకున్న నాట్యకారులే ఎక్కువ కాలం కొనసాగగలరు. మహిళలకు ఎదురయ్యే పెద్ద చాలెంజ్ ఇదే. కుటుంబం సహకరిస్తే కళకు సంబంధం లేని ఉద్యోగం చేసుకుంటూ, పిల్లలను చూసుకుంటూ కూడా కళాసాధన కొనసాగించవచ్చు.''

ఇంటర్వ్యూ: **వాకా మంజులారెడ్డి,**
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: **నోముల రాజేశ్‌రెడ్డి**

లకుమాదేవి గొప్ప వ్యక్తిత్వం గల మహిళ

డాక్టర్ సి. నారాయణరెడ్డిగారితో కలిసి ప్రయాణిస్తున్న సందర్భంలో ఆయన రాసిన 'కర్పూర వసంతరాయలు' గేయకావ్యాన్ని విన్నాను. 14వ శతాబ్దంలో కొండవీటి రెడ్డిరాజుల ఆస్థానంలో నర్తకి లకుమాదేవి. కావ్యంలో లకుమాదేవి పాత్ర అద్భుతంగా ఉంది. ఆ పాత్రను ప్రదర్శించడానికి నారాయణరెడ్డి గారి అనుమతి తీసుకున్నాను. నాకిష్టమైన పాత్రల్లో మండోదరి, దుస్సల, రుద్రమదేవి, వేలు నాచియార్ పాత్రలు ముఖ్యమైనవి. వేలు నాచియార్ తమిళనాడులో ప్రఖ్యాతి చెందిన మహిళా పాలకురాలు, బ్రిటిష్ పాలకులతో పోరాడిన యోధ. ఆ పాత్రను ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా 'వారియర్ ఉమెన్ ఆఫ్ భారత్' నాట్యరూపకంలో ప్రదర్శించాను. నేను అమ్మవారి పాత్ర ప్రదర్శించినప్పుడు నాలో అమ్మవారిని చూసుకుని ఆశీర్వాదం కోసం సాష్టాంగ ప్రణామం చేసిన ప్రేక్షకుల అభిమానం ఎంతో గొప్పది. వారి అభిమానానికి సదా కృతజ్ఞతతో ఉంటాను.

హెల్దీ డైట్ ఫ్లఫ్ఫీ పూరీ




డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

కావలసినవి: గోధుమపిండి– కప్పు; నీరు– పావు కప్పు లేదా అవసరాన్ని బట్టి; చక్కెర – పావు టీ స్పూన్; నెయ్యి– 2 టీ స్పూన్‌లు; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● నూనె మినహా మిగిలిన పదార్థాలన్నింటినీ ఒక పాత్రలో వేసి పూరీల పిండిని కలిపి మూత పెట్టి పది నిమిషాల సేపు పక్కన పెట్టాలి ● ఈ పిండిని ఎనిమిది భాగాలుగా చేసి పూరీలు వత్తి ఫ్లవర్ మౌల్డ్‌తో వత్తాలి ● బాణలిలో నూనె వేడి చేసి పూరీలను రెండు వైపులా కాల్చి తీస్తే ఫ్లఫ్ఫీ పూరీలు రెడీ. ఇందులోకి వెజిటబుల్ –కాజు సాగ్ హెల్దీ కాంబినేషన్. దీనిని ఎలా చేయాలో చూద్దాం.

కావలసినవి: జీడిపప్పు – 10; పచ్చి కొబ్బరి తురుము– టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు– టీ స్పూన్; పుదీన ఆకులు– 8; ధనియాల పొడి– పావు టీ స్పూన్; పచ్చిమిర్చి – అర కాయ; ఉడికించిన కూరగాయలు – కప్పు (క్యారట్, బీన్స్, బంగాళదుంప, మొక్కజొన్న, పచ్చి బఠాణీలు కలిపి); అల్లం తరుగు– అర టీ స్పూన్; ఉల్లిపాయ ముక్కలు– 2 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నిమ్మరసం– టీ స్పూన్; నూనె – టీ స్పూన్.

తయారీ: ● కూరగాయ ముక్కలను ఉడికించి పక్కన పెట్టాలి. జీడిపప్పు, కొబ్బరితురుము, కొత్తిమీర, ధనియాల పొడి, అల్లం, పచ్చిమిర్చి కలిపి మెత్తని పేస్ట్ చేయాలి ● బాణలిలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు వేయించి అందులో జీడిపప్పుతోపాటు గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని వేసి రెండు నిమిషాల పాటు వేయించాలి. ఇప్పుడు కూరగాయ ముక్కలు, కొద్దిగా నీటిని వేసి ఐదు నిమిషాల సేపు ఉడికిస్తే వెజిటబుల్ కాజు సాగ్ రెడీ.

పోషకాలు: పూరీలో... ఫ్యాట్ – 9.8 గ్రాములు, ప్రొటీన్ – 2.3 గ్రాములు, కార్బొహైడ్రేట్‌లు – 12 గ్రాములు. **కర్రీలో...** ప్రొటీన్– 4 గ్రాములు, కార్బొహైడ్రేట్‌లు – 13 గ్రాములు, ఫైబర్– 5 గ్రాములు.

● బ్యూటిప్స్

స్కిన్‌టోనింగ్‌కోసం...



టొమాటో రసం పావు కప్పు తీసుకుని అందులో దూది ముంచి ముఖానికి అద్దాలి. ఆరిన తర్వాత వలయాకారంగా మర్దన చేస్తూ చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తేమగా కాంతివంతంగా మారుతుంది. వార్ధక్య లక్షణాలుగా కనిపించే ముడతలు కూడా తొలగిపోతాయి.

మృత కణాలు పోవాలంటే...





బొప్పాయి గుజ్జు పావు కప్పు తీసుకుని అందులో టీ స్పూన్ పన్నీరు (రోజ్‌వాటర్) కలిపి ముఖానికి రాయాలి. పది లేదా పదిహేను నిమిషాలకు తేమను చర్మం పీల్చుకుంటుంది. అప్పుడు వేళ్లతో వలయాకారంగా ముఖమంతా మర్దన చేసి చన్నీటితో శుభ్రం చేయాలి. బొప్పాయిలోని ఎంజైమ్‌లు చర్మంలోని మృత కణాలను తొలగించి చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతాయి.

నేడు 'ఎర్త్ ఓవర్ షూట్ డే'

అన్నీ వాడేశాం!



భూగోళం ప్రకృతి వనరులను పునరుత్పత్తి చేసుకోగలిగే వేగం కంటే.. ప్రకృతి వనరులను మనుషులు అధిక వేగంతో వాడుకుంటూ ఉండటం వల్ల ఈ ఏడాదంతా వాడుకోవాల్సిన వనరులు ఆగస్టు 1 నాటికే పూర్తిగా వాడేసుకున్నట్లు గ్లోబల్ ఫుట్‌ప్రింట్ నెట్‌వర్క్ చెబుతోంది. అంటే.. రేపటి (ఆగస్టు 2) నుంచి మనం పీల్చే గాలి, తాగే నీరూ, వాడే వనరులన్నీ ప్రకృతికి పెనుభారమే! అది తెలియజెప్పేదే 'ఎర్త్ ఓవర్ షూట్ డే'.

ఒక విధంగా చెప్పాలంటే.. మనుషులు భూగ్రహంపై పర్యావరణ వ్యవస్థలు పునరుత్పత్తి చేయగల దానికంటే 1.7 రెట్లు వేగంగా ప్రకృతివనరులను ఖర్చు చేస్తున్నారని 2024 ఎర్త్ ఓవర్ షూట్ డే సూచిస్తోంది. ఈ పర్యావరణ లోటు ఎంత ఎక్కువగా ఉంటే.. అడవుల నిర్మూలన, నేలకోత, జీవవైవిధ్య నష్టం అంత వేగంగా జరుగుతున్నట్లు లెక్క.

419 పిపిఎంకి పెరిగిన సీఓ2

భూవాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ సాంద్రత 2023 నాటికి 419.3 పార్ట్స్ పర్ మిలియన్(పిపిఎం) స్థాయికి పెరిగింది. 2022 – 2023 మధ్యలో 2.8 పిపిఎం పెరిగింది. ఏడాదికి 2 పిపిఎం కన్నా ఎక్కువగా పెరగటం వరుసగా ఇది 12వ సంవత్సరం. ఈ సాంద్రత వల్లే భూ తాపం పెరిగిపోతోంది. ఫలితంగా పర్యావరణం గతి తప్పి.. వాతావరణం మార్పులకు లోనవుతోంది.

ఎవరు లెక్కిస్తున్నారు?

కెనడాలోని యోర్క్ యూనివర్సిటీ 'ఎకలాజికల్ ఫుట్‌ప్రింట్ ఇనీషియేటివ్' కార్యక్రమంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి పునరుత్పత్తి సామర్థ్యాన్ని, ఏయే దేశాల్లో ప్రకృతి వనరుల వాడకం ఏ తీరులో ఉంటోందో లెక్కగడుతోంది. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రాల స్థాయిలో ఈ గణాంకాలు అందుబాటులో ఉన్నాయి. 1971లో ప్రపంచ పర్యావరణ బడ్జెట్ డిసెంబర్ ఆఖరి రోజుల వరకు సరిపోతూ ఉండేది. 1973 నుంచి లోటు పెరుగుతూ వచ్చింది. 1997 అక్టోబర్ వరకు ఉండేది. ఆ తర్వాత మరింత వేగంగా పెరుగుతూ 2024 ఆగస్టు 1 నాటికే పర్యావరణ వనరుల ఖాతా ఖాళీ అయే స్థితికి చేరింది.

పర్యావరణ పాదముద్ర..

ఎంతమేరకు ప్రకృతి వనరులు వాడుతూ ఉంటే అంత పర్యావరణ పాదముద్ర (ఎకలాజికల్ ఫుట్‌ప్రింట్) ఉంటుందన్నమాట. ఇది ప్రతి మనిషికి, ప్రతి దేశానికీ వేర్వేరుగా ఉంటుంది.

ప్రపంచంలో ప్రతి ఒక్కరూ అమెరికన్లలా ప్రకృతి వనరులు వాడితే 5 భూగోళాలు అవసరం అవుతాయి. అయితే ఆ విధంగా చూసుకుంటే మాత్రం ప్రకృతి వనరుల వాడకంలో భారతీయులు పొదుపరులేనని చెప్పాల్సి ఉంటుంది. ప్రపంచంలో అందరూ మనలా ఉండగలిగితే 30% వనరులు మిగిలే ఉంటాయి.

మీ పర్యావరణ పాదముద్ర ఎంత?

దైనందిన జీవితంలో మనం చేసే ప్రతిపనికీ ప్రకృతి వనరులు ఎంతోకొంత ఖర్చవుతూనే ఉంటాయి. మనం చేసే పనులు, తినే ఆహారం, వాడే వాహన ఇంధనం, ధరించే వస్త్రాలు.. ఇలాంటివన్నీ మన పర్యావరణ పాదముద్ర స్థాయిని నిర్ణయిస్తాయి.

జీవన శైలిని మార్చుకొని సహజ వనరుల వాడకాన్ని తగ్గించుకుంటూ ప్రకృతి పరిరక్షణకు దోహదం చేయొచ్చు.. భూతలమ్మీద వాతావరణంలో కర్బన ఉద్గారాలను పెంపొందించే పనులు తగ్గించే పనులను చేపట్టగలిగితే ఆ మేరకు.. ఎర్త్ ఓవర్ షూట్ డేని వెనక్కి జరపగలం! ఏటేటా పెరిగిపోతున్న పర్యావరణ అప్పు భారాన్ని ఆ మేరకు తగ్గించుకోగలుగుతాం. అయితే, పెరుగుతున్న జనాభా నేపథ్యంలో.. స్థూల జాతీయోత్పత్తి(జిడిపి) ఎలాగైనా ఏటా పెరగాల్సిందే అనే మానవాళి ధోరణితో.. ఇదెంత వరకు సాధ్యం అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న!



జొకోవిచ్ ముందుకు...

కెరీర్‌లో లోటుగా ఉన్న ఒలింపిక్ స్వర్ణ పతకాన్ని సాధించే దిశగా సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో అడుగు వేశాడు. పారిస్ ఒలింపిక్స్ పురుషుల టెన్నిస్ సింగిల్స్ విభాగంలో జొకోవిచ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ జొకోవిచ్ 7-5, 6-3తో డొమినిక్ కోఫెర్ (జర్మనీ)పై గెలుపొందాడు. 37 ఏళ్ల జొకోవిచ్ ఇప్పటి వరకు సింగిల్స్ విభాగంలో 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచాడు.



స్వియాటెక్ జోరు...

పారిస్ ఒలింపిక్స్ టెన్నిస్ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) జోరు కొనసాగుతోంది. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ 6-2, 6-4తో 52వ ర్యాంకర్ వాంగ్ జియు (చైనా)పై గెలిచింది. క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ డానియెలా కొలిన్స్ (అమెరికా)తో స్వియాటెక్ తలపడుతుంది. మరో మ్యాచ్‌లో మాజీ నంబర్‌వన్, 36 ఏళ్ల కెర్బర్ (జర్మనీ) 6-4, 6-3తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా)పై గెలిచి ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన పెద్ద వయస్కురాలిగా గుర్తింపు పొందింది.


లవ్లీనా

లవ్లీ 'పంచ్' పవర్

క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ బాక్సర్ లవ్లీనా ● మరో విజయం సాధిస్తే పతకం ఖాయం

పారిస్: భారత ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో ముగ్గురికే సాధ్యమైన ఘనతను సాధించేందుకు మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ ఒక్క విజయం దూరంలో ఉంది. వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న ఈ అస్సాం బాక్సర్ ఆడిన తొలి బౌట్‌లోనే ఏకపక్ష విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన 75 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో లవ్లీనా 5-0తో (29-28, 30-27, 29-28, 30-27, 29-28) సునీవా హాఫ్‌స్టడ్ (నార్వే)ను చిత్తుగా ఓడించింది. ఆదివారం జరిగే క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ లీ కియాన్ (చైనా)తో లవ్లీనా తలపడుతుంది. ఈ బౌట్‌లో గెలిస్తే లవ్లీనాకు కనీసం కాంస్య పతకం ఖాయమవుతుంది. తద్వారా వ్యక్తిగత క్రీడాంశంలో రెండు ఒలింపిక్ పతకాలు గెలిచిన నాలుగో భారతీయ ప్లేయర్‌గా లవ్లీనా గుర్తింపు పొందుతుంది. ఇప్పటి వరకు భారత్ తరఫున రెజ్లర్ సుశీల్ కుమార్ (2008 బీజింగ్-కాంస్యం; 2012 లండన్-రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియో-రజతం; 2020 టోక్యో-కాంస్యం), పిస్టల్ షూటర్ మనూ భాకర్ (2024 పారిస్-2 కాంస్యాలు) రెండు ఒలింపిక్ పతకాల చొప్పున సాధించారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 69 కేజీల విభాగంలో పోటీపడి కాంస్య పతకం నెగ్గిన లవ్లీనా ఈసారి 'పారిస్'లోనూ మెడల్ ఫేవరెట్స్‌లో ఒకరిగా బరిలోకి దిగింది. సునీవాతో జరిగిన బౌట్‌లో లవ్లీనా పక్కా వ్యూహంతో ఆడి ప్రత్యర్థికి ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు. తన ఎత్తును ఉపయోగించుకొని నార్వే బాక్సర్ ముఖంపై నిలకడగా పంచ్‌లు కురిపించింది. నిర్ణీత మూడు రౌండ్లలోనూ లవ్లీనా పూర్తి ఆధిపత్యం చలాయించింది. దాంతో బౌట్‌ను పర్యవేక్షించిన ఐదుగురు జడ్జిలు లవ్లీనాయే పైచేయి సాధించినట్లు నిర్ణయించారు. క్వార్టర్ ఫైనల్లో లవ్లీనా సత్తాకు అసలు పరీక్ష ఎదురుకానుంది. చైనా బాక్సర్ లీ కియాన్ టోక్యో ఒలింపిక్స్‌లో 75 కేజీల విభాగంలో రజత పతకం సాధించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో స్వర్ణం సొంతం చేసుకుంది. గత ఏడాది జరిగిన ఆసియా క్రీడల్లో లీ కియాన్ పసిడి పతకాన్ని దక్కించుకుంది. ఫలితంగా లవ్లీనా తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేస్తేనే చైనా బాక్సర్‌పై పైచేయి సాధించే అవకాశం ఉంటుంది.

పోరాడి ఓడిన ప్రీతి

మరోవైపు మహిళల 54 కేజీల విభాగంలో భారత బాక్సర్ ప్రీతి పవార్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రీతి పవార్ 2-3తో (29-28, 29-28, 30-27, 30-27, 28-29) రెండో సీడ్ మార్సెలా అరియస్ కాస్టనెడా (కొలంబియా) చేతిలో పోరాడి ఓడిపోయింది.



నాకౌట్ దశకు సింధు, లక్ష్య సేన్, ప్రణయ్

పారిస్ ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగాల్లో భారత స్టార్ ప్లేయర్లు పీవీ సింధు, లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ నాకౌట్ దశకు అర్హత సాధించారు. తద్వారా పతకం గెలిచే ఆశలను సజీవంగా నిలబెట్టుకున్నారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ గ్రూప్ 'ఎమ్' రెండో లీగ్ మ్యాచ్‌లో సింధు 21-5, 21-10తో క్రిస్టిన్ కుబా (ఎస్టోనియా)పై అలవోకగా గెలిచింది. 33 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధుకు ఏ దశలోనూ ఇబ్బంది ఎదురుకాలేదు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన సింధు గ్రూప్ 'ఎమ్' విజేతగా అవతరించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత పొందింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హి బింగ్‌జియావో (చైనా)తో సింధు తలపడుతుంది.


లక్ష్య సేన్


ప్రణయ్

పురుషుల సింగిల్స్‌లో భారత రెండో ర్యాంకర్ లక్ష్య సేన్ సంచలనం సృష్టించాడు. ప్రపంచ నాలుగో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)ను బోల్తా కొట్టించి గ్రూప్ 'ఎల్' టాపర్‌గా నిలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. 50 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 22వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-18, 21-12తో క్రిస్టీపై గెలిచాడు. రెండో గేమ్‌లో స్కోరు 19-12 వద్ద ఉన్నపుడు ఇద్దరి మధ్య 50 షాట్‌ల ర్యాలీ జరిగింది. చివరకు క్రిస్టీ కొట్టిన షాట్ బయటకు వెళ్లడంతో పాయింట్ లక్ష్య సేన్‌కు లభించింది. ఆ తర్వాత లక్ష్య సేన్ మరో పాయింట్ నెగ్గి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. గ్రూప్ 'కె' టాపర్‌గా భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ నిలిచాడు. చివరి లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ ప్రణయ్ 16-21, 21-11, 21-12తో ఫట్ లె డక్ (వియత్నాం)పై నెగ్గాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన లక్ష్య సేన్‌తో ప్రణయ్ తలపడతాడు.

పక్కా ప్రణాళికతోనే పతకాలు

గగన్ నారంగ్

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ షూటర్లు పతకాలతో సత్తా చాటుకున్నారు. సమర్థవంతమైన మౌలిక వసతులు, ప్రణాళికబద్ధమైన కృషి వల్లే ఇది సాధ్యమైందని షూటింగ్ బృందం నిరూపించింది. సమయానుకూలంగా మారాల్సిన ఆవశ్యకతను ఈ విజయాలు తెలియజేశాయి. గత టోక్యో ఒలింపిక్స్‌లో ఒక్క పతకం లేకుండానే భారత షూటర్లు రిక్తహస్తాలతో తిరిగి వచ్చారు. మనూ భాకర్, సరబ్‌జోత్ సింగ్ పతకాలతో 12 ఏళ్ల తర్వాత విశ్వక్రీడల్లో మన షూటర్లు చరిత్ర సృష్టించారు. మను ఖాతాలో రెండు పతకాలున్నాయి. మూడో పతకం గెలిచేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. దురదృష్టం వల్లే అర్జున్ బబూతాకు కాంస్యం చేజారింది. దీన్ని వైఫల్యంగా చూడలేం. నిజానికి అతను అత్యుత్తమ ప్రదర్శనే చేశాడు. కాకపోతే ఏం చేస్తాం ఆ రోజు తనది కాదు! ఈ ఒలింపిక్స్‌లో ఇంత మార్పు ఎలా సాధ్యమైంది. పతకాలు ఏలా సాకారమయ్యాయంటే మాత్రం యువ షూటర్ల ఆత్మవిశ్వాసమే ప్రధాన కారణం. క్రీడాగ్రామంలో నేను వారితో పోటీలకు ముందే భేటీ అయ్యాను. నేనో చెఫ్ డి మిషన్‌గా కాకుండా ఓ షూటర్‌గానే వాళ్లతో సంభాషించాను. అప్పుడు వాళ్ల విశ్వాసం, పట్టుదల ఏంటో నాకు అర్థమైంది. ఓ సీనియర్ షూటర్‌గా నేను వారికి చెప్పేదొకటే... గతం గురించి ఆలోచించకుండా ప్రస్తుత క్రీడలపైనే దృష్టి సారించాలని చెప్పాను. ప్రస్తుత బృందంలోని 21 మందిలో 10 మంది 'ఖేలో ఇండియా' ద్వారా వెలుగులోకి వచ్చారు. మరో 11 మంది టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) అండదండలతో విశ్వక్రీడలకు అర్హత సాధించగలిగారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ క్రీడాకారులకు ఉన్న ఆర్థిక కష్టాలను తొలగించి ఆటపై దృష్టి పెట్టేలా పెద్ద ఎత్తున కృషి చేశారు. క్రీడాకారులకు సంబంధించి ప్రత్యేక, వ్యక్తిగత శిక్షణ సిబ్బందిని ఎంచుకునే స్వేచ్ఛ కూడా కల్పించడం గొప్ప విషయం. విదేశీ కోచ్‌లు, విదేశాల్లో శిక్షణ వీటన్నింటి మీద క్రీడా శాఖ సమన్వయంతో పనిచేయడం వల్లే సానుకూల ఫలితాలు వస్తున్నాయి. ఆరంభంలోనే రెండు పతకాలు (షూటింగ్) రావడంతో ఈ విశ్వక్రీడల్లో భారత్ మరిన్ని పతకాలు గెలిచేందుకు పారిస్ ఒలింపిక్స్ దోహదం చేస్తుందని నేను ఆశిస్తున్నాను.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

ఆర్చరీ

పురుషుల వ్యక్తిగత (1/32 ఎలిమినేషన్ రౌండ్): ప్రవీణ్ జాధవ్ x వెన్‌చావో (చైనా) (మధ్యాహ్నం గం. 2:31 నుంచి). పురుషుల వ్యక్తిగత (1/16 ఎలిమినేషన్ రౌండ్): (మధ్యాహ్నం గం. 3:10 నుంచి).

షూటింగ్

పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ (ఫైనల్): స్వప్నిల్ కుసాలే (మధ్యాహ్నం గం. 1:00 నుంచి). మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ క్వాలిఫికేషన్ రౌండ్: సిఫ్ట్ కౌర్ సమ్రా, అంజుమ్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి).

గోల్ఫ్

పురుషుల వ్యక్తిగత ఫైనల్స్: గగన్‌జీత్ భుల్లర్, శుభాంకర్ శర్మ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి).

బాక్సింగ్

మహిళల 50 కేజీల ప్రిక్వార్టర్ ఫైనల్: నిఖత్ జరీన్ x యూ వూ (చైనా) (మధ్యాహ్నం గం. 2:30 నుంచి).

సెయిలింగ్

పురుషుల డింగీ తొలి రెండు రేసులు: విష్ణు శరవణన్ (మధ్యాహ్నం గం. 3:45 నుంచి). మహిళల డింగీ తొలి రెండు రేసులు: నేత్రా కుమానన్ (రాత్రి గం. 7:05 నుంచి)

హాకీ

భారత్ x బెల్జియం (గ్రూప్ మ్యాచ్) (మధ్యాహ్నం గం. 1:30 నుంచి).

బ్యాడ్మింటన్

పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్ ఫైనల్స్: (మధ్యాహ్నం గం. 12:00 నుంచి). పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్: సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి x చియా ఆరోన్-సోహ్ వూయి యిక్ (మలేసియా) (సాయంత్రం గం. 4:30 నుంచి). మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్ (సాయంత్రం గం. 4:30 నుంచి).

గురి కుదిరితే మరో పతకం

పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ స్వప్నిల్

- ఒలింపిక్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారత షూటర్‌గా ఘనత
- క్వాలిఫయింగ్‌లో ఏడో స్థానంతో ఫైనల్‌కు అర్హత
- నేడు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పతకం కోసం పోటీ

మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో నిరాశపరిచిన భారత షూటర్లు పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం నిలకడగా రాణిస్తున్నారు. ఇప్పటికే మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మనూ భాకర్... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మనూ భాకర్-సరబ్‌జోత్ కాంస్య పతకాలు అందించారు. అంతా అనుకున్నట్లు జరిగితే నేడు భారత్ ఖాతాలో షూటింగ్ ద్వారా మూడో పతకం చేరుతుంది. బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో భారత్ తరఫున స్వప్నిల్ కుసాలే, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ బరిలోకి దిగారు. స్వప్నిల్ ఏడో స్థానంలో నిలిచి ఫైనల్లోకి దూసుకెళ్లగా... ఐశ్వర్య ప్రతాప్ సింగ్ 11వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

పారిస్: అంతగా అంచనాలు లేకుండా తొలిసారి ఒలింపిక్స్ క్రీడల్లో బరిలోకి దిగిన భారత షూటర్ స్వప్నిల్ కుసాలే అదరగొట్టాడు. ఆద్యంతం నిలకడగా పాయింట్లు సాధించి పతకం రేసులో నిలిచాడు. బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో మహారాష్ట్రకు చెందిన 28 ఏళ్ల స్వప్నిల్ 590 పాయింట్లు స్కోరు చేసి ఏడో స్థానాన్ని దక్కించుకున్నాడు. మొత్తం 44 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో టాప్-8లో నిలిచిన వారికి ఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి. భారత్‌కే చెందిన ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ కూడా క్వాలిఫయింగ్‌లో పాల్గొని 589 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందలేకపోయాడు. ఒలింపిక్స్ క్రీడల్లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్‌కు అర్హత సాధించిన తొలి భారత షూటర్‌గా స్వప్నిల్ గుర్తింపు పొందాడు.

'త్రీ పొజిషన్స్' అని ఈవెంట్ పేరులో ఉన్నట్టే షూటర్లు వేర్వేరు మూడు భంగిమల్లో లక్ష్యం దిశగా షాట్‌లు సంధిస్తారు. తొలి సిరీస్‌లో షూటర్లు మోకాళ్లపై (నీలింగ్) కూర్చొని షూట్ చేస్తారు. రెండో సిరీస్‌లో సైనిక భంగిమ (ప్రోన్)లో షూట్ చేస్తారు. చివరిదైన మూడో సిరీస్‌లో నిల్చొని (స్టాండింగ్) లక్ష్యం వైపు షాట్‌లు కొడతారు. ఈ మూడు భంగిమల్లో స్కోరు చేసిన పాయింట్ల ఆధారంగా ర్యాంక్‌ను నిర్ణయిస్తారు. అత్యధికంగా పాయింట్లు సాధించి తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

మహిళల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో ప్రపంచ మాజీ చాంపియన్, మహారాష్ట్రకే చెందిన తేజస్విని సావంత్ వద్ద శిక్షణ తీసుకుంటున్న స్వప్నిల్ క్వాలిఫయింగ్‌లో సంయమనం కోల్పోకుండా, ఏకాగ్రతతో షూట్ చేశాడు. ముందుగా 'నీలింగ్' సిరీస్‌లో 198 పాయింట్లు... 'ప్రోన్' సిరీస్‌లో 197 పాయింట్లు... చివరిదైన 'స్టాండింగ్' సిరీస్‌లో 195 పాయింట్లు స్కోరు చేశాడు. స్వప్నిల్‌తోపాటు జిరీ ప్రివ్రత్‌స్కయ్ (చెక్ రిపబ్లిక్), పీటర్ నింబర్‌స్కయ్ (చెక్ రిపబ్లిక్) కూడా 590 పాయింట్లు స్కోరు చేశారు. అయితే ఈ ముగ్గురిలో 10 పాయింట్ల షాట్‌లు స్వప్నిల్ (38 సార్లు), జిరీ (35 సార్లు) ఎక్కువగా కొట్టడంతో ఏడు, ఎనిమిదో ర్యాంక్‌లతో ఫైనల్‌కు చేరగా... పీటర్ (32 సార్లు) తొమ్మిదో స్థానంతో ఫైనల్ అవకాశాన్ని కోల్పోయాడు. ఐశ్వర్య ప్రతాప్ సింగ్ 'నీలింగ్'లో 197 పాయింట్లు... 'ప్రోన్'లో 193 పాయింట్లు... 'స్టాండింగ్'లో 193 పాయింట్లు స్కోరు చేసి 589 పాయింట్లతో 11వ స్థానాన్ని సంపాదించాడు. లియు యుకున్ (చైనా; 594 పాయింట్లు), జాన్ హెర్మన్ హెగ్ (నార్వే; 593 పాయింట్లు), సెర్హీ కులిష్ (ఉక్రెయిన్; 592 పాయింట్లు), డెనిస్ బెర్నార్డ్ లుకాస్ (ఫ్రాన్స్; 592 పాయింట్లు), లాజర్ కొవాసెవిచ్ (సెర్బియా; 592 పాయింట్లు), టొమాస్ బార్టనిక్ (పోలాండ్; 591 పాయింట్లు) వరుసగా తొలి ఆరు స్థానాల్లో నిలిచి స్వప్నిల్, జిరీలతో కలిసి నేడు జరిగే ఫైనల్లో పతకాల కోసం పోటీపడతారు.


స్వప్నిల్

రాజేశ్వరి, శ్రేయసి విఫలం

మహిళల ట్రాప్ ఈవెంట్‌లో భారత్ నుంచి ఇద్దరు షూటర్లు రాజేశ్వరి కుమారి, శ్రేయసి సింగ్ బరిలోకి దిగారు. మొత్తం 30 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో రాజేశ్వరి, శ్రేయసి 113 పాయింట్లు స్కోరు చేసి వరుసగా 22వ, 23వ స్థానాల్లో నిలిచారు. టాప్-6లో నిలిచిన వారు మాత్రమే ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

రోయింగ్ సెమీస్‌లో బల్‌రాజ్‌కు ఆరో స్థానం

భారత రోవర్ బల్‌రాజ్ పన్వర్ పారిస్ ఒలింపిక్స్ సింగిల్స్ స్కల్స్ సెమీఫైనల్లో ఆరో స్థానంలో నిలిచాడు. బుధవారం జరిగిన పోటీల్లో పన్వర్ 7 నిమిషాల 4.97 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. ఇక 19 నుంచి 24 స్థానాల కోసం శనివారం జరగనున్న పోటీలో బల్‌రాజ్ బరిలోకి దిగనున్నాడు.

మనిక అవుట్... ప్రిక్వార్టర్స్‌లో శ్రీజ


శ్రీజ

పారిస్ ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) వ్యక్తిగత విభాగంలో భారత్ నుంచి ఆకుల శ్రీజ మాత్రమే బరిలో నిలిచింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ 25వ ర్యాంకర్ ఆకుల శ్రీజ 9-11, 12-10, 11-4, 11-5, 10-12, 12-10తో జెంగ్ జియాన్ (సింగపూర్)పై విజయం సాధించింది. 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీజకు గట్టిపోటీ ఎదురైంది. అయితే కీలక దశల్లో శ్రీజ పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. ఈ గెలుపుతో మనిక బత్రా తర్వాత ఒలింపిక్స్ క్రీడల టీటీ పోటీల్లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన రెండో భారతీయ క్రీడాకారిణిగా తెలంగాణ అమ్మాయి శ్రీజ గుర్తింపు పొందింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సన్ యింగ్షా (చైనా)తో శ్రీజ తలపడుతుంది. మరోవైపు భారత రెండో ర్యాంకర్ మనిక బత్రా పోరాటం విశ్వక్రీడల్లో ముగిసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 28వ ర్యాంకర్ మనిక 6-11, 9-11, 14-12, 8-11, 7-11తో ప్రపంచ 13వ ర్యాంకర్ మియు హిరానో (జపాన్) చేతిలో ఓడిపోయింది.

సాత్విక్ జోడీ సత్తాకు పరీక్ష

ఒలింపిక్స్‌లో పతకం రేసులో నిలవాలంటే భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సిన సమయం వచ్చేసింది. 'పారిస్' గేమ్స్‌లో బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ నాకౌట్ దశ 'డ్రా' బుధవారం విడుదలైంది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ ద్వయం ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా)తో సాత్విక్-చిరాగ్ జంట తలపడనుంది. ముఖాముఖి రికార్డులో సాత్విక్-చిరాగ్ ద్వయం 3-8తో వెనుకబడి ఉంది. ఒకదశలో మలేసియా జంట చేతిలో వరుసగా ఎనిమిది మ్యాచ్‌ల్లో ఓడిపోయిన భారత జోడీ ఇటీవల ఈ ద్వయంతో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలుపొందింది. అయితే గత టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన ఆరోన్ చియా-సో వుయ్ యిక్‌ను తక్కువ అంచనా వేసే పరిస్థితి లేదు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	8	7	3	18
2	జపాన్	8	3	4	15
3	ఫ్రాన్స్	7	9	8	24
4	ఆస్ట్రేలియా	7	4	3	14
5	బ్రిటన్	6	6	5	17
6	దక్షిణ కొరియా	5	3	3	11
7	అమెరికా	4	13	12	29
39	భారత్	0	0	2	2

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.



అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూత

భారత మాజీ క్రికెటర్, కోచ్ అన్షుమన్ గైక్వాడ్ (72) బుధవారం కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇటీవలే చికిత్స చేయించుకున్నా గైక్వాడ్ కోలుకోలేకపోయారు. బరోడాకు చెందిన అన్షుమన్ భారత్ తరఫున 40 టెస్టుల్లో 1,985 పరుగులు, 15 వన్డేల్లో 269 పరుగులు చేయగా... 22 ఏళ్ల ఫస్ట్ క్లాస్ క్రికెట్ కెరీర్‌లో 206 మ్యాచ్‌లలో 12,136 పరుగులు సాధించారు. అసాధారణ బ్యాటర్ కాకపోయినా... భీకరమైన పేస్ బౌలింగ్‌నైనా సమర్థంగా ఎదుర్కొనే ధైర్యం, పట్టుదల గైక్వాడ్‌ను ప్రత్యేకంగా నిలిపాయి. 1975-76లో విండీస్ గడ్డపై హోల్డింగ్ తదితరుల ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొని చేసిన 81 పరుగులు గైక్వాడ్ కెరీర్‌లో చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌గా మిగిలిపోయింది. పాకిస్తాన్‌పై 671 నిమిషాల పాటు బ్యాటింగ్ చేసి సాధించిన 201 పరుగులు టెస్టుల్లో గైక్వాడ్ అత్యధిక స్కోరు. 1997-99 మధ్య అన్షుమన్ భారత జట్టు కోచ్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో భారత జట్టు చెప్పుకోదగ్గ పలు విజయాలు సాధించింది. 2018లో బీసీసీఐ కల్నల్ సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో గైక్వాడ్‌ను గౌరవించింది. అన్షుమన్‌కు శత్రుంజయ్ అనే 40 ఏళ్ల కుమారుడు ఉన్నాడు.

నీరజ్ చోప్రాపైనే భారత్ ఆశలు

నేటి నుంచి పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్ పోటీలు

- బరిలో 29 మంది భారత అథ్లెట్లు
- తొలి రోజు 20 కిలోమీటర్ల రేస్ వాక్

పారిస్: విశ్వ క్రీడల్లో అందరూ ఆసక్తితో ఎదురు చూసే అథ్లెటిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలకు నేడు తెర లేవనుంది. ఒలింపిక్స్ మొదలై ఐదు రోజులు దాటినా.. అసలు సిసలు మజా ఇచ్చే అథ్లెటిక్స్ ఈవెంట్ నేటి నుంచి జరుగుతుంది. భారత అభిమానుల విషయానికొస్తే స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే అందరి దృష్టి ఉంది. టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకంతో భారత అథ్లెటిక్స్ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించిన నీరజ్ మరోసారి అదే స్థాయి ప్రదర్శన చేసేందుకు సిద్ధమవుతుండగా.. భారత్ నుంచి మొత్తం 29 మంది అథ్లెట్లు ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సత్తా చాటేందుకు రెడీ అయ్యారు. 'టోక్యో' క్రీడల్లో పసిడి పతకం సాధించిన తర్వాత అంతర్జాతీయ స్థాయిలో అదే నిలకడ కొనసాగిస్తూ వస్తున్న నీరజ్ వరుసగా రెండో స్వర్ణం నెగ్గాలని తహతహలాడుతున్నాడు. ఆగస్టు 6న పురుషుల జావెలిన్‌త్రో క్వాలిఫికేషన్ రౌండ్... రెండు రోజుల తర్వాత 8న ఫైనల్ జరగనుంది. నీరజ్ టైటిల్ నిలబెట్టుకుంటే.. ఒలింపిక్స్‌లో ఆ ఘనత సాధించిన ఐదో జావెలిన్ త్రోయర్ కానున్నాడు. విశ్వక్రీడల చరిత్రలో ఎరిక్ లామింగ్ (స్వీడన్; 1908, 1912), జానీ మైరా (ఫిన్లాండ్; 1920, 1924), జాన్ జెలెన్జీ (చెక్ రిపబ్లిక్; 1992, 1996, 2000), ఆండ్రీస్ థోర్‌కిల్డ్‌సెన్ (నార్వే; 2004, 2008) స్వర్ణాన్ని నిలబెట్టుకున్నారు.

రేస్ వాక్‌తో మొదలు..

అథ్లెటిక్స్‌లో భాగంగా తొలి రోజు మహిళల, పురుషుల 20 కిలోమీటర్ల రేస్ వాక్ పోటీలు ప్రారంభం కానున్నాయి. భారత్ నుంచి పురుషుల విభాగంలో అక్షదీప్ సింగ్, వికాస్ సింగ్, పరమ్‌జీత్ సింగ్ బిష్త్ పోటీలో ఉన్నారు. ఇక మహిళల విభాగం నుంచి ప్రియాంక గోస్వామి బరిలోకి దిగనుంది. పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అవినాశ్ సాబ్లేపై భారీ అంచనాలు ఉండగా... 4-400 మీటర్ల పురుషుల ఈవెంట్‌లో మన జట్టు పతక ఆశలు రేపుతోంది. ఇటీవల పారిస్ డైమండ్ లీగ్‌లో అవినాశ్ జాతీయ రికార్డు బద్దలు కొట్టి 8 నిమిషాల 9.91 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఆరో స్థానంలో నిలిచాడు.

హర్డిల్స్‌లో జ్యోతి...రిలేలో జ్యోతిక శ్రీ

ఇక ఒలింపిక్స్ చరిత్రలో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో పాల్గొంటున్న తొలి భారత అథ్లెట్‌గా ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ గుర్తింపు పొందనుంది. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న జ్యోతి... 'పారిస్' క్రీడల్లోనూ అదే జోరు కనబర్చాలని చూస్తోంది. మహిళల 4X400 మీటర్ల రిలే జట్టులో కీలక సభ్యురాలైన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతిక శ్రీపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఇక మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌తో పాటు 5000 మీటర్ల పరుగులో పాల్గొంటున్న పారుల్ చౌదరి, మహిళల జావెలిన్‌త్రోలో అన్ను రాణి, పురుషుల షాట్‌పుట్‌లో తజిందర్ పాల్‌సింగ్ తూర్, ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రావేల్, అబూబాకర్ నుంచి కూడా మెరుగైన ప్రదర్శన ఆశించవచ్చు.

కొత్తగా రెపిచాజ్ రౌండ్..

రెజ్లింగ్, రోయింగ్ మాదిరిగానే ఈసారి నుంచి ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లోనూ రెపిచాజ్ విభాగాన్ని ప్రవేశ పెట్టనున్నారు. 200 మీటర్ల నుంచి 1500 మీటర్ల పరుగు వరకు వ్యక్తిగత విభాగాల్లో దీన్ని అమలు చేయనున్నారు. హర్డిల్స్‌కు కూడా ఇది వర్తించనుంది. గతంలో హీట్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన అథ్లెట్లతో పాటు వేగవంతమైన టైమింగ్ నమోదు చేసుకున్న అథ్లెట్లు సెమీఫైనల్‌కు చేరేవారు. తాజా రెపిచాజ్ రౌండ్‌తో హీట్స్‌లో ముందు నిలిచిన వారు మాత్రమే సెమీస్‌కు అర్హత సాధిస్తారు. మిగిలిన వాళ్లందరూ రెపిచాజ్ రౌండ్‌లో పాల్గొంటారు. అందులో సత్తా చాటితే సెమీఫైనల్‌కు చేరేందుకు రెండో అవకాశం దక్కనుంది.

అసలేంటీ రెపిచాజ్

ఫ్రెంచ్ భాషలో రెపిచాజ్.. అంటే రెండో అవకాశం అని అర్థం. నిజంగానే ఇది అథ్లెట్లకు సెకండ్ చాన్స్ వంటిదే. 'పారిస్' క్రీడల ద్వారా అథ్లెటిక్స్‌లో ఈ రౌండ్‌ను మొదటిసారి ప్రవేశ పెట్టనున్నారు. గతంలో మార్షల్ ఆర్ట్స్, రోయింగ్, రెజ్లింగ్ క్రీడల్లో మాత్రమే ఈ అవకాశం ఉండేది. ఇప్పుడు రన్నింగ్, హర్డిల్స్‌లో 200 మీటర్ల నుంచి 1500 మీటర్ల వరకు దీన్ని అమలు చేయనున్నారు. దీంతో తొలి హీట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చలేకపోయిన వారికి సెమీఫైనల్ చేరడానికి మరో అవకాశం దక్కనుంది. 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్, 5000 మీటర్ల పరుగులో రెపిచాజ్ రౌండ్‌ను అనుమతించడం లేదు. ఈ ఈవెంట్‌లలో పాల్గొన్న అథ్లెట్లు తేరుకునేందుకు మరింత సమయం అవసరమవనుండటంతో.. 1500 మీటర్ల వరకే దీన్ని పరిమితం చేశారు. ఇక పురుషుల, మహిళల 10,000 మీటర్లు, మారథాన్స్‌లో కేవలం ఫైనల్ మాత్రమే నిర్వహించనున్నారు.



జావెలిన్ త్రో షెడ్యూల్
నీరజ్ చోప్రా,కిషోర్ జేనా
క్వాలిఫయింగ్: ఆగస్టు 6
మధ్యాహ్నం గం. 1:50 నుంచి
ఫైనల్: ఆగస్టు 8 రాత్రి
గం. 11:55 నుంచి



మహిళల 4x400 మీటర్ల రిలే
దండి జ్యోతిక శ్రీ
తొలి రౌండ్: ఆగస్టు 9
మధ్యాహ్నం గం 2:10 నుంచి
ఫైనల్: ఆగస్టు 11
అర్ధరాత్రి గం. 12.44 నుంచి



మహిళల 100 మీటర్ల హర్డిల్స్
జ్యోతి యర్రాజీ
తొలి రౌండ్: ఆగస్టు 7
మధ్యాహ్నం గం. 1:45 నుంచి
రెపిచాజ్ రౌండ్: ఆగస్టు 8
మధ్యాహ్నం గం. 2:05 నుంచి
సెమీఫైనల్: ఆగస్టు 9
మధ్యాహ్నం గం. 3:35 నుంచి
ఫైనల్: రాత్రి గం. 11:05 నుంచి

దీపిక ముందుకు...

తరుణ్‌దీప్ రాయ్ నిష్క్రమణ




పారిస్: టీమ్ ఈవెంట్‌లో నిరాశాజనక ప్రదర్శనను మరిపించే విధంగా భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి వ్యక్తిగత విభాగంలో రాణించింది. వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్ క్రీడల్లో పోటీపడుతున్న ఈ జార్ఖండ్ క్రీడాకారిణి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగం తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ దీపిక 6-5తో (29-28, 26-27, 27-27, 24-27, 30-27) 'షూట్ ఆఫ్'లో రీనా పర్నాత్ (ఎస్టోనియా)పై విజయం సాధించింది. ఐదు సెట్‌ల తర్వాత ఇద్దరూ సమంగా నిలువడంతో విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్'ను నిర్వహించారు. 'షూట్ ఆఫ్'లో దీపిక సంధించిన బాణానికి 9 పాయింట్లురాగా, రీనా పర్నాత్ 8 పాయింట్లే స్కోరు చేసి ఓడిపోయింది. అనంతరం రెండో రౌండ్ మ్యాచ్‌లో దీపిక 6-2తో (29-28, 27-29, 25-17, 28-23) క్వింటీ రోఫిన్ (నెదర్లాండ్స్)పై గెలిచింది. శనివారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మిచెల్లి క్రాపెన్ (జర్మనీ)తో దీపిక; దియనంద చోయ్‌రునీసా (ఇండోనేసియా)తో భజన్ కౌర్ తలపడతారు. మరోవైపు పురుషుల వ్యక్తిగత విభాగంలో భారత వెటరన్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్ కథ ముగిసింది. నాలుగోసారి ఒలింపిక్స్‌లో పోటీపడ్డ 40 ఏళ్ల తరుణ్‌దీప్ రాయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. తొలి రౌండ్‌లో తరుణ్‌దీప్ రాయ్ 4-6తో (27-27, 27-28, 28-25, 28-29, 29-29)తో టామ్ హాల్ (బ్రిటన్) చేతిలో ఓడిపోయాడు.

ఆ ఆర్చర్ గురికి ఒకటే పాయింట్!



పారిస్: ఆర్చరీ పోటీల్లో గురి లక్ష బిందువుపైనే ఉంటుంది. ఇది కుదిరితే 10 కాస్త అటుఇటు తప్పితే 9, 8, 7 పాయింట్లు సహజం. కానీ ఆఫ్రికన్ దేశం చాద్ ఆర్చర్ ఇస్రాయెల్ మదయె దాదాపు టార్గెట్ రింగ్స్ బోర్డుకే దూరమయ్యే బాణం సంధించాడు. త్రుటిలో బోర్డులో పడింది... కానీ వచ్చింది ఒకే పాయింట్! వినడానికి విడ్డూరంగా ఉన్న మదయె రెండో సెట్‌లో మూడు షాట్లలో ఒకటి ఒక్క పాయింటే తెచ్చి పెట్టింది. విలువిద్యలో కొరియన్ ఆర్చర్లకు తిరుగుండదు. పైగా మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ అయిన కిమ్ వూ జిన్ ముందు 36 ఏళ్ల మదయె ఓ పిల్లబచ్చ! ఈ మ్యాచ్‌లో 26-29, 15-29, 25-30 స్కోరుతో కిమ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. తొలి సెట్‌లో 26 పాయింట్లు సాధించిన మదయె రెండో సెట్‌లో కేవలం 15 పాయింట్లే చేశాడు. అంటే మూడు బాణాల స్కోరుకు (10+10+10)కు సగమన్నమాట! ఇందులో మూడో షాట్ ఒక పాయింట్ తేవడంతో అతను సగం స్కోరుకు పరిమితమయ్యాడు. అయితే మూడో సెట్‌లో పుంజుకొని 25 పాయింట్లు సాధించాడు. ఇంత ఘోరంగా మదయె ఓడినప్పటికీ స్టేడియంలోని కొరియన్ అభిమానుల నుంచి ఓదార్పు లభించింది. చప్పట్లతో మదయెకు వీడ్కోలు పలికారు.

ఈక్వెస్ట్రియన్‌లో అనూష్‌కు నిరాశ



పారిస్ ఒలింపిక్స్ అశ్విక క్రీడల్లో (ఈక్వెస్ట్రియన్) భారత్‌కు నిరాశ తప్పలేదు. 2022 హాంగ్జూ ఆసియా క్రీడల డ్రెసాజ్ విభాగంలో రెండు పతకాలతో మెరిసిన అనూష్ అగర్వల్లా.. విశ్వక్రీడల్లో అదే జోరు కనబర్చలేకపోయాడు. బుధవారం పురుషుల వ్యక్తిగత డ్రెసాజ్ ఈవెంట్ గ్రూప్ స్టేజ్‌లో అనూష్ 66.444 పాయింట్లతో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గ్రూప్ 'ఇ'లో పోటీపడిన 24 ఏళ్ల అనూష్ భారత్ నుంచి ఒలింపిక్స్ డ్రెసాజ్ విభాగంలో పాల్గొన్న తొలి ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు.

వినోదం... పోరాటం సినిమా



• కీర్తి సురేష్

కీర్తి సురేష్ లీడ్ రోల్‌లో నటించిన ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'రఘుతాత'. సుమన్‌కుమార్ దర్శకత్వం వహించిన సినిమా ఇది. హోంబలే ఫిలింస్ తమ బేనర్‌పై నిర్మించిన ఈ తొలి తమిళ సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది. తెలుగులోనూ ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సినిమా తమిళ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'ఒక అమ్మాయిలా నువ్వు ఎందుకు డ్రెస్సింగ్ చేసుకోవు?', 'ఒక అచ్చమైన అమ్మాయిలా ఉండేందుకు నాకు ఆసక్తి లేదు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఓ భాష నేర్చుకోవడానికి ఓ యువతి పడే ఇబ్బందులు, ఆమె ముందు ఉన్న సవాళ్లు, ఆమె పోరాటం నేపథ్యంలో ఈ సినిమా కథనం వినోదాత్మకంగా ఉంటుందని సమాచారం.

జాబిలమ్మ వచ్చెనండి



• కియారా

రామ్‌చరణ్, కియారా అద్వానీ జంటగా నటిస్తున్న చిత్రం 'గేమ్ చేంజర్'. శంకర్ దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది. బుధవారం కియారా అద్వానీ బర్త్ డే సందర్భంగా 'గేమ్ చేంజర్'లో 'జాబిలమ్మ..' అంటూ యూనిట్ ఆమె కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఇప్పటికే ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్ర షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం మిగిలిన ప్రధాన తారాగణం పాల్గొనగా హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది.

హై ఓల్టేజ్ యాక్షన్



గోపీచంద్ హీరోగా రూపొందిన హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'విశ్వం'. శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించారు. దోనేపూడి చక్రపాణి సమర్పణలో టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ చివరి దశలో ఉన్న 'విశ్వం' మూవీ త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా 'ది జర్నీ ఆఫ్ విశ్వం' అనే వీడియోను విడుదల చేశారు. ''హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం 'విశ్వం'. శ్రీను వైట్ల మార్క్ హ్యూమర్, యాక్షన్, కామెడీతో ఈ సినిమా ఉంటుంది. గోపీచంద్‌ని ఒక విభిన్నమైన పాత్రలో చూపిస్తున్నారు దర్శకుడు. సినిమాలో ఎలాంటి అంశాలు ఉంటాయో తెలియజేయడంతో పాటు ఆడియన్స్‌లో ఎగ్జయిట్‌మెంట్‌ని క్రియేట్ చేసేలా ఈ వీడియోను అద్భుతంగా డిజైన్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్, సంగీతం: చేతన్ భరద్వాజ్.

• గోపీచంద్

నా దగ్గర ఆధారాలు ఉన్నాయి - రాజ్ తరుణ్



లివింగ్ రిలేషన్‌షిప్‌లో ఉండి తనను రాజ్ తరుణ్ మోసం చేశాడని, ఇందులో మాల్వీ మల్హోత్రా ప్రమేయం కూడా ఉందని ఇటీవల లావణ్యా చౌదరి అనే అమ్మాయి ఆరోపణలు చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ వివాదంపై రాజ్ తరుణ్ బుధవారం జరిగిన 'తిరగబదర సామీ' చిత్రం ప్రీ రిలీజ్ వేదికగా స్పందించారు. రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా ఏయస్ రవికుమార్ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది.

ఈ వేదికపై రాజ్ తరుణ్ మాట్లాడుతూ – ''నేను చేయని తప్పుకు నిందలు వేస్తుంటే చాలా బాధగా ఉంది. నా కుటుంబ సభ్యులు కూడా బాధపడుతున్నారు. ఆరోపణలు చేసేవారు (పరోక్షంగా లావణ్యను ఉద్దేశించి..) బయట మాట్లాడతారు. ప్రతి దానికీ నా దగ్గర ఆధారాలు ఉన్నాయి. భయపడాల్సిన అవసరం నాకు లేదు. లీగల్‌గానే ప్రొసీడ్ అవుతాను... అవుతున్నాను. నాపై ఆరోపణలు చేసేవారి మాటలు విన్నారు కానీ ఏ రోజైనా ప్రూఫ్స్ అడిగారా? (మీడియాను ఉద్దేశించి..) అన్నారు. వారు చూపించాల్సిన ఆధారాలు చూపిస్తున్నారని ఓ జర్నలిస్ట్ మాట్లాడుతుండగా... మధ్యలో రాజ్ తరుణ్ జోక్యం చేసుకుని ''వాళ్ల ప్రూఫ్‌లను కోర్టులో చూపించుకుంటామన్నారు'' అన్నారు. ఇంకా రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''ఆవిడ మాట్లాడిన తర్వాత ఫస్ట్ డేనే నేను మీడియా ముందుకు వచ్చి మాట్లాడాను. నేను ఆ రోజు చెప్పిన దాంట్లో ఏ అబద్ధం లేదు. ఇప్పుడూ చెప్పడం లేదు. నా సోదరుడు శేఖర్ చాలా ఆధారాలు తీసుకువచ్చాడు. నా దగ్గరా చాలా ఆధారాలు ఉన్నాయి. అయితే వాటిలో వేరే వాళ్ల పేర్లు, వివరాలు ఉన్నాయి. ఆ పేర్లు బయటపెట్టడం ఇష్టం లేక ఆ ఆధారాలు బయటపెట్టలేదు'' అంటున్న రాజ్ తరుణ్‌తో 'మీరు ఆమెకు అబార్షన్ చేయించారని ఆమె అంటున్నారు' అని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా... ''మరి... నాపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఆ సెక్షన్ ఎందుకు లేదు?' అన్నారు రాజ్ తరుణ్.

''నా సోదరుడిపై ఆమె (లావణ్యను ఉద్దేశించి...) చేసిన ఆరోపణలకు సంబంధించి పోలీసులతో మాట్లాడాను. జూలై 24న ఆమె నాకు పంపిన సందేశాన్ని పోలీసులకు పంపాను. లీగల్ యాక్షన్ తీసుకుంటున్నారు. 2020లో నన్ను ఇబ్బంది పెట్టిన కొందరు క్రిమినల్స్‌తో ఆమె టచ్‌లో ఉన్నారు. నా దృష్టిలో ఆమె కూడా ఓ క్రిమినల్'' అన్నారు **మాల్వీ**. కాగా ఈ వేదిక ప్రాంగణంలో ''రాజ్ తరుణ్ నా మనిషి... నా కెరీర్‌ని వదులుకుని అతని కోసం పదేళ్లు ఇంటి పట్టునే ఉన్నాను. తనకోసం ఎంతదాకా అయినా వెళతాను'' అంటూ **లావణ్య** మాట్లాడారు.

కొత్తగా ప్రయత్నించాలని ఈ సినిమా చేశాను

\- అశ్విన్‌బాబు




అశ్విన్‌బాబు హీరోగా నటించిన చిత్రం 'శివం భజే'. ఇందులో దిగంగనా సూర్యవన్షీ హీరోయిన్. మూలి మహేశ్వర్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు (గురువారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అశ్విన్‌బాబు మాట్లాడుతూ– ''హిడింబ' తర్వాత చాలా కథలు విన్నాను. మళ్లీ ఏదో ఒకటి కొత్తగా ప్రయత్నించాలనుకుంటున్న సమయంలో 'శివం భజే' కథ విన్నాను. చాలా నచ్చింది. నా గత చిత్రాలు 'రాజుగారి గది, హిడింబ'లా 'శివం భజే' పాయింట్ బాగుంటుంది. ఈ చిత్రంలో పక్కింటి కుర్రాడిలా కనిపిస్తాను. ఎప్పుడేం జరుగుతుందో తెలియదు. అంతా విధి. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటారు కదా!.. ఆ టైపులో ఇందులోని నా క్యారెక్టర్ ఉంటుంది. అప్సర్ 'శివం భజే' కథను రాసుకున్న తీరు, ఐడియాలజీ నాకు నచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు కథను డివైన్ పాయింట్‌కు కనెక్ట్ చేసిన విధానం బాగుంటుంది. నిర్మాత రాజీ పడకుండా ఎక్కువే ఖర్చుపెట్టారు. ఏమన్నా అంటే అంతా శివయ్య చూసుకుంటారు అనేవారు. ఆగస్టు 1న నా బర్త్ డే కాబట్టి ఈ సినిమా రిలీజ్‌ను ప్లాన్ చేయలేదు. మేం ఓ రిలీజ్ డేట్ అనుకున్నాం. సరిగ్గా అది నా బర్త్ డేకి కుదిరింది... అంతే. ఇక 'రాజుగారి గది 4' సినిమా ప్లానింగ్ జరుగుతోంది. మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.

గద్దర్ అవార్డులకు కమిటీ

''దివంగత గాయకుడు గద్దర్ పేరు మీద 'గద్దర్ అవార్డ్స్' ఇవ్వడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ, సినీరంగ ప్రముఖుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా సినిమా రంగానికి చెందిన ప్రముఖులు ముందుకొచ్చి ఈ ప్రతిపాదనను, ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలి'' అంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సోమవారం మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై తాజాగా 'తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి', 'తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి' స్పందించాయి. ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. వాటి సారాంశం ఇలా... ''తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డిగారు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగారు చేస్తున్న కృషికి ధన్యవాదాలు. నటునిగా, కళాకారునిగా, గాయకునిగా కళారంగానికి గద్దర్‌గారు చేసిన సేవలు ఎనలేనివి. ఆయన పట్ల మాకు చాలా గౌరవం ఉంది. ఆయన పేరిట అవార్డులు ఇస్తున్నందుకు గర్వంగా ఉంది. ఈ అవార్డ్స్‌కు సంబంధించిన కమిటీ విషయంపై 'తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్'తో చర్చించాం. త్వరలోనే ఒక కమిటీని నియమించి, విధి విధానాలను రూపొందిస్తాం. వాటిని తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారికి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగారికి అతి త్వరలో అందజేస్తాం'' అని ఆ ప్రకటనల్లో 'తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి', 'తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి పేర్కొన్నాయి.

స్వచ్ఛమైన ప్రేమకథ

''అలనాటి రామచంద్రుడు' నేటి తరం కథ. హానెస్ట్ లవ్ స్టోరీ, మంచి ఫ్యామిలీ డ్రామాతో రూపొందిన ఈ మూవీని అన్ని వర్గాలవారు చూస్తారని నమ్ముతున్నాను'' అన్నారు డైరెక్టర్ చిలుకూరి ఆకాశ్ రెడ్డి. కృష్ణ వంశీ, మోక్ష జంటగా చిలుకూరి ఆకాశ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఆగస్టు 2న రిలీజ్ చేస్తోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో కృష్ణ వంశీ మాట్లాడుతూ– ''ఈ మూవీలో నా పాత్ర పేరు సిద్ధు. తను రామచంద్రుడులాంటి వాడే'' అన్నారు. ''మా 'అలనాటి రామచంద్రుడు' మూవీ 'దిల్' రాజుగారికి నచ్చి రిలీజ్ చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. చాలా మంచి కథ. నేటి తరానికి కావాల్సిన స్వచ్ఛమైన ప్రేమకథని చూపించబోతున్నాం'' అన్నారు శ్రీరామ్ జడపోలు.



• కృష్ణవంశీ, మోక్ష, ఆకాశ్ రెడ్డి

పట్నం పిల్లని పట్టేశారో..



• తేజస్, ఖుష్బూ

తేజస్ కంచర్ల హీరోగా నటిస్తున్న చిత్రం 'ఉరుకు పటేల'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను హీరో అడవి శేష్ రిలీజ్ చేశారు. 'నీకో బంపర్ ఆఫర్... నన్ను పెళ్లి చేసుకో... నీకు లైఫ్ ఇస్తా', 'నిన్ను మాత్రం చేసుకోను నేను' అనే డైలాగ్స్‌తో పాటు 'పట్నం పిల్లని పట్టేశారో...', 'పటేలా పటేలా నీకే సలామ్ కొట్టాలా..' అనే సాంగ్స్ కూడా టీజర్‌లో వినిపిస్తాయి. ఈ సందర్భంగా తేజస్ కంచర్ల మాట్లాడుతూ– ''మంచి కంటెంట్ ఇవ్వాలని కాస్త టైమ్ తీసుకున్నాను. దర్శకుడు వివేక్ చెప్పిన కథ నచ్చింది'' అన్నారు. ''చాలా ఎంజాయ్ చేస్తూ ఈ సినిమాను పూర్తి చేశాం'' అన్నారు దర్శకుడు వివేక్. ''ఇది మా ఫస్ట్ మూవీ. మా అబ్బాయి తేజస్‌తో తీశాను. వివేక్ మంచి కథ ఇచ్చారు'' అన్నారు బాల భాను. ''టీజర్‌లో ఒక్క శాతం మాత్రమే చూపించాం. కథ చాలా ఉంది'' అన్నారు ఖుష్బూ చౌదరి.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. అల్లు శిరీష్‌తో 'ఏబీసీడీ' సినిమా, రాజ్ తరుణ్‌తో 'అహ నా పెళ్లంట' వెబ్ సిరీస్‌కి దర్శకత్వం వహించిన సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'మధుర' శ్రీధర్ రెడ్డి, నిర్వి హరి ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి విక్రాంత్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. ఒక సమకాలీన సమస్యను వినోదాత్మకంగా చూపిస్తూ ఈ సినిమాను రూపొందిస్తున్నారు సంజీవ్'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: మహిరెడ్డి పండుగుల, సంగీతం: సునీల్ కశ్యప్.



• విక్రాంత్

సాక్షి బిజినెస్

గురువారం
1-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
286	94
81,741	24,951

విదేశీ సూచీలు (భారత కాలమానం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,515	▲ 369
డోజోన్స్	40,939	▲ 195
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,368	▲ 94
డాక్స్	18,509	▲ 97
షాంఘై	2,939	▲ 59
నికాయ్	39,102	▲ 576

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	69,309
బంగారం (99.5 స్వచ్ఛత)	69,031
వెండి (కేజీ)	82,974

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.32	84.34
£	బ్రిటన్ పౌండ్		106.45	109.03
€	యూరో		89.60	91.97
¥	జపాన్ ఎన్ (100)		54.25	55.47
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.59	55.52
S$	సింగపూర్ డాలర్		60.32	65.01
SAR	సౌదీ రియాల్		21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్		21.91	23.69
¥	చైనా యువాన్		10.73	12.55

మారుతీ లాభం జూమ్



నికర లాభం రూ. 3,650 కోట్లు • ఎగుమతులు 12% అప్

న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (2024–25, క్యూ1) లో రూ. 3,650 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో నమోదైన రూ. 2,485 కోట్లతో పోలిస్తే 47 శాతం ఎగబాకింది. వ్యయ నియంత్రణలు, తగ్గిన కమోడిటీ ధరలు, విదేశీ మారక ఆర్జన లాభాల్లో వృద్ధికి దోహదపడినట్లు కంపెనీ కార్పొరేట్ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భారతీ పేర్కొన్నారు. అయితే ఒక్కో వాహనంపై డిస్కౌంట్ సగటున రూ. 14,500 నుంచి రూ. 21,700కు పెరిగినట్లు వెల్లడించారు. మొత్తం ఆదాయం సైతం రూ. 30,845 కోట్ల నుంచి రూ. 33,875 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 5 శాతం అధికంగా 5,21,868 వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీ విక్రయాలు 4 శాతం వృద్ధితో 4,51,308 యూనిట్లను తాకాయి. 2025 జనవరిలో ఏర్పాటుకానున్న భారత్ మొబిలిటీ షోలో తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని(ఈవీ) ప్రదర్శించనున్నట్లు రాహుల్ తెలిపారు.

ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు 2.3 శాతం లాభంతో రూ. 13,168 వద్ద ముగిసింది.

మహీంద్రా.. టాప్ గేర్



క్యూ1 లాభం రూ. 3,283 కోట్లు

న్యూఢిల్లీ: దేశీ వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (2024–25, క్యూ1)లో పటిష్ఠ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 20 శాతం ఎగసి రూ. 3,283 కోట్లను తాకింది. గతేడాది (2023–24) ఇదే కాలంలో రూ. 2,745 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 10 శాతం పుంజుకుని రూ. 37,218 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 33,892 కోట్ల టర్నోవర్ అందుకుంది. గత క్యూ1లో కేజీ మొబిలిటీ పెట్టుబడి ద్వారా రూ. 405 కోట్లు, ఎస్‌సీఐఈలో వాటా ద్వారా రూ. 358 కోట్లు చొప్పున వన్‌టైమ్ లాభాలు కలసి ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా కంపెనీ ప్రస్తావించింది. క్యూ1లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 2.12 లక్షల యూనిట్లు విక్రయించినట్లు ఎంఅండ్ఎం ఎండీ, సీఈవో అనిష్ షా పేర్కొన్నారు. ఇది 14% వృద్ధి. యుటిలిటీ విభాగం కొత్త రికార్డ్‌తో 1.24 లక్షల యూనిట్లను తా కింది.

ఎంఅండ్ఎం షేరు 0.5% క్షీణించి రూ. 2,907 వద్ద క్లోజైంది.



భలే మంచి డిపాజిట్ బేరం!

- జోరందుకున్న బ్యాంకుల డిపాజిట్ వేట
- రుణాల జోరు.. డిపాజిట్ల డీలా ఎఫెక్ట్
- అధిక వడ్డీ స్కీమ్‌లతో నిధుల సమీకరణకు సై..
- సీనియర్ సిటిజన్లకు అర శాతం అదనం

గత కొన్నాళ్లుగా బ్యాంకుల రుణ వృద్ధి భారీగా ఎగబాకుతోంది. డిపాజిట్లు మాత్రం ఆ మేరకు పెరగడం లేదు. రెండింటి మధ్య కొంత అంతరం ఉండటం సహజమే కానీ, ఇంత భారీ వ్యత్యాసం ఉండకూడదు. దీనివల్ల బ్యాంకింగ్ రంగంలో వ్యవస్థాగత ద్రవ్య సరఫరా (లిక్విడిటీ) సమస్యలకు దారితీస్తుంది. ప్రజల పొదుపు ధోరణుల్లో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటాయి. దీన్ని అధిగమించేందుకు బ్యాంకులు వెంటనే తగిన వ్యూహాలను అమలు చేయాలి.

– తాజాగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ వ్యక్తం చేసిన ఆందోళన ఇది.

ఈ దెబ్బతో బ్యాంకులు డిపాజిట్ల వేటను ముమ్మరం చేశాయి. ప్రత్యేక స్కీమ్‌ల ద్వారా మరిన్ని రిటైల్ డిపాజిట్ల సమీకరణకు తెరతీస్తున్నాయి. ఇప్పటికే ఉన్న డిపాజిట్ పథకాలతో పోలిస్తే 25–30 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు అంటే 1 శాతం) అధిక వడ్డీని కూడా ఆఫర్ చేస్తూ డిపాజిటర్లకు గాలం వేస్తున్నాయి. తాజా పరిణామాలతో, రుణాలపై అధిక వడ్డీరేట్ల భారం మరికొన్నాళ్లు కొనసాగుందని స్పష్టమవుతోంది. డిపాజిట్ల పెంపునకు తక్షణం చర్యలు చేపట్టాలంటూ బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించిన తర్వాత ప్రభుత్వ రంగ బ్యాంకులు పోలోమంటూ కొత్త పథకాలను ప్రకటించాయి. ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), యూనియన్ బ్యాంక్, అలాగే బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఈ రేసులో ముందున్నాయి. 7.25 శాతం నుంచి 7.3 శాతం మేర వడ్డీరేట్లతో డిపాజిట్ స్కీమ్‌లను ప్రకటించాయి. వీటి కాలవ్యవధి 399 రోజుల నుంచి 444 రోజుల వరకు ఉంటోంది. ఐఓబీ అత్యధికంగా 444 రోజుల డిపాజిట్ స్కీమ్‌పై 7.3 శాతం వడ్డీ ఇస్తోంది. అంతేకాకుండా బ్యాంకులన్నీ సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో అర శాతం వడ్డీని కూడా అందిస్తుండటంతో డిపాజిటర్లకు మేలు చేకూరుతోంది. '4% స్థాయికి ద్రవ్యోల్బణం శాంతిస్తే, ఆర్‌బీఐ రేట్ల కోత మొదలవుతుంది. అప్పుడు డిపాజిట్లపై అధిక రేట్ల వల్ల బ్యాంకుల వ్యయాలు పెరిగిపోతాయి. అందుకే బ్యాంకులు స్వల్పకాలిక డిపాజిట్లకే అధిక వడ్డీని పరిమితం చేస్తున్నాయి' అని ఇక్రా రేటింగ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ గుప్తా అభిప్రాయపడ్డారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

20 ఏళ్లలో తొలిసారి...

ఈ ఏడాది జూలై 12 నాటికి బ్యాంకుల డిపాజిట్ల వృద్ధి 11 శాతానికి పరిమితమైంది. అయితే, రుణ వృద్ధి మాత్రం 14 పైగా శాతంగా నమోదైంది. దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో రుణ, డిపాజిట్ వృద్ధిలో ఇంత తేడా రావడం గడిచిన 20 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. దీంతో ఈ అంతరాన్ని తగ్గించాల్సిందేనని బ్యాంకు సీఈఓలకు ఆర్‌బీఐ స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో భారత్ కూడా అందుకు మినహాయింపు కాదని, పాలసీ వడ్డీ రేట్ల కోత గురించి ఆలోచించడం తొందరపాటేనంటూ గవర్నర్ శక్తికాంత్ దాస్ తాజాగా పేర్కొనడం విశేషం. కాగా, ప్రస్తుత వడ్డీ రేట్లతో రిటైల్ డిపాజిట్ల సమీకరణ బ్యాంకులకు కష్టతరంగా మారిందని, అందుకే పరిమిత కాల స్కీమ్‌లను ప్రారంభించాల్సి వస్తోందని ఓ వాణిజ్య బ్యాంకు ట్రెజరీ హెడ్ పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

గ్రామాల్లో బ్యాంక్ సేవలు విస్తరించాలి	బ్యాంక్ ఆఫ్ బరోడా లాభం రూ. 4,728 కోట్లు

ప్రత్యేక డిపాజిట్ ఆఫర్స్...
ఎస్‌బీఐ- అమృత్ వృష్టి: వడ్డీ రేటు 7.25% (కాల వ్యవధి 444 రోజులు)
బ్యాంక్ ఆఫ్ బరోడా – మాన్సూన్ ధమాకా: 7.25% (399 రోజులు)
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర: 7.15% (666 రోజులు)
యూనియన్ బ్యాంక్: 7.25% (399 రోజులు)
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్: 7.3% (444 రోజులు)



తగ్గిన ఇన్‌ఫ్రా జోరు

జూన్‌లో వృద్ధి 4 శాతానికి పరిమితం

న్యూఢిల్లీ: ఎనిమిది రంగాలతో కూడిన కీలక మౌలిక పరిశ్రమ గ్రూప్ జూన్‌లో తీవ్ర నిరాశ కలిగించింది. గడచిన 20 నెలల్లో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయిలో కేవలం 4 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది. క్రూడాయిల్, రిఫైనరీ ప్రొడక్టుల పేలవ పనితీరు దీనికి ఒక కారణం. 2024 మేలో ఈ గ్రూప్ వృద్ధి రేటు 6.4 శాతం అయితే, 2023 జూన్‌లో వృద్ధి రేటు 8.4 శాతం.



మూడు నెలల్లో పురోగతి 5.7 శాతం...

కాగా, ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో గ్రూప్ వృద్ధి రేటు 5.7 శాతం. గత ఏడాది ఇదే కాలంలో ఈ స్పీడ్ 6 శాతం. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఎనిమిది రంగాల వాటా దాదాపు 40 శాతం. ఆగస్టు తొలి పక్షం రోజుల్లో జూన్ ఐఐపీ గణాంకాలు వెలువడనున్నాయి.

నాలుగోరోజూ లాభాలే

సెన్సెక్స్ లాభం 286 పాయింట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభాలతో ముగిశాయి. మెటల్, ఆటో, విద్యుత్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 286 పాయింట్లు పెరిగి 81,741 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్లు బలపడి 24,951 వద్ద నిలిచింది. మారుతీ సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ షేర్లు 2% నుంచి 1% రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 372 పాయింట్లు బలపడి 81,828 వద్ద, నిఫ్టీ 127 పాయింట్లు ఎగసి 24,969 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు ఇంట్రాడేలో జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. ఫెడ్‌తో సహా బీఓజే, బీఓఈలు సరళతర ద్రవ్య విధాన వైఖరికి మొగ్గుచూపొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.



టాటా స్టీల్ లాభం అప్..


క్యూ1లో రూ. 919 కోట్లు: 75% వృద్ధి

న్యూఢిల్లీ: వ్యయాలను గణనీయంగా తగ్గించుకోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. క్యూ1లో నికర లాభం (కన్సాలిడేటెడ్) ఏకంగా 75 శాతం ఎగసి రూ. 919 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఇది రూ. 525 కోట్లు. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 60,666 కోట్ల నుంచి రూ. 55,031 కోట్లకు తగ్గింది. అటు వ్యయాలు కూడా రూ. 58,553 కోట్ల నుంచి రూ. 52,389 కోట్లకు దిగి వచ్చాయి. మరోవైపు టీపీ పరివర్త్ సంస్థలో 26 శాతం వాటాల కొనుగోలు ప్రతిపాదనకు టాటా స్టీల్ బోర్డు ఆమోదముద్ర వేసింది. అటు ఈ ఆర్థిక సంవత్సరంలో నీలాచల్ ఇస్పాత్ నిగమ్ (ఎన్ఐఎన్ఎల్)కు రూ. 6,000 కోట్ల వరకు నిధులు సమకూర్చే ప్రతిపాదనను కూడా బోర్డు ఆమోదించింది.



ఇన్ఫీకి రూ.32,403 కోట్ల జీఎస్‌టీ ఎగవేత నోటీస్

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు భారీ పన్ను ఎగవేతకు సంబంధించి 'ప్రీ షో కాజ్' నోటీసులు అందాయి. దాదాపు రూ. 32,403 కోట్ల మేర వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ఎగవేతకు పాల్పడిందన్న ఆరోపణలపై ఈ నోటీసులు అందుకున్నట్లు బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ ఒక బీఎస్‌ఈ ఫైలింగ్‌లో పేర్కొంది. 2017 నుంచి 2022 మార్చి మధ్య ఇన్ఫోసిస్ విదేశీ బ్రాంచ్ ఆఫీస్‌లు చేసిన వ్యయాలకు ఈ పన్ను చెల్లించాలన్నది డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటిలిజెన్స్ నోటీసుల ప్రధాన సారాంశం .ఈ నోటీసుకు ప్రతిస్పందన సమర్పించనున్నట్లు సంస్థ తెలిపింది. నిబంధనల ప్రకారం, అటువంటి వ్యయాలకు జీఎస్‌టీ వర్తించదని కంపెనీ విశ్వసిస్తోంది. తాజా వార్తలతో అమెరికా మార్కెట్‌లో ఇన్ఫోసిస్ ఏడీఆర్ 2.5% తగ్గి 22 డాలర్లకు చేరింది.



భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పదితో తపాలశాఖలో కొలువు



- 44,228 జీడీఎస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది. దేశవ్యాప్తంగా 44,228 జీడీఎస్ పోస్టులను భర్తీ చేస్తారు ఎటువంటి రాత పరీక్ష లేకుండానే పదో తరగతిలో సాధించిన మెరిట్ మార్కులతో పోస్టల్ శాఖలో కొలువు సొంతం చేసుకోవచ్చు. ఎంపికైన వారు బ్రాంచ్ పోస్టు మాస్టర్(బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్(ఏబీపీఎం) హోదాలతో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 44,228 (ఆంధ్రప్రదేశ్-1355, తెలంగాణలో 981 ఖాళీలు)

అర్హత

పదోతరగతి ఉత్తీర్ణత ఉండాలి. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష తప్పనిసరిగా ఉండాలి. ఏపీ, తెలంగాణకు చెందినవారు తెలుగు సబ్జెక్టు పదోతరగతి వరకు చదవాలి. కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు సైకిల్ తొక్కడం వచ్చి ఉండాలి.

వయసు

జీడీఎస్ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు 18–40 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ట సడలింపు లభిస్తుంది.

ఎంపిక ఇలా

అభ్యర్థులు పదోతరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఖాళీలున్న బ్రాంచ్‌లు, రిజర్వ్‌డ్/అన్ రిజర్వ్‌డ్ తదితర వివరాలు పేర్కొన్నారు. అభ్యర్థులు వాటిని పరిశీలించి, తమ ప్రాధాన్యం ప్రకారం ఆప్షన్లు ఇవ్వాలి. మొదటి ప్రాధాన్యానికి ఆప్షన్-1, ఆ తర్వాత దానికి ఆప్షన్-2.. ఇలా నింపాలి. అవకాశాన్ని బట్టి వీటిలో ఏదో ఒకచోట పోస్టింగ్ కేటాయిస్తారు.

వేతనాలు

బ్రాంచ్ పోస్టు మాస్టర్(బీపీఎం)పోస్టులకు ఎంపికైన వారికి నెలకు రూ.12,000–రూ.29,380 వేతనం అందుతుంది. అలాగే అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్/డాక్ సేవక్‌గా నియమితులైన వారికి నెలకు రూ.10,000–రూ.24,470 వేతనం లభిస్తుంది.

వీటితో పాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన సేవలకు ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలోప్రోత్సాహకం అందిస్తారు. స్వల్పమొత్తంలో హెచ్‌ఆర్‌ఏ కూడా దక్కుతుంది.

విధులు ఇలా

- బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం): వీరు బ్రాంచ్ కార్యకలపాలను పర్యవేక్షించాలి. పోస్టల్ విధుల తోపాటు ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు వ్యవహారాలూ చూసుకోవాలి. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ లావాదేవీలు, రోజువారీ కార్యకలాపాలు సజావుగా సాగేలా ఉత్తరాల పంపిణీ జరిగేలా పర్యవేక్షించాలి.
- అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్(ఏబీపీఎం): ఈ పోస్టులకు ఎంపికైన వారు స్టాంపులు/స్టేషనరీ అమ్మకం, ఉత్తరాలు పంపిణీ, ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన డిపాజిట్లు, పేమెంట్లు, పోస్టల్‌కు సంబంధించిన ఇతర వ్యవహారాలు చక్కబెట్టాలి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 2024, ఆగస్టు 05
- దరఖాస్తు సవరణ తేదీలు: 2024, ఆగస్టు 6–8 వరకు;
- వెబ్‌సైట్: https://indiapostgdsonline.gov.in

మేనేజ్‌మెంట్ పీజీ వయా ఎక్స్‌ఏటీ

» జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్–2025 నోటిఫికేషన్ విడుదల
» ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ అనుబంధ ఇన్‌స్టిట్యూట్స్‌లో మేనేజ్‌మెంట్ పీజీ
» మరో 250కు పైగా బి-స్కూల్స్‌కు ప్రామాణికంగా ఎక్స్‌ఏటీ స్కోర్

ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీఏలో చేరేందుకు ఏటా లక్షల మంది ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమవుతుంటారు. ఐఐఎంల్లో అడ్మిషన్స్ కోసం నిర్వహించే క్యాట్ తర్వాత.. ఆ స్థాయి పరీక్షగా నిలుస్తోంది జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ)!! తాజాగా 2025 సంవత్సరానికిగాను ఎక్స్‌ఏటీ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఎక్స్‌ఏటీతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ.. జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తోంది. ఎక్స్‌ఏటీ స్కోర్‌ను జాతీయ స్థాయిలో 250కు పైగా బీ స్కూల్స్ మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

అర్హతలు

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. కోర్సు చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐలో ప్రవేశం పొందాలనుకునే వారు జూన్ 12, 2025లోపు సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ పరీక్ష

ఎక్స్‌ఏటీ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. రెండు విభాగాలుగా (పార్ట్–1, పార్ట్–2) పరీక్ష ఉంటుంది. పార్ట్–1లో డెసిషన్ మేకింగ్, వెర్బల్ అండ్ లాజికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్; పార్ట్–2లో జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పార్ట్–3 పేరుతో ఎస్సే రైటింగ్ కూడా ఉంటుంది. మొత్తం 105 ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షకు లభించే సమయం మూడు గంటల పది నిమిషాలు. వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి గరిష్ఠంగా 26 ప్రశ్నలు; డెసిషన్ మేకింగ్ నుంచి గరిష్ఠంగా 22 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి గరిష్ఠంగా 28 ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పార్ట్–1లో నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ఎస్సే రైటింగ్‌లో ఏదైనా ఒక అంశంపై 250 పదాల్లో వ్యాసం రాయాల్సి ఉంటుంది.

మలి దశలో జీడీ/పీఐ

ఎక్స్‌ఏటీ స్కోర్ ఆధారంగా ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అనుబంధ ఇన్‌స్టిట్యూట్స్ అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి.. మలిదశలో గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశం కల్పిస్తున్నాయి.

రాత పరీక్షకు సన్నద్ధత ఇలా

వెర్బల్ అండ్ లాజికల్ ఎబిలిటీ

వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ ఎబిలిటీ.. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు ఉండే విభాగమిది. ఇందులో నిర్దేశిత ప్యాసేజ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నల్లో అధిక శాతం ప్యాసేజ్ సారాంశం అర్థమైతేనే సమాధానం ఇవ్వగలిగేవిగా ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు స్పీడ్ రీడింగ్ అలవాటుతోపాటు ఒక అంశాన్ని చదువుతున్నప్పుడే అందులో కీలకాంశాలను గుర్తించే విధంగా నైపుణ్యం సొంతం చేసుకోవాలి. పంక్చుయేషన్స్ నుంచి ప్యాసేజ్ మెయిన్ కాన్సెప్ట్ వరకూ.. అన్నింటిపై అవగాహన పెంచుకోవాలి. అర్థాలు, సమానార్థాలు, ఫ్రేజెస్, వర్డ్ యూసేజ్, సెంటెన్స్ ఫార్మేషన్ అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. వీటితో పాటు వొకాబ్యులరీపైనా పట్టు సాధించాలి. ఫలితంగా ఆయా ప్యాసేజ్‌లలో వినియోగించిన పదజాలాన్ని వేగంగా అర్థం చేసుకుని.. నిర్దేశిత సమయంలో సమాధానాలిచ్చే నైపుణ్యం లభిస్తుంది.

డేటా ఇంటర్‌ప్రిటేషన్

డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి. డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో అధిక శాతం ప్రశ్నలు అభ్యర్థులు స్వీయ విశ్లేషణ, సూక్ష్మ పరిశీలన ఆధారంగా సమాధానం రాబట్టేవిగా ఉంటాయి. అంటే.. గ్రాఫ్‌లు, చార్ట్‌లలో ఇచ్చిన దత్తాంశాలపై నేరుగా ప్రశ్నలు అడగకుండా.. సంబంధిత కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని సమాధానం గుర్తించేలా ప్రశ్నలు ఉంటాయి. పర్సంటేజీ, యావరేజెస్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం ఏదైనా స్టాండర్డ్ మెటీరియల్ లేదా ఆన్‌లైన్ టెస్ట్‌లోని ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇక్కడ కేవలం ఒకే తరహా ప్రశ్నలు కాకుండా.. విభిన్న క్లిష్టతతో కూడిన సమస్యలను సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

క్వాంటిటేటివ్ ఎబిలిటీ

మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ అంశాలతో ఉండే విభాగం ఇది. ఇందులో రాణించడానికి వేగం ముఖ్యం. కాబట్టి కాలిక్యులేషన్స్ వేగంగా చేయగలిగే నేర్పు సొంతం చేసుకోవాలి. నాన్–మ్యాథ్స్ అభ్యర్థులు ప్రాబబిలిటీ అండ్ పెర్ముటేషన్స్/ కాంబినేషన్స్, నెంబర్స్, అల్‌జీబ్రా, జామెట్రీ విభాగాలపై దృష్టి పెట్టాలి. వీటికి సంబంధించిన బేసిక్ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. ప్రస్తుత సమయంలో సబ్జెక్ట్ ప్రిపరేషన్‌తోపాటు ఆయా సెక్షన్లలో ప్రీవియస్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ నాలెడ్జ్

ఈ విభాగానికి జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి సమకాలీనంగా ప్రాధాన్యం సంతరించుకున్న అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించిన తాజా పరిణామాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

జీడీ/పీఐ

ఎక్స్‌ఏటీ స్కోర్ ఆధారంగా మలి దశ ఎంపిక ప్రక్రియలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్ కోసం అభ్యర్థులు కోర్ నుంచి కాంటెంపరరీ వరకు.. పలు అంశాలపై పట్టు సాధించాలి. గ్రూప్ డిస్కషన్‌లో ప్రతిభ ఆధారంగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. సదరు విద్యార్థికి మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న వాస్తవ ఆసక్తి, అతని భవిష్యత్తు లక్ష్యాలు, వాటిని అందుకునేందుకు ఎంపిక చేసుకున్న మార్గాలు తదితర అంశాలను ఇంటర్వ్యూలో పరిశీలిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, నవంబర్ 30
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: 2024, డిసెంబర్ 20 నుంచి
- ఎక్స్‌ఏటీ తేదీ: 2025, జనవరి 5
- వెబ్‌సైట్: https://xatonline.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఫిషరీస్ యూనివర్శిటీలో బీఎఫ్ఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్శిటీ, క్యాంప్ ఆఫీస్ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 100 సీట్లు.
» కాలేజ్, సీట్ల వివరాలు:
1. కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్, ముత్తుకూరు(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా)–40 సీట్లు.
2. కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్, నరసాపురం(పశ్చిమ గోదావరి జిల్లా)–60 సీట్లు.
» కోర్సు వ్యవధి: నాలుగేళ్లు(8 సెమిస్టర్లు).
» బోధనా మాధ్యమం: ఇంగ్లిష్.
» అర్హత: ఇంటర్మీడియట్(ఫిజికల్ సైన్సెస్/బయాలాజికల్ లేదా నేచురల్ సైన్సెస్) ఉత్తీర్ణతతో పాటు ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ సాధించి ఉండాలి.
» వయసు: 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 24.07.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 07.08.2024.
» ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది: 09.08.2024.
» వెబ్‌సైట్: https://apfu.ap.gov.in

ఆర్మీ నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ దేశవ్యాప్తంగా ఉన్న ఐదు కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆఫ్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల బీఎస్సీ(నర్సింగ్) కోర్సులో అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 220.

ఏఎఫ్ఎంఎస్ సీట్లు

కాలేజ్ ఆఫ్ నర్సింగ్, పుణె–40, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, కోల్‌కతా–30, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ముంబై–40, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, లక్నో–40, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, బెంగళూరు–40.

అర్హత

అవివాహిత/విడాకులు తీసుకున్న/చట్టబద్ధంగా విడిపోయిన/వితంతువులైన మహిళా అభ్యర్థులు అర్హులు. కనీసం 50 శాతం మార్కులు సీనియర్ సెకండరీ పరీక్ష 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ,ఇంగ్లిష్). నీట్(యూజీ)2024లో అర్హత సాధించి ఉండాలి. కనిష్ఠ ఎత్తు 152 సెం.మీ. కలిగి ఉండాలి.

» వయసు: 01.10.1999 నుంచి 30.09.2007 మధ్య జన్మించిన వారై ఉండాలి.
» ఎంపిక విధానం: నీట్ 2024 స్కోరు, జనరల్ ఇంటెలిజెన్స్/జనరల్ ఇంగ్లిష్ టెస్ట్, సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 07, 2024
» వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in



మసాలా దోశ.. ఇడ్లీ.. వడ

- వెజ్ ఆర్డర్లలో మూడో స్థానంలో హైదరాబాద్
- ఎక్కువగా మసాలా దోశ, ఇడ్లీ, వడ ఆర్డర్లు
- మొదటి రెండు స్థానాల్లో బెంగళూరు, ముంబై

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌వాసులు ఆహార ప్రియులన్నది తెలిసిందే. ఇప్పటికే బిర్యానీలో మనమే అగ్రస్థానంలో ఉన్నాం.. ఇప్పుడు వెజ్ ఆర్డర్లలో మూడో స్థానంలో హైదరాబాద్ నిలిచింది. ఇటీవల స్విగ్గీ గ్రీన్ డాట్ ప్రకటించిన అవార్డుల్లో ఈ విషయం వెల్లడైంది. హైదరాబాద్ వాసులు ఎక్కువగా మసాలా దోశ, ఇడ్లీ, వడ ఆర్డర్ ఇస్తున్నట్టు ఆ సంస్థ తేల్చింది. మొదటి రెండు స్థానాల్లో బెంగళూరు, ముంబై ఉండటం విశేషం.


బెంగళూరు టాప్..

దేశంలో స్విగ్గీకి వస్తున్న ప్రతి మూడు వెజిటేరియన్ ఆర్డర్లలో ఒకటి బెంగళూరు నుంచే వస్తోందట. మసాలా దోశ, పనీర్ బిర్యానీ, పనీర్ బటర్ మసాలా ఎక్కువగా ఆర్డర్ చేస్తున్నారు. ఇక ముంబై నుంచి దాల్ కిచిడీ, మార్గరేట్ పిజ్జా, పావ్ బాజీ ముందు వరుసలో ఉండటం విశేషం.

స్విగ్గీ ఆర్డర్లలో అవే ముందు..

ఇటీవల స్విగ్గీ గ్రీన్ డాట్ అవార్డుల పేరిట రెస్టారెంట్లకు అవార్డులు ప్రకటించింది. దేశంలో రుచికరమైన శాఖాహారం అందిస్తున్న రెస్టారెంట్లకు ఈ అవార్డులను అందజేస్తోంది. దేశంలో ఆర్డర్ చేస్తున్న 10 ఆహార పదార్థాల్లో 6 శాఖాహారమేనని గుర్తించింది. ఉదయం అల్పాహారం కోసం చేస్తున్న ఆర్డర్లలో 90 శాతం శాఖాహారమేనట. అందులోనూ హైదరాబాద్ వాసులు మసాలాదోశ, ఇడ్లీ, వడనే భారీగా ఆర్డర్ ఇస్తున్నారని తేలింది.

టుడేస్ గ్రాఫిక్



నేడు మీర్‌ఖాన్‌పేటకు సీఎం రేవంత్‌రెడ్డి

- స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతోపాటు పలు భవన నిర్మాణాలకు శంకుస్థాపన
- సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలో ప్రసంగం

కందుకూరు: రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. అధికారులు, నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ శశాంక బుధవారం సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. నెట్ జీరో సిటీలో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, రైతులకు ప్లాట్లు కేటాయించనున్న లేఅవుట్‌లో అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాల్ భవనాల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమాల అనంతరం సాయంత్రం 4 గంటలకు అక్కడే నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఏర్పాట్లు పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట టీజీఐఐసీ ఈడీ పవన్, ఆర్డీఓ సూరజ్‌కుమార్, డీఈఓ సుశీంధర్‌రావు, తహసీల్దార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తుండగా గుండెపోటు

సీపీఆర్ చేసి కాపాడిన హెల్త్ అసిస్టెంట్




పెనుబల్లి: ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కింద పడిపోగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం లంకాసాగర్ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ సత్తెనపల్లి రవికుమార్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గాదం ఏసుబాబు తన బైక్‌పై బుధవారం ఉదయం వీఎం బంజర్ వైపు వెళ్తుండగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో అక్కడ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న లంకాసాగర్ హెల్త్ అసిస్టెంట్ సత్తెనపల్లి రవికుమార్ వెంటనే స్పందించి ఏసుబాబుకు సీపీఆర్ చేస్తుండగా గ్రామస్తుడు మద్దెల చంటి నోటి ద్వారా శ్వాస అందించాడు. దీంతో ఏసుబాబు ఊపిరి పీల్చుకోగా వెంటనే అతడిని పెనుబల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా రవికుమార్‌తో పాటు పంచాయతీ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

గ్రామీణ బ్యాంకుల్లో నిలిచిన సేవలు

ఖమ్మం గాంధీచౌక్: రెండు తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ బ్యాంకుల్లో మూడు రోజులుగా పలు రకాల సేవలు నిలిచిపోయాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ), తెలంగాణ గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల్లో సోమవారం నుంచి నగదు బదిలీ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఆయా బ్యాంకులకు సంబంధించి బ్రాంచ్‌లలో ఆన్‌లైన్ సేవలు పనిచేస్తున్నా.. ఆ బ్యాంకుల నుంచి ఇతర బ్యాంకులకు నగదు బదిలీ నిలిచిపోయింది. ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్), నెఫ్ట్ (నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్), ఫోన్‌పే వంటి సేవలకు అంతరాయం ఏర్పడటంతో గ్రామీణ బ్యాంకుల నుంచి వాణిజ్య బ్యాంకులకు నిధుల బదలాయింపు సాధ్యం కావడం లేదు. ముంబైలోని సర్వర్‌లో సమస్యే దీనికి కారణమని అధికారులు చెబుతున్నారు. మూడు రోజులుగా వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు.

అనుకున్న స్థాయికి ఎదగలేదని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



పటాన్‌చెరు టౌన్: ఉద్యోగంలో అనుకున్న స్థాయికి ఎదగలేకపోతున్నానని మనస్తాపం చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలివి. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బరిదీపూర్‌కు చెందిన మేకల విక్రం (23) రాయదుర్గంలో ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. మరో స్నేహితుడితో కలసి ఆర్సీ క్రాస్ రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్లాడు. మధ్యలో పటాన్‌చెరులోని ఇస్నాపూర్‌లో ఉంటున్న తన బాబాయ్ వద్దకు వెళుతున్నానని స్నేహితులకు చెప్పాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో స్నేహితుడి సమాచారంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విక్రం కోసం గాలిస్తుండగా ముత్తంగి వద్ద ఓ చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అతనికి ఉరే సరి: హైకోర్టు

ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య కేసు ● దారుణానికి ఒడిగట్టిన వ్యక్తికి ఉరిశిక్ష ఖరారు

- రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు
- 2017లో చాక్లెట్ ఇప్పిస్తానని తీసుకెళ్లి చిన్నారిపై హత్యాచారం చేసిన దినేశ్

సాక్షి, హైదరాబాద్: ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య కేసులో రంగారెడ్డి జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. అత్యంత పాశవికంగా చిన్నారిపై దారుణానికి ఒడిగట్టిన దినేశ్‌కు ఉరిశిక్షే సబబని చెప్పింది. రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన ఈ కేసులో నిందితుడు దినేశ్‌కుమార్‌ను రంగారెడ్డి జిల్లా కోర్టు 2021లో దోషిగా తేల్చింది. ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. దీనిపై దినేశ్ హైకోర్టులో సవాల్ చేయగా, ట్రయల్ కోర్టు నిర్ణయం సబబేనంటూ.. ఉరిశిక్షను ఖరారు చేస్తూ బుధవారం హైకోర్టు తీర్పునిచ్చింది. అప్పీల్‌ను కొట్టివేస్తూ ట్రయల్ కోర్టు నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడం లేదంది. ఇలాంటి కేసుల్లో నిందితులకు సత్వరం శిక్షలు పడితేనే.. బాధితులకు కొంతైనా న్యాయం జరుగుతుందని చెప్పింది. దినేశ్ అప్పీల్‌పై జస్టిస్ శామ్ కోషి, జస్టిస్ సాంబశివరావు నాయుడు విచారణ చేపట్టారు.



దినేశ్

కేసు పూర్వాపరాలు...

హైదరాబాద్‌లోని అల్కాపురి టౌన్‌షిప్‌లో ఒడిశాకు చెందిన భార్యభర్తలు పనిచేసేవారు. మధ్యప్రదేశ్‌కు చెందిన దినేశ్ అక్కడే సెంట్రింగ్ పనిచేసేవాడు. ఒడిశా దంపతులతో కలిసిమెలిసి ఉండేవాడు. 2017, డిసెంబర్ 12న ఇంటి ముందు ఒంటరిగా ఆడుకుంటున్న వారి ఐదేళ్ల కుమార్తెకు చాక్లెట్ల ఆశ చూపి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లాడు. అత్యాచారానికి పాల్పడటమే కాకుండా బండరాయితో మోది హత్య చేశాడు.

నేరం అంగీకరించిన నిందితుడు

చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు.. చిన్నారి చివరిసారిగా దినేశ్‌తో కనిపించిందనే ఆధారంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి దుస్తులకు అంటుకున్న గునుగు పూలను గమనించి అతడే నేరం చేశాడని నిర్ధారణకు వచ్చారు. దినేశ్‌ను అరెస్ట్ చేశారు. కిడ్నాప్, అత్యాచారం, హత్యతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. కేసులో వేగంగా విచారణ చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోర్టు 2021, ఫిబ్రవరిలో దినేశ్‌ను దోషిగా నిర్ధారిస్తూ మరణ శిక్ష విధించింది.

తలారి లేదు.. ఉరి కంబమూ లేదు..

రాష్ట్రంలోని జైళ్లలో ఎక్కడా నేరస్తులకు ఉరి శిక్ష అమలు చేసేందుకు తలారి లేడు.. కంబమూ లేదు. రాష్ట్ర పరిధిలో ఉరిశిక్ష అమలు జరిగి దాదాపు నాలుగు దశాబ్దాలకు పైనే అయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోని ముషీరాబాద్, రాజమండ్రి జైళ్లలో ఉరి తీసేందుకు వీలు ఉండేది. అయితే ముషీరాబాద్ జైలు తీసేసిన తర్వాత ఉరి అమలు చేసే వీలు లేకుండాపోయింది. చర్లపల్లిలో స్థలం ఉన్నా.. నిర్మాణం చేపట్టలేదు. అలాగే తలారి కావాల్సి వస్తే ఇతర ప్రాంతాల నుంచో లేదా ఇక్కడే ఎవరన్నా ముందుకొస్తే వారికి శిక్షణ ఇప్పించో అమలు చేయాల్సిన పరిస్థితి. దినేశ్‌కు హైకోర్టు ఉరి శిక్ష ఖరారు చేసిన నేపథ్యంలో ఇది చర్చనీయాంశంగా మారింది.

> ‘అమానుషమైన దారుణాలకు పాల్పడితే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందో.. ఇలాంటి మరణ శిక్షల ద్వారా తెలియజేయాలి. అయితే, మరణశిక్షపై భిన్నాభిప్రాయాలున్నాయి. మరణశిక్షకు బదులుగా మారేందుకు అవకాశం ఇచ్చేలా జీవిత ఖైదు విధిస్తే సరిపోతుందని కొందరు అభిప్రాయపడుతుంటారు. ఇలాంటి వారు బాధితురాలి తల్లిదండ్రుల పరిస్థితిని కూడా అర్థం చేసుకోవాలి. తమ ఐదేళ్ల కుమార్తె తప్పిపోయిన తర్వాత బాధితురాలి తల్లిదండ్రులు మొదటిసారిగా ఆమె మృతదేహాన్ని చూసినప్పుడు, ఆమె ప్రైవేట్ భాగాలపై గాయాలతో నగ్నంగా పడి ఉండటాన్ని చూసినప్పుడు ఎంత విలవిలలాడిపోయారో ఎవరికీ తెలియదు. చిన్నారి తలపై బండరాళ్లతో కొట్టారు. నేరం జరిగిన ఏడేళ్ల తర్వాత కూడా ఆ దృశ్యం తల్లిదండ్రుల మదిలో మెదులుతూనే ఉంటుంది’
> –హైకోర్టు ధర్మాసనం



నడిచొచ్చిన న్యాయం

ఆదిలాబాద్ టౌన్: ఏదైనా కేసులో ఎవరైనా కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సిందే. కానీ నడవలేని స్థితిలో ఉన్న బాధితుల వద్దకు ఏకంగా జడ్జి వచ్చి సాక్ష్యం నమోదు చేసుకుని ప్రత్యేకత చాటుకున్నారు. ఆమె ఆదిలాబాద్ పీసీఆర్ కోర్టు జడ్జి దుర్గారాణి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం జామిడి గ్రామానికి చెందిన మునేశ్వర్ రాంబాయి, భగత్ సులోచనలు 2017లో తలమడుగు పోలీసు స్టేషన్‌లో కె.ఊశన్న, అయిండ్ల సక్కుబాయిపై ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా జడ్జి ఇద్దరు సాక్షులను కోర్టుకు పిలిచారు. వారు నడవలేని స్థితిలో ఉండడంతో న్యాయస్థానం వరకు ఆటోలో వచ్చారు. ఈ క్రమంలో జడ్జి స్వయంగా కోర్టు ఆవరణలోని ఆటో వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. కోర్టు ప్రాంగణంలో ఏపీపీ నవీన్, న్యాయవాది అమరేందర్ రెడ్డి సమక్షంలో బాధితుల సాక్ష్యాన్ని నమోదు చేసినట్లు లైజన్ అధికారి ఎ.గంగాసింగ్ తెలిపారు.



కాలినడకన వాగు దాటి వైద్యం

గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న మామిడిగూడెం గొత్తికోయగూడెం వాసులు జ్వరాల బారిన పడటంతో వాగులు వంకలు దాటుకుని మరీ వెళ్లి వైద్యమందించారు స్థానిక వైద్యాధికారులు. గొత్తికోయగూడెంలో 15 కుటుంబాలు నివాసముండగా అక్కడ జ్వరాలతో బాధపడుతున్నట్లు స్థానిక డాక్టర్ చంద్రకాంత్ తెలుసుకుని వారికి వైద్యం అందించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాలతో పీడీఎంఓ డాక్టర్ అనూష, ఇతర వైద్య సిబ్బంది కలసి...కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేని పరిస్థితుల్లో కూడా ఉధృతంగా ప్రవహిస్తున్న వట్టివాగును దాటుకుంటూ 14కి.మీ కాలినడకన వెళ్లి అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం గూడెంలో ఇంటింటికీ సర్వే చేసి 25 మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఓ భూపాలరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ జంపయ్య, ఆశావర్కర్ సమత పాల్గొన్నారు.



ఎడ్లబండి లాగుతూ.. మాస్టారుకు వీడ్కోలు

దుగ్గొండి: చక్కగా బోధించారు. క్రమశిక్షణ నేర్పారు.. విద్యార్థులకు భవిష్యత్ నిర్దేశకుడిగా పేరు తెచ్చుకున్నారు. దీంతో పదవీ విరమణ సందర్భంగా ఆ టీచర్‌పై ఉన్న మమకారానికి గుర్తుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడిని, ఆయన సతీమణిని ఎడ్లబండిపై ఊరేగించి అభిమానాన్ని చాటుకున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అనుమాండ్ల జనార్దన్ 36 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేసి బుధవారం పదవీ విరమణ చేశారు. దీంతో పాఠశాలలో ఈ మేరకు వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రేమానుబంధాన్ని చూసి జనార్దన్ దంపతులు కన్నీరు పెట్టుకున్నారు.

ఆస్పత్రి బోర్డుకు మేక కళేబరం

వెటర్నరీ సేవలు అందకపోవడంపై ఓ కాపరి నిరసన



బోర్డుకు వేలాడుతున్న మేక కళేబరం

ధారూరు: వైద్యం అందక తన మేక చనిపోయిందని మనస్తాపానికి గురైన ఓ కాపరి పశువైద్యశాల భవనానికి ఉన్న బోర్డుకు మూగజీవి కళేబరాన్ని వేలాడదీసి నిరసన తెలిపాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా ధారూరు మండలం నాగారంలో జరిగింది. అల్లీపూర్ దశరథ బుధవారం వైద్యం కోసం తన మేకను వెటర్నరీ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అక్కడ ఎవరూ లేకపోవడంతో.. చికిత్స అందక అది మృతి చెందింది. ఈ దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు డాక్టర్ లేడు, కాంపౌండర్ రాడంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇలా ఇప్పటి వరకు 35 మేకలు చనిపోయాయని వారు తెలిపారు. మేక కళేబరం వేలాడదీసిన వీడియో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు తరిగోపుల గ్రామం నుంచి గోపాల మిత్రను పంపించారు. గ్రామంలో పశువైద్యశాల ఉన్నా, వైద్యుడు, సిబ్బంది లేరు. ఔట్‌సోర్సింగ్‌లో కాంపౌండర్ రజనీబాయి డ్యూటీ చేస్తున్నా.. ఆమె తన స్థానంలో భర్తను విధులకు పంపిస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం

నేను సిద్దులూరు నుంచి బదిలీపై వచ్చా. మంగళవారం విధుల్లో చేరా. బుధవారం సిద్దులూర్‌లో మరో డాక్టర్‌కు బాధ్యతలు అప్పగించేందుకు వెళ్లా. ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పని చేయాల్సిన మహిళకు బదులు ఆమె భర్త విధులకు హాజరవుతున్నట్టు నాకు తెలియదు. ఇకనుంచి రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం.

– సురేందర్‌నాయక్, నాగారం పశువైద్యాధికారి

పాస్‌పుస్తకంలో పొలం.. ఆన్‌లైన్‌లో మాయం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



బోనకల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

బోనకల్: ముగ్గురు రైతులకు సంబంధించిన పొలం వివరాలు పట్టాదారు పాస్ పుస్తకంలో ఉన్నా ధరణి పోర్టల్‌లో లోపాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో బుధవారం వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని రావినూతలకు చెందిన ఎరగాని వెంకటేశ్వర్లు, ఎరగాని కొండలు, ఎరగాని కృష్ణయ్యకు నారాయణపురం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ భూమి ఉంది. 236 సర్వే నంబర్‌లో కృష్ణయ్యకు 1.09 కుంటలు, కొండలుకు 0.10 కుంటలు, వెంకటేశ్వర్లుకు 0.20 కుంటల సాగు భూమి ఉండగా.. 2018లో ధరణి పోర్టల్ వచ్చినప్పుడు వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించారు. కొన్నాళ్ల క్రితం రుణమాఫీ వస్తోందని తెలుసుకుని 1బీ సర్టిఫికెట్ కోసం వారు మీ సేవా కేంద్రానికి వెళ్లగా ఆన్‌లైన్‌లో పొలం వివరాలు లేకపోవడంతో తహసీల్దార్‌ను ఆశ్రయించారు. ఆయన సర్వే చేయించి నమోదు చేయిస్తానని చెప్పినా.. రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట టెంట్ వేసి నిరసనకు దిగారు. 236 సర్వే నంబర్‌లో 32 ఎకరాల భూమికి సంబంధించి మిగతా అందరి పేర్లు ఉన్నా తమ పేర్లు ఎలా తొలగించారని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. కాగా, పోలీసులు సర్దిచెప్పినా ఈ రైతులు ససేమిరా అనడంతో మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

భీంపల్లిలో ఇంటింటి సర్వే

జ్వరపీడితుల నుంచి వివరాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్



వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో సాంబశివరావు

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని భీంపల్లి వాసులు అంతుచిక్కని జ్వరాలతో నెల రోజులుగా సతమతమవుతున్న వైనంపై ‘అంతుచిక్కని జ్వరం.. ఊరంతా కలవరం’శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టి జ్వర పీడితులు, కీళ్ల నొప్పులు, కాళ్ల వాపులకు సంబంధించి వివరాలు సేకరించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మురుగు కాలువలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. భీంపల్లిలోని పల్లె దవాఖానాలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యపరీక్షలతో పాటు ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్ట్ (ఆర్‌డీటీ)లు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఎంపీడీవో గుండె బాబు భీంపల్లిలోని పల్లె దవాఖానాను సందర్శించి జ్వరాలు, కీళ్ల నొప్పులు, కాళ్ల వాపులు, ఇతరత్రా ఇబ్బందులకు సంబంధించి వైద్యులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో సాంబశివరావు మాట్లాడుతూ భీంపల్లి వాసులు గత 15 రోజులుగా జ్వరాల బారిన పడ్డారని, గ్రామంలో జ్వరాల సర్వే కూడా పూర్తయిందని, 135 మంది జ్వర పీడితులకు ఆర్‌డీటీ పరీక్షలు చేసి 8 మందిని ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేశామని తెలిపారు. ప్రస్తుతం జ్వరాలు పెద్దగా లేకున్నా రోగులకు ఒళ్లు నొప్పులు బాగా ఉంటున్నాయని, వీటిని వైరల్ ఫీవర్‌గా భావించి బాధితులు ఎదుర్కొంటున్న లక్షణాలకు అనుగుణంగా చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. తాగునీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నామని చెప్పారు. జ్వరాలు పూర్తిస్థాయిలో తగ్గే వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, గ్రామస్తులు ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు.

మా సారు మాకే కావాలి

ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ బదిలీకి నిరసనగా రోడ్డెక్కిన విద్యార్థులు

ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో నిరసనలు



లక్సెట్టిపేటలో...



ఇంద్రవెల్లిలో...

ఇంద్రవెల్లి/లక్సెట్టిపేట: ‘మా సారు మాకే కావాలి.. మా పాఠశాల, కళాశాలలోనే ఉండాలి’ అంటూ ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో విద్యార్థులు రోడ్డెక్కారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆశ్రమ వసతిగృహం (బాలికల) ప్రధానోపాధ్యాయుడు కాత్లే గంగారాం బదిలీ వార్త తెలియడంతో బుధవారం 9వ, 10వ తరగతి విద్యార్థులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. బదిలీ రద్దుకు ప్రయత్నిస్తామని పోలీసులు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. చివరకు ప్రధానోపాధ్యాయుడు వచ్చి నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు. 2015 నుంచి వసతిగృహంలో పనిచేస్తున్న గంగారాం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తున్నారు. మరోవైపు మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజాకు గోదావరిఖని డిగ్రీ కళాశాలకు బదిలీ కావడంతో బదిలీని ఆపాలంటూ విద్యార్థులు బుధవారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. ఈ విషయం తెలిసి విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. 2019లో కళాశాల ప్రారంభం నుంచి కొత్త కోర్సులు, ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులను ప్రవేశపెట్టి మంచి భవిష్యత్ అందించారని అన్నారు. పేద విద్యార్థులకు సాయం చేస్తూ ముందుకు నడిపించారని.. ఆయన బదిలీ నిలిపివేయాలని నినదించారు. సుమారు గంటసేపు రాస్తారోకో నిర్వహించడంతో పోలీసులు వచ్చి శాంతింపజేశారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీగా స్థానిక తహసీల్దార్ దిలీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.